శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి సంపూర్ణ గ్రంథావళి.

వ్యాసమంజరి

(మధురకవితలు)

కర్త

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

ప్రచురణ

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

2015

VYASAMANJARI

By Sri V. Prabhakara Sastri

T.T.D. Religious Publications Series No.

First Edition: 2015

© All Rights Reserved

Copies : 1000

Price.Rs...............

Published by

Sri D. Sambasivarao I.A.S.
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati -517 501

D.T.P. SVPSVP., T.T.D. Tirupati.

Printed at
Tirumala Tirupati Devasthanams, Press.
Tirupati.

ఓం నమో వేంకటేశాయ

ముందుమాట

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు బహుముఖప్రజ్ఞాశాలి, ఉత్తమపరిశోధకులు, విమర్శకులు, ఆత్మదర్శనులు, నిరంతర యోగసాధకులు, కవి, రచయిత, శాసన, భాషాపరిశోధకులు. ప్రాచీనగ్రంథాలను ఎన్నింటినో సేకరించి, పరిశీలించి, పరిష్కరించి ప్రచురించారు. తి.తి.దే. ఓరియంటల్ కళాశాలలో ఆచార్యులుగా పనిచేస్తూ ఎంతోమంది ఉత్తమ శిష్యులను తయారు చేశారు. వారికి జ్ఞానభిక్షను ప్రసాదించి ఉత్తమపండితులుగా తీర్చిదిద్దారు. సంస్కృత నాటకాలను తెనుగులోనికి అనువదించారు. మార్గసాహిత్యంతోపాటు, దేశిసాహిత్యాన్ని, జానపద సాహిత్యాన్ని ఆదరించి అనేక వ్యాసాలను వివిధ పత్రికల్లో ప్రచురించారు. రేడియో ప్రసంగాలు చేశారు. ప్రస్తుతం ప్రకటింపబడుతున్న గ్రంథం వ్యాసమంజరి, వారు వివిధ పత్రికలకు వ్రాసిన, రేడియోలో ప్రసంగించిన వ్యాసాలకు సంబంధించినది.

వ్యాసమంజరి గ్రంథం దేశిరచనలకు, మధురకవితలకు సంబంధించినది. ఇందులో నలభై వ్యాసాలున్నాయి. ఈ వ్యాసాలన్నీ శాస్త్రిగారు వివిధ పత్రికల్లో ప్రచురించినవి. కొన్ని రేడియో ప్రసంగాలున్నాయి. ఈ వ్యాసాలన్నింటిలో ప్రాచీనకవుల కావ్యాలను గూర్చినచర్చ, తెలుగుభాష దాని విశిష్టతను గూర్చిన ఆలోచనాతీరు, దేశి, జానపద సాహిత్య విమర్శనం, కొందరు పెద్దలకు సంబంధించిన సన్నివేశాల వివరణలు చోటుచేసుకున్నాయి. ఈ వ్యాసాలు పరిమాణంలో చిన్నవే అయినా వాటిలోని ఆలోచనలు చాలా మౌలికమైనవి. ఈ వ్యాసమంజరిని చదివితే జాతికి సంబంధించిన మౌలిక సమాచారాన్ని సేకరించడం, సేకరించిన వాటిని విశ్లేషించడం శాస్త్రిగారికి చాలా ఇష్టమని తెలుస్తుంది. తెలుగుపలుకుబళ్ళు, జీవితకథనాలు లాంటి ఎన్నో అంశాలు వీటిలో ఒదిగిపోగలిగాయి. ఈ వ్యాసాలద్వారా శ్రీ ప్రభాకరశాస్త్రిగారి బహుముఖప్రజ్ఞావిశేషాల్ని తెలుసుకోవచ్చు. వీరి వ్యాసములన్నీ భావిపరిశోధకులకు చాలా ఉపయోగపడతాయి. మార్గదర్శనం చేస్తాయి. ఇంతటి మంచి వ్యాససంపుటిని ప్రకటిస్తున్న శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయ పీఠం ప్రత్యేకాధికారిని, వారి సిబ్బందిని అభినందిస్తున్నాం.

సదా శ్రీవారిసేవలో

కార్యనిర్వహణాధికారి

నివేదన

కవి, పండితుడు, విమర్శకుడు, పరిష్కర్త, యోగసాధకులైన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ప్రాచీనగ్రంథాలను ఎన్నింటినో పరిష్కరించి ఆంధ్రలోకాని కందించినారు. తాళ్లపాకకవుల రచనలను పరిశీలించి, పరిశోధించి, ప్రచురించారు. శిల్పకళాఖండాలను సేకరించి మ్యూజియం స్థాపనకు కృషిచేశారు. శ్రీ వేంకటేశ్వరస్వామికి సంబంధించిన సాహిత్యాన్ని సంకలనం చేయడమేగాక చాటుపద్యమణిమంజరి, ప్రబంధరత్నావళిలాంటి సంకలనగ్రంథాలను ప్రచురించారు.

ప్రాచీనసాహిత్యంతోపాటు మధురకవితలు పేరుతో జానపద సాహిత్యాన్ని సేకరించి వ్యాసాలుగా ప్రచురించారు. కాటమరాజుకథను సేకరించి గ్రంథస్థం చేశారు. తెలుగుపలుకుబళ్ళు, గాలికబుర్లు, గ్రామ్య మీమాంస, ఏనాదులు, జానపదవాఙ్మయం, జానపదగీతములు, ఏలపాటలు, మధురకవితలు, మధురగీతాలు, మధురరచనలు, నేటితెలుగు – నోటి తెలుగు ఇలా ఎన్నో అంశాలకు సంబంధించిన విషయాలను సేకరించి పరిశీలనాత్మక వ్యాసాలను వివిధపత్రికల్లో ప్రచురించారు. రేడియోలో ప్రసంగించారు. శ్రీ శాస్త్రిగారు ప్రచురించిన, రేడియోలో ప్రసంగించిన వ్యాసాలను ఒక చోటచేర్చి 'వ్యాసమంజరి' పేరుతో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం పక్షాన తి.తి.దే వారు ప్రచురిస్తున్నారు. ఒక మంచి వ్యాససంకలన గ్రంథాన్ని ప్రకటిస్తున్నందుకు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం సిబ్బందికి అభినందనలు. ఈ గ్రంథాన్ని ముద్రించడానికి అనుమతినిచ్చిన శ్రీ కార్యనిర్వహణాధికారి వారికి కృతజ్ఞతలు.

సదా శ్రీవారిసేవలో

ప్రత్యేకాధికారి

విషయసూచిక

మనవి	vii
వ్యాస హృదయం	ix
– ఆచార్య శ్రీమతి నాయని కృష్ణకుమారి	
Foreword	xx
- Prof M. Sivaramakrishna	
1. నన్నియకుఁబూర్వపు ఛందస్సు	1
2. తెలుగుకవితలోని దేసితనం	9
3. తెలుగుదనము – సంప్రదాయము	15
4. ప్రాచీనగ్రంథముల పలుకుబడి – మనపై చెల్లుబడి	21
5. ద్విపదకృతులు	28
6. రంగనాథరామాయణము	30
7. శ్రీనాథకవి	41
8. శ్రీనాథుని సింహాచలపుముచ్చటలు	46
9. వనితలకవితలు	51
10. వనితలకవితలు – 2	53
11. దక్షిణదేశమందలి ఆంధ్రవాఙ్మయము	56
12. దేశిసాహితిసొంపు – వీరపదాలు	74
13. ఎఱ్ఱగడ్డవారి పోరాటము	85
14. సాహిత్యం – అన్ని తరగతులవారికి అనుభవింపతగి ఉండాలి	88
15. కాటమరాజుకథ	94
16. తెనుఁగుతేటదనము	112
17. తెలుగుపలుకుబళ్లు	115
18. గాలికబుర్లు	120

19. గ్రామ్యమీమాంస 132

20. ఏది సజీవరచన? 137

21. ఏనాదులు 143

22. పూర్వకాలపు పల్లెటూళ్లు 146

23. జానపదవాఙ్మయం 151

24. ఆంధ్రదేశములోని జానపదగీతములు 156

25. ఆంధ్రదేశపుజానపదగీతాలు 162

26. ఏలపాటలు – తెలుగునుడికారపుసొంపు 171

27. మధురకవితలు 177

28. మధురగీతములు 182

29. మధుర రచనలు 188

30. మధురకవితలు – 2 191

31. ఆంధ్రులు – సంగీతము 194

32. చాటువులు – చిత్రకవితా రచనలు 200

33. బ్రహ్మశ్రీ నడిమింటి మంగళేశ్వరశాస్త్రులు 204

34. జయంతి కామేశముపంతులుగారు 212

35. ఆనందగజపతి బాల్యంలో 216

36. క్షేత్రయ అక్షరాక్షరమును పరమ ప్రమాణమే 218

37. వాఙ్మయపరిణామము 225

38. నేటితెలుగు – నోటితెలుగు 229

39. మధురకవితలు –3 234

40. ముగ్ధమధురవాఙ్మయము 247

మనవి

(మణిమంజరిప్రచురణలు లోనిది యథాతథం)

ఎప్పుడెప్పుడో ఎక్కడెక్కడో అచ్చయిన ప్రభాకరుల వ్యాసాలన్నీ చాలావఱకు సంపాదించాము. ఇంకా కొన్ని పాతపత్రికలు దొరకని కారణంచేత వాటిల్లోపడ్డ వ్యాసాలను మే మింకా చేకూర్చుకోలేదు. అయినా అవి అన్నీ లభించేవఱకూ మా ప్రయత్నాన్ని విరమించబోము.

ప్రభాకరుల వ్యాససంకలనాలు ఇదివరకు కొన్ని వచ్చాయి. 'తెలుగు మెఱుగులు' (1948) ప్రభాకరుల పర్యవేక్షణలోనే రూపుదిద్దుకొన్నది. 'మీగడ తఱకలు' (1950), 'సింహావలోకనము' (1951), ఆ తరువాత మేము వెలువరించినవి వాటిల్లో వారి వ్యాసాలను అందినంతవఱకు ఏవో కొన్నింటిని ఏదో ఒక ఉద్దేశంతో ఎన్నికచేసి ఒక క్రమాన పొందుపరిచే ప్రయత్నంచేశాము. వాటిల్లో విషయవిభాగంగాని, ఏ వ్యాసం ఎందులో ఎప్పుడచ్చయింది మొదలైన వివరాలుగాని లేకుండానే పీఠికలు, వ్యాసాలు, ప్రసంగాలు, అన్నీ కలగలుపుగా చోటుచేసుకొన్నాయి. కారణాంతరాలవలన వాటిల్లో కొన్ని వ్యావహారికం నుండి సరళగ్రాంథికంలోకి మారిన సందర్భాలూ ఉన్నవి. రేడియోప్రసంగాలైన కొన్నివ్యాసాల సంగ్రహపాఠాలను తెలుగుమెఱుగులలో ప్రభాకరులే విస్తృత పాఠాలుగా పెంపుచేకూర్చి ప్రకటించారు.

ప్రస్తుత సంకలనం భాషకు, దేశిరచనలకు, మధురకవితలకు సంబంధించినది. ఇందులో పూర్వసంకలనాలలోని లోటుపాట్లు కొన్ని సవరించాము. పరిశోధకుల కనువుగా రచనా కాలాదులు సూచించే వివరాలిచ్చాము. ఇదికాక "వ్యాసప్రభాకరము" అనే పేరుతో మరో సంకలనాన్ని కూడా రూపొందించాము. హైదరాబాదులోని ఆంధ్రసారస్వత పరిషత్తువారి సహాయ సహకారాలతో అదీ త్వరలోనే వెలువడబోతున్నది. దాని తరువాత మరి ఒకటి రెండు సంపుటాలుగా తక్కిన వ్యాసాలన్నింటినీకూడా ప్రచురిస్తాము. కేవలం ఈ వ్యాసాలు మాత్రమే పదిపన్నెండువందలపుటలకు పైపడిన గ్రంథం అవుతుంది. అందుకే వీటిని విడివిడి సంపుటాలుగా తెచ్చే ప్రయత్నం చేస్తున్నాము. సంస్కృతవాఙ్మయం, తెలుగుసాహిత్యం, చరిత్ర, శాసనాలు, వ్యాకరణం, ఉపన్యాసాలు, గ్రంథాలు, వినోద విమర్శలు, ప్రకీర్ణకాలు వగైరాలన్ని

టినీ ముందుముందు రాబోయే సంపుటాల్లో పొందుపరుస్తాము. వ్యాసాలలోని భాషారీతిని మార్పుచేయకుండానే ప్రకటిస్తున్నాము. సంగ్రహవిస్తృత పాఠాలున్న వాటికి, వ్యాసనిర్మాణపరిణామపరిశీలన కనువుగొలిపే విధంగా పాశ్చాత్యుల వ్యాససంకలనాల మాదిరిని రెండురూపాలను ముద్రించదలిచాము. ఇలా సంకలనాల కూర్పులో ఉచితమైన మార్పులుతెస్తూ ప్రభాకరుల వ్యాసరచనల్లోనూ వ్యాసవచనంలోనూ గల వైవిధ్యాన్ని సవిమర్శంగా పరిశీలించి అంచనా వేయడానికీ తగిన ప్రాతిపదికను ఈ విధంగా కల్పించాలని మా ఉద్దేశము. ఈ మా ప్రయత్నంలో భాగమైన 'వ్యాసమంజరి – మధురకవిత' లనే యీ సంపుటాన్ని పాఠకలోకం హర్షంతో స్వీకరిస్తుందనే ఆశిస్తున్నాము. భాషాసాహిత్యాలకు మధురకవితారచనలకు ప్రాధాన్యమున్న ఈ సంకలనం తెలుగు చదువుకునే విద్యార్థిలోకానికి కూడా పాఠ్యంగా ఉపకరిస్తుందని నమ్ముతున్నాము.

యథాపూర్వం ఇందులోనూ గ్రంథప్రశంసలు ఇంగ్లీషు, తెలుగు భాషల్లో సమకూర్చాము. మా కోర్కిని మన్నించి అడిగిన వెంటనే అనేక అపూర్వ విషయాల నుట్టంకిస్తూ తెలుగులోనూ, ఆంగ్లంలోనూ గ్రంథప్రశంసలందించిన ఆచార్య (శ్రీమతి) నాయని కృష్ణకుమారిగారికీ, ఆచార్య ఎం. శివరామకృష్ణగారికి కృతజ్ఞతాభివందనాలర్పిస్తున్నాము. ట్రస్టువారి గ్రంథ ప్రకటన కార్యకలాపాలను మెచ్చి గత సంవత్సరం తగిన ఆర్థిక సహాయాన్ని అందించిన కేంద్రప్రభుత్వ ఆర్కైవ్సుశాఖవారికీ, మా యీ గ్రంథ ప్రకటన ప్రణాళికకు తమ ఆమోదముద్ర నొసగిన రాష్ట్రప్రభుత్వం వారికి ధన్యవాదములర్పిస్తున్నాము.

గ్రంథముద్రణంలో శ్రద్ధాసక్తులు చూపెట్టిన మాస్టర్ ఆర్ట్ ప్రింటర్స్ వారికి అభినందనలు.

మమ్మాదరించి ప్రోత్సహిస్తున్న పాఠకలోకానికి ప్రత్యేకంగా మా అభినందనలు.

11-11-1988 విధేయుడు
హైదరాబాదు. **వేటూరి ఆనందమూర్తి**

ఆచార్య నాయని కృష్ణకుమారి
తెలుగుశాఖ
ఉస్మానియా విశ్వవిద్యాలయం
హైదరాబాద్

వ్యాసహృదయం

('మణిమంజరిప్రచురణలు' లోని యథాతథం)

సోదరుడు డా॥వేటూరి ఆనందమూర్తిగారూ నేనూ ఒకే ఉస్మానియా కుటుంబానికి చెందినవాళ్ళం కావడం వలన, ఈనాడు ప్రభాకరుల వ్యాసమంజరికి ముందుమాట వ్రాసే అదృష్టం నాకు చిక్కిం దనుకుంటున్నాను.

ప్రభాకరశాస్త్రిగారిని నువ్వు ఎరుగుదువా అని ఎవరైనా అడిగితే, నేనుచెప్పే జవాబు 'ఎరుగుదును' అనే! – అసలు సూర్యుణ్ణెరుగుదువా, భూమి తెలుసా, ఆకాశం గుర్తేనా అని ఎవరైనా అడిగితే, అతి సామాన్యజీవి కూడా టక్కున 'ఎరుగుదును, తెలుసు, గుర్తే' అని చెప్పక ఏంచేసేటట్లు? – అంతే ఇక్కడ కూడా!

ప్రభాకరులు మా నాన్నగారికంటే పదకొండేండ్లు పెద్ద. వారిని నేను మొదటసారిగా చెళ్లపిళ్ళవారి ఆస్థానకవి పట్టభద్రోత్సవంలో, బెజవాడలో చూచాను. తర్వాత, ఆంధ్రవిశ్వవిద్యాలయంలో తెలుగు ఎం.ఏ. పాఠాలను వింటున్నప్పుడూ, పాఠాలకు అవసరమైన అదనపు సమాచారాన్ని పుస్తకాల నుండి నిర్విరామంగా సేకరిస్తున్నప్పుడూ, వారి అక్షరరూపాన్ని అడుగడుగునా చూడడం నేర్చుకున్నాను.

ఒక్కొక్కరి జీవితాలను వింగడించి విశ్లేషించడం చాలా కష్టంతో కూడుకున్నపని. ప్రభాకరులు యోగి, వైద్యుడు, తాత్త్వికుడు, అలాగే చారిత్రక పరిశోధకుడు, శాసనసంగ్రాహకుడు, భాషావిమర్శకుడు, మార్గదేశిసాహిత్య పరిశోధకుడు. వీరిజీవితంలో ఒక్కొక్కకోణం కొన్నిపదులపరిశోధన గ్రంథాలనూ, పరిశోధకుల్నీ తయారుచేసే సామర్థ్యం కలది. ఒక వ్యక్తి బహుముఖాలుగా తన జీవితాన్ని నడిపించడం అరుదైన విషయం కాదుకాని, ఈ నడకలో

ప్రభాకరుల సత్యపరిశోధనా తత్పరత ప్రతిఫలించడం మాత్రం, అవును! తెలుగుపరిశోధన రంగంలోనికి ఈయన నిసర్గమైన ఆలోచనాధారతో ప్రవేశించినవాడు. అంతేకాదు, ఆధునిక లక్షణాలను కలగలుపుకున్న ప్రాచీనుడు. ఈ కొత్తపాతల మేలుకలయిక మనకు ఆయన పరిశోధనారంగంలో అణువణువునా కనిపిస్తూ ఆశ్చర్యచకితుల్ని చేస్తుంటుంది.

వ్యాసమంజరిలోని వ్యాసాలన్నీ ఎన్నోయేండ్ల వెనుక ఇతరత్రా ప్రచురిత మైనవే. ఈ వ్యాసాలలో ఒకరకమైన అనుస్యూతలక్షణం ఉంది. పొసగ ముత్తెపు సరుల్ పోహళించిన రీతి ఈ సంపుటం పూర్వాపరసంబంధాన్ని చూచుకుంటూ గుచ్చుకున్న ఆణిముత్యాలసరం.

నాకుచూడగా, ఈ వ్యాసాలను కొన్ని భాగాలకింద అమర్చవచ్చు ననిపిస్తుంది. వస్తుపరంగా, ఇందులోని విషయాలు; 1.ప్రాచీనకవులనూ కావ్యాలనూ గూర్చిన విచికిత్స 2. తెలుగుభాష, దాని విశిష్టతను గూర్చిన ఆలోచన 3.దేశి జానపదసాహిత్య పరామర్శ. 4. కొందరు పెద్దలకు సంబంధించిన మనో మోహనకరమైన ఉదంతాల వివరణ.

వ్యాసాలు చిన్నవే. ఒక్కొక్కచోట కేవలం రేడియో శ్రోతల నుద్దేశించి నవే. కాని ఈ వ్యాసాలలోని కొన్ని కొన్ని ఆలోచనలు చాలా మౌలికమైనవి. అవి యెంత మౌలికాలంటే, విషయపరంగా ప్రభాకరులు యత్కించిత్ సందేహాన్ని ప్రకటిస్తే, ఆ సందేహాన్ని ఇన్నియేండ్ల తరువాత కూడా మన మెవ్వరమూ రహితం చేయలేనంత మౌలికమైనవి. ఉదాహరణకు ఆయన సందేహించిన రంగనాథరామాయణ కర్త ఎవ్వరో ఈనాటికీ మనకు ఖచ్చితంగా తెలీదు.

ఇందులోని 'ద్విపదకృతులు' అనే చిన్న వ్యాసం తొలుతగా 1914లో ప్రచురింపబడ్డది. అందులో ఒక కొత్త అంశాన్ని ప్రభాకరులు ప్రతిపాదించారు. "ఆంధ్ర భాషకు సంబంధించిన విలువగల విషయ మొకటి దీనివలన వెల్లడి యైనది. అది – "సంస్కృత సూత్రపరమైన ఆంధ్రలక్షణగ్రంథము తిక్కనాదులకు పూర్వమే వెలసియుండుట" యనునది – ఈ గ్రంథం పేరేమిటో కర్త యెవరో ప్రభాకరులు తెలియదన్నారు. మనకు కూడా ఈనాటికీ తెలియదు. సోమన పేర్కొన్న "అనియతగణైః," "యతిర్వా", "ప్రాసోవా" అనేవి ఈ లక్షణగ్రంథం లోని సూత్రాలయి ఉంటాయని ప్రభాకరుల తలంపు.

ఈ ఆలోచనకు సంబంధించిన వివరణ 'నన్నియకు పూర్వము ఛందస్సు' అన్న వీరివ్యాసంలో మరింత స్పష్టంగా ఆవిష్కృతమైంది.

11వ శతాబ్దంలో అరవంలో వెలువడిన 'యాప్పిరంగలమ్' అనే ఛందోగ్రంథాన్ని ప్రభాకరులు పేర్కొన్నారు. ఆ గ్రంథంలో కనిపించిన 'వాంచియార్ చేసిన తెలుగు ఛందము' అన్న ఉటంకింపు, ప్రభాకరుల దృష్టికి వచ్చింది. ఈ ఛందోగ్రంథం నన్నయ భారతరచన చేపట్టిన కాలానగానీ, అంతకు కొంచెం ముందుగాగానీ, ఏర్పడి ఉండవచ్చునని ప్రభాకరుల ఊహ. ఈ వాంచియరే సంస్కృతంలో వెలయించిన తొలి తెలుగుఛందోగ్రంథకర్త అని ఆయన ఉద్దేశం. ఆ గ్రంథం మనకు దొరకలేదు. గ్రంథకర్త వివరాలూ తెలియవు.

ఇక్కడ నాకుగా కలుగుతున్న ఊహ ఒకటి విజ్ఞుల ముందు పెట్టడానికి సాహసిస్తున్నాను.

నన్నయగారు వ్రాసిన 'పాయకపాకశాసనికి' అనే పద్యంలో 'తానును ధరామరవంశ విభూషణుండు' అనే చోట 'వానసధరామరవంశవిభూషణుండు' అనే పాఠం ఉంది. శ్రీఖండవల్లి లక్ష్మీరంజనంగారు ఉస్మానియా విశ్వవిద్యాలయం తరపున మహాభారత సంశోధిత ప్రతిని తయారుచేసిన సందర్భంలో అక్కడ 'వానస' అన్నదాన్నే ముఖ్యపాఠంగా గ్రహించి, 'తానును' అన్నదాన్ని పాఠాంతరంగా సూచించారు. కారణం పై పాఠం చాలా ప్రతులలో, ముఖ్యంగా, ఉత్తరాంధ్రంలో దొరికిన ప్రతులలో, ఉండడమే! దీన్నిబట్టి లేఖకులు 'వానస' అన్నదానికి అర్థం తెలియక 'తానును' అని దాన్ని దిద్దుకుని ఉంటారని ఊహించవచ్చు. యాప్పిరంగలంలో పేర్కొనబడిన వాంచియార్, నన్నయ చెప్పిన వానస (య్యగారు) ఒకరు కావచ్చునేమో! నన్నయకు ప్రియస్నేహితుడైన నారాయణభట్టు వంశంలోని అతడే సంస్కృతంలో వడఘుఛందాన్ని వెలయించి ఉండవచ్చునేమో! అష్టభాషలలో కవియైన నారాయణభట్టు వంశస్థుడు, తెలుగు భాషకు సంబంధించిన ఛందాన్ని సంస్కృతంలో వెలయించడంలో ఆశ్చర్యం ఉండనక్కరలేదు. నన్నయకు నారాయణభట్టు భారతరచనకు తోడై నిర్వహిం చడంలో, నారాయణభట్టు వంశంలో పుట్టిన 'వడఘుఛందం' ప్రభావం కూడా ఉందేమో!

రంగనాథరామాయణము అనే వ్యాసంలో, దాని కర్తృత్వ విషయంలో ప్రభాకరులొక ప్రశస్తమైన మాట అన్నారు. "రంగనాథుడను కవీశ్వరుని గూర్చి ఇటీవల చెలరేగిన వాదదావాగ్నిలో చిక్కుపడి నే నొడలు కాల్చుకొనజాలను. ప్రాచీనకావ్య, లక్షణశాస్త్ర, కవిచరిత్రాదిపరిజ్ఞానము కొలుపుటలో నాకు ప్రాచీన లక్షణగ్రంథకర్తలు పితృతుల్యులు. ఉహ్వాని యువ్వెత్తున వారి పరిజ్ఞానము నుత్తుత్తి దానినిగా నూదివేయజాలను"– ఈ మాట అని చెప్పీ చెప్పనట్లుగా, రంగనాథుడనే కవి ఉండి ఉండాలనే సూచించారు – మా గురువుగారు శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారు మాకు సాహిత్యచరిత్రపాఠాలు చెప్పేటప్పుడు రంగనాథరామాయణకర్త బుద్ధభూపతి అనీ, అతని తండ్రి విఠలభూపతి పేర ఆ రామాయణము రంగనాథరామాయణంగా భాసించిందనీ చెప్పేవారు 'నామైక దేశే నామ గ్రహణం' అనే పలుకుబడి ప్రకారం, విఠల రంగనాథుడు అనేది తండ్రి పూర్తిపేరై, ఆ రంగనాథ శబ్దమే కావ్యానికి గ్రహింపబడి ఉంటుందని చెప్పేవారు. విషయసేకరణ సందర్భంలో చక్రపాణి రంగనాథుణ్ణి గురించి పెక్కుకథలూ, కవిప్రశంసలూ, అతడు శైవుడైన పిదప రచించిన నయనరగడ వంటివి, కళ్ళముందుకువస్తున్నా, ఆ సమాచారాన్నీ రంగనాథ రామాయణాన్నీ కలిపి ఆలోచించడం ఆ రోజుల్లో పూర్తిగా మానుకున్నాము. మా మీద మా గురువుగారి ప్రభావం అటువంటిది! ఈ కర్తృత్వవిషయం ప్రభాకరులు లేవదీసి, ఇప్పటికి దాదాపు 50 సంవత్సరాలు గడిచినా, రంగనాథుడికీ రామాయణానికీ ఉన్న సంబంధం నిర్విరామంగా నిర్ణయం కాలేదు. శైవరంగనాథుడూ, వైష్ణవరంగనాథుడూ, ఒకడే అనీ, అతడే రామాయణ కర్త అనీ నిర్ధారణ కాలేదు. మన సాహిత్యచరిత్ర సంగతంతే. ఒకవైపు నుంచి అడ్డదిడ్డంగా పెరిగిన కథల కంపల్నీ తీర్మానాల తీగెచిక్కుల్నీ కత్తిరించుకుంటూ వస్తున్నా మరోవైపునుండి అటువంటివే రాక్షసవృద్ధితో కమ్ముకుంటూ వస్తాయి. అవి అవధ్యాలు.

ఈ సందర్భంలోనే మరో చిన్న విషయం. 'సాహిత్యం' అనే వ్యాసంలో ప్రభాకరులు తిరిగి గోనవంశపురెడ్ల ప్రసక్తి తీసుకువచ్చారు. రంగనాథ రామాయణ సంస్కరణపరిశ్రమలో, రాయలసీమలో తిరుగుతూ, ఆయన విన్న ఒక జానపదగేయకథలో "గోనకాటారెడ్డి" అనే గ్రామపెత్తందారీ ప్రసక్తి ఉంది. ఇతడు అమాయకుడైన భరతుణ్ణి మోసంచేసి, ఉద్దండుడైన రాముడి

చేతిలో చిత్తైపోయినవాడు. ఇదే కథ సర్కారుప్రాంతంలో ఉంది. తెలంగాణం లోనూ ఉంది. గ్రామపెత్తందారీతనం వహించినవాళ్ళు రెడ్లు. వ్యవసాయం చేపట్టినవారు పంటకాపులు. పంటరెడ్లకూ, కాపులకూ పెత్తందారీతనంలో తప్ప మరో భేదంలేదు. గోనె లేదా గోన అనేది ఆ వంశంలో, తొలిరోజుల్లో ఉండిన వ్యాపారవృత్తిని సూచిస్తూ వంశనామంగా కుదురుకున్న పదమైకూడా ఉండవచ్చు. ఎప్పుడో 50 సంవత్సరాల క్రిందటే, ఈనాటి పరిశోధనకు మౌలికమనదగిన అంశాలను ప్రభాకరులందించడం మనం గమనించవలసిన విషయం.

జాతికి సంబంధించిన మౌలిక సమాచారాన్ని సేకరించడం, దాన్ని విశ్లేషించడం, ప్రభాకరులకు చాలా ప్రియమైన విషయంగా ఈ వ్యాసమంజరిని చూస్తే విదితమౌతుంది. సమాస భూయిష్ఠమైన తత్సమరచనకంటే తేటతెనుగు రచనలమీద వీరికి ప్రీతి. "ద్రవిడపదముల అచ్చుమెత్తదనమును సంస్కృతపు బింకమును కొంత కొంత కూర్చుకుని తెలుగు బాస ద్రావిడభాషా కుటుంబములో లేబ్రాయపు జిలిబిలి పలుకుల పొలతియై వన్నెకెక్కినది" అనడంలో, తెలుగు లేతదనం మీదా, మార్దవలక్షణం మీదా ఆయనకున్న మమకారం వెల్లడి అవుతూన్నది. తెలుగు అజంతత్వంలో ఉండే విశిష్టత, ద్రుతంవల్లకలిగే సంధ్యుచ్చారణలోని హృద్యత, గడసదవ సరళాదేశాలవల్ల అనువుపడే కటూచ్చారణారాహిత్యం, ఇవన్నీ ఆయనను ఎక్కువగా ఆకట్టుకున్న లక్షణాలు. సంస్కృతంలో అమోఘమైన పాండిత్యం ఉన్నా, దేశివేపూ, దేశ్యమైన భాషా సాహిత్యసౌందర్యం వేపూ మొగ్గేమనస్సుతో ఎంతో విలువైన దేశ్యసమాచారాన్ని పోగుచేసి విశ్లేషించారు. తెలుగుపలుకుబళ్ళూ, మౌఖికసాహిత్యం, చారిత్రక విషయాలు, కథలు, గేయాలు, ఆచారవ్యవహారాలు, జీవితకథనాలు వంటి యెన్నో అంశాలు వీరి జ్ఞానభాండారంలో ఒదిగిపోగలిగాయి.

అన్నిటిలోకీ జానపదవాఙ్మయ సేకరణ వీరికి మిక్కిలి ప్రీతిపాత్రమైన విషయం. 'గాలికబుర్లు' అనే వ్యాసంలో వారిలా చెప్పుకున్నారు.

"పాటలు, పదాలు, పొడుపుకథలు, సామెతలు, పలుకుబళ్ళు, నానుళ్ళు, దేశీయములు, నుడికారములు, జాతివార్తలు, చమత్కారములు, పొడుపుపద్యములు, చాటుధారలు, లక్షణోదాహరణములు మొదలైన వాటిని

భాషాసస్యపుపంటలలో ఇదివరకు సేకరము కాక గాలికి కొట్టుకొని పోతూ ఉండే చెదురుడు, రాలుడు, పరిగగింజలను బిచ్చగాడనై ఊళ్ళూ నాళ్ళూ తిరుగుతూ ముప్ఫైయేళ్ళ ముందు నుండి ఎక్కడపడితే అక్కడల్లా ఏరుకుతెచ్చు కుంటూ ఉన్నాను.''

ప్రభాకరుల ఈ వక్కణ సత్యం. అంతేకాదు;

"విచ్చలవిడిగా జీబుకొని వెలయుచున్న ఆంధ్రభాషారణ్యమునుండి కవితోద్యానమునకు కొని తేవలసిన హృద్యవచో వల్లరులు ఇంక నెన్నోయున్నవి. చవులొలుకు పలుకుబళ్ళు, పాటలు, పదాలు, కథలు, గాథలు, సామెతలు ఇత్యాదులు పెక్కులు అపరిశోధితములై యముద్రితములై లోకము వాకులందే పుట్టుచు గిట్టుచున్నవి. అట్టివానిని పరిశోధించుటలోను, సేకరించుటలోను, నాకు కోర్కె కొండంత" అనికూడా చెప్పుకున్నారు. అట్లా 77 సంవత్సరాల క్రిందటే ప్రభాకరులదృష్టి మౌఖికసాహిత్యం వేపుకు మళ్ళింది. 1911లోనే ఆయన కాటమరాజుకథకు జెందిన "ఎరగడ్డపోట్లాట''ను పత్రికల్లో ప్రచురించారు.

అప్పటికి జానపద సాహిత్యంపైన మక్కువను జనం పెద్దగ పెంచుకో లేదు. ఆడవాళ్ళు పాడుకోడానికి అనువుగా ఉంటాయన్న ఉద్దేశ్యంతో మాత్రమే టేకుమళ్ళ కామేశ్వరరావుగారు పాతపాటలనీ, నందిరాజు చలపతిరావుగారు స్త్రీలపాటలనీ ప్రచురించారు. అట్లాగే, మంగళహారతులు, వేడుకపాటలు, పెండ్లిపాటలు వంటివి కాలక్రమాన ప్రచురింపబడుతూ వచ్చాయి. కాని ఈ పాటలన్నీ మధ్యతరగతి బ్రాహ్మణకుటుంబాలలోని స్త్రీలు పాడుకునే పాటలు. ఆ స్థాయినిమించి, దిగువవర్ణపు జనానికీ, పల్లెజనానికీ సంబంధించిన గేయాల వైపు వీరిదృష్టి పోలేదు.

ప్రభాకరులు ప్రకటించిన ఈ పాట చూడండి –

రామన్న రాముడోయ్ రామభజనా
రాముడొస్తున్నాడు రామభజనా
పూలారథమునెక్కి రామభజనా
ఊరేగుతున్నాడు రామభజనా''

ఇదే వంతతో మరొక జానపదగేయాన్ని చూడండి –

"అమ్మరా ఓయమ్మ రాంబజనా
విసుపేటు బాడబోత రాంబజనా
విసుపేటు బాడకయ్య రాంబజనా
వల్లమాల్న తగువులొచ్చు రాంబజనా
వద్దన్న నేనెపోత రాంబజనా
పొమ్మన్న నేనెపోత రాంబజనా
సేమంగ రా కొడుక రాంబజనా
లాబంగ రా కొడుక రాంబజనా''

ఈ రెంటికీ ఉన్న తేడా, విమర్శనా దృష్టిని దాటిపోలేనిది.

ప్రభాకరులకు దేసితనంమీద ఎంతప్రేమ ఉన్నా, అపశబ్దాలనీ, గ్రామ్యాలనీ నిరసించడం వారికిష్టం లేకపోయినా వారికి దొరికిన గేయాలను దొరికినట్లుగా ప్రకటించడానికి కొంత ముందువెనుకలాడినట్లుగా నాకు అనిపిస్తూ ఉంది. "పామరజనులు పాడే ఏలపాటలు వెకలిశృంగారంతో ఉంటవి గాని, అందులోనూ మంచిపలుకుబడి, పలుకుపొంకమూ, వ్యంగ్యార్థ చమత్కారమూ కలవి కొన్ని లేకపోలేదు. మచ్చుకు కొన్ని మాత్రమే వినిపిస్తాను'' అంటూ సౌమ్యంగా ఉన్నవీ అతివేల శృంగారస్పర్శలేనివీ అయిన వాటిని మాత్రమే ఉదాహరించారు. ఈనాటి జానపదవాఙ్మయపరిశోధకులకు భావం విషయంలోగానీ, భాషవిషయంలో గానీ ఇటువంటి ఆంక్షాప్రవృత్తిలేదు. ఉండ కూడదుకూడా. అప్పటి ప్రభాకరులకు అటువంటి దృష్టి ఉండి ఉంటే, ఆయన ఆనాడు సేకరించిన జానపదవాఙ్మయమంతా ఆనాడే లిపిబద్ధమై భాసించి ఉండేది.

వీరికి వీరగాథలమీద మక్కువ యెక్కువ. మద్రాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలో లభించిన కాటమరాజుకథాభాగాన్ని వీరు 1911లోనే పత్రికాముఖంగా వెలుగులోనికి తేవడం జరిగింది. బ్రౌన్, మెకంజీ దొరలు ఆభాగాన్ని ఉన్నది ఉన్నట్లుగా వ్రాయించి ఉంచడం వీరి మనసు మెచ్చుకున్న విషయం. "ఆ వ్రాతలు భాషావిషయమున సంపూర్ణ సంస్కారమందని వైనను (అందమి చేతనే కాబోలు) పసిబాలునకైన నర్థమగునట్లు తేటతెల్లముగ

నుండును. అట్టివానిని మన మతికౌశలముచూపి సంస్కరింపబూనిన సులువుగా నర్థముకాక పోవునేమోయను తలంపున నున్నదున్నట్లే వ్రాయించి పంపగడంగితిని". అని ఒక సంజాయిషీలాంటిది చెప్పుకున్నారు.

కాటమరాజు కథాసందర్భానొ్నకదాన్ని గ్రహించి, కాటంరాజు కథ రామాయణం నాటిదా? అని ఒక ప్రశ్న వేశారు ప్రభాకరులు. అదృష్టవశాత్తూ ఆ ప్రశ్నకు సమాధానం కోసం పట్టుపట్టి లేదు. ప్రసంగం వచ్చింది కనుక, జానపద కథలు, పురాణపురుషుల్నీ, ప్రకాస్తిపొందిన పురాణపాత్రల్నీ, ఇతర కథల్నీ, తమలోఎలా కలుపుకుంటాయో చూడండి. కాటమరాజు సాక్షాత్తూ శ్రీకృష్ణుడే. అంటే భారతకాలంనాటివాడు. ఆయన గోవర్ధనగిరిని ఎత్తినప్పుడు ఇంద్రుడు కోపించి వజ్రాయుధాన్ని విసిరిన కథ మనకు తెలుసు. కృష్ణుడు ఆ వజ్రాయుధాన్ని పట్టుకుని, కమ్మరికిచ్చి ఒక కొంగవాల్‌కత్తి, జేగంట చేయించాడట. తాను కాటమరాజుగా జనించినపుడు, ఆ కత్తిని తన భక్తుడూ అనుచరుడూ అయిన బీరన్న కిచ్చాడట. ఆ బీరన్న సృష్టికంటే ముందుపుట్టిన తాత జాంబవంతుని అవతారం. ఇట్లా తామరతంపరగా జానపదకథలు ఒకదానిలో ఒకటి చిక్కుపడిపోయి చౌరశక్యంకాని పద్ధతిలో మనల్ని దూరంగా నిలబెట్టేస్తాయి. అందుకని వాటి విషయమై చాలావరకూ స్థలమూ కాలమూ అంటూ విచికిత్సకు లోను కాకుండా, దూరంనుండి తమాషా చూచి ఆనందిస్తుండడమే లగ్గు. ఈ రహస్యాన్ని ప్రభాకరులు ఎరుగుదురు. అసంఖ్యాకంగా స్త్రీలనోళ్ళల్లో బ్రదికే జానపదగేయాలను సేకరించి భద్రపరచాలన్నది ప్రభాకరుల తపన. "స్త్రీలు పాడుచుండెడి కొన్నిపాటలు రసవత్తర కథాసంవిధానముతో నున్నవి. ఆంధ్రభాషావిద్వాంసులు పెక్కురు వీనిని వాఙ్మయయాంగముగా దలపకున్నారు. పరిహాసపాత్రముగా భావించుచున్నారు" అని దిగులుతనాన్ని వెలిబుచ్చారు.

భాషవిషయంలో ఆ కాలానికి ప్రభాకరులదృష్టి ఆధునిక దృష్టి. గ్రాంథికమూ, గ్రామ్యమూ అంటూ పాకులాడే పండితులను దృష్టిలో ఉంచుకుని "ఏది గ్రామ్యము?" అని ప్రశ్నింస్తుండేవారు. "గ్రాంథికభాషనూ ఇంకా ఇటీవల ప్రబలిన వ్యావహారికభాషను కూడా ఇప్పటిదాకా ఏవో హద్దు పద్దులతో కొంతవరకైనా ఆచి పట్టుకుంటూ వస్తున్నారు యూనివర్సిటీవారు, గ్రంథరచయితలు, పత్రికా రచయితలు మరీ పండితులూనూ – హరిజనుల దగ్గరనుండి భూసురులదాకా భుజాలు కలుపుకుని వర్ధిల్లను సాగించినారంటే వారివారి భాషలు మాత్రం దూరంగా ఉండిపోగలవా? మీ జాతి తక్కువది మా జాతి ఎక్కువది అనరానట్లే, మీ పలుకుబడి తక్కువది మా పలుకుబడి యెక్కువది అన ఇక వీలుండదు." – "ఇది పెద్దయుగపరిణామం వంటిది" అన్నారు.

ఈ దృష్టితో సామాన్యజనులు వాడుకునే పదాల నెన్నిటినో ఆదరంతో ఆయన గుర్తించారు. ఉదాహరణకు స్త్రీలపాటల్లో దొరికిన 'చేపట్టు' అనే మాటకు, శబ్దరత్నాకరం 'స్థానము' అనే అర్థాన్ని మాత్రమే ఇస్తూ ఉంది. కాని వ్యవహారంలో, భోజనం చెయ్యడంకోసం విస్తరి వేసేముందు, ఆ స్థలాన్ని నీటితో శుద్ధిచేయడానికి చేతితో పామే క్రియగా, ఈ పదానికి అర్థం ఉంది. ఇటువంటి పదాలనెన్నిటినో గుర్తించి జానపదవాఙ్మయంలో నిఘంటువుల కెక్కవలసిన పదాలెన్నో ఉన్నాయని, ఆ వైపుకు తన పరిశోధనాచక్షువును సారించారు. అంతేకాక వాడుకలో ఉన్న పదజాలాన్ని, పలుకుబళ్ళను, సేకరించే ప్రణాళిక కొకదానికి నాందీవచనం పలికారు. ఈ ప్రణాళిక ప్రకారం ఎవరు, ఎక్కడనుండి కొత్తపదాలను సేకరించి పంపినా, అవి పత్రికాముఖంగా ప్రకటింపబడేవి.

అమరకోశాన్ని దృష్టిలో ఉంచుకుని తాను సేకరించిన పదాలనన్నిటినీ వర్గవిభజన చేయడానికి పూనుకున్నారు. గాలికబుర్లు అనే వ్యాసంలో ప్రభాకరులు చూపిన ఏడు వర్గాలు కనీసం ఏడు పరిశోధక వ్యాసాలకు దిక్ప్రదర్శకాలు కాగలవనడంలో అతిశయోక్తిలేదు.

సాంకేతికలక్షణం కలిగిన కొన్నిపదాలకు అలవోకగా సులువైన తెలుగుమాటల్ని అందించారు. ఉదాహరణకు వంత (Refrain) అనే మాటకు 'ఎత్తుపలుకు' అనీ, వ్యావహారికభాషకు' 'నోటి తెలుగు' అనీ అనడం ఇటువంటిదే.

ఒకభాష మాత్రమేకాక తెలుగుజాతి ప్రాచీనచరిత్రమీద కూడా ఆయనకు ప్రత్యయం ఉంది. నృశాస్త్రవేత్తలు (Anthropologists) చేయవలసిన మానవశాస్త్రశోధన కూడా ఈయనకు ఇష్టమైన విషయమే. ఈ సంకలనంలోని 'ఏనాదులు' అనే వ్యాసం జిజ్ఞాసువుల్ని పరిశోధనా మార్గంవేపు నడిపించేదిగా

ఉంది. ఆహారాన్ని పండించుకునే దశకు రాకముందు, ఆహారాన్ని సేకరించే దశలో మానవజాతి ఉండేదని నృశాస్త్రవేత్తలు సోపపత్తికంగా తీర్మానించారు ఏనాదులు ఆ దశను సూచించే నేటి అవశేషాలుగా చెప్పవచ్చు. ఆ అభిప్రాయాన్ని బలపరుస్తూ ప్రభాకరులు తమ తోటల్లో పనిచేసే ఏనాదుల జీవిత విశేషాలను వివరించడం ఈ వ్యాసంలో కనిపిస్తుంది. స్వతహాగా పండితుడూ, భాషాభిమానీ, విమర్శకుడుగా అయినవాడు తన విమర్శనాదృష్టిని జనజీవన విధానంవేపు మళ్ళించి సామాజికశాస్త్రవేత్తగా మారడం మనం గుర్తించవలసిన విషయం. కాని ఈ రంగంలో ఈయన యెక్కువగా శ్రమించకపోవడం నేటి పరిశోధకుల దురదృష్టం.

పురాతత్త్వశాస్త్రమేకాక, సమకాలిక ప్రసిద్ధవ్యక్తుల జీవితాల్లో వాటిల్లిన సంఘటనల్నీ, కథల్నీ లోకంలో ప్రచారంలో ఉన్నవాటినీ భద్రపరచడంలో కూడా వీరికి ఆసక్తి ఉంది. నడిమింటి మంగళేశ్వరశాస్త్రి, కామేశంపంతులు, ఆనందగజపతి, శ్రీపాదరామశాస్త్రి మొదలైనవారి జీవితాల్లోని సంఘటనలను వర్ణించిన వ్యాసాలీ సంపుటంలో ఉన్నాయి.

ఇట్లా ఈ వ్యాసమంజరినీ, తద్వారా ప్రభాకరుల బహుముఖ ప్రజ్ఞా విశేషాన్నీ ఎంతైనా చెప్తూనే ఉండవచ్చు. మొత్తంమీద ఈ గ్రంథంలో ప్రభాకరులు పలువ్యాసాలలో వెలిబుచ్చిన కొన్ని అభిప్రాయాలు ఈనాటికీ ఎంతో విలువైనవిగానే తోస్తాయి. అవి ఆయన హృదయాన్ని ఆవిష్కరించేవిగా ఉన్నాయి.

1. ఆంధ్రులన్నా తెలుగువారన్నా ఒకరే అన్న ఎరుకతో మాట్లాడుతున్నాను. తెలుగు సంప్రదాయమన్నా తెలుగుతనమన్నా ఆంధ్రసంప్రదాయమన్నా ఆంధ్రత్వమన్నా ఒకటే అని నా తలంపు. (పుట 17)

2. ప్రాచీనదేసిరచనల పరిశీలనము జరుగకపోతే, జాతి భాషా స్వభావానుగుణములైన హృద్యార్థముల నుజ్జగించడమూ, వానికి బదులుగా అ(న)నుగుణములైన వైజాత్యార్థముల నవలంబించడమూ జరగవచ్చును. జరుగుచున్నది కూడా". (పుట.101)

3. ఆంధ్రభాషా అందచందములను సరిగా గుర్తించుటకు వీని (తెలుగు పలుకుబళ్లు, కథలు, సామెతలు, పాటలు, వింత శబ్దజాలము) సర్వే అత్యావశ్యకము (పుట. 133)

4. మండలాల్లో మాటలు మారినయ్యని భాష చెడ్డభాష అవుతుందా? (పుట 149)

5. అందుకై (దేశీయ భాషాసాహిత్య సామగ్రికై) యూనివర్శిటీవారు, దొరతనమువారు, సాహిత్యపరిషత్తువారు అందరు ఏకమై, దేశం నలుమూలలా గాలించి, భాషాసాహిత్యపరికరముల సర్వేచేసి సేకరింపవలెను (పుట 183)

6. ఎన్నాళ్ళదాక పాటలు, పదాలు మొదలైన మధురకవితలయెడ రసజ్ఞలోకమాదరము చూపదో, అన్నాళ్ళదాక ఆంధ్రకవిత యందాంధ్రతావాసన గుబాళింపదు. (పుట 200)

7. పాతకాలపుపాటలు ప్రాచీనగ్రంథములట్లు పరిశీలింపదగినవి.

8. చాలమట్టుకు నేటిది కాకపోయినా రేపటిదయినా, తెలుగుభాష నోటితెలుగుకాక తప్పదు. (పుట 261)

ఈ వక్కణలన్నీ మౌలికమైనవి. ఈ సంపుటంలో ఉన్న వ్యాసాల హృదయావిష్కారం చేసేవి.

ప్రభాకరుల విమర్శనాసక్తికి, విషయవివేచనానురక్తికి, భవిష్యత్తును సూచించగల రచనాశక్తికి నా వినయపూర్వక నమస్కారాలు.

హైదరాబాద్
5–10–1988 – నాయని కృష్ణకుమారి.

Prof. M. SIVARAMAKRISHNA
Ph.D (Osm)
DEPARTMENT OF ENGLISH
Osmania University
Hyderabad - 500 007

FOREWORD

(మణిమంజరిప్రచురణలు లోనిది యథాతథం)

Analysing the nature and timeless significance of a literary work. Sri Sasti observed:

> Even if the subject is good and writer is well equipped with linguistic and other tools, if his heart does not flow in the direction of spiritual values, that piece of writing is vitiated. But if this spiritually-oriented heart is there, whatever the subject and whatever the language it will reflect the light generated by the intersection of subject and emotion.

Pionting out that such a situation does not exist yet in modern Telugu literature, he identifies the reason as rooted in the continuing economic and social imbalances:

> For people starving for want of food and clothing, and for writers who emerge from such a context, it is difficult to allow the spiritual outlook to crystallize. Dedication does not come unless there is (economic) stability. Even if stability is achieved, it evidences only chaos. (pp. 156 -157).

These remarks constitute the critical framework from which Sri Sastri undetstood and evaluated literature. Whatever he wrote or spoke was animated by the impulse to find in literature the

principle of refinement of the self both individual and collective. In effect, literature was for him a mode to delight, instruct and move a person to virtuous, dharmic, action.

II

Judged from such a perspective criticism becomes enduring only when its content and form - like literature itself - possesses a significance transcending its immediate context and the specific text. If this transcending element is there, then, the topical and the timely acquires an interior resilience to survive mere history and become an integral component of the continuum of tradition. This tradition is so indispensable that both the creative writer and the critic willingly - and deliberately - acquire it as a dynamic catalytic agent activating (what they initially but indefensibly assume to be) their own individual sensibility.

Sri Sastri invariably professed and created this kind of criticism. As such his critical writing shows insights which are holistic and itegral, expository skills which are remarkable, and above all linguistic nuances which are highly singificant in understanding the development of modern Telugu prose itself.

To read this fascinating-- and fairly substantial --collection of essays, seminar papers, radio talks etc., by Sri Sastri is, therefore, to realize how a scholar can combine meticulous concern for detail with and unusual gift for spontaneity and immediacy of language. Here is no pedantic punditry but a remarkable intelligence vitally alive to the changing "registers" of a living language. In fact, one is amazed at the prophetic way in which Sri Sastri predicts in an extremely lively essay -- " Neti Telugu and Noti Telugu"-- the need to align the spoken and the written structures. He realizes, in this regard, the unmistakable impact of English.

Yet he is aware of and cautions us against the risks implicit in the emergence of spoken Telugu in the context of several extant varia tions.

III

It is this caution of a classicist and the openness and courage of conviction of a modernist that marks almost all the essays. If this is itself refreshing, what is more amazing is the versatility and range of the areas discussed. There are essays on prosody, on music, on women's poetry, children's poerty, folk literature, on rural milieu, on important poets such as Srinatha and texts such as Ranganatha Ramayana.

Everywhere the animating impulse is to see literature steadily and see it whole. Sri Sastri unerringly identifies the social determinants of literary and linguistic structures and unambiguously declares that literature should be available for the experience of all. He rightly argues that the impulse towards modernity is rooted in the quest for freedom from all constricting elements - social, economic, political. Analogously, the same freedom and fluidity is bound to be demanded in the use of language and the creation of literature.

But in the context of dialectical variations, evident in the usages peculiar to different social groups where do we locate and how do we create norms and standards? This becomes problematic specially when - as Sri Sastri makes us aware with surprising finesse and familiarity - that the so-called ' illiterates', old women, devadasis, rural folk etc, can extensivelyand with full awareness quote and comment on classical Telugu poetry in the very ordinary events of what critics call 'contingent reality'. As is abundantly clear, these variations, of often breath - takingly picturesque expression have to be absorbed into the mainstream of

language (and implicity of literature).

This concern for language and literature as dynamic instruments reflecting the ethos of a culture makes this collection a rich treasure- house of considered, mature judgment. Even casual observations illumine a whole cultural context and some context recreated with studied casualness (cf: the recreation of a context of marriage festivities which was enlivened with recitfations of verses from Sringaranaishadha and somebody reciting another verse from the sametext on the eve of sending the bride to the inlaws) make one feel nostalgic of the days when peotry (supposedly elitist speech) was the comoonent of "common" texture of life. No wonder that in a memorable sentence Sri Sastri says that the unstudied, unadorned Telugu ("తేట తెలుగు") is the invariable of all people from the "lower classes to the Prophet," from the "Balasiksha to Moksha vidya", from the Elementary primer to the Science of Liberation (p.128). As such, Sri Sastri declares rightly, we have to recover and conserve this heritage embodied in proverbs, in folk tales, and popular songs etc., to identify the angularities of Telugu language and its evolu tion vis-a-vis the development of literary sensibility.

This draws attention to what is certainly the most valuable perspective which emerges from this collection. In Sri Sastri's own words:

> " whatever changes in dress and language we experince, we retain the patterns and moulds of our grandfathers, of our ancestors. Similarly, whatever new paths we traverse, we retain the residue of the ideas, traditions, and writings of our ancestors. These are rooted in us. We cannot forsake them; indeed we should not....." (p. 31)

Sri Sastri was himself an exemplar of this rootedness in tradition opening itself to new sources of literary and linguistic, cultural and spiritual, nourishment. In making these essays available in a collection to a whole new generation of readers, Sri Prabhakara Sasrti Memorial Trust and its dynamic, guiding spirit, Professor V. Anandamurti specially, have done a signal service. My gratitude for this is symbolic, I am sure, of th gratitude of Telugu people everywhere.

4-10-1988
Hyderabad M. Sivaramakrishna

నన్నియకుఁ బూర్వపుఛందస్సు

మృదువై, మధురమై, అచ్చుమీఁగడఁ దలపించు నుచ్చారణము గలిగి, భావప్లుతములగు పలుకుబళ్లు కలిగి, వీనులకు విందుగూర్చు ఛందస్సందర్భము గలిగి, భావుకుల డెందములను పరితోషడోలికలలో నూగించుచున్న మన యాంధ్రభాషలోఁ బ్రబంధరచన మే కవీశ్వరుఁడు సాగించినాఁడు? ఆ కవీశ్వరు నాదరించిన రాజెవ్వఁడు? వారి దేశకాలములెవ్వి? యని యోజించి చూచినప్పు డాంధ్రభారత రచయితయగు నన్నియభట్టారకుఁడును, చాళుక్య రాజగు రాజరాజనరేంద్రుఁడును, రాజమహేంద్రపురమును నిప్పటికిఁ దొమ్మన్నూరేండ్ల క్రిందటి ప్రాంతకాలమును దలఁపునకు వచ్చుచున్నది. ఏమి! నన్నియకుఁ బూర్వ మాంధ్రప్రబంధరచనము లేదా? అని సందేహము పొడమినప్పుడు తడవుళ్లాడుచుంటిమే గాని తత్పూర్వ గ్రంథముల నెఱుంగఁ జాలకున్నాము. ఆ గ్రంథముల యునికిని దెలుపు సాధనములనేని గట్టివానిని గనిపట్టఁ జాలకున్నాము. నన్నియకుఁ బూర్వపు గ్రంథముల యభావమెట్టిదో సరిగా నెఱుఁగరాదు. రాజమహేంద్రపురమున నింక నీ యభావచర్చ సాగించుటయు బాగుగానుండదు. శ్రీనాథునిపరిహాసమునకుఁబాలగుదుము. బ్రహ్మశ్రీ జయంతి రామయ్యపంతులుగారు పరిశోధించిన యుద్ధమల్లశాసన మొక్కటి మధ్యాక్కరలది నన్నియకుఁ బూర్వకాలమునాఁటిది. బ్రహ్మశ్రీ గిడుగు రామమూర్తిపంతులుగారు ప్రకటించిన దీర్ఘాసి సీసపద్యశాసనము నన్నియనాఁటి దున్నది. బ్రహ్మశ్రీ లక్ష్మణరావుపంతులుగారు సరిగా నన్నియ నాఁటిదేయగు మఱియొక సీసపద్యశాసనమును ద్రాక్షారామము నందలి దానిని గ్రొత్తగా నెత్తినారు. ఇట్టివింకను దొరకవచ్చును. నేను కవితయను పదమును బర్యాప్తలక్షణ మయిన యుత్తమగ్రంథరచన నుద్దేశించి చెప్పినాఁడను. పాటలు, పదములు కొన్ని తెఱఁగుల పద్యములు మొదలగు పాండిత్య నిరపేక్షములగు రచనములును, వానిని బంధించు ఛందోవ్యాకరణ విధులును కొన్ని యంతకుముందును గలవనుట నిశ్చయము. అన్నియు నన్నియయే కల్పించినాఁడని చెప్పఁ జూచువా రాంధ్రభాషావ్యవహారమునే నన్నియ సృష్టించెనను వారగుదురు. పాల్కురికి సోమనాథుని గ్రంథములో నప్పటి పదములు కొన్ని పేర్కొనఁబడినవి. తుమ్మెద పదములు, ప్రభాతపదములు, పర్వతపదములు, ఆనందపదములు,

గొబ్బిపదములు, వెన్నెలపదములు మొదలగునవి. మఱియు నాతఁడు బసవపురాణమునందుఁ బ్రాచీన శివభక్తులచరిత్రములను, బురాతనము లయిన గీతలమునుబట్టి రచించితినని చెప్పుకొన్నాడు.

పండితారాధ్యచరిత్ర కృత్యవతరణికలో–

"…. అనియతగణై" రనియును 'ప్రాసోవా' యనియు 'యతిర్వా' యనియుఁ జెప్పు ఛందోవినిహితోక్తి గాన ప్రాసమైనను యతిపైవడియైన…" అని ద్విపదలలో 'అనియతగణైః' 'ప్రాసోవా', 'యతిర్వా' యని సంస్కృతోక్తులను మూఁడింటి నుదాహరించినాఁడు. ఇవి ఛందస్సూత్రములగునని నేను దలంచు చున్నాఁడను. గణములు నియతముగా నుండ నక్కఱలేదనియు, ప్రాసముగాని యతిగాని యుండఁదగు ననియు పైవాని యర్థము. ఇవి తెలుఁగుభాషకు సంబంధించిన ఛందస్సులోని వగును. యతిప్రాసములగూర్చియు మాత్రాగణ ముల గూర్చియుఁ జెప్పునప్పు డవి తప్పక తెల్గునకే సంబంధించిన వగును గదా! సోమనాథుడు తిక్కనకు తర్వాతివాఁడు కాఁడనుట స్పష్టము. ఇంచుక పూర్వుఁడగునని తలంచుచున్నాము. ఈతఁడుదాహరించిన సంస్కృత చ్ఛందోగ్రంథము నన్నియ కంతగా నర్వాచీనము కాఁగూడదు. ప్రాచీన మేమో! మఱియు ద్రావిడభాషలో 'యాప్పిరంగలమ్' అను ఛందోగ్రంథము పదునొకొండవ శతాబ్దిది గలదు. అందు సంస్కృత కర్ణాటాంధ్రఛందస్సుల ప్రస్తావమున్నది. "వాంచియార్ శెయిద వడఘుఛందవుం' అని యందున్నది. అనఁగా "వాంచియ రచించిన తెనుగుఛందము" ను జూచి తా నా గ్రంథమును రచించినట్లు గ్రంథకర్త చెప్పుకొనుటలోఁగలదు. ద్రావిడ నిఘంటు కార్యాలయ మున విద్వాంసులుగానున్న శ్రీ మూ. రాఘవయ్యంగా రిది గుర్తించిరి. శ్రీ రంగస్వామి సరస్వతిగారి వలన నిది విని శ్రీ రాఘవయ్యంగారిని గలిసికొని సరిగా విచారించితిని. వాంచియ యను నాంధ్రచ్ఛందఃప్రణేత మనకుఁ దెలియ రాకున్నాఁడు. ప్రాచీనప్రతుల లిపిరీతిని బరిశీలించువారు వాంచియర్ అను పదము రేచియర్గా నుండఁదగు ననిరి. కొన్ని సంస్కృత శబ్దములు గూడ నందిట్లే వికృతిఁ బొరసియున్నవి. రేచియార్ అని యగునేని యా గ్రంథము రేచియ (రేచన) రచించిన కవిజనాశ్రయమగును. ఆ ద్రవిడగ్రంథకర్త జైనుడు. ఈ రేచియయును జైనుఁడే. ఇదియొక పొందిక యగును. ఇట్లగునేని కవిజనాశ్రయము కాకున్నచో మఱి యేదో వాంచియ రచించిన ఛందోగ్రంథ

మొకటి యా కాలమున నుండెనని యా ద్రావిడ ఛందోగ్రంథము చెప్పుచున్నది. ఆ ద్రావిడ గ్రంథరచనా కాలము నన్నియకుఁ బూర్వమో, పరమో నాకుఁ దెలియరాలేదు. ఆతఁడు నన్నియకంటె ప్రాచీనుఁడగు నేమో!

మఱియుఁ దెలుఁగుయతులలో 'ము' విభక్తికయతి యని యొక యతి గలదు. తెల్గుఛందస్సులలో పు,ఫు,బు,భు లకు విభక్తిముకారమునకు యతి చెల్లుననియు, నది పయి యతియనియుఁ జెప్పఁబడినది. నన్నియాదు లీ యతిని వాడిరి. పు, ఫు, బు, భు లకు విభక్తిముకారమునకు మాత్రమే యతి చెల్లుటయు, తక్కిన పదమధ్య ముకారాదులకుఁజెల్లకుండుటయు మన కిప్పుడు వింతగా నుండును. 'పుణ్యుఁడు రాఘవుండు వనముం గనియెన్' అనఁ దగును గాని 'పుణ్యుఁడు రాఘవుండు మునిముఖ్యులతో' ననరాదు. దీనికి సరియయిన కారణమున్నది. తెనుఁగునం దిప్పుడు విభక్తిముకార మనఁ బడుచున్న "ము" నకు "ంబు" "మ్ము" అను రూపాంతరము లున్నవి కదా! ప్రాచీనకాలమున నివిగాక 'బు' అను రూపము కూడ నుండెడిది. ప్రాచీనశాసనము లీ యర్థమున సాక్ష్యమిచ్చుచున్నవి. ద్రావిడభాషా శబ్దము లిందుకుఁ దోడు పలుకుచున్నవి. మీఁదఁ జెప్పఁబడిన "ము" విభక్తికయతి 'వనబు' అను రూపమున్న కాలమున నేర్పడినదగును. 'వనబు' అను రూపము పోయిన తర్వాత ఛందోగ్రంథకర్తలు దానికి ముభక్తికయతి యని పేరిడిరి. నన్నియ నాఁటికి 'వనబు' అన్న రూపము పోయినది. భారతమునఁ గానరాదు. ఈ సాధనము యతిప్రాసలు, పద్యరచనము నన్నియకుఁ బూర్వమే కలవని స్పష్టపఱుచుచున్నది.

కాని నన్నియ తిక్కనల నడిమికాలపుఁగవులు కొందఱు చేసిన కృత్యాది స్తుతిప్రశంసలం దాంధ్రకవితాభ్యుదయమునకు నన్నియ ముఖ్యుఁడని స్పష్టముగఁ గానవచ్చుచున్నది. కేతన, మారన మొదలగు వారి స్తుతులను జూడఁదగును. ఇది చూడుఁడు. నన్నిచోడుఁడు –

"మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవితఁబుట్టించి తెనుం
గును నిలిపి రంధ్రవిషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్."

'జనసత్యాశ్రయునిఁదొట్టి చాళుక్యనృపుల్' అన్న పాఠము పరిగ్రాహ్యము కాదు. *ప్రబంధరత్నావళి పీఠికలో నా విషయమును బ్రపంచించి వ్రాసి యున్నాను.

పై పద్యమునఁ జాళుక్యరాజనఁగా నిప్పుడు మనకుఁ బ్రస్తుతుఁడును, నన్నియ యాంధ్రభారతకృతికిఁ గారయితయనగు రాజరాజనరేంద్రుఁడగు నని నేను దలంచుచున్నాఁడను. ఆతఁడు కాఁడని చెప్పుట కట్టి ప్రస్తుతికిఁ దగినవాఁడు వేఱొకఁడగపడవలెను గదా! పై పద్యమం దాంధ్రకవితఁబుట్టించి తెనుంగును నిలిపిరని యుండుట లోఁతుగా నాలోచింపఁదగినది. పై విషయములనన్నింటిని బర్యాలోచింపఁగా నిట్లు తోఁచుచున్నది: నన్నియ నాఁటికి తెనుఁగున నెలకొన్న రచనములు పాటలు, పదాలు, ఏలలు, జోలలు, అర్ధచంద్రికలు మొదలగు గేయరచనములును, అక్షరగణములతోఁగాక

*నన్నిచోడఁడు – ఈ కవికాల నిర్ణయాదికమును గూర్చి పెక్కురు చర్చించియున్నారు. అన్ని చర్చల పర్యవసానము నింతే. ఈ కాలము వాఁ డని నిర్ధారించుటకుఁ దగిన సాధనములు లేవు. శ్రీ చిలుకూరి వీరభద్రరావుగా రాంధ్రులచరిత్రమున నిట్లు వ్రాసినారు: "క్రీ. 925–40 సం. ప్రాంతమున నున్న యీ సత్యాశ్రయుని నన్నెచోడమహాకవి తన కుమారసంభవకావ్యమున నీ క్రింది పద్యములోఁ బేర్కొని యున్నాఁడు.

"మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గు నిలిపి రంధ్రవిషయమునఁ
జనఁ సత్యాశ్రయునిఁదొట్టి చాళుక్యనృపుల్."

దీనిం బట్టి నన్నయభట్టారకునకు నూఱేండ్లకుఁ బూర్వమే యాంధ్రకవితా సతి వర్ధిల్లుచున్నదని స్పష్టమగుచున్నది."

శ్రీ వీరభద్రరావుగారు గాని, మఱియెవరు గాని నన్నిచోడఁడు నన్నియ కంటెఁ బ్రాచీనుఁడని చెప్పఁజూచుటకును, గావచ్చునని లోకము విశ్వసించుటకును నీ పద్యమే ప్రధానాధారముగా నున్నది. శ్రీరామకృష్ణకవిగారు ప్రచురించిన కుమారసంభవపు ముద్రితప్రతిలో నీ పద్య మిట్లున్నది. 1909 సం॥ దీనిని ముద్రించినారు. అప్పు డీ పద్యమునకు వారు పాఠాంతరమును జూపలేదు. వారి యచ్చునకు మాతృక యెక్కడిదో చెప్పనులేదు. కాని తంజాపురపు సరస్వతీపుస్తకభాండాగారమునఁ దాటియాకులపై వ్రాయఁబడిన కుమారసంభవపుఁ బ్రతియున్నది. అక్కడఁ దక్క నింతవఱకుఁ బ్రత్యంతర మెక్కడను మనకుఁ గనరాదు. వినరాదు. ఆ పుస్తకములోఁ బై పద్యమిట్లున్నది:

"మును మార్గకవిత లోకం
బున వెలయఁగ దేశికవితఁ బుట్టించి తెనుం
గును నిలిపి రంధ్రవిషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగఁ బలువుర్."

కవిగారికి "చన సత్యాశ్రయునిఁదొట్టి చాళుక్యనృపుల్" అన్న పాఠమెక్కడ నుండి వచ్చినదో! వారింక నెక్కడి ప్రతి సంపాదించినారో! ప్రథమభాగమును ముద్రించునప్పటికి వారీ తంజావూరు ప్రతి నెఱుఁగనే యెఱుఁగరు గావలయును. ఎఱిఁగి యుందురేని యనర్ఘమగు నీ పాఠమును జూపకుండుట కేమి కారణము? తంజావూరు పుస్తకశాలలో నన్నిచోడని కుమారసంభవ మున్నదని యెల్లరు నెఱిఁగిన తర్వాత క్రీ. 1914–లో వీరు ప్రచురించిన కుమారసంభవపు రెండవ భాగమున "చాళుక్యరాజు మొదలుగఁ బలువుర్" అను పాఠాంతర మున్నట్లు తెలిపిరి. కాని యిప్పుడయినను దంజాపురపుఁ

మాత్రాగణములతో నిబద్ధములగు అక్కరలు, రగడలు, సీసములు, గీతములు, మంజరి, తరువోజ, ద్విపద మొదలగు పద్యరచనములును, వాని ప్రకృతులునునై యుండును.

నన్నియ యిట్టివానిని గొంత సరిపఱిచి, సీసములు, గీతులు, అక్కరలు మొదలగువానిఁజేర్చి కన్నడమునఁబోలె చంపకోత్పలాదులగు నక్షరగణ బద్ధములైన వృత్తములను గూడఁగూర్చుకొని కొంత క్రొత్తసంస్కారము గావించి సత్ప్రబంధరచనము సాగించినవాఁడయి యుండును.

నన్నియ రచనముకంటెఁ బ్రాచీనముగాఁ దెలియుచున్న యుద్ధమల్ల శాసనమెల్ల నక్కరలతోనే చెక్కఁబడినది గదా! ఇట్లగునేని ఈ నన్నియ నాదరించిన చాళుక్య రాజు (రాజరాజ నరేంద్రుఁడు) నన్నిచోడఁడన్నట్లు దేశి

కవితఁబుట్టించి తెనుఁగు నిలిపినవారిలో ముఖ్యుఁడు కాఁగల్గును. నన్నిచోడ మహాకవిచే దేశికవితను బుట్టించి తెలుంగు నిలిపినవాఁడని కీర్తింపబడిన యీ చాళుక్యచక్రవర్తి రాజరాజనరేంద్రుఁడు రాజధానియగు రాజమహేంద్ర వరమున పట్టాభిషిక్తుఁడయి యిప్పటికి సరిగా తొమ్మన్నూఱేండ్లయినది. ఆనాఁట యీ రాజ్యస్థితిని, నా పట్టాభిషేకోత్సవ సంరంభమును, నా నన్నియాదుల యునికిని నవధానముతో నొకతూరి స్మరించి చూచినప్పుడంధ్రభాష నభిమానించు వారికిఁ బులకోద్గమము కలుగును.

నన్నియ, నారాయణభట్టు మొదలగు కవీశ్వరు లా రాజేంద్రుని యాస్థాన మున విద్వత్కవులుగా వెలసియుండిరి. మహావీరాచార్యుని సారసంగ్రహ గణితమును దెలిఁగించిన పావులూరి మల్లన తాతయగు మల్లన కాతఁడు

బుస్తకమును వీరు చూచినట్లు వ్రాయలేదు. కావున నీ పాఠము మఱియొక ప్రతిలోఁ జూచినారేమో? అత్యూహ లెందులకు? తంజావూరు పుస్తకపాఠము మాత్రమే మన కిప్పుడు గ్రాహ్యము – శ్రీకవిగారి పాఠముగల మాతృక బయల్పడువఱకును. అట్టి ప్రత్యంతరము బయల్పడెనా యది పాఠాంతరముగాఁ గూర్చుకొందము. ఇఁకఁ "జాళుక్యరాజు మొదలుగ" నన్నప్పుడు రాజరాజనరేం ద్రుఁడే యేల కారాదు? చోడఁడు నన్నియకంటెఁ బ్రాచీనుఁడనుట కాధారములు తగినవిలేవు. శ్రీ వీరేశలింగముపంతులుగారు నన్నిచోడని భాషాప్రయోగము లను గూర్చి చేసిన యాక్షేపములు నిలువఁజాలనివి. వాని నెల్ల నిర్వచించుట కిక్కడ స్థలము చాలదు. పాల్కురికి సోమనాథుఁడు 1180 ప్రాంతముల నున్నవాఁడను పంతులవారి సిద్ధాంతము పోలును. నన్నిచోడఁడంతకు ముందటివాఁడో వెనుకటివాఁడో సిద్ధాంత మేర్పడలేదు గదా! ఈ యిర్వురిలో నొకని పుస్తకము నింకొకఁడు చక్కఁగా సంగ్రహించుకొన్నాఁడు. ఇది చదివి చూడుఁడు!

ద్వి. నెట్టన నేలకు నింగికి సూత్ర
పట్ట మ్రోఁకాళ్ళకు బట్టతలలకు
ముడివెట్టఁ దననీడ గడవంగఁబాఱ
వడి నెండమావుల కడగళ్ళు కట్ట
పాయక రెండుగాఁ బాఱెడు నీరు
వ్రేయఁ బుల్జున్ను గోరో యని యమ్మ
ఱూనార యొలువఁ జత్రాతిపైఁ గ్రుంక
నేనుంగు పురుడోమ నిసుమువ్రాద్వేన
లలిగొన దెసలు తాళములు వాయింపఁ
జెలఁగుచు రోఁకటఁ జిగురులు గోయఁ
గలి వెన్న పుచ్చఁగొండలు దొంతిఁ బేర్ప
నిల మంచుఁ గుంచానఁ గొలువ రేఁబవలు
సేయ నాకసమునఁ జిత్రరూపములు
వ్రాయ వాయువుఁ బట్ట వడగళ్ళ గుళ్ళు
గట్ట వెన్నెల గుంపుగాఁ జేయ వచ్చి
పుట్టినప్పుడె నేర్చుబుద్ధులప్రోఁక." –బసవపురాణము.

సీ॥ నేలయు నింగియుఁ దాలముల్ వాయింప
నెండమావులఁ బట్ట బండతలయు
మ్రోఁకాలు ముడివెట్ట రోఁకటఁ జిగుళులు
గోయఁ జత్రాతిపైఁ గ్రుంగ నిడుపు
లేక చిత్రము వ్రాయ నాకాశమునఁ దాఁప
రము నిడ మంచుఁ గుంచములఁ గొలువ

నవఖండవాడను నగ్రహారము నొసఁగెను. నారాయణభట్టారకున కా రాజరాజ నరేంద్రుఁడొసఁగిన నందంపూడి దానశాసనము, నన్నియ రచితము, తెలుగుఁన శ్రీ జయంతి రామయ్యపంతులుగారిచేఁ బ్రకటితము ప్రఖ్యాతమే గదా! కోరుమిల్లి శాసనము రెండవది.

ఆంధ్రలోకము విద్యావిజ్ఞానములతో వెలసి యుండునంతకాలము రాజ రాజనరేంద్రుని యశశ్చంద్రుఁడు తేజరిల్లుచునే యుండును. మత్యమరాధిపా చార్యుఁడనఁబడిన నన్నియవంటి మహామహుల కాశ్రయమయిన యీ రాజరాజనరేంద్రుని కిటీవలివా రన్యాయముగ నొక యపదూరు నంటఁగట్టి నారు. సారంగధరకథ యందఱకు నెఱుకలో నున్నదే కదా! అన్ని ప్రాచీన గ్రంథములలోను నా కథ మాళవదేశమున మాంధాతపురమున జరిగినదని

యున్నది. రాజమహేంద్రవరముననున్న మన రాజరాజనరేంద్రునితలకుఁ దగిలించుట యన్యాయము. ఈ నడుమనే యొక రట్లు తప్పుగా వ్రాయఁగా నీ విషయమును విపులముగ చర్చించి యాంధ్రపత్రికలోఁ బ్రకటించితిని. అది యెల్ల మఱలఁజెప్పుట చర్వితచర్వణమగునని మానుచున్నాఁడను. పలువురా వాదప్రతివాదములు చూచియుందురు. రాజరాజనరేంద్రునిపయి యన్యాయముగాఁ గల్పింపఁబడిన యీ యపప్రథ నపాకరించి మన మా నరేంద్రుని పుణ్యశ్లోకత్వమును రాద్ధాంతపఱచుదుము.

నే నీ వ్యాసము వ్రాసిన పిదప శ్రీ లక్ష్మణరావుగారు బటర్వర్తు ముద్రించిన నెల్లూరుశాసనములలో నిదివఱకుఁ బద్యరచనములుగా నూహింపఁబడుచున్న పండరంగని శాసనములు రెండు తొమ్మిదవశతాబ్దివి తర్వోజసీసములుగా గుర్తించినారు. పద్యరచన తొమ్మిదవశతాబ్దిలో నుండెనని యిది స్పష్టపఱుపఁ గలదు. ఆ పద్యములు మాత్రాగణబద్ధములేయనుటయు నాలోచింపఁదగిన విషయము.

(శ్రీ రాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచిక, 1922,
సింహావలోకనము 1952 ప్ర.ము.
1953 ద్వి.ము.)

నేనుంగు పురుడోమ ఊనారఁ గొన గాలి
గంటిడ నిసుమున గట్టుదాల్ప

గీ॥ నీరినడుము దెంప నేలఁ దెన్నుండి చే
వెల్పఁ గలియుఁ ద్రచ్చి వెన్న గొనఁగఁ
గడవ నేర్పు గలిగి కందువు మానెడ్డై
కత్తిగంటు లయిన యత్తగంతు.

కుమా. 8 ఆ.– 135 ప.

యిట్లీ యిర్వుర గ్రంథములనుండియు వలసినన్ని సంవాదములు చూపవచ్చును. సులువుగా ద్విపదలో సోమనాథుఁడు కూర్పఁగా నన్నిచోడఁ డిట్లు సీసపద్యమునఁ జేర్చుకొన్నాఁడేమో! సుసూక్ష్మముగా నీ యిర్వుర కృతులను బరిశీలించినచో నీ విషయమును బయల్పడఁగలదు. భాషావ్యుత్పత్తిలోఁ జోడఁడును, సోమనాథుఁడునుగూడ సమధికులే యని యాయా గ్రంథములఁ జక్కం జదివి యెఱిఁగినవారు భావింతురని నా నమ్మకము.

తెలుగుకవితలోని దేసితనం

తెలుగుభాష, తెలుగు లిపి, తెలుగు కవిత – వీటి పుట్టు పూర్వోత్తరాలను పరిశీలింప బూనుకొంటిమా, ద్రవిడకన్నడములనూ, సంస్కృత ప్రాకృతములనూ కూడా కలయజూచుకోవడము ఆవశ్యకమవుతుంది. శాసనములలో కొన్ని రకాల పద్యరచనలు నన్నయ కింకా ఇన్నూరేండ్ల పూర్వమునుండి ఉన్నట్లు తెలియవస్తుంది. అప్పటికే కన్నడములో శాసనరచనలేకాక గ్రంథములు కూడా కానవస్తున్నవి. అరవములో అంతకింకా పూర్వకాలమునుంచీ కవితారచన ఉన్నది. అతిప్రాచీనము లనబడే 'శిలప్పధికారము' మొదలైన గ్రంథములు పదులకొలదీ వందలకొలదీ చరణములు గల 'పాట్టగళ్' అనబడే రచనలతో నిండి ఉన్నవి. ఆ పాట్టులు మన తెలుగువారు నేడు పాడే లంకాయాగము, కుచ్చలకథ మొదలైన పాటలవంటివే. వాటి వికారములే నన్నయకు పూర్వపు శాసనములలో కానవచ్చే పద్యరచనలు. సీసము, తరువోజ, మధ్యాక్కర, గీతము – ఇవే శాసనములలో నున్నవి. ఇవి కొంచెము మార్పుతో ఉన్న పాటలే. కర్ణాటకులు ఈ రచనలన్నిటినీ తమ గ్రంథములలో పాటించినారు. నన్నయకు పూర్వపుదైన కర్ణాటకచ్ఛందోంబుధిలో సీసపద్యము మొదలయిన పై పద్యముల కన్నింటికీ లక్షణము చెప్పబడ్డది. ప్రాకృతకావ్యము లనేకములు కందపద్యమయములు. ఈ కందపద్యమును తొలుత కర్ణాటకులు తమ కావ్యములలో పరిగ్రహించినారు. కర్ణాటకులకు పద్యరచనలో ప్రాసములు మాత్రమేకాని యతులు లేవు.

అరవమున యతిప్రాసములు రెండునూ గలవు. కాని కందము లేదు. కందమునకు యతిప్రాసములు రెండూ నిలుపుట మొదలగు విధముల నన్నయ యతిప్రాసనియమమును ద్రవిడకర్ణాటకములకంటె తెలుగులో ప్రగాఢపరచినాడు. కర్ణాటకమున వర్గప్రాసమని శాంతప్రాసమనీ వర్గాక్షరములకు పరస్పరమునూ శషసలకు పరస్పరమునూ ప్రాసము చెల్లుట నన్నయకు పూర్వముదగు కర్ణాటకచ్ఛందోంబుధిలో నున్నది. కాని తర్వాతి కర్ణాటకవులును, నన్నయాద్యాంధ్ర కవులును ఎక్కడో క్వాచిత్కముగానే దానిని పాటించినారు. శైవకవులు వాని నధికముగా పాటించినారు.

నన్నయ ఆంధ్రకవితామార్గనిర్మాణమునకు ద్రవిడరచనలు పరిమితముగాను, కర్ణాటసంస్కృతప్రాకృతరచనలు అపరిమితముగాను సహాయపడినవి. మత్తేభశార్దూలాది వృత్తములు సంస్కృతమునుండియు, కందపద్యము ప్రాకృతము నుండియు, తరువోజ, మధ్యాక్కర, సీసాదులు ద్రవిడకర్ణాటకాంధ్రములకు సహజములైన దేశిపాటల నుండియు, నన్నయ్య కైకొన్నాడు. సీస, తరువోజాదులు పద్యములుగా, గేయములుగా సుఖముగా చదువదగినవై యుండును గాని అక్కరలూ అందులో నన్నయ అధికముగా వాడిన మధ్యాక్కరలు మాత్రమే వో వింతతీరు గలవిగా, సులువుగా చదవరానివిగా, సుఖగతి లేనివిగా ఉన్నట్లుండును.

నన్నయకు పూర్వముదైన యుద్ధమల్లుని శాసనములోని ఒక మధ్యాక్కర వినండి :

స్వస్తినృపాంకుశాత్యంత వత్సలసత్యత్రినేత్ర
విస్తరశ్రీయుద్ధమల్లుఁ డనవద్యవిఖ్యాతకీర్తి
ప్రస్తుతరాజాశ్రయుండు త్రిభువనాభరణుండు సకల
వస్తుసమేతుండు రాజసల్కి భూవల్లభుండర్థిన్.

రెండింద్రగణములు, ఒక సూర్యగణము, రెండింద్రగణములు, ఒక సూర్యగణము ప్రతిచరణమునకు ఇందుండును.

అక్షరరమ్యతను, పద్యముల మధురగతిని పాటించే నన్నయ చాలా ప్రియంగా తన భారతభాగంలో ఈ మధ్యాక్కర నధికముగా వాడినాడు. ఒకనాడు మా ఇంట స్త్రీలేవో పాటలు పాడుతూ ఉండగా ఒక పాట నడక నాకు చాలా హృద్యముగా ఉండెను. గణవిభజనచేసి చూతునుగదా– అది మధ్యాక్కరే. కాని చరణము నడిమికి రెండుదళములుగా తెగిపోయినది. ఆ పాట తీరున భారతములోని, శాసనములోని మధ్యాక్కరలన్నీ నాకు మనోహరముగా చదువతగినవయినవి. ఆ పాట ఫణితి వినండి:

అంతట రాములవారు – అంగన సీతనుగూడి
సంతసమందుచు వేగ – స్వపురమునకు జనుదెంచి
తమ్ములతోడను గలసి – నెమ్మది రాజ్యము నేలె
ధర్మముతో ప్రజలెల్ల – తామరతంపర లైరి.

ఈ పాటలో రెండింద్రగణములు, ఒక సూర్యగణము అనుక్రమమున చరణములు పదులకొలదిగా నుండును. సంస్కృతసంప్రదాయము చొప్పున పద్యము నాల్గుచరణములతో ముగింపబూనుకొనుటలో ఈ పాటలోని రెండు పదములను ఒక పాదముగా పొడిగించి యతిప్రాసలు కల్పించి మన కవులు మధ్యాక్కర కావించిరి. మధ్యాక్కర అను పేరులోని మధ్యపదము సీసచరణము వలె రెండుదళములుగా మధ్యాక్కరచరణమును వేఱుపరిచి చదువవలె ననుటకు జ్ఞాపకము. ఈ మార్పు వలన ఎనిమిదిచరణముల పాట నాల్గు ప్రాసములతో నాల్గుచరణముల పద్యముగా కుదుర్కొన్నది. పాటకూ ఈ పద్యమునకూ కల ఫణితి సంబంధము నేటివారి యెఱుకకందక పోవుటచేత మధ్యాక్కరపఠనము కొంతక్లేశము కూర్చునట్టిదైనది. ఇదివరకు చదివిన శాసన మధ్యాక్కరను పాటఫణితితో మళ్ళీచదువుతా వినండి :

“స్వస్తినృపాంకుశాత్యంత వత్సలసత్యత్రినేత్ర
విస్తరశ్రీ యుద్ధమల్లు.....”

ఈ మధ్యాక్కర పేరువలెనే తరువోద, తరువోజలనీ, అక్కలి సీసమనీ, అవకలి సీసమనీ పద్యములకున్న పేళ్ళయర్థము వింతగా విచారింపతగినది. వాటిని వివరించుట కిక్కడ చోటులేదు. పద్యములు నాల్గుపాదములు గలవిగా చేయుట, అందు రెండు మూడు చరణములకు సంధి కలుపుట, సీసతరువోజాది దేశిరచనలను గ్రహించుట, వీలైన సంస్కృతఛందోవృత్తములను గైకొనుట పాటల, పదాలసంప్రదాయము చొప్పున కొన్ని పద్యములలో యతికి బదులుగా ప్రాసమును కూడ వాడుట అన్నవి నన్నయ నాటి ఛందఃపరిణామములో ముఖ్యములు.

సమసంస్కృతకర్ణాటరచన బహుమనోహరముగా ఉంటుందని (ప్రాచీన కర్ణాటక కవులు) ప్రశంసించిరి. నన్నయ ఆ మార్గమునే అధికముగా ప్రేమించినాడు. కన్నడమున ఆదిపురాణమును భారతమును రచించిన పంపకవి నన్నయకి నూరేండ్లకు పూర్వపువాడు. అతడు సమసంస్కృత కర్ణాటరచనముగా కవితను వెలయించినాడు. నన్నయ కర్ణాట పంపకవి రచించిన ఆదిపురాణ భారతములను చిదిపితెచ్చి తెలుగునాట కవితాదీపమును దివ్యజ్వాలతో వెలిగించినాడు. పంపకవికీ నన్నయకవికీ పోలికలు చూడండి :

సకలక్ష్మాచరఖేచరాంచిత మహామాణిక్యగాణిక్య హా
స్తికచక్రోర్జిత చక్రవర్తి విభవంమున్నంబకెక్కెంద్రమై
హికపారత్రిక భోగమంకుడువినమాణిక్య భట్టారకాం
తికమం సారెవినేయ రాగిదె జయం భద్రం శుభం మంగళం.
(ఆదిపురాణం)

మదమాతంగతురంగ కాంచనలసన్మాణిక్య గాణిక్య సం
పద లోలిం గొని తెచ్చియిచ్చి ముదమొప్పంగాంచి సేవించి ర
య్యుదయాస్తాచలసేతుశీతనగమధ్యోర్వీపతుల్ సంతతా
భ్యుదయున్ ధర్మజు దత్సభాస్థితు జగత్పూజ్యప్రతాపోదయున్.
(భారతము)

ఈలాటి పద్యరచనలలోనే కాక పరికరములో పలుకుబళ్ళలోకూడా పంపకవికీ నన్నయభట్టుకూ చాలా సాంగత్యం ఉంది. తరుసంటి పలుకులు, నడునడ నడుంగుటలు, ఒయ్యనొయ్యనలు, పశువరించుటలు, ఉల్లలు, అనార్యులు మొదలైన పలుకుబళ్ళు పంపకవి రచనలలోను నన్నయ రచనలలోను సమానముగా ఉన్నవి.

నన్నయ సంస్కృతభాషయైనా సంస్కృతకవితాసంప్రదాయమునకు విలక్షణముగా తెలుగునకు అందముగా ఉండేటట్టు సమాసములు సందర్భింప జేయడంలో మొనగాడు. ఈ పద్యములోని సంస్కృతసమాసపు పోకడ వినండి:

"బహువనపాదపాబ్ధికులపర్వత పూర్ణ సరస్సరస్వతీ
సహితమహామహీభరమజస్ర సహస్రఫణాళిదాల్చి దు
స్సహతరమూర్తికిన్ జలధిశాయికి పాయక శయ్యయైన య
య్యహిపతిదుష్కృతాంతకుఁ డనంతుఁడు మాకుఁ బ్రసన్నుడయ్యెడున్"
(భారతము)

ఇంకా 'అవంధ్యకోపి' 'వక్షోముఖాజ్గేషు' మొదలైనప్రయోగములు కొన్నిటిని సంస్కృతవ్యాకరణ నియమములకు అనిత్యత కల్పించేవాటిని తన నాటి వాడుకనుబట్టి కాబోలు నన్నయ ధారాళముగా తనకవితలో చొప్పించి నాడు.

'తథాపి' అని సంస్కృతంలోను 'అయినప్పటికీ' అని నేటి తెలుగులోను

ఉండే వ్యవహారానికి సరిగా 'నేని, ఏని' అని రూపాంతరములుకల అవ్యయం పూర్వపు తెలుగుకావ్యరచనలో ఉన్నది. దీనిని నన్నయ విచిత్రవిధంగా తన భారతంలో ప్రయోగించినాడు. వినండి:

వాడిమయూఖముల్ గలుగువాఁడపరాంబుధి గ్రుంకె ధేనువుల్
నేడిటవచ్చె నేకతమ నిష్ఠమెయిన్ భవదగ్నిహోత్రముల్
పోడిగవేల్వగాబడియె బ్రొద్దునుబోయె గచుండునేనియున్
రాడు వనంబులోన మృగరాక్షసపన్నగబాధ జిక్కెనో.

ఈ పద్యములో 'ప్రొద్దును బోయెను, అయినను కచుండు రాడాయెను, అనుటకు 'ప్రొద్దునుబోయె గచుండునేనియున్‌రాడు' అని నన్నయ ప్రయోగించి నాడు. ఇట్లే ఇంకొక్కచోట –

"నీవును జూచి తట్టి సభనేని వినంబడ దే యుగంబులన్
భూవలయంబులోనిది యపూర్వము సర్వమనోజ్ఞ మిష్టభో
గావహ మే క్రియం బడసెనయ్య మహాత్ముడు దాననేమి సం
భావిత భాగ్యుడయ్యెను బ్రభాకరతేజుఁడు ధర్మజుండిలన్."

నన్నయ తన భారతభాగమును ఛందోవ్యాకరణానుశాసనమైన లక్ష్య గ్రంథముగా రచించినాడని ప్రాచీనకవులు స్తుతించినందుకు ఒక ఉదాహరణ–

"పాయక పాకశాసనికి భారతఘోరరణంబునందు నా
రాయణునట్లు దానును ధరామరవంశవిభూషణంబు నా
రాయణభట్టు వాఙ్మయధురంధరుఁ డీ కృతికిష్టుడున్ సహా
ధ్యాయుఁడునైనవా డభిమతంబుగ దోడయి నిర్వహింపగన్."

నన్నయ ఈ పద్యము రెండోచరణం మూడవచరణంలో నారాయణ పదముతో ధరామర పదంతోనూ ధురంధరపదంతోనూ, అజ్ఝల్ యతులు కూర్చినాడు. ధరామరపదంతో అజ్యతిగా ధురంధరతో హల్యతిగా కూర్చినాడు. అనగా, నారాయణ ఖండాఖండయతులు. అచ్చులకూ హల్లులకూ కూడా ఇట్టి చోట్ల ఖండాఖండయతులు చెల్లుతవని అనుశాసనం చేసినాడన్నమాట.

ఈ విధంగా నన్నయ భారత భాగములోనుండి ఛందోవ్యాకరణ నియమ ముల నెన్నింటినో ఉద్ధరింపవచ్చును.

ప్రాచీనాంధ్ర కవివర్గమంతా నన్నయనే ఆంధ్రకవితా మార్గదర్శకునిగా పేర్కొన్నప్పటికి ఇటీవల బయల్పడిన నన్నిచోడని కుమారసంభవము నన్నయ కింకనూ ప్రాచీనమైనదన్న అపప్రథనొకదానిని అవతరింపజేసినది. దానికీ క్రింది పద్యము కారణము–

"మునుమార్గ కవిత లోకం
బున వెలయగ దేశికవితఁ బుట్టించి తెలుం
గు నిలిపిరంధ్ర విషయమునఁ
జనసత్యాశ్రయునిఁ దొట్టిచాళుక్యనృపుల్.

ఇది వ్రాతప్రతిలోనున్న పాఠమునకు తార్మారుగా అచ్చులో కెక్కిన అపపాఠము. 'తెనుంగును నిలిపిరంధ్రవిషయంబున జని చాళుక్యరాజు మొదలుగఁ బలువుర్' అన్న పాఠము ప్రామాణికము. ఇదియే తంజావూరి పుస్తకశాల వ్రాఁతప్రతిలోనున్న పాఠము. దీనినిబట్టి చూడగా తెలుగు దేశి కవితను పుట్టించి ఆంధ్రవిషయమున నిలిపినవాడు రాజరాజని యర్థమగును. నన్నయకు పూర్వకాలపు గ్రంథములేవీ యీనాటిదాకా తెలియరాలేదు. నన్నెచోడని కుమారసంభవము నన్నయకు నూఱేండ్ల తర్వాతిదని యనేక చరిత్రాధారములచే గుర్తింపనగుచున్నది.

తొమ్మన్నూఱేండ్ల నాడు నన్నయ వెలయించిన ఆంధ్రకవితా మార్గము ననే కవితార్థమంతా ఈనాటికీ నడుస్తూ ఉన్నది.

ఉన్నత గోత్రసంభవము, నూర్జితసత్త్వము భద్రజాతి సం
పన్నము నుద్ధతాన్యపరిభావిమదోత్కటము న్నరేంద్ర పూ
జోన్నయనోచితంబునయి యొప్పెడు నన్నయభట్టకుంజరం
బెన్న నిరంకుశోక్తి గతినెందును గ్రాలుట సన్నుతించెదన్.

(–రేడియో ప్రసంగము : 4–7–1944
–విస్తృతపాఠము – సింహావలోకనము
1952 ప్ర.ము.
1955 ద్వి.ము.)

తెలుగుదనము – సంప్రదాయము

ఆంధ్రులన్నా, తెలుగువారన్నా ఒకరే అన్న యెఱుకతో మాటాడుతున్నాను. తెలుగుసంప్రదాయమన్నా, తెలుగుతనమన్నా, ఆంధ్రసంప్రదాయ ఆంధ్రత్వ మన్నా ఒకటే అని నా తలపు.

"ఆంధ్రద్రవిడకర్ణాటా మహారాష్ట్రాశ్చ గుర్జరాః" ఈ అయిదు జాతుల వారూ పంచద్రావిడులని ప్రాచీనులు పేర్కొన్నారు. ప్రాచీనకాలమునందు, ఇప్పటికీ కూడా, ఈ అయిదుజాతుల వారికీ ఆచారవ్యవహారములు, ఆహార విహారములు, కవితాగానములు, కులమర్యాదలు కొంతకొంత సరిపోలుతూనే ఉన్నవి. ఔత్తరాహులయిన పంచగౌడులకు "సారస్వతాః కాన్యకుబ్జా గౌడా ఉత్కల మైథిలాః" అని పేళ్ళు. వారు చాలావిధాల పంచద్రావిడులతో భేదిస్తారు. పంచద్రావిడులలో నేడు, ఆంధ్రద్రవిడకర్ణాటులు మాత్రమే అత్యధిక సంబంధముగల వారుగా ఉన్నారు. కాని, ప్రాచీనకాలమున అనగా రెండు వేలేళ్ళకు ముందు, సాతవాహనులూ, ఇక్ష్వాకులూ పాలించేనాళ్ళలో, మహారాష్ట్రులు గుర్జరులు కూడా ఈ మూడుజాతులతో చాలా సన్నిహిత సంబంధము గలవారై యుండేవారు. ఆంధ్రుల నేటి యాహారసంప్రదాయమే పంచద్రావిడులయు నాహారసంప్రదాయమని, శంకరాచార్యాదులు రచించిన పూజాస్తోత్రములలోని నైవేద్యక్రమవర్ణన శ్లోకములబట్టి గుర్తింపవచ్చును. శాల్యన్నము, నెయ్యి, పప్పు, కూరలు, పచ్చళ్లు, దప్పళము, పెరుగు ప్రధానాహార పదార్థములుగా శ్లోకములున్నవి. ఇప్పటికీ ఆంధ్రుల యాహారపద్ధతి ఇదేకదా.

ప్రాచీనకాలమున తెలుగువారికి పైటలు లేవు. అవి మహారాష్ట్ర గుర్జరుల సంబంధమున, అప్పటి ఆంధ్ర రాజధానియయిన ప్రతిష్ఠానము – పైఠాన్ – నుండి నాగరకతతో వ్యాపించినవి. పైఠాన్ పదభవమే పైట. ఆంధ్ర స్త్రీ వర్ణనమున సాతవాహనసప్తశతిలోను, ఇతర సంస్కృతకావ్యములందును, కుచ సౌభాగ్యము ప్రధానముగా వర్ణితమగును. మంకుకుని కావ్యమీమాంసలో ఆంధ్రస్త్రీలను గూర్చి యీ శ్లోకమున్నది.

కేశాః సపుష్పగండూషా జఘనే మణిమేఖలా
హారో రక్తాంశుకం శుభ్రం వేషః స్యాదంధ్రయోషితామ్.

సదుక్తికర్ణామృతముననుండి –

వాచో మాధుర్యవర్షిణ్యో నాభయః శిథిలాంశుకాః
దృష్టయశ్చ చలద్భ్రూకా మందనాన్ధ్రయోషితామ్. భర్తృమేణ్ఠస్య.

ఆమూలతో వలితకున్తలచారుచూడః
చూర్ణాలకప్రకరలాంఛితఫాలభాగః
కక్షానివేశనిబిడీకృతనీవిరేష
వేషశ్చిరం జయతు కున్తలకామినీనామ్. రాజశేఖరస్య.

వాక్ సత్త్వాంగసముద్భవై రభినయైర్నిత్యం రసోల్లాసతో
వామాంగ్యః ప్రణయన్తి యత్ర మదనక్రీడామహానాటకమ్
అత్రాన్ధ్రాస్తవ దక్షిణేన త ఇమే గోదావరీస్రోతసాం
సప్తానామపి వార్నిధిప్రణయినాం ద్వీపాన్తరాళశ్రియః. రాజశేఖరస్య.

మానసోల్లాసమున నుండి –

కాశ్చిత్కుంతలకామిన్యః కుటిలీకృతకున్తలాః
కాశ్చిద్ద్రవిడకామిన్యః ప్రకాశితపయోధరాః
మహరాష్ట్రస్త్రియః కాశ్చిత్ లంబలోలకభూషితాః
అంధ్రనార్యోవరాః కాశ్చి దపసవ్యోత్తరీయకాః
గుర్జర్యో వనితాః కాశ్చి దాపాణికృతకంచుకాః.

పువ్వులను పుక్కిలించే కొప్పు, మణిమయమయిన యొడ్డాణమూ, రక్తహారము, తెల్లచీర, ఇది తెలుగునెలతవేషము అని తొలిదానియర్థము. భర్తృమేణ్ఠాది సంస్కృతకవులు ఆంధ్రులనుగూర్చి చెప్పిన శ్లోకములకు ఆంధ్రస్త్రీలు సౌందర్యవతులని, నృత్యగానప్రియలని, అమాయికలని అర్థసారము.

అంధ్రుల సంగీతసాహిత్యములతో తొలుత మహారాష్ట్రకర్ణాటకుల కధిక సంబంధముండేది. సంగీతమున అంధ్రదేశి సంప్రదాయ భేదములు కొన్ని మతంగుని బృహద్దేశిలో వివరింపబడినవి. తెలుగువారిలో వివాహము లందు మంగళసూత్రము కట్టుట అనాది యాచారము. ఈ యాచారము ఉత్తరదేశీయులకు లేదు. ఆర్యుల గృహ్యసూత్రగ్రంథములలో లేనేలేదు. ప్రాచీనకాలము నుండి ఆంధ్రస్త్రీలకు వివాహములందు తాటియాకును చుట్టగా జుట్టి పసుపు

పూసి నూలిబొందుతో కట్టి వరునిచే మూడుముళ్లు వేయించుట యాచారము. కనుకనే దానికి తాళిబొట్టని పేరయ్యెను. తాళియనగా తాడియే. అట్లే ఆంధ్రస్త్రీలు చెవులకు కమ్మలను, అనగా తాటియాకులనే, చుట్టి పెట్టుకొనుట యాచారము. 'తాటాకు' పదమే సంస్కృతమున తాటంకమయినది. మఱీన్నీ దానికి తెలుగున చెవాకు అనికూడ పేరున్నది. తాటియాకులను చెవులకమ్మలని ధరించుట, తాళిబొట్టు కట్టుకొనుట తెలుగువారినుండి కడమ ద్రావిడులకు సంక్రమించినవి. ఇట్లనుటకు తాళి, తాటంక, కమ్మ, చెవాకు పదములే సాధకములు. తాడి, కమ్మ, తాటాకులు, తెలుగుపదములే కదా. తెలుగువారికి తాడిచెట్టు కల్పవృక్షము! తెలుగువారిలో వెలనాట్లు, వేగినాట్లు, తెలుగాణ్యులు, రెడ్లు, వెలమలు, కమ్మలు, కాపులు, కోమట్లు, రాచవారు, పాఱులు మొదలగు ప్రజాశాఖలలో సర్వసామాన్య ధర్మములుగా, నీ క్రిందివి కానవచ్చును.

క॥ ఆతిథ్యగౌరవంబును
స్వాతంత్ర్యప్రియత, స్వల్పసంతోషము, దు
ర్నీతివిహీనత, నైచ్యా
పేతత్వము, నంధ్రులందు పేర్పడు గుణముల్.

ఉ॥ ఓర్వరు మాయమర్మముల, నుజ్జ్వలధీమహిమంబు పేర్పడన్
నేర్వరుగాక విద్దియలు, నెయ్యము తియ్యము చూచుకొంద్రు, లో
గర్వము తక్కువే యయిన గంద్రతనంబునఁ గానవత్తు, రా
యు, ర్వపు, రుజ్జ్వలుల్ బలసమున్నతు లెన్నఁగ నంధ్రపుత్రకుల్.

తెలుగువారి స్వరూపస్వభావములతోపాటు భాషాకవితాగానరీతులలోని ప్రత్యేకలక్షణములుగూడ పేర్కొనదగినవి. తెలుగువారి శబ్దోచ్చారము తక్కిన ద్రావిడుల యుచ్చారముకంటె సుందరమయినది. కనుకనే "తెలుగుతేట" అన్న నానుడి యేర్పడినది. తెలుగుదేశపు శీతోష్ణస్థితులు మంచివగుటచే, తెలుగువారి ముఖముద్ర స్పష్టవికాసముగలది. వారి ఆహారవిహారములు బలిష్ఠము లగుటచే ధృడగంభీరరీతులు గలది వారి యుచ్చారము. తెలుగుభాష కున్నన్ని యక్షరములు తక్కిన యే ద్రవిడభాషకుగాని లేవు. తెలుగుపలుకులు ప్రాయికముగా అజంతములగుటచే ప్రతిపదము విభిన్నముగా వ్యవహరింప వీలగును. ద్రుతపుచ్ఛము కొన్ని పదములకుండుటచే నది తర్వాతి యజాది పదములతో సుఖసంధ్యుచ్చారముగూర్చునదై హృద్యతగొల్పుచున్నది.

గసడదవాదేశము సరళాదేశము శబ్దముల కటూచ్చారమును దొలగించు చున్నది. ద్రవిడపదముల యచ్చమెత్తదనముగాని, సంస్కృతపదముల ప్రౌఢ గాఢ క్లిష్ట వాక్ఛరములుగాని లేక, యరవమెత్తదనమును, సంస్కృతపుబింకమును గొంతకొంతకూర్చుకొని, తెలుగుబాస ద్రావిడభాషాకుటుంబములో లేఁబ్రాయపు జిలిబిలిపలుకుల పొలతియై వన్నెకెక్కినది. ఇటువంటి భాషాపరికరముగల తెలుగువారి కవితయు కొంత విశిష్టలక్షణములుగలది.

తెలుగుకవిత ప్రాయికముగా సంస్కృతానుకారియే యైనను నందులో నెంతో విశిష్టతకూడ కలదు. నన్నయ, తిక్కన, ఎఱ్ఱన యను కవిత్రయము గోదావరి, కృష్ణ, పినాకిని యను నదీత్రయమువోలె, తెలుగువారికి జీవనాధార మయినది. గోదావర్యాది నదీత్రయము, శాఖోపశాఖలతో కాల్వలై పాయలై పాఱి తెలుగునేలనెల్ల, పాడిపంటలతో సుక్షేత్రపఱిచినట్లు, కవిత్రయ కవిత శ్రీనాథ పోతనాది సర్వాంధ్రకవి పరంపర యొక్కయు హృదయక్షేత్రములందు రసధారపాఱించి దివ్యకావ్యసస్యముల పండించినది, పండించుచున్నది.

కవిత్రయమువారు దైవభక్తులు, సదాచారులు, ఉత్తమపండితులు. వారి రచనలలో జుగుప్సితము నీతిదూరమునగు కూర్పుతీరు కానరాదు. వారి దివ్యకావ్యసృష్టి సర్వాంధ్ర కవిమండలికిని మేలుబంతియై సత్కావ్య సంప్రదాయము కొనసాగించుచున్నది. నన్నయరచనలోని ధర్మోపాఖ్యానములు, తిక్కనరచనలోని మర్మకవితలు, ఎఱ్ఱనరచనలోని కృష్ణబాలక్రీడాదివర్ణన సౌభాగ్యములు, పోతనభక్తికవితామృతధారలు, శ్రీనాథుని యంధ్రదేశ శివసౌందర్యవర్ణనాహ్లాదములు, పెద్దనతిమ్మనల మనోజ్ఞప్రబంధసృష్టులు, సూరనరామకృష్ణుల శాలీననిగమశర్మాది కథాకల్పనావిశేషములు, సోమన రంగనాథగౌరనల ద్విపదరచనాసారస్యములు, వేమన్న వినోదవిమర్శపు టాటవెలదులు తెలుగువారికి నిస్సామాన్యసాహిత్యభాండాగారములు – తెలుగువారి భక్తిమయజీవితమునకు పోతరాజు, త్యాగరాజు, గోపరాజులు, జీవగఱ్ఱలయిన త్రిమూర్తులు. ఈ త్రిమూర్తులలో కడపటి యిద్దఱి గేయములు తెలుగువారి కమృతధారలు. తెలుగుకవులలో ప్రాచీనులు కొందఱు తెలుగు దేశముయొక్కయు తెలుగుప్రజలయొక్కయు విశిష్టతను వర్ణించిరి. ప్రధాన ముగా శ్రీనాథుడు కాశీఖీమఖండములలోను, జక్కన విక్రమార్కచరిత్ర లోను, సోమనాథుడు పండితారాధ్యచరిత్రలోను, అజ్జరపు పేరయ ఉదయనంబి

విలాసములోను, ఆంధ్రదేశసౌభాగ్యమును వర్ణించినారు. అజ్జరపుపేరయకవి ఉదయనంబివిలాసములో అంధ్రప్రజలను గూర్చి వర్ణించిన వర్ణనలే కొన్ని యిప్పుడు వినిపించుచున్నాను –

గీ॥ భామ విను శ్రీమదాంధ్రభూభాగమనెడు
తారహారంబునకు సొంపుదనరుచున్న
మధ్యమణి చందమున మహామహిమదాల్చె
భూరి విభవంబు బెజవాడ పురవరంబు.

సీ॥ క్రొత్తబియ్యము కాయగూర లొబ్బట్లు సై
దంపు బూరెలు పంచదారతొలలు
వడలు నల్లంబు మీగడల తియ్యనిపెర్గు
కమ్మని సిరివాలు గసగసాలు
చిఱుసెన్గపప్పును తఱచు వీద్యంబులు
కంబళ్లు నంబళ్ళు కంచుకములు
ఇంగువ జిలకఱ్ఱ నెనసిన మిరియంబు
మంచివాసననెయ్యి మాట దురుసు

గీ॥ తఱచు రణశీలమొప్పు గంధాక్షితములు
నంద మింపొందుశిఖలు, నొయ్యారి నడలు
కలిగి కాంతలు పురుషులు కలసి సిరుల
చెలఁగు నయ్యాంధ్రదేశంబు చెలువుగాంచె॥

సీ॥ కదళీఫలంబులు ఖండశర్కరయును
పెనుపచ్చిపోకలు పనసతొలలు
మామిడిపండ్లు కమ్మని గోఘృతమ్మును
వంకాయ టెంకాయ వలపుపప్పు
బహువిధభక్ష్యముల్ పరమాన్నమును బైళ్లు
కందపెండలములు కాయగూర
లమృతోపమానంబులైన రసావళుల్
శాల్యోదనము పెర్వు సకలరుచులు

గీ॥ గలుగు నూఱుఁగాయలు బానకములు నప్ప
డములు వరుగులు వడియముల్ శ్రమముదీర
ననుభవించిరి వేదశాస్త్రార్థవాద
ములకు నలరుచు కోనభూస్థలమునందు॥

తెనుగుతనమునుగూర్చి నేను కూర్చిన చిన్నిపద్దెము నొకదానిని వినిపించి ముగిస్తున్నాను.

ఆ॥వె॥ ఆంధ్రభాష యమృత మాంధ్రాక్షరంబులు
మురువులొలుకు గుండ్ర ముత్తియములు
ఆంధ్రదేశమాయురారోగ్యవర్ధకం
బాంధ్రజాతి నీతి ననుచరించు.

(జర్నల్ ఆఫ్ శ్రీ వేంకటేశ్వర ఓరియంటల్ ఇన్స్టిట్యూట్
(JSV.O.I) పు- 25-29. జులై-డిసెంబర్- 1943
రేడియో ప్రసంగము. మదరాసు: 2-8-1945
తెలుఁగు మెఱుఁగులు
ప్రథమ ముద్రణ 1948
తృతీయ ముద్రణ 1960)

ప్రాచీనగ్రంథముల పలుకుబడి మనపై చెల్లుబడి

కవిత్వము, సంగీతము, నృత్యము, చిత్రరచన ఏ దేశములో ఏ జాతిలో పెంపొందుచుండునో ఆ దేశము, ఆ జాతి పాపప్రవృత్తులకు దూరమై ఉండునని, భగవదనుభూతికిఁదగిన పరిపాకముగలదై ఉండునని విజ్ఞు లందురు. తెలుగుజాతి, తెలుగుదేశము పైకళలలో ముందడుగు వేయుచున్న దనియే నా నమ్మకము.

భారతదేశములోని అన్ని దేశభాషల సాహిత్యములును సంస్కృతభాషా సాహిత్యసంపద నాస్వాదించి జీర్ణించుకొని పుట్టి పెరిగినవే. మన తెనుఁగు సాహిత్యవాహినిలో కూడ తెలుఁగునాటి వారి పలుకులతీరులు, తలఁపుల తీరులు, కూర్పులతీరులు, ఫణితులతీరులు ఊటలూరఁగా ఊరఁగా స్వతంత్ర రచనలను సొనయేళ్లు కొన్ని జాలువాఱుచున్నను, సంస్కృతసాహిత్య ప్రవాహము కూడ అందులో ప్రధానముగ సాగుచునే ఉన్నది; నేఁటికిని, రేపటికిని ఉండగలదు.

'వెన్నవలెం గరంగు సుకవిత్వము' చెప్పినవారు శ్రీ శివశంకరశాస్త్రిగారు. 'వకుళమాల' అని హృద్యకావ్యము నొకదానిని కూర్చినారు. ఆ వకుళమాలలో గూడ భట్టుమూర్తిగారి యీ క్రింది పద్యపుసువాసన గుబాళించుచున్నది.

కమనీయద్యుతిధామమా విమలముక్తాదామమా సేమమా
కమలామోదకు, తత్సఖీసమితికిం గల్యాణమా తన్మరా
ళ మయూరీ శుకశాబశారికల కెల్లన్ భద్రమా తెల్పుమా
ప్రమదారత్నముపేరుగా నెద నినున్ బాటించి ప్రార్థించెదన్.

కాళిదాసకవి మేఘసందేశమని కొత్తతీరు కావ్యము రచింపఁగా, హనుమత్సందేశమును మనసులో ఉంచుకొని రచించె నన్నారఁట నాఁటి విద్వాంసులు.

నన్నయభట్టుగారు మొదలుకొని చిన్నయసూరిగారిదాఁక ఎన్నికగన్న ఆంధ్రకవులు రచించిన ప్రబంధములపలుకుబడి విద్యావివేకములుగల యాంధ్రప్రజల హృదయములపై విశేషముగా సాగుచున్నది.

రాములు, లక్ష్మణులు, భరతులు, రావణులు, విభీషణులు, సీతలు, కౌసల్యలు, కైకలు, మందరలు, ధర్మరాజులు, ఉత్తరకుమారులు, ప్రహ్లాదులు, హిరణ్యకశిపులు, గుణనిధులు, నిగమశర్మలు, వరూథినీప్రవరులు, కరటక దమనకులు, సుగాత్రీశాలీనులు, ఆషాఢభూతులు, కీలోత్పాటులు, మొదలగు వారు పురాణపురుషులు, ప్రబంధపురుషులు. నేడును అనేక స్థలములలో అనేకులు గుర్తింపఁబడుచున్నారు.

సామెతలు గ్రంథములలోని కెక్కినట్లు గ్రంథములలోని పద్యముకూడ లోకవ్యవహారములలోని కెక్కినవి. అసలు ఆంధ్రప్రజల నిత్యవ్యవహారముల లోనే కవిత్వగానములు కలగలుపై యున్నవి. ఆంధ్రభాష పుట్టుకయే కవితా గానాత్మకము.

వినాయకచతుర్థి, నవరాత్రములు అను పండుగనాళ్ళలో బాలకులచే పద్యములు పాడించుట, ప్రబంధములు చేతఁబట్టించుట నేనెఱుఁగుదును.

ధర సింహాసనమై నభంబు గొడుగై తద్దేవతల్ భృత్యులై
పరమామ్నాయములెల్ల వందిగణమై బ్రహ్మాండ మాగారమై
సిరి భార్యామణియై విరించి కొడుకై శ్రీగంగ సత్పుత్రియై
వరుసన్ నీ ఘనరాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా.

ఇత్యాది పద్యములు నేను చాల పసిప్రాయమున నేర్చుకొన్నవి. వివాహ ములలో రుక్మిణీకల్యాణపద్యములను ముత్తయిదువలు ఆనందభైరవి రాగముతో నాలాపించుచుండుట అనేకు లెఱుఁగుదురు. బడిపిల్లలు వాట పద్యాలు, ఆటవిడుపుపద్యాలు అను పేర ప్రబంధపద్యములు వల్లించుట పల్లెటూళ్ళలో పరిపాటి. పెళ్ళిళ్ళలో వరునిచేత తాటాకులమీఁద, ఇటీవల కాగితాలమీద "శ్రీయును కులమును రూపము ప్రాయము శుభలక్షణంబు"– ఇత్యాది పద్యములను వ్రాయించుట ఆచారము. తెల్లవాఱుగట్ల ప్రబంధముల లోని దశావతారపద్యములను పలువురు పల్లెటూళ్ళలో పారాయణము చేయుచుందురు. రంగనాథరామాయణ ద్విపదలే రామాయణపు బొమ్మలాట లలో తోలుబొమ్మలాటవారు పాడుపాటలు; కనుకనే పల్లెటూళ్ళలో వారు రంగనాథ రామాయణమును బొమ్మలాటరామాయణ మనుచుందురు. శైవుల శుభాశుభ సమయములలో బసవపురాణమును పారాయణచేయుదురు.

వానలు లేనప్పు డూరిపెద్దలు విరాటపర్వమును పురాణము చెప్పింతురు. ఇవి సాహిత్యప్రయోజనములకే కాక మతసంప్రదాయ వ్యవహార ప్రయోజనము నకై కూడ ఏర్పడిన ఆచారములు.

గీ॥ పాత్రసంశుద్ధి కాజ్యం బుపస్తరించి
యూరకుండిరి యిది యేమియొక్కొ వీరు
కానరావిప్డు శాకపాకములు నెదుర
మనకు నిజమయ్యె నల చందమామఘుటిక.

శ్రీనాథుని భీమఖండములోని పయిపద్యము "చందమామరావే, జాబిల్లి రావే" అన్న పసిబాలకుల పాటనుబట్టి పుట్టినది.

బాలకుల పాటతో పై పద్యార్థము మిళితమై ఉన్నది.

నా చిన్ననాటి ముచ్చట ఒకటి: ఏదో అల్లరిచేయఁగా మాయమ్మ నన్ను గట్టిగా కొట్టినది. నేను ఎక్కడనో ఉన్న మా నాయనగారి దగ్గఱ కేడ్చుచు వెళ్ళితిని. నా గొడవ వెళ్ళబోసికొంటిని. నేనిఁక ఇంటికి రానంటిని. అమ్మ మొగము చూడనంటిని. కాశీఖండములోని గుణనిధి కథచెప్పి మా నాయనగారు అందలి పద్యమిది చదివి వినిపించి అర్థము చెప్పిరి.

చ॥ అరుణగభస్తిబింబ ముదయాద్రిపయిం బొడతేర గిన్నెలో
పెరుగును వంటకంబు వడపిందెలునుం గుడువంగఁ బెట్టు ని
ర్భర కరుణాధురీణయగు ప్రాణము ప్రాణము తల్లియున్నదే
హరహర యెవ్వరింకఁ గడుపారసి పెట్టెద రీప్సితాన్నముల్.

అమ్మ ప్రేమ ఆకళింపునకురాఁగా తలగోఁకుకొనుచు ఏడుపు దిగమ్రింగు కొని నే నింటికి వచ్చితిని.

తెనుఁగురచన లనఁగా చిన్ననాఁటనుండియు నాకు బులుపాటము. తెలుఁగుపద్యములు వినుటకై చెవి కోసికొనువాఁడను. గుజ్జనగూళ్లతో పాటు తెలుఁగురచనల తీయఁదనమునుగూడ మా నాయనగారు నన్నాస్వాదింపించి నారు. మా తోఁబుట్టువును అత్తవారింటికి అనిపిన సందర్భమున ఒకనాఁడు శ్రీనాథుని శృంగారనైషధములోని ఈ క్రింది పద్యముచదివి అర్థము చెప్పినారు:

గీ॥ ఉభయవంశలలామ మయ్యుత్పలాక్షి
అత్తవారింటి కరిగెడు నవసరమున
మాతృజనక సఖీజన భ్రాతృవిరహ
మధిపతి ప్రేమ జలరాశి కౌర్వమయ్యె.

అర్థమాలోచించినకొలఁది ఈ పద్యము నా కానందము గొల్పసాగినది. శ్రీనాథుని రచనలమీఁద నాకు చిన్న నాఁట నుండియు ఆదర మిట్టిపద్యములు వినుటచేతనే.

ఈ నడుమ మా యింట నొక వివాహము జరిగినది. భోజన సమయమున నసాళమంటు తాళింపు పొగరుగల పెరుగుపచ్చడిని ఆస్వాదించి నవ్యాంధ్రకవిమిత్రులొకరు చదివినా రీ శృంగారనైషధపద్యమును :

గీ॥ మిసిమిగల పుల్లఁబెరుగుతో మిళితములగు
నావపచ్చళ్లు చవిసూచి రాదరమున
చుఱ్ఱుమని మూర్ధములు దాఁకి యొఱ్ఱఁదనము
పొగలు వెడలింప నాసికాపుటములందు.

ఇరువదియేండ్ల క్రిందట ప్రాచీనగ్రంథసంపాదనకై తెలుఁగుదేశము ఊరూర "టూరు' చేయుచు చాలకాలము విద్వద్గోష్ఠి జరిపినవాఁడను గనుక, ప్రాచీనగ్రంథార్థములపలుకుబడి పల్లెటూళ్లలో ఎంతచెల్లుబడి అగుచు ఉన్నదో నేను ఎఱుఁగఁగల్గినాను. కొన్ని యెఱుకలు వివరింతును.

ఒక సంపన్నగృహస్థుని యింట ప్రాచీన గ్రంథములున్నవని విని అడిగి ఆహూతుఁడనై వారి యింటికి వెళ్ళితిని. ఆ యింటి యజమానునికి ధర్మపత్నీ సమానురాలు, కళావంతురాలు, ప్రేయసి ఇంటనే ఉన్నది. నేనక్కడికి వెళ్ళఁగానే ఆమె మనుచరిత్రలోని యీ క్రింది పద్యమును సాదరముగా, సంగీతముతో, సముచితహస్తాభినయముతో చదివినది.

ఉ॥ వానిది భాగ్యవైభవము, వానిది పుణ్యవిశేష మెమ్మెయిన్
వాని దవంధ్యజీవనము వానిది జన్మము వేఱుసేయ కె
వ్వాని గృహాంతరంబున భవాదృశ యోగిజనంబు పావన
స్నానవిధాన్నపానముల సంతసమందుచుఁ బోవు నిచ్చలున్.

నే నన్నాను: "తల్లీ నన్నొక యోగిని జేసితివి. తంటాలేదు గాని, నీ వల్లభుని వాస్తవప్రవరునిగాఁ జేయుట సందర్భపడలేదమ్మా! –"

ఆమె అన్నది : "అయ్యగారూ! నేను ప్రేమించినది వాస్తవముగా వాస్తవ ప్రవరునివంటివారినే. నా యేకాంత ప్రేమకు వశ్యులయిన యీ సహృదయులు కూడ వాస్తవ ప్రవరులనియే అనుకొనుచున్నాను. అయ్యో! పాపము! వరూధిని మాయాప్రవరుని ఎఱుఁగనే యెఱుఁగదు గాదండీ! ఎంత ద్రోహము!

అయ్యా, ఇది చిత్తగించండి!

సీతాదేవిని రావణాసురుఁడు రామవేషము వేసికొనివచ్చి అమాంగళ్య పఱిచినట్లు ఏ కవి అయినను కథ కట్టినచో విజ్ఞులకందరికిని వెఱ్ఱులు వేకులు ఎత్తవండీ! అంత రోతగానే కాదండీ ఉన్నది యిక్కడి సందర్భమూను? ప్రవరుని మీఁదనే ప్రాణములర్పించి ఉన్న వరూధినిని, అంతకుముం దామెను ప్రేమించి ఆమెచే ఛీఛీ అని చీవాట్లు తిన్న దొంగ ప్రవరవేషముతో వచ్చి చేటుకూర్చుట చండాలముగా లేదండీ వరూధిని వెలయాలందురు. ఆమె ప్రవరుని ఏమి వెలకయి ప్రేమించినది! వేషధారి ప్రవరుఁడు ఏమి వెలయిచ్చి ఆమెను కొనుక్కొన్నాడు! ఆంధ్రకవితాపితామహుని అనుగ్రహము అట్లున్నదే!' అన్నది.

నేను "చాల చుఱుకుగా ఉన్నదే సల్లాపము" అనుకొనుచు. "సంస్కృతము బాగుగా చదువుకొన్నట్టున్నావమ్మా" అన్నాను.

"మా నాయనగారు విద్వాంసులు. వారు నేర్పఁగా కావ్యనాటకములు కొన్ని చదువుకొన్నానండీ!" అనుచు నామె కాళిదాసు కవీంద్రుని మీఁద కూడ కంకరఱాళ్లు విసరసాగినది.

"చూడండి! శాకుంతలములో దుష్యంతునికి రంగప్రవేశము ఎంత సంతాపజనకముగా ఉన్నదో".

"తానేదో వేఁటకువచ్చినాఁడు. ఆశ్రమమున కణ్వమహర్షి లేఁడు. ముగ్ధలు ఋషికన్యలు చెట్లకు నీళ్లుపోయుచున్నారు. అక్రమముగా ఆశ్రమ ప్రాంతమునకు వెళ్ళి, ధీరోదాత్తుఁడుగా పొగడ్తగాంచవలసిన మహారాజు దొంగచాటుగా నక్కి ఉండి ఆ కన్యలను తొంగిచూచుట, 'సతాంహి సందేహ

పదేషు' అని తనతప్పును ఒప్పునుగా తానే పొగడుకొనుట మర్యాదగా ఉన్నదండీ! శకుంతలముఖాన తుమ్మెదవ్రాలఁగా ఆపన్నురాలిని రక్షించి రాజధర్మము నెఱపఁ బోవుచున్నట్లు దర్పాలు పలుకుకొనుచు వంకరతలఁపుతో రంగప్రవేశముచేయుట బాగుగా ఉన్నదండీ?" అన్నది.

నే నిఁక శ్రుతి మించుచున్నది అనుకొని సంస్కృతాంధ్ర రచనలలో ఆమెకుఁ గల సాహిత్యచాతుర్యమునకు సంతోషము వెల్లడించి వచ్చినాను.

ఇంకొక ముచ్చట

ఒక పూరియిల్లు; చిన్నది; తలుపు ఓరవాకిలిగా వేసి ఉన్నది. లోపల ముసలమ్మ వడ్లుదంచుచున్నది. రోఁకటిపోటుతోపాటు.

"ఓ రామ ఓ రామ ఒయ్యారిరామ
ఓరామ! ఓరామ!
ఓరామ! ఓరామ!"

అనుచు ఉచ్ఛ్వాసనిశ్వాసములతో రామనామస్మరణ జోడించుచున్నది. మధ్యాహ్నము ఒంటిగంట వేళ. ఇంట నామె ఒక్కర్తెయే. తాటాకు పుస్తకాలేవో ఉన్నవనఁగా చూడవెళ్ళినాను. ఇంటిలోనికి అడుగు సాగక వాకిటనే ఉన్నాను. కొంతసేపటికి దంపుడుముగియఁగా చేటలో దంచినబియ్యము చేర్చుకొని చెఱుగఁబోవుచు ఈ క్రింది పద్యము చదివినది :

కII కలఁడందురు దీనులయెడఁ
గలఁడందురు పరమయోగిగణముల పాలన్
కలఁడందు రన్నిదెసలను
కలఁడు కలండనెడు వాఁడు కలఁడో లేఁడో!

నాలుగవచరణము గద్దించుచు మఱి మ్మ్మాఱు చదివినది. ఇదే సందర్భమురా అనుకొని 'ఉన్నాఁడమ్మా' అనుచు నేను లోపలికి వెళ్ళినాను. ఆమె ఆ బియ్యముతో అటు తర్వాత వంటచేసికొని భోజనము చేయఁబోవును. ఇట్లనుకొన్నాను: "ఆహా! పోతరాజుగా రెంత పుణ్యాత్ములు. భాగవత మెందఱినో పవిత్రాత్ములనుగాఁ జేయుచున్నదిగదా!"

బ్రౌనుదొరగారి కెవఁడో దీనుఁడు ఈ క్రింది పద్యమును అర్జీగా వ్రాసి పంపుకొన్నాఁడట.

శాII లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యెఁ, బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను, మూర్ఛవచ్చెఁ, దనువున్ డస్సెన్, శ్రమం బయ్యెడిన్
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మన్నింపందగున్ దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!

బ్రౌనుదొరగా రా దీనుని కేదో కొంత సొమ్ముతోపాటు ఆ యర్జీమీఁదనే 'ఎండార్సుమెంటు'గా ఈ క్రింది పద్యమును వ్రాసి పంపినారట:

ఉII ఏను మృతుండ నౌదునని యింతభయంబు మనంబులోపలన్
మానుము సంభవంబుగల మానవకోట్లకు చావు నిక్కమౌఁ
గాన హరిం దలంపు మిఁకఁ గల్గదు జన్మము నీకు ధాత్రిపై
మానవనాథ! చెందెదవు మాధవలోక నివాససౌఖ్యముల్.

బ్రౌనుదొరగారికికూడ భాగవతమింత పరిచితమయినది!

ఇన్ని ఉదాహరణములను ఎందుకు చెప్పినాననఁగా, మన తండ్రితాతల పోలికచాలికలు మనలో ఏవిధముగా అనుగతములై వచ్చుచున్నవో – మనము వేషభాష లెంతమార్చినప్పటికిని – మనపూర్వుల గ్రంథములలోని భావములు సంప్రదాయములు, రచనలు – మన మెంత క్రొత్తత్రోవలు త్రొక్కజూచుచున్నప్పటికిని – మనలో ఎట్లు కుదుర్కొన్నవో తెలుపుటకే. వానిని మనము విడనాడలేము; విడనాడనూ కూడదు అని యెఱిఁగించుటకే.

(ఆంధ్రపత్రిక 3–9–1950.
తెలుగు మెఱుఁగులు ప్ర. ము. 1948
తృ.ము. 1960)

ద్విపదకృతులు

మన తెలుఁగులో విరివిగా ద్విపదగ్రంథములున్నవి. వానిలోఁ బాల్కురికి సోమనాథుని గ్రంథములును, రంగనాథుని గ్రంథములును దొల్తటివి. ఈ యిర్వుర రచనమునందును భేదముకన్పడుచున్నది. సోమనాథుఁడు ప్రాసయతి నుపయోగించుకొన్నాఁడు. రంగనాథుఁడు ప్రాసయతిని బరిత్యజించినాఁడు, మతభేదమిది లక్షణగ్రంథములందు సూచింపఁబడెనా యని పరిశీలించితిని. ఎక్కడను బ్రాసయతి కూడదని కానరాలేదు. కూడుననియును గన్పడలేదు. కానీ ప్రాసనియతిలేని పద్యముల కన్నింటికిని బ్రాసయతి, సార్వత్రికముగాఁ గూర్పఁబడుచున్నది. ఈ విషయము చొప్పునఁ జూచుకొన్నచో ద్విపదకుఁ బ్రాసయతి చెల్లరాదు. మంజరి (ద్విపద) లందుఁగొన్నింటఁ బ్రాసయతి గూర్పఁబడినది. దీనికిఁ బ్రాసనియమములేదు గావుననే కూర్పఁబడె ననవచ్చును. కృష్ణదేవరాయలకాలమునాఁడు తాళ్ళపాక చిన్నన్న యష్టమహిషీ కళ్యాణమున

"యతుల లోపలఁ బ్రాసయతి తక్క సకల
యతులుఁ జెల్లును బ్రయోగానుసారమున,
అను లక్షణంబుల ననువొంది సుకవి
జన సుప్రయోగైకశరణమై వెలయు."

ఇట్లు ప్రాసయతి తగదన్నాఁడు. ఈ లక్షణము సుకవిజనప్రయోగైక శరణమే యనియు జెప్పినాఁడు. ఈతఁడు సోమనాథుని గ్రంథములఁజూచి యుండలేదు గాఁబోలు. లేక, సోమనాథుఁడు సుకవి కాఁడనియే తలఁ చినాఁడేమో గదా!

సోమనాథుఁడు బసవపురాణమునఁ బ్రాసవడి నుపయోగించినందులకు ప్రతాపరుద్రుని కాలముననే ధూర్తపండితులు వెక్కిరించినట్టును, సోమనాథుఁడు వారిని జయించినట్టును బిడుపర్తి బసవన చెప్పినాఁడు. కావున నిది యప్పటికే వింతగాఁ దోచిన సోమనాథుఁడెట్టి సమాధానము చెప్పెనో! అరయుదము.

పండితారాధ్యచరిత్రమం దిట్లున్నది : – " జాతులు మాత్రానుసంధాన గణ వినీతులుగాన యనియత గణై' రనియును, 'ప్రాసోవా' యనియు,

'యతిర్వా' యనియుఁ జెప్పు ఛందో వినిహితోక్తి గాన ప్రాసయైనను యతిపై వడియైన బేసిగా నిలిపి"

బసవపురాణము రచించిన తర్వాతనే పండితారాధ్యచరిత్రము నాతఁడు రచించెను. ఆ ధూర్తపండితుల వెక్కిరింపునకు సమాధానమే కావలయు నిది. ఇందు "అనియతగణైః" "ప్రాసోవా" "యతిర్వా" అని మూడు సంస్కృత సూత్రము లుదాహరింపఁబడినవి. యతిప్రాసములు రెండింటిని గూర్చి తెలుపు గ్రంథ మాంధ్రభాషకు సంబంధించినదే కావలయును. ఆ గ్రంథము పేరేమో, కర్త యెవరో తెలియదయ్యెను. సోమనాథుని నాఁటికి బూర్వమే యతిప్రాసములను గూర్చి కూడ నింత విస్పష్టముగాఁ దెలుపఁజాలిన సూత్రగ్రంథము వెలసి యుండెనని దీనివలనఁదేలుచున్నది. అది నన్నయభట్టారకునిదో, యంతకుం బూర్వునిదో కావలయును. లక్షణము నుదాహరించి సోమనాథుఁడు ద్విపదలోఁ బ్రాసయతి కూడునని సిద్ధాంతీకరించినాఁడు. రంగనాథాదులు ప్రయోగింపకున్న నేమి? నేఁడు కొందఱు ముగ్ధపండితులు వెక్కిరించుచున్నారు. సోమనాథుని చూపిన త్రోవను బ్రాసయతితో రచింపఁబడు ద్విపద కృతులను వెక్కిరింపఁబోవుటపోలదు. ద్విపదకృతులందు బ్రాసయతియును గూడునని సోమనాథుని గ్రంథములు రాద్ధాంతపఱుచుచున్నవి.

ఆంధ్రభాషకు సంబంధించిన విలువగల విషయమొకటి కూడ దీని వలన వెల్లడియయినది. సంస్కృతసూత్రరూపమయిన యాంధ్రలక్షణ గ్రంథము, తిక్కనాదులకుఁ బూర్వమే వెలసి యుండుట!

(ఆంధ్రపత్రిక : సోమవారము, 10 ఆగస్టు, 1914)

రంగనాథరామాయణము

రంగనాథరామాయణమును బరిశీలింపఁగా గ్రంథకర్తృకవిషయ మీ క్రిందితీరున నున్నది. గోన కాటభూపతి. తత్పుత్త్రుడు గోన రుద్రభూపతి. తత్పుత్త్రుఁడు బుద్ధభూపతి. తత్పుత్త్రుఁడు విట్ఠలభూపతి. తత్పుత్త్రుఁడు గోనకాట బుద్ధభూపతి.

గోనకాట
|
రుద్ర
|
బుద్ధ
|
విట్ఠల
|
బుద్ధ – (గ్రంథకర్త)

ఈ బుద్ధ భూపతియే తమ తండ్రి విట్ఠలభూపతి ప్రేరణమునఁ దదంకితముగా రామాయణము రచించెను. గ్రంథమునుబట్టి చూడఁగా వీ రే జాతివారో తెలియరాదు. క్షత్రియులనియేని, శూద్రులనియేని గుర్తింపఁదగ్గ యాధారము లేవియు గ్రంథమున లేవు. అనేక ప్రతులలో 'గోన' అని, కొన్నింట 'కోన' అని కాననగును. 'కోన' పాఠమునే గ్రహించినచో గ్రంథకర్త బుద్ధభూపతి – గోదావరీతీరపు కోనరాష్ట్రమును – నేఁటి కోనసీమను – పూర్వము పరిపాలించిన కోనాన్వయులగు క్షత్రియులలోని వాఁడగునేమో యని యనుమానింపఁగూడును గాని, యింతవఱకు నా కోనవంశ్య క్షత్రియులలోఁ బయిపేళ్ళవారెవ్వరును గానరామిచేతను, బెక్కుప్రతులలో 'గోన' ఉండుట పరిగ్రాహ్యతరమగుటచేతను బై యనుమానము పరిత్యజింపఁదగినదే యనవచ్చును. ఇఁక 'గోన' పాఠమునే పరిగ్రహించి చూడఁగాఁ బశ్చిమాంధ్ర దేశమున– ననఁగా నేఁటి నిజాంరాష్ట్రమున గద్వాల వనపర్తి రాజ్యముల ప్రాంతమునఁగల వర్ధమానపురమున (వడ్లమాని వారు అని యింటిపేరు ఈ యూరినిబట్టి వచ్చినదే) కాకతీయ సామంతులుగా రాజ్యమేలినవారు ఏతత్కృతి కర్తృవంశ పురుషనామసమంచితులు క్రీ॥శ॥ 12,13 శతాబ్దులలోఁ గొందఱు శాసనములందు గుర్తింపనగుచున్నారు. గోనబుద్ధయ కుమార్తె 'శ్రీ గోనవంశ జనిశేఖరబుద్ధయాఖ్య పుత్రీపవిత్రచరితా' యగుకుపమ శక 1198 ధాతృసంవత్సరమున ('వసునందశంకరమితే శ్రీధాతృసంవత్సరే) బూదపూరిలో లింగప్రతిష్ఠచేసి భూదానముచేసినట్లొక శాసనమున్నదిమఱియు శకవర్షములు

1216 అగు జయవత్సరమున 'శ్రీమతు మీసియారగండగోనగన్నయరడ్డివారు వర్ధమానపురమందు సుఖసంకథావినోదంబు (న) ప్రిథువి రాజ్యము సేయుచుండగాను తద్రాజ్యరక్షామణి యయిన 'వితాలనాథ భూనాథుండు' రాచూరిపట్టణ ప్రవేశాభిముఖుండై..... దుర్గము రచించి' నట్లొక శాసనమున్నది.

ఈ రెండుశాసనములలో తొలిశాసనము క్రీ.శ. 1276 సంవత్స రము నాఁటిది. రెండవశాసనము క్రీ.శ. 1294 సంవత్సరమునాఁటిది. రెండింటికిని బదునెనిమిదివత్సరముల యంతరమున్నది. ఇందుఁదొలి శాసనమునఁ బ్రస్తుతుఁడయిన 'గోనబుద్ధయ' మన రామాయణ కృతికర్తయగు గోనబుద్ధయకాని, యాతని తాత బుద్ధయ కాని కాఁదగును. ఒక్కబుద్ధయయే కాని రాయచూరి శాసనమునఁ గాననగు గోన గన్నయరెడ్డివా రీ రంగనాథ రామాయణమునఁ గానరారు. కాని రంగనాథోత్తర రామాయణమని సరిగా నీ రంగనాథ రామాయణముఁ బోలిన ద్విపదరచనావిధానము గలది, షట్కాం డాత్మకమయిన యీ రామాయణమునకుఁ బరిశిష్ట మనఁదగిన ఉత్తరకాండ కథారచనము, గోన కోటగన్నభూపాలుని కుమారుఁడగు బుద్ధభూపతికిఁ బుత్త్రులగు కాచవిభు పినవిట్ఠల భూపతులు తమ తండ్రిపేర రచించినది మఱొక గ్రంథముకలదు. అందుఁగానవచ్చు గోన కోటగన్నభూపతి రాయచూరి శాసనపు గోన గన్నయరెడ్డివారు కాఁదగుదురు. రాయచూరి (కోట) దుర్గనిర్మాణాదికము జరపించుటచే గన్నయరెడ్డి వారికి 'కోట' గన్నయ యని పేరేర్పడియుండవచ్చును. ఇట్లేని యుభయగ్రంథకర్తృవంశముల నిట్లు సమన్వయింపవలెను. మన రంగనాథరామాయణకర్త తాతయగు బుద్ధభూపతికి బూదపూరిశాసన ప్రస్తుత 'కుపమ' కుమార్త. ఆ బుద్ధభూపతికి విట్ఠల కోటగన్న భూపతులిర్వురును కొడుకులు. ఈ కొడుకులిద్దఱును దమ తండ్రి బుద్ధభూపతి పేరే తమ కొడుకులిద్దఱకుఁబెట్టిరి. విటలుని కొడుకు బుద్ధభూపతి పూర్వరామాయణ కర్తయయ్యెను. ఆతనికి వ్రేలువిడిచిన సోదరుఁ (పితృవ్య పుత్రుఁ) డగు బుద్ధభూపతి కొడుకులు కాచవిట్ఠలభూపతు లుత్తర రామాయణ్తకం

లయిరి. పూర్వోత్తర రామాయణములకు సహోదరుల కొడుకు, మనుమలు కర్తలగుట తెలినవిషయము. ఇది యిట్లేయేని వంశవృక్ష మీ తీరున నుండును.

గోనకాటభూపతి
|
రుద్రభూపతి
|
బుద్ధభూపతి
(బూదపూరి శాసనము) (రాయచూరు శాసనము)

- కుపమ (1276 *A.D*)
- విట్ఠలభూపతి
  - బుద్ధభూపతి (పూర్వరామాయణకర్త)
- గన్నభూపతి (1294 *A.D*)
  - బుద్ధభూపతి
    - కాచవిభుఁడు
    - విట్ఠలవిభుఁడు

(ఉత్తర రామాయణ కర్తలు)

ఉభయరామాయణములందును కృతికర్తల కులమేదో తెలియరాకున్నను శాసనములఁబట్టి 'గోనవంశమువారు శూద్రులు, 'రడ్లు' అని యేర్పడుచున్నది. కాన రంగనాథోభయరామాయణకర్తలను మనము రెడ్డిజాతివారని నిర్ణయింపవచ్చును. మీఁది సందర్భములన్నింటినిబట్టియు నీ రెడ్లు నాఁటి పశ్చిమాంధ్రరాష్ట్రమందలి వర్ధమానపురమున కధీశ్వరులని నిర్ణయింపఁదగియున్నది. మఱియు గ్రంథస్థమగు నీ క్రింది ద్విపదము కూడ రంగనాథ రామాయణకర్త నేఁటి నిజాంరాష్ట్ర ప్రాంతపువాఁడనుటకు సాధకమగు నని నా తలఁపు.

'వేదాద్రిగుహలలో విహరించువాఁడు
......................................'

ఈ వేదాద్రి నిజాంరాష్ట్రమున ప్రసిద్ధమైన రాచకొండ ప్రాంతపు వేదాద్రియని నా నమ్మకము. ఆ కాలమున నా వేదాద్రి చాలఁబ్రసిద్ధి గన్నది. తద్దేశ వాస్తవ్యులు కాకతీయసామంతులు, తర్వాత స్వతంత్రులు, వెలుగోటి

వెలమరాజులు వేదగిరి నామములఁ దత్పర్వతపూజ్యతాజ్ఞాపకములుగాఁదాల్చిరి.

పై పరిశీలనమునుబట్టి రంగనాథోభయ రామాయణములును క్రీ.శ. పదమూఁడవశతాబ్ది తుదభాగమున ననఁగా క్రీ.శ. 1280 –1300 ప్రాంతమున రచితమైనట్లు తేలును. అది కాకతీయరుద్రాంబ పాలనపుఁ దుదికాలమును, గాకతీయ ప్రతాపరుద్రుని పాలనపుటారంభకాలమును నగును. ఇది యట్లే యగునేని రంగనాథరామాయణకర్త రంగనాథుఁడనీ, అతఁడు ప్రతాపరుద్రుని నాఁటివాఁడనీ, రంగనాథరామాయణమునకుఁ బ్రతిగా ప్రతాపరుద్రుఁడు భాస్కరునిచే రామాయణము రచింపింపఁ బూనినాఁడనీ చిరంతనముగా వెలయుచున్న ప్రతీతి రక్షిత మగుచున్నది. గోనబుద్ధ కాచ విట్ఠలప్రభులకు రంగనాథుఁడనుకవి యొకఁడు గ్రంథరచనమునఁ దోడయి యుండుననుట యవిశ్వాస్యమనఁజాలను. మఱియు రంగనాథునివి, రంగనాథ రామాయణేతరములు, రచనములు లక్షణగ్రంథములందుఁ గలవు గాన యట్టికవి నొకని నంగీకరింపక తప్పదు. మఱియుఁ దొలుత వీరవైష్ణవుఁడై బహుగ్రంథముల రచించి చక్రపాణిరంగనాథుఁడన్న పేరుతో వెలసినట్లును, పాల్కురికి సోమనాథునితోవాదించి యోడిపోయినట్లును శివద్వేషముచేఁ గన్నులు పోఁగా శ్రీశైలప్రదక్షిణముచేసి శైవుఁడై నయనరగడను రచించి కన్నులు పడసినట్లును స్థానికచరిత్రలందుఁ గలదు. ఇట్లు ప్రాచీనగ్రంథములందుఁ బ్రస్తుతుఁడయిన చక్రపాణిరంగనకవియే మన బుద్ధభూపాలునకు రామాయణరచనలోఁదోడ్పడిన రంగనాథుఁడు కాఁగూడును. ఆతనిని గర్ణాటశైవకవులును, స్థానికచరిత్రలునే కాక 15వ శతాబ్దినాఁటిదగు శివయోగ సారమును బ్రశంసించుచున్నది. ఆతని గ్రంథము[1] నయనరగడ ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోనున్నది.

మన రంగనాథరామాయణమున మూలమునఁగానరానివి పెక్కు చోట్ల వైష్ణవమతాభిమానరచనలు ప్రబలముగాఁ గానవచ్చుచున్నవి. అవి ప్రక్షిప్తములన వీలులేక యనేక ప్రతులలో సమానరీతిగాఁ గానవచ్చు చున్నవి.

1. ఇటీవల చాటుపద్యమణిమంజరి పునర్ముద్రణమున బ్రకటింపఁ బడినది.

మఱియు రంగనాథరామాయణరచనా కాలమునఁ బశ్చిమాంధ్ర దేశమందు వైష్ణవమతము ప్రబలియుండుట నక్కడి శాసనము లానాఁటివి పెక్కులు నిరూపించుచున్నవి.

మఱియు రంగనాథరామాయణరచనానంతరము దానిఁజూచి భాస్కరాదులు భాస్కరరామాయణము రచించిరనుటకుఁ దార్కాణగా రంగనాథ రామాయణరచనా సంవాది రచనలు భాస్కరరామాయణమునఁ బెక్కులున్నవి. ఇర్వుఱును వాల్మీకము ననుసరించి వేర్వేఱుగానే యట్లు రచించి యుండరాదా యనఁగుదురదు. వాల్మీకమునఁ గానరాక రంగనాథ భాస్కర రామాయణముల మాత్రమే గోచరించు విషయములు భాషారచనాసామ్యముగూడఁ గలవి పెక్కులున్నవి. వాని కూర్పు తీరులఁబట్టి పౌర్వాపర్యము రంగనాథ భాస్కర రామాయణములకే క్రమముగాఁదోచును. పై వ్రాఁతకు సారాంశము –

రంగనాథరామాయణ కర్త 'గోన ఇంటిపేరి వాఁడు. ఆతఁడు రెడ్డిరాజు. కాకతీయ సామంతుఁడు. వర్ధమానపురాధీశ్వరుఁడు. క్రీ.శ. 1290 ప్రాంతము వాఁడు. రంగనాథుఁడనుకవి యాతనికిఁ గృతిరచనమునఁ దోడ్పడి యుండ వచ్చును. రంగనాథరామాయణము దొల్తటి రచనము. భాస్కర రామాయణము తర్వాతి రచనము. చిరంతనప్రతీతి యట్లే గలదు.

* * *

(రంగనాథుఁడను కవీశ్వరునిగూర్చి యిటీవల చెలరేఁగిన వాద దావాగ్నిలోఁ జిక్కువడి నే నొడలు కాల్చుకొనఁజాలను. ప్రాచీనకావ్యలక్షణ శాస్త్ర కవిచరిత్రాది పరిజ్ఞానము గొల్పుటలో నాకుఁ బ్రాచీనలక్షణగ్రంథకర్తలు పితృతుల్యులు. ఉప్వాని యువ్వెత్తున వారి పరిజ్ఞానము నుత్తుత్తి దానిఁగా నే నూఁదివేయఁజాలను. వారు భ్రమప్రమాదములు లేనివారనఁగాదు. ప్రబల ప్రమాణములచే నట్టి వట్టివరకును నిరూపించి కొట్టివేయుట లగ్గు. రంగనాథుని గూర్చి యుపలబ్ధాంశముల నెత్తిచూపుటకే నా యీ యుపక్రమము. ఇందు ప్రామాణ్యాప్రామాణ్యచర్చను ప్రాజ్ఞులు కావింపగలరు గాక!)

కర్ణాటకకవియగు తొంటెదార్యకవి 'పాల్కురికి సోమేశ్వరపురాణము'న రంగనాథునివిషయము నిట్లు చెప్పినాఁడు. "చక్రపాణి రంగనాథుఁడను వైష్ణవునితో సోమనాథునకు మతవిషయమునఁ దగవు వాటిల్లెను. ఆ శైవుని

దర్శింపఁడు గాన సోమనాథుఁడు తెరచాటున నుండి వాదముచేయ నంగీకరించెను. కాని యా వైష్ణవుని జయించుటకు సోమనాథుని పుత్రుఁడగు చతుర్ముఖ బసవేశ్వరుఁడే తలపడెను. వారిర్వురకును గొప్పవాదము జరిగెను. రంగనాథుఁ డోడిపోయెను. పరాజయ దుఃఖముతో నా రంగనాథుఁడు శ్రీశైలమార్గముననే తిరిగి పోయెను. శ్రీశైలమల్లికార్జునునిఁ జూడక ద్వేషబుద్ధితోనే యరిగెను. ఆ శివద్వేషముచే నాతనికి గన్నులు గ్రుడ్డివయ్యెను. అహోబలమున కరిగి యాతఁడు నరసింహస్వామిని బ్రార్థించెను. ఆ స్వామివలన స్వప్నమున శివాధిక్య బోధమును బడసి లజ్జితుఁడై తిరిగి శ్రీశైలమునకువచ్చి మల్లికార్జునుని బహువిధములఁ బ్రస్తుతించెను. ఒక కన్ను వచ్చెను. పదపడి పాలుకురికి వచ్చి సోమనాథుని దర్శించి యపచారము క్షమింపఁ బ్రార్థించెను. సోమనాథుఁ డనుగ్రహించెను. రెండవ కన్నును వచ్చెను. రంగనాథుఁడు శివదీక్ష నొసఁగుమని సోమనాథునిఁ బ్రార్థించెను. పుత్త్రుఁడగు చతుర్ముఖ బసవేశ్వరుని చేత సోమనాథుఁ డాతని శివదీక్షితునిఁ జేయించెను. రంగనాథుఁ డప్పుడు వీరభద్ర విజయ శరభచరిత్రాదులను రచియించి గురుపాదముల కర్పించెను."

2

పాల్కురికి సోమనాథపురాణమే కాక కర్ణాటకకృతియగు గురురాజ చరిత్రము గూడ నీ చక్రపాణి రంగనాథుని చరిత్రము జెప్పుచున్నది. తొంటెదార్య కవి చెప్పినట్టే యీ గురురాజచరిత్రకర్త సిద్ధనంజేశకవియు రంగనాథుని యోటమిని జెప్పినాఁడు. 'వీరభద్ర విజయము' 'శరభలీల' యను గ్రంథములనే కాక యాతఁడు శ్రీగిరినాథవిక్రమమని యేనూఱు సీసపద్యముల తెలుఁగు గ్రంథమునుగూడ రచించెనఁట! దానినే సంస్కృతమునఁ గూడ రచించెనఁట ఆ కవి యిట్లు చెప్పుచున్నాఁడు.

' శ్రీశైలభర్తకును సీసంబు లేనూఱు
లేనప్ప పద్యంగ ళెంటు సావిరగళుం
భాసురద దండకం సాహస్ర తారావళియునాల్కు లయగ్రాహియు;
ఆ శతక వృత్తగళు దోధకం సావిరవు
భాసురద తోటకం నూఱు రగళెగ ళేడు
భాషిసిద మత్తకోకిల మూఱు సాసిరం గీతియం తాఱుమాఱు,
సరస మంజెర వెంటు కందంగ ళైనూఱు

విరచిసిద కృతియు మూవత్తాఱు గద్యగళు
నిరువ మూవత్తాఱు వుభయశతకం వొప్పుమిగులు సర్వేశ నిమగె.'

ఇందు 'శ్రీగిరినాథవిక్రమము' అనుపేర శ్రీశైలమల్లికార్జునిపై నైదువందల సీసపద్యములను, నెనిమిదివేల పద్యములుగల మఱొక గ్రంథమును, వేయిపాదములుగల దండకమును, నొక తారావళిని, నాలుగు లయగ్రాహులను, నొక వృత్తశతకమును, వేయిదోదకవృత్తములను, నూఱు తోటకవృత్తములను, నేదురగడలను, మూఁడువేలమత్తకోకిలలను, నాఱు వందల గీతపద్యములను, నెనిమిదిమంజరులను, నైనూఱు కందములను, ముప్పదియారు గద్యములను, ముప్పదియాఱు ఉభయశతకములను జెప్పినట్లు ఈ పద్యమునందున్నది. ఇతని యీ కృతులెల్ల నిప్పుడు మనకుఁ గానరావు.

3

కాని శివదూషణచేఁగన్నులుపోఁగా శివస్తుతిచే గన్నులు తెచ్చి కొన్నట్లుగా రంగనకవి రచించినట్లుగా శ్రీగిరి మల్లికార్జునుని మీఁద రగడ యొకటి యున్నది. 'శివభక్తిదీపిక' యని దానికిఁ బేరు. దానికి 'నయనరగడ' యని నామాంతరము.

4

నేఁడు 'శివమంత్రవర్ణనము' అనుపేర మఱియొక రగడ రంగనాథుఁడు రచించినదిగానే దొరకినది. 'నమశ్శివాయరగడ' యని దీనికి నామాంత రము. దీని కడపట నీ క్రిందిపద్యమున్నది.

'అని మన? (ముని?) రంగనాథుఁడు దయానిధి శ్రీగిరినాథుమీఁదఁజెప్పిన
శివమంత్రవర్ణనము చిత్తసముద్గత భక్తియుక్తి వ్రా
సినఁ గొనియాడినన్ వినినఁ జెల్వొసలారఁ బఠించినన్ జగ
జ్జనులకుఁ బుణ్యసంపద లసంఖ్యములై సమకూఱు నిమ్మహిన్.

ఈ పద్యమును రంగనాథుఁడే రచించెనో లేక తర్వాతి కాలమున నితరుఁడే రచించెనో! సిద్ధనంజేశకవి పద్యములో లెక్కింపఁబడిన రంగనాథుని రగడ లేడింటిలో నిప్పటికి రెండు రగడలు దొరకినవనవచ్చును. 1. శివభక్తి దీపికయను నయనరగడ 2. శివమంత్రవర్ణనమను నమశ్శివాయరగడ.

5

శివభక్తిదీపిక వ్రాఁతప్రతిలో కడపట నిట్లున్నది.

'వైష్ణవ చక్రపాణి రంగనాథుఁడు శైవదీక్షాధారణమైన తర్వాతను చేసిన నయనరగడ'

6

'ఏకశిలానగర వృత్తాంతము'లో రంగనాథుని గూర్చి యిట్లున్నది.

'రంగనాథుఁడు ఆందోళికపైనెక్కి చనుదెంచునప్పుడు త్రిపురాంతక దేవుని గోపురంబుఁ జూచి 'అదియేమి?' యని యడిగిన నా వివరాలు త్రిపురాంతక గోపురంబని పలుకుటయు నా శివభవనంబుఁ జూడ నొల్లక మైనపు జడ్లు కప్పించుకొనియె. అప్పుడు రంగనాథుని నేత్రంబులు గానరాక జాత్యంధుని వలెనే మగిడి శ్రీరంగానకుపోయి యద్దేవుని బ్రసన్నుని జేసికొని నేత్రంబులుపోయెనని యొఱయాడుటయు, నద్దేవుండు కరుణించి త్రిపురాంతక దేవుణ్ణి వేడుకొమ్మనుటయు, రంగనాథుండు మళ్ళీ త్రిపురాంతకమున కేతెంచి యద్దేవునకు నమస్కరించి తన యెత్తుకృతులు సమర్పింతునని వ్రతంబుచేసి భక్తిమయంబగు రగడచెప్పిన నద్దేవుండు ప్రసన్నుండై రంగనాథునకు నిరుకన్నుల నొసగుటయు రంగనాథుఁడు పాలకూర్తికింజని సోమనాథునిచే శివదీక్ష గైకొనియె. ఆ యయ్యవద్ద శైవరహస్యంబులు తెలిసికొనుచుండె. అంత నిక్కడ ప్రతాపరుద్రుండు రంగనాథుని ప్రభావంబువిని యాశ్చర్యంబు నొందెను' రంగనాథుని గూర్చిన పై కథ నిన్ననో నేఁడో యెవరో సృష్టించిరని యుజ్జగింప వీలులేనిది.

7

శ్రీనాథుని సమకాలపు వాఁడగు కొలని గణపతిదేవుఁడు తన 'శివ యోగసారము'న చక్రపాణి రంగన కవి నిట్లు స్తుతించినాఁడు.

'అసమశివభక్తిరస మా
నసునిం బాల్కురికి సోమనాథునిఁ గవిరా
జ సమున్నత యశు సద్యః
ప్రసాదియగు చక్రపాణి రంగనఁ గొలుతున్.''

8

గురురాజకవిపద్యమున రంగనాథుఁడు నూఱుతోటకవృత్తములను గూడ రచించినట్లు కలదు. ఛందోగ్రంథములలో రంగనాథుని తోటకము లివి రెండు కానవచ్చినవి.

బాలబోధ చ్ఛందస్సులో

తోటకము॥ ఉపవాసము లెల్లను నుండుట నీ
కృప వచ్చుటకాయది రిత్త సుమీ
యపవిత్రునిఁ బుల్లని యంబలికై
సుపవిత్రునిఁ జేయుట సుద్ది గదే.

హనుమచ్ఛందస్సులో

తోటకము॥చెలువార గజాజినచేలముతో
గళనీలిమతో నహికంకణుఁడై
తలఁజంద్రకళంగల దైవము మా
కులదైవము దైవతకోటులలోన్.

వీనినిబట్టి సిద్ధనంజేశకవి చెప్పిన తోటకవృత్తములను రంగనాథుఁడు రచించుట సమర్థిత మగుచున్నది,

9

రంగనాథుని యనుకరణము కానవచ్చును. కాశీఖండమున శ్రీనాథుఁడు కూడ తోటకవృత్తరచనము చేసినాఁడు.

బాలబోధచ్ఛందమున రంగనాథునిదిగా నీ క్రింది కందపద్యము కలదు.

క. ఫాలతలభస్మరేఖలు –

ఇది సమగ్రముగా లేదు. ఇది సిద్ధనంజేశకవి పేర్కొన్న నూఱు కందములలోఁ జేరినదేమో!

10

ప్రయోగరత్నాకరములో రంగనాథుని మిత్రవిందాపరిణయము లోనిదిగా నీ క్రింది పద్యభాగమున్నది.

"వనమాలి గొలుచు నందుననె యెల్లప్పుడు"

11

పలువురు శివకవులు కవిస్తుతిలో రంగనాథుని శివకవినిగా స్తుతించినారు. మచ్చుకు ఒకటి.

భద్రకవి లింగకవి రంగనాథ ప్రశంస–

.... – దండితోఁ బండితత్రయముఁగీర్తించి
సకలవేదపురాణశాస్త్రేతిహాస – నికరార్థములు ప్రమాణించి సద్భక్తి
శ్రీమతి నుద్ధరించిన పాలకుఱికి – సోమనాథేశ్వరు సొంపుతోఁగొలిచి
రంగద్విశాలాంతరంగంబునందు – రంగనాథునిఁ గవిరాజన్యుఁదలఁచి
యసమానచరితు బ్రత్యగ్రకల్యాణ – బసవేశుఁ బిడుపర్తి బసవేశుఁగొలిచి'

(సానందోపాఖ్యానము)

12

వైష్ణవుఁడైన చక్రపాణి రంగనాథుఁడు శైవుఁడై రంగనకవి యయినాఁడు. ఇట్లే శైవుడైఁన తెనాలి రామలింగకవి వైష్ణవుఁడై రామకృష్ణుఁ డయినాడు.

13

రంగనాథుని పద్యములుగా ప్రబంధరత్నావళిలో నీ పద్యములున్నవి. ఇవి కూడ (శ్రీశైల మల్లికార్జున) శివస్తవపరములే కాన పయి రంగనాథుని రచనములే యగుట సుస్పష్ట మయినది.

చ॥ అదలని తేరు తేరునకు నాదరువై తగువిల్లు వింటికిం
గుదురగునారి నారిపయిఁ గూర్కుశరంబు శరంబు బొద్దునం
బొదలిన యంత యంతముఖముల్ నిజవాసములైన గుఱ్ఱముల్
చెదరక నీకు నెట్టి పని సేయు నయా! గిరిజాధినాయకా!

సీ॥ ఓజు చేముట్టక యొగ్గానఁబట్టక
చక్కఁగా దివిఁజాఱుచక్రములును
లాయానఁ గట్టక లలి మేఁత వెట్టక
వర్ణహీనంబైన వారువములు

తవన వెట్టక జీవితము కాసు ముట్టక
సత్త్వసంపదc జూపు సారథియును
కడచీలc దట్టక ఘనముగా మెట్టక
గంభీరసంపద గలుగు నిరుసుc

గీ॥ గలిగి తనరారు నరదంబుc గడcక నెక్కి
త్రిపురవిజయంబుc జేకొన్న దేవదేవుc
డిందుశేఖరుc డానందమందిరుండు
మనలc గరుణావిధేయుcడై మనుచుcగాత!

ఉ॥ గోళతపంచవార్ధులును గోయుగవార్ధులు గోత్రవార్ధులున్
గోళరవార్ధులున్ విదితగోశర (వార్ధులు) పంచవార్ధు లా
కేశవతల్ప పద్మభవ కేకిపవాహన దానవేశ దే
వేశుల కిచ్చునట్టి పరమేశ్వరుc డీవుత మా కభీష్టముల్.

14

పొత్తపి వెంకటరమణకవి రచించిన లక్షణశిరోమణి యను లక్షణ గ్రంథములో 'అచ్చవెల్లి రంగన్న గారు' అను పేర రంగనాథరామాయణ ద్విపద లుదాహరింపcబడినవి.

(నోట్సు, వ్రాతప్రతులు 1939 - 1942
JSV.O.I సం॥ VIII –సం. 1. జనవరి – జూన్ 1947
చాటుపద్యమణిమంజరి 1951
సింహావలోకనము ప్ర.ము.1953 ద్వి.ము. 1955)

శ్రీనాథకవి

నాటికెల్లా ఒడ్డూ పొడుగూ బలమూ కల ప్రజలకలిమికి కొండవీటి సీమ నాcటికే కాదు నేcటికికూడా ప్రఖ్యాతికెక్కినదే. శ్రీనాథుc డానాటి కొండవీటి ధాటీ, మంచి ఆహారపుష్టిగలవాcడు; అందగాcడు. ఎడరైనపట్టుల నిత్రుపాస ముండవలసినా, అట్టేకాలాచక ఆమడలాది నడవవలసినా తాళగలవాcడు. దగ్గుపల్లి దుగ్గన, పినవీరన, చెన్నమరాజు మొదలగు శిష్యులను వెంటcబెట్టుకొని దేశదేశములు తిరిగినవాcడు. "దేశాటనం పండితమిత్రతాచ, వారాంగనా రాజసభాప్రవేశః అనేక శాస్త్రార్థవిలోకనంచ, చాతుర్యమూలాని భవంతి పంచ." అన్న సంస్కృతోక్తి చొప్పున దేశాటనమేకాక తక్కిన చాతుర్య మూలములు నాలుగును గడించి జగత్ ఖ్యాతిగాంచినవాcడు.

సీ॥ "సంస్కృత ప్రాకృత శౌరసేనీ ముఖ్య
భాషాపరిజ్ఞాన పాటవంబు
అక్షపాదకణాదపక్షిలోదీరిత
న్యాయకలాకౌశలాతిశయము
పన్నగపతి సార్వభౌమభాషిత మహా
భాష్య విద్యాసమభ్యాసబలము
శ్రుతిపురాణాగమస్మృతిసాంఖ్య సిద్ధాంత
కబళనవ్యుత్పత్తి గౌరవంబు

గీ॥ పూర్వకవిముఖ్యవిరచితాపూర్వకావ్య
భావరససుధాచర్వణప్రౌఢతయును..."

శ్రీనాథునికి గలవని అతనిబావమఱది దగ్గుపల్లి దుగ్గన చెప్పినాcడు. ప్రాచీనాంధ్ర కవీశ్వరులలో పాండిత్యసాహిత్య సంస్కారంలేని సామాన్య ప్రజలు కూడా మన తెలుగుదేశంలో శ్రీనాథుని కవితాకథ లేవేవో చెప్పుకొంటూ ఆయన కవితాప్రశస్తి నెంతెంతో మెచ్చుకొంటూ ఉంటారు. కావ్యములు ప్రౌఢములయి సాధారణజనదురవబోధములయినా చాటుధారలు చమత్కార కలితములయిన పొడిరచనలగుటచే ప్రజాసామాన్యంలో శ్రీనాథునికీర్తి అల్లి బిల్లిగా అల్లుకున్నది. పూర్వపుటాంధ్రకవులలో శ్రీనాథునికే యీ భాగ్యము చెల్లినది; నేcటి కవులలో శ్రీ తిరుపతి వేంకటేశ్వరకవులకే చెల్లినది.

సరిగా యిప్పటికి 550 ఏండ్లకు పూర్వము శ్రీనాథుఁడు వెలనాటిలో జన్మించి సుఖములు కష్టములు చూరగొంటూ పూర్ణపురుషాయుషకాలం జీవించి కవిసార్వభౌముఁడై ఖ్యాతిగాంచినాఁడు. వెలనాటిలో, వేగినాటిలో, పలనాటిలో, పాకనాటిలో ఆయన కవితావిలాసిని స్వైరవిహారములు జరిపినది. ఆయన ప్రాయపుప్రొద్దుపొడుపు కొండవీటిరెడ్డిసామ్రాజ్యమును మతీ కలకలలాడించినది. ఆనాటి కొండవీటిసీమ ముత్యాలమూటలవంటి జొన్నకంకులపొలాలతో, ఆకుతోటలతో, పోకతోటలతో, ఇంకా వేఱువేఱు తీరులైన పయరపునాస పొలాలతో, ఆలమందలతో, సంపన్నులు, దీర్ఘాయుష్మంతులు అయిన స్త్రీ పురుషులతో పొలుపారుతూ ఉండేది. తెలుగువైభవమింతకలవాఁడు వేఱొకఁడు కానరాఁడు.

ఇట్టి పాండిత్యవైభవమునకు స్ఫోరకములు కవితాఘట్టములు కాశీఖండములో చాలా కనుపడుచున్నవి.

ఇంచుమించుగా ఇర్వైయేండ్లపాటు పెదకోమటి వేమారెడ్డిగారి యాస్థానమున కొండవీటిలో శ్రీనాథుఁడు విద్యాధికారిగా వెలసినాఁడు. శాలివాహన సప్తశతి మొదలుగా ననేకగ్రంథముల నతఁడక్కడ రచించినాఁడు. అఖిల పురాణవిద్యాగమములు వినిపించి అనవేమభూపాలుని శృంగారదీపిక, సాహిత్యచింతామణి మొదలగు గ్రంథములకు కర్తనుగాను సర్వజ్ఞచక్రవర్తినిగాను చేసినాఁడు. ఆయనచే వేదవేదాంతతర్కవ్యాకరణవైద్యజ్యోతిషాది శాస్త్రవేత్తలకు అనేకాగ్రహారము లిప్పించినాఁడు. "విద్యాధికారీ శ్రీనాథో వీర శ్రీవేమభూపతేః" అని కీర్తినిగన్నాఁడు.

శ్రీనాథుని మూలమున ఆనాఁడు కొండవీటిసీమ నలువైపులా కవితావాసనలు గుబాళించినవి. సందులలో గొందులలో కూడా కవీశ్వరులే కడల్కొన్నారు.

ఉ॥ బూడిదబుంగవై యొడలు పోడిమిదక్కి మొగంబు వెల్లనై
వాడలవాడలం దిరిగి వారును వీరును చొచ్చొచోయనన్
గోడలగొందులం దొదిగి కూయుచునుండెదు కొండవీటిలో
గాడిద! నీవునుం గవివి గావుగదా అనుమాన మయ్యెడిన్.

అని శ్రీనాథుఁడు అప్రౌఢకవుల నప్పుడవహేళనము చేసినాఁడు.

పెదకోమటి వేమారెడ్డిగారి ప్రేరణమున శ్రీనాథుఁడు రాచకొండలో రాజ్యమేలుతూ ఉన్న సర్వజ్ఞసింగభూపాలుని దర్శించి అంతకు పూర్వము రెడ్డిరాజులనోడించి వెలమరాజులు కొనిపోయిన కటారిని కవితా పారితోషికముగా గ్రహించికొని తెచ్చినాఁడు. విద్వాంసుఁడయిన సర్వజ్ఞ సింగభూపాలునిపై చెప్పిన పద్యములలో చాలా చమత్కారపూరిత మీ క్రింది పద్యము:

"కుక్కవొ, నక్కవో, ఫణివొ, క్రోఁతివొ, పిల్లివొ, బూతపిల్లివో!" అని సిరగ భూపాలుఁడు సమస్య యిచ్చెనట. దీనిని శ్రీనాథుఁడిట్లు పూరించినాఁడు.

ఉ॥ తక్కక రావు సింగవసుధావరుఁ దర్థుల కర్థమిచ్చుచో
దిక్కిలలేని కర్ణుని, దధీచిని, ఖేచరు వేల్పుమ్రాని పెం
పెక్కిన కామధేనువు శిబీంద్రుల నెన్నెదు భట్ట దిట్టవై
కుక్కవొ, నక్కవొ, ఫణివొ, క్రోతివొ, పిల్లివొ, బూతపిల్లివో?

ఈ సమస్యలోని చమత్కారమును వివరించుట కిపుడు సమయము చాలదు. ఆంధ్రవాఙ్మయమున నిఁక నిట్టి సమస్య లెన్నోలేవు.

కొండవీటి రెడ్డిరాజ్యముకూలిపోయిన తర్వాత శ్రీనాథుఁడు రాజమహేంద్రవరప్రాంతము నేలుచుండిన వేమవీరభద్రారెడ్ల యొద్ద చేరినాఁడు. గోదావరీ ప్రాంతదేశము శ్రీనాథుని మరీ మురిపించినది. కాశీఖండభీమఖండములలో మూలగ్రంథములలో లేకపోయినా గోదావరీ ప్రాంతదేశము నితఁడు అధికముగా మనోహరముగా వర్ణించినాఁడు. ఆ వర్ణనలనుగాని, రాజమహేంద్రవరపుతర్కవిద్వాంసులను సోమయాజులనుగూర్చి కూర్చిన చాటుధారలను గాని, ఇంకను ఇతరములయిన అచ్చటి ముచ్చటలనుగాని ఇక్కడ వివరింపఁ జాలను.

రాజమహేంద్రవరము రాకపూర్వము శ్రీనాథుఁడు విద్యానగరమున కరిగి విద్యానగరరాజాస్థానకవి అయిన డిండిమభట్టారకునితో విద్యావివాదము జరిపి ఓడగొట్టి అతని కంచుఢక్కను బ్రద్దలుగొట్టించి కవిసార్వభౌముఁడయి రాయల ముత్యాలశాలలో కనకాభిషేకసత్కారమును గాంచినాఁడు. తన కవితా చాతురిని గూర్చి శ్రీనాథుఁడక్కడ చెప్పికొన్న పద్యమొక్కటి.

సీ॥ పంపావిరూపాక్షబహుజటాజూటికా
రగ్వధప్రసవసౌరభ్యములకు
తుంగభద్రాసముత్తుంగ వీచీఘటా
గంభీర ఘుమఘుమారంభములకు
కళసాపురప్రాంతకదళీవనాంతర
ద్రాక్షాలతాఫలస్తబకములకు
కర్ణాటకామినీ కర్ణహాటకరత్న
తాటంకయుగధాళధళ్యమునకు

గీ॥ నిర్నిబంధ నిబంధమై నెనయుకవిత
తెలుఁగునను సంస్కృతంబునఁ బలుకనేర్తు
ప్రౌఢదేవేంద్రరాయభూపాలవరుని
సమ్ముఖమ్మున దయఁజూడు ముమ్మసుకవి...

ఈ పద్యము విద్యానగరమున విద్యాధికారిగనున్న ముమ్మకవిపై చెప్పినది.

కనకాభిషేకము జరిగిన పయినే ప్రౌఢరాయలను ప్రస్తుతించదగుట నిట్లు శ్రీనాథుఁడు చమత్కరించినాఁడు.

మ॥ జననాథోత్తమ! దేవరాయనృపతీ! చక్రేశ! శ్రీవత్సలాం
ఛనసంకాశ! మహాప్రభావ! హరిరక్షాదక్ష! నా బోఁటికిన్
గునృపస్తోత్రసముద్భవంబయిన వాగ్దోషంబు శాంతంబుగాఁ
గనకస్నానముచేసి కాక పొగడంగా శక్యమే దేవరన్.

శ్రీనాథుఁడు నిర్మత్సరుఁడు ; వినయవిధేయుఁడు.

"బోధమల్పంబు గర్వ మభ్యున్నతంబు
శాంతి నిప్పచ్చరంబు మచ్చరము ఘనము
కూపమండూకములువోలె కొంచెమెఱిఁగి
పండితమ్మన్యులైన వైతండికులకు."

పద్యమిది డిండిమపండితునుద్దేశించి యతఁడు చెప్పినది కావచ్చును. బహుదేశబుధులతో విద్యాపరీక్షణవేళలందు భాషించినవాఁడు గాన శ్రీనాథుఁడు పొంగిబోర్లపడక, కోరి కయ్యములు తెచ్చుకొనక నేరుపుతో విదేశవిద్వద్ గోష్ఠులలో వర్తిల్లినాఁడు.

"ఎవ్వనిచో నెచ్చోటను
చివ్వకు చేసాపఁ జనదు, చేసాచినచో
నివ్వల నవ్వల నెవ్వరు
నవ్వకయుండంగ పగసనన్ దీర్పఁదగున్."

అనివార్యముగా నేర్పడిన డిండిమవాదమున తెగువమీఱ నిట్టి ప్రతిజ్ఞ సాధించినాఁడు.

శ్రీనాథుఁడు 'కావ్యస్యాత్మాధ్వనిః' అన్న ఆనందవర్ధనుని సిద్ధాంతము నభిమానించినవాఁడు. అతఁడు విద్యాధికారిగా నుండఁగా పెద్దకోమటి వేమా రెడ్డిగారు రచించిన సాహిత్యచింతామణిలో ధ్వనిమతమే ప్రతిష్ఠాపితమయినది.

"ధ్వన్యధ్వన్యధ్వన్యః పెదకోమటివేమ భూపతిర్జయతి"

అని అతఁడు పొగడ్తగన్నాఁడు. పరమార్థమదే యని తలఁచినా శ్రీనాథుఁడు 'రీతిరాత్మాకావ్యస్య' అను వామనుని మతమునుగూడ నత్యంతము నభిమానించినాఁడు. రీతి, సౌశబ్ద్యము శ్రీనాథునికవితకు జీవధాతువులు. నన్నయతెన్నున ప్రసన్నరచనముచేయుట శ్రీనాథుని పరిపాటి. ప్రౌఢగాఢమగు వక్షోజద్వయపు బిగుపుబింకములపై గంధసారకస్తూరీరసముల కలగలపు కలపముంబోలు నుభయవాక్ప్రౌఢితో సీసపాదము లుద్దండలీలలు నుయ్యాల లూఁగఁగా సూక్తివైచిత్రి సొంపొదవింపఁగా రసాభ్యుచితబంధముచేయుట శ్రీనాథుని యసాధారణకవితాపద్ధతి.

"సూనాస్త్రప్రమదామదస్ఫురితవక్షోజాతకాఠిన్యముం
బూనంజాలు వచోవిలాసముల నింపుల్ మీఱ కర్ణాటక
క్ష్మానాథేంద్రుసభన్ కవిత్వవిజయోత్సాహంబుకైకొన్న మా
శ్రీనాథున్ కవిసార్వభౌముఁ గొలుతున్ సేవాంజలుల్ గీల్కొనన్.

రాధామాధవకవి చెప్పిన యీ శ్రీనాథస్తుతి పద్యముతో కథను ముగించి కంచికిపంపి నేనింటికి వెళ్లుతున్నాను.

(రేడియో ప్రసంగము.,
మదరాసు : 23.11.1940.,అముద్రితము)

శ్రీనాథుని సింహాచలపుముచ్చటలు

రాజమహేంద్రవరము రాజధానిగా ఉత్తరాంధ్రదేశమును పరిపాలించిన వేమ వీరభద్రారెడ్లతోను, విజయనగరపు ప్రౌఢదేవరాయల సామంతుడై సింహాద్రిపర్యంతము ఆంధ్రదేశము జయించియిచ్చిన సాంపరాయని తెలుంగు రాయనితోను శ్రీనాథమహాకవి సింహాచలమునకు తఱచుగా వెళ్లుతూ ఉండేవాడు. సాంపరాయని తెలుంగురాయడు క్రీ.శ. 1450 నాడు సింహాచలముమీద విజయయాత్రావినోద మనుభవిస్తూ రసిక విద్వద్గోష్ఠితో కొంతకాలమువసించినాడు. అప్పుడు శ్రీనాథకవి యాతని దర్శించి కవితజెప్పి మెప్పించినాఁడు. అప్పటి పద్యమిది –

శా॥ అక్షయ్యంబగు సాంపరాయని తెలుంగాధీశ కస్తూరికా
భిక్షాదానము సేయురా సుకవిరాడ్బృందారక శ్రేణికిన్
దాక్షారామ చళుక్య భీమవరగంధర్వాప్సరోభామినీ
వక్షోజద్వయ కుంభికుంభములపై వాసించుఁ దద్వాసనల్.

ఈ పద్యము తెనుంగురాయడు సింహాచలముమీద నున్నప్పుడేని దాక్షారామము వచ్చియున్నప్పుడేని చెప్పినది కావచ్చును. శ్రీనాథుడు సింహాచలమునను దాక్షారామమునను గూడ అవారిగా రసికవిహారములు జరిపినవాడు. శ్రీనాథు డా రెండుస్థలములలో నానాజాతి వనితలగూర్చి జేసిన వర్ణనమును, ఆనాటి స్త్రీవేషభాషాదిపరిజ్ఞానము కొరకును శ్రీనాథ కవితాస్వారస్య పరిశీలనము కొరకును చదువుకొందము. సింహాద్రిమీద ఒక దుకాణములో తమలపాకులు కొనబోయి, తమలపాకులమ్ముచున్న జంగమ పడుచును శ్రీనాథుడు చూడ తటస్థించును. శివభక్తురాలైన ఆమె ధరించిన శివలింగమును చూచి, పరమశివుడే ఆమె వక్షసీమను నాట్యమాడు చుండెనని ఉత్ప్రేక్షించి, మనుష్యమాత్రుడైన తాను –

చ॥ తొలకరి మించుఁ దీవగతి తోఁప దుకాణము మీఁదనున్న య
య్యలికులవేణితోఁ దమలపాకుల బేరము లాడబోయి నే
వలచుటకేమి...

అని చమత్కారముగా చెప్పును. ఈ పద్యమున శ్రీనాథుని కవితాచాతురి కులుకులాడుచున్నది. తమలపాకులు కొనుక్కొని తాంబూలచర్వణము చేస్తూ సవిలాసముగా సాగిపోవుచున్న శ్రీనాథునికి ఆ యంగడివీథిలోనే సమకూరిన మరొక వినోదము –

ఉ॥ అంగడి వీధిఁ బల్లవుల కాసగ మామిడిపండులమ్ముచున్
జంగమువారి పిన్నది పిసాళితనంబున జూచెఁ బో నిశా
తాంగజబాణ కైరవ సితాంబుజ మత్తచకోర బాల సా
రంగ తటిన్నికాయముల రంతులు సేసెడు వాడి చూపులన్.

నృసింహస్వామివారి చందనయాత్రోత్సవము చూచుటకు కొండమెట్లెక్కి వచ్చుచున్న వనితను చూచి –

సీ. హరినీలముల కప్పు లణగించు నునుగొప్పు
విడఁ బువ్వుదండ తా వీడఁబార
కోటిచందురుడాలు గోటమీటగఁ జాలు
మొగముఁగుంకుమ చుక్కసొగసు గుల్క.....

అని శ్రీనాథుడు చాల అందముగా వర్ణించినాడు. పెదవులు, పగడాల ఎరుపట. కనుచూపులు అత్యంత రమ్యములు – మార్గాయాసమున ముచ్చె మటలు పోసెను –

చిగురుఁ గెమ్మోవిఁబగడంపు జిగియు మెఱయ
మాటమాటకు గనుదోయి తేటలలర
జెమటలూరంగ సింహాద్రి చేరవచ్చె.....

అంటూ వర్ణించాడు. మరియొక అందకత్తె సౌందర్యము శ్రీనాథునకు మరింత వర్ణనీయముగాతోచెను. ఆమెనుగూర్చి –

సీ॥ విడినకొప్పున జాజివిరులొప్పుగా రాలఁ
జిట్టికుంకుమ చుక్కబొట్టు చెదర
చక్కఁగాఁ బటువారు సందెడు కుచ్చెళ్లు
చెలగు మెట్టియలపైఁ జిందులాడ...

ఎంత కన్నులకు కట్టినట్లున్నదో చూడండి వర్ణన – చీరకుచ్చెళ్లు కాలి మెట్టియలపై చిందులాడడం చాలా స్వాభావికము. ఆమె ముక్కున ముద్దులొల్కే నత్తు కూడా వున్నదట. ఆమె నడచుచుండగా –

మొలగంట లిమ్మగు మ్రోతతో రంజిల్లఁ
గనకంపుటందియల్ ఘల్లురనఁగ

గీ॥ బొసఁగఁ గప్రంపు వీడ్యమ్ము పొందుపఱిచి
యనుఁగు జేడెలతో ముచ్చటాడికొనుచు
నలరు సింహాద్రిపై కెక్కి హర్షమునను
వచ్చెఁగలకంఠి....................

అంటూ వర్ణిస్తూ శ్రీనాథుడు సింహాద్రిపై తీర్థస్నానమున కేగి యచ్చట సుస్నాతయై విభూతిధారణ చేయుచున్న యొక శైవ సుమంగళిని చూచి యిట్లనుచున్నాడు.

క॥ కుంకుమలేదో మృగమద
పంకములేదో పటీర పాంసువులేదో
సంకుమదములేదో యశు
భంకరమగు భస్మమేల బాలా నీకున్?

అచట నున్న ఇతరజాతి స్త్రీల వర్ణనలను బట్టి ఆ రోజులలో ఆయా జాతివారు వాడెడి ఆభరణములు తెలియనగును. ముక్కున నత్తు, కమ్మలు, పచ్చపూసలు ఇటువంటివి అనేకములు.

ఆంధ్రనైషధకర్త, మిక్కిలి సులభ శైలిని వర్ణించిన ఒక దృశ్యము –

క॥ పూజారివారి కోడలు
తా జాఱఁగ బిందెజాతి దబ్బునఁ బడియెన్
మైజారు కొంగుదడిసిన
బాజారే తిరిగిచూచి పక్కున నవ్వెన్.

శ్రీనాథుడిట్లు నీలాటి రేవున గూర్చుండి స్త్రీసౌభాగ్యవర్ణనాత్మకములైన పద్యములు చెప్పుచుండగా శ్రోత్రియ బ్రాహ్మణుడొకడు అధిక్షేపించెను. అతని నవహేళనము చేయుచు శ్రీనాథుడు ఇట్లనెను –

మ॥ శ్రుతిశాస్త్రస్మృతు లభ్యసించుకొని విప్రుండంత నానాధ్వర
వ్రతుఁడైపోయి కనున్ బురందర పురారామద్రుమానల్ప క
ల్పతరుప్రాంతలతాకుడుంగ సుఖసుప్త ప్రాప్త రంభాంగనా
ప్రతిరోమాంకురపాటనక్రమకళా పాండిత్య శౌండీర్యముల్.

సింహాద్రియప్పని సేవకై అరుగుచున్న యొక 'నయమైన యొయ్యారి నడలు' గల వనితను చూచి శ్రీనాథుడిట్లు హెచ్చరించుచున్నాడు –

సీ॥ సొగసుకీల్జడదాన, సోగకన్నులదాన
వజ్రాలవంటి పల్వరుసదాన
బంగారు జిగిదాన..... ....

అని హెచ్చరించి, ఆమె తన వైపు చూచునటుల ప్రభోదించుచున్నాడు –

పిడికిట నడఁగు నెన్నడుముదాన!
తళుకుఁ జెక్కులదాన, బెళుకు ముక్కరదాన!
సింగాణి కనుబొమ చెలువుదాన!

గీ॥ మేలిమి పసింది రవకడియలదాన!
మించి పోనేల రత్నాల మించుదాన!
తిరిగిచూడవె ముత్యాల సరులదాన!
చేరిమాటాడు చెంగావి చీరదాన.

శ్రీనాథుని గుర్తింపక యేగు నా వనిత వెనుకకుతిరిగి చూచి పశ్చాత్తప్తయై వచ్చి నమస్కరింపగా రసిక కవిశ్రేష్ఠుడగు శ్రీనాథకవి –

సీ॥ శ్రీరస్తు భవదంఘ్రి చికురంబులకు మహా
భూర్యబ్దములు సితాంభోజనయన!
వరకాంతిరస్తు తావకముఖ నఖముల
కాచంద్రతారకం బబ్జవదన!
మహిమాస్తు నీ కటిమధ్యంబులకు మన్ను
మిన్నుగలన్నాళ్లు మించుబోఁడి!

విజయోస్తు నీ గాన వీక్షల కా నీల
కంఠహరిస్థాయిగా లతాంగి!

అంటూ ఆమెను ఆశీర్వదిస్తాడు కవి సార్వభౌముడు.

శ్రీనాథుడిట్టి వర్ణనలనేగాక దేశసౌభాగ్య ప్రజాజీవితాది విషయముల యందు చాటురూపముగాను గ్రంథరూపముగానుకూడ మనోజ్ఞవర్ణనల నెన్నింటినో చేసియున్నాడు.

(రేడియో ప్రసంగము
మదరాసు : 12.8.1941
అముద్రితము)

వనితలకవితలు

మొల్ల

తెలుఁగునఁ దేట తేటగా రామాయణకథ రచించినది మొల్ల. చక్కఁదనాలకృతులలో నామె కృతియు నొక్కటి. అంతకుఁ బూర్వము మన యాంధ్ర భాషలో వాగమృతధారను కావ్యరూపమునఁ జాలువార్చిన వనిత లెవ్వరును గానరారు. పూజ్యురాలు మొల్ల తన చరిత్రవిషయమునంతగా నెఱుక పఱిచి నదికాదు. శాంతచిత్తయగు సాధ్విగాఁ దోఁచుచున్నది. కుమ్మర కులమున జన్మించినదని వినికి. మన స్త్రీల కామె శీలము మేలుబంతిగాఁ జూచుకోదగినది.

పెద్దనాదుల కాలమునుండి, కులకాంతలు చక్కఁగా చదువుకోఁదగిన కావ్యములు వెలయఁ జొచ్చినవికావు. కావున ఆ కావ్యములను జదువుటకే సందేహించుచు వచ్చిరి స్త్రీలు. పురుషులు చదివింప నొల్లరయిరి. చదువు నేర్చిన వేశ్యలు చదివి తీరుదురట మనుచరిత్ర నాల్గాశ్వాసములనేని. కులస్త్రీలలో విద్యాభ్యాసము మనదేశమున, చాలావఱ కీ కారణమునఁగూడ సన్నగిల్లినది.

ఏల్బడి చెడి రాజ్యవ్యవస్థలు, ఛిన్నాభిన్నములయి, దేశము కలవరపాటుతో నుండుటచేఁ గృష్ణరాయల తర్వాతఁ గొన్నాళ్ళకు దీరి కూర్చుండి తిన్నఁగాఁ గవిత్వముచెప్పిన కవివర్యులే కఱవయిరి మన తెలుఁగుదేశమున.

మధురవాణి

ఈమెకిది బిరుదుపేరు. రఘునాథరాయ లీమె వాఙ్మాధుర్యమునకు మెచ్చి యీ బిరుదు పేరిచ్చినాఁడట. రఘునాథరాయల చరిత్రము వినుతింపఁదగినది. వేఱొక వ్యాసమున నది వివరించెదను. మధురవాణి చతుర్విధకవిత లందును జతురురాలు. వీణావాదమునఁబ్రవీణురాలు. పాణినీయ వ్యాకరణమునఁపాండిత్యము కలది. నానావిధావధానములను నేర్చినది. వీణావాదన

సమయమందుఁ బలువురు కవీశ్వరులు సమస్యాశతము నిచ్చుచుండగా నప్పటికప్పుడే వానినిపూరించి చెప్పుచుండెడి దఁట. ఇట్టి కవితా చాతుర్య మీమెకుఁదెనుఁగుననే కాక సంస్కృతమునఁగూడ నుండెడిది. రఘునాథరాయల దయాదృష్టి తన వైదుష్యమునకుఁగారణమని యామె చెప్పికొన్నది. ఆంధ్ర భాషలో రఘునాథరాయలు రచియించిన రామాయణమహాకావ్యము నీమె సంస్కృతభాషలోనికిఁ జక్కఁగాఁ బరివర్తనము చేసినది. రఘునాథరాయల చేతనే కాక, తదాస్థానస్థితులు, మహావిద్వాంసులునగు గోవిందదీక్షితాదులచేఁ గూడ నీమె మిక్కిలిగా సత్కరింపఁబడినది. రఘునాథరాయల విద్వద్గోష్ఠులందుక్తి ప్రత్యుక్తిచాతుర్యము, చిత్రయుక్తికల్పన, పలుకు పలుకునకు దొలఁకులాడు చుండెడిదఁట. సమయస్ఫూర్తి చమత్కారములందు బహునిపుణుఁ డయిన కొంటెకోణంగి కవిచౌడప్ప రఘునాథరాయల యాస్థానమునకరిగి యబ్బుర పోయి పద్యము చెప్పినాడు : –

కII నేరుతునని మాటాడను
వారిజభవునంతవాని వశమా తంజా
వూరి రఘునాథనాయని
గారి సభను గుందవరపుఁగవిచౌడప్పా!

ఇట్టి యాస్థానమున విద్వద్గౌరవము వడసిన వెలయాలెంత రసికురాలు, విద్వాంసురాలునై యుండవలయునో తలపోసి చూడుఁడు.

(ఆంధ్రపత్రిక
సోమవారము, 31 ఆగస్టు 1914)

వనితల కవితలు

2

మధురవాణియను వేశ్యనుగూర్చి వెనుకటివ్యాసమున గొంత వెల్లడించి తిని. తంజావూరు రఘునాథరాయల కుమారుఁడైన విజయరాఘవనాయని యాస్థానమునఁగల యొక విద్వాంసురాలిని గూర్చి యిందుఁ బ్రస్తావించెదను.

రంగాజమ్మ

ఈమె పసుపులేటి వేంకటాద్రికుమార్తె. వేశ్యయే కావలెను. విజయ రాఘవరాయలకుఁ బ్రియురాలు. మన్నారుదాసవిలాసమను పేర, విజయరాఘవ రాయల శృంగారవర్తనము నీమె ప్రబంధముగా రచియించినది. ఉషాపరిణయ మని వేఱొక ప్రబంధమును రచించినది. మఱికొన్ని యక్షగానములను, గద్య కావ్యములనుగూడ రచియించినది. ఈమె గద్యమిట్లున్నది.

“ఇది శ్రీరాజగోపాల కరుణాకటాక్షవీక్షణానుక్షణ ప్రవర్ధమాన సార సారస్వతధురీణయు, విచిత్రతరపత్రికాశతలిఖిత వాచికార్థావగాహన ప్రవీణయుఁ, దత్ప్రతి పత్రికాశత స్వహస్తలేఖన ప్రశస్తకీర్తియు, శృంగార రసతరంగి పదకవిత్వ మహనీయమతిస్ఫూర్తియు, నతులితాష్టభాషాకవితా సర్వంకష మనీషావిశేషశారదయు, రాజనీతివిద్యావిశారదయు, విజయరాఘవ మహీపాలవిరచిత కనకాభిషేకయు, విద్వత్కవిజనస్తవనీయవివేకయు, మన్నారు దాసవిలాస నామక మహాప్రబంధ నిబంధన కృతలక్షణయు మహనీయ రామాయణభారతభాగవతకథాసంగ్రహణ విచక్షణయుఁ, బసపులేటి వేంకటాద్రి బహుజన్మతపఃఫలంబును, మంగమాంబాగర్భశుక్తిముక్తి ఫలంబును, రంగద్గుణకదంబయునగు రంగాజమ్మ వచనరచనాచమత్కృతిం జెన్ను మీఱు నుషాపరిణయంబను మహా ప్రబంధంబునందుఁ బ్రథమాశ్వాసము”

గద్యమును మఱలఁ జక్కగాఁ బరికించి యామె చాతుర్యమును గుర్తిం చుఁడు! ఉషాపరిణయ కృత్యవతరణమునుండికూడఁ గొండొకపట్టు నుదా హరింతును:

వ॥ .... మఱియు. దానరాధేయుండును..... రాజగోపాల నిత్య కైంకర్య ధుర్యుండును. చతుర్వేదశతక్రతు శ్రీనివాసాచార్య చరణసరసిజ సేవా నిష్ఠాగరిష్ఠుండును,.............. రఘునాథనృపాలనందనుండును. రచితకళావత్యంబికా నయనానందుండును నగు నవ్విజయరాఘవేంద్రుండు రామణీయక విరచిత రాజరాజ సభావిజయంబగు రాజగోపాలవిజయంబు నందు నతులితవిలాసవతులైన కులసతులును, విబుధసన్నుతమతియగు విజయవేంకటపతియును, మహితప్రభావుండగు మన్నారుదేవుండును, తతయశోఘనుండగు తాత ఘనుండును, రంగద్యశోవిలాసుండగు చెంగమల దాసుండును, మొదలగు నిఖిలజనమిత్రులగు పుత్త్రులును నిరుపమచరిత్ర పవిత్రులయిన పౌత్త్రులును, నిరవద్యరూపరేఖాకనకపుత్త్రికలయిన పుత్త్రిక లును, నింపువెలయఁ దామరతంపరై నిండియుండఁ, జెంగట శృంగారవతులు రంగురక్తులుమీఱ సంగీతమేళంబుగావింప నగ్రభాగంబున నాచార్యా గ్రేసరుండగు శతక్రతు శ్రీనివాసాచార్యుండుకృతదురితభంగంబగు హరివంశ కథాప్రసంగంబు గావింప నింపు మీఱ నేనును, శృంగారరసంబు చెన్ను మీఱు మన్నారుదాసవిలాసంబు వినిపించుచున్న సమయంబున :

సీ॥ వేంకటేంద్రునిపుత్త్రి వినుత సద్గుణధాత్రి
తతయశోరాజి రంగాజి వినుము!
మాధుర్యమున మించు మన్నారుదాస వి
లాసప్రబంధంబు లలితఫణితి
గావించి మిగుల శృంగారంబు గన్పట్టఁ
బదములు మృదురసాస్పదములగుచు
రాణింప రచియించి రామాయణంబును
భాగవతంబును భారతంబు

గీ॥ సంగ్రహంబుగ రచియించి సరసరీతి
మమ్ము మెప్పించితివి చాల నెమ్మిదనరఁ
బరఁగ హరివంశమున నుషాపరిణయకథ
తెనుఁగు గావింపు మిఁక మాకుఁదేటగాఁగ॥

అని సబహుమానంబుగాఁ దాంబూల జాంబూనదాంబర మాల్యాభర ణంబు లొసంగిన నేనును బరమానందంబుంజెందుచుఁబతియును గతియును

గల దైవంబునయిన నీదు పాదారవిందంబులు డెందంబున సేవించుచున్న తనకు మీ రానతిచ్చు కథాసంవిధానంబు సర్వంబును నవగతంబగుఁ గావున నట్ల రచియించెదఁ బంజరశుకంబు మంజు వాక్ఫణితి రంజిల్లం బలికినం దత్పోషకుండు సంతోషించుతెఱంగున మదీయ వచనకుసుమార్చనం బంగీకరించి నన్నుం గటాక్షింపుండని విన్నవించిన లాలించి యాచార్య చరణంబులకు వందనంబు గావించి యమ్మహామహుని యనుజ్ఞ గైకొమ్మనుటయు నట్లన సేవించిన దీవించి గురురాజ పట్టభద్రుం డిట్లనియె.

క. నీ పతి మన్నరుదాసుఁడు
గోపాలుఁడుగనుక నతఁడు కోర్కులుహెచ్చన్
జేపట్టి మనుప నెలకొను
నా పలుకుల నెలఁత నీ ముఖాంబుజసీమన్

క. చతురాస్యుండనఁదగు నీ
పతి యిటు నినుగారవించి బహుమతి దోఁపన్
గృతిరచియింపుమనెన్ భా
రతికిన్ సరివత్తునమ్మ! రంగాజమ్మా!

(ఆంధ్రపత్రిక
సోమవారము, 14 సెప్టెంబరు 1914)

దక్షిణదేశమందలి ఆంధ్రవాఙ్మయము

క్రీ.శ.1400 తరువాతినుండి తురుష్కులయు, గజపతులయు నలజడి యంధ్రదేశము నత్యధికముగ నలముకొన్నది. 1430 ప్రాంతపుటలజడిని చూడలేక తాళ్ళపాక యన్నమాచార్యుఁ డిట్లు సంకీర్తన రూపమున విలపించి నాఁడు.

రామక్రియ

పల్లవి

తతిగాని యీ పాటు దైవమా విచారించవే
కతలాయఁజెప్ప నేఁడు కలికాలమహిమా॥

చరణములు

తుటుములై భూసురుల తుండెములు మొండెములు
నిటువలె భూతములు యెట్టు మోఁచెనో
అటు బాలుల రొదలు ఆకాశ మెట్లోరిచెనో
కటకటా యిట్లాయఁ గలికాలమహిమా॥ 1

అంగలార్చే కామినుల యంగభంగపు దోఁపు
లింగితాన మింట సూర్యుఁడెట్టు చూచెనో
పొంగు నానాజాతిచేత భువన మెట్లానెనో
కంగి లోక మిట్లాయఁ గలికాలమహిమా॥ 2

అరుదు గోహత్యలు సేయఁగ దూడ లంగలార్వంగ
సరి ధర్మదేవతెట్టు సమ్మతించెనో
పరధనచూర కెట్టు పట్టాయెనో లక్ష్మి
కరుణ యెందణఁగెనో కలికాలమహిమా॥ 3

దేవాలయాలు నానాదేశము లెల్లాఁజొచ్చి
దేవఁగా నెట్లుండిరో దేవతలు

తావు లేలేరాజులకు దయ గొంత పుట్టదాయ
కావరమే ఘనమాయఁ గలికాలమహిమా॥ 4

నిరపరాధులఁ జంపి నెత్తురు వారించఁగాను
తెరల కెట్లుండిరో దిక్పాలులు
విరసవర్తనులుండే విపరీతకాలమున
గరువాలుం గపటాలె కలికాలమహిమా॥ 5

ఉపమించి దంపతులు వొకరొకరినిం జూడ
చపలదుఃఖములతో సమయగాను
తపములు జపములు ధర్మములెందణఁగెనో
కపురుంబాపాలు నిండె కలికాలమహిమా॥ 6

తలలు పట్టీడువఁగాను తల్లులు బిడ్డల వేయ
తలపెట్టుండెనో యంతర్యామికి
మలసి ముక్కులు గోయ మరుఁడెట్టు వోరిచెనో
కలకలే ఘనమాయఁ గలికాలమహిమా॥ 7

దీనతలోఁ బడి గుండెదిగు లసురుసురులు
వాని నెట్లు లోఁగొనెరో వాయుదేవుండు
గూను వంచి తల్లి చూడఁ గొడుకుఁ గుత్తికఁ గోయఁ
గానంబడె నింతేసి కలికాలమహిమా॥ 8

పలుమారు నమ్మించి ప్రాణములు గొనగాను
యిలఁ దమలోఁ బ్రాణా లెట్లుండెనో
నెలవై శ్రీ వేంకటేశ నీవే యెరుంగుదువు
కలుషమే ఘనమాయఁ గలికాలమహిమా॥ 9

(అన్నమాచార్యుల అధ్యాత్మసంకీర్తనములు 373 ఱేకు 1వ పాట)

క్రీ. 1500 నుండి 1565 దాఁక నష్టదిగ్గ్రాయ భయంకరుఁడయిన కృష్ణదేవరాయఁడు మొదలగు రాజులు దక్షిణాపథమును సురక్షితపఱిచి భాగ్యలక్ష్మిని, సాహిత్యసరస్వతిని చాలఁగ సంవర్ధిల్లఁ జేసిరి, గాని విద్యానగర

వినాశము తరువాత ఆంధ్రరాజ్యలక్ష్మి, ఆంధ్రసాహిత్య సరస్వతి, దక్షిణదేశమును అనఁగా అరవదేశము నధికముగ నాశ్రయింపవలసెను. కారణ మా దేశము రాజ్యోపప్లవము, దౌర్భాగ్యము లేక రాజన్వంతముగా నుండుటయే. తంజావూరిలో చెవ్వప్పనాయకాదులు, మధురలో నాగమనాయకాదులు, పుదుక్కోటలో కోటవారు, రాజ్యములేలుచు నాంధ్రదేశముననుండి కవులను, గాయకులను, గాయనులను, అభినేత్రులను, శిల్పకారులను, వ్రాయసగాండ్రను, నింకను రాజ్యాంగమునకు వలసిన విద్యావ్యవహార, వినోద, ముఖ్యతంత్రములవారినెల్లను వెంటగొనిపోయిరి. అరవదేశమున విఖ్యాతులుగ నున్న విద్వాంసులను, గాయకులను, వ్యవహారదక్షులను సంపూర్ణముగఁ దమకు సహాయపఱచుకొని సర్వసామరస్యముతో రాజ్యరక్షణము గావించిరి.

తొలుత చాళుక్యరాజ్యమునను, దర్వాత కాకతీయరాజ్యమునను సంప్రదాయ పరంపరాగతములగుచుండు గ్రంథసంచయమునుగూడఁ దమతో వారా యా రాజ్యములకుఁ గొనిపోయిరి. అట్లు కొనిపోయిన గ్రంథసంచయము తంజావూర మహనీయముగఁ బెంపొందినది. ద్రవిడదేశమున నెలకొన్న నాయకరాజులు తమ పాలనతంత్రమును దమ పూర్వులు కృష్ణదేవరాయాదులు నిర్వహించిన తీరుననే నిర్వహించిరి. శ్రీకృష్ణదేవరాయాదులు తమ పూర్వపు సంగమవంశపురాజుల తీరును, వారు తమ పూర్వపుఁ గాకతీయుల తీరును, వారు తమ పూర్వపుఁ జాళుక్యుల తీరును ననువర్తించి రాజ్యతంత్రముల సాగించిరి. విద్యానగరమున నుండి తంజావూరికిఁ జేరిన గ్రంథములలో నట్టి రాజ్యపరంపరాయాతము లనేకములున్నవి. చాళుక్యుల యభిలషితార్థచింతామణీ సంగీతచూడామణులు సామ్రాజ్యలక్ష్మీపీఠికాతంత్రము మొదలగు గ్రంథము లీ రాజ్యపారంపర్య సంప్రదాయములను వెల్లడించునవిగా గుర్తింపనగుచున్నవి. ప్రధానముగఁ బైమూడు గ్రంథములు శ్రీకృష్ణరాయల రాజ్యనీతి, రాజ్యతంత్రవిధానములకును, నట్లే తంజావూరిరాజుల రాజ్యతంత్ర రాజ్యనీతివిధానములకును సరిపోలునవిగా నిరూపణ కెక్కుచున్నవి. రాయవాచకమునను, నాముక్తమాల్యదలోను నున్న రాజ్యనీతి విషయములు చాల సామ్రాజ్యలక్ష్మీపీఠికాతంత్రమునను, నభిలషితార్థ చింతామణిలోను నున్నవి. రాయవాచకమున కృష్ణరాయల దినచర్యాది విధానమునే తంజావూరి

రాజులును బాటించిరి. నేఁటికిని మైసూరురాజ్య మా విధానమును గొంత పాటించుచున్నది. తంజావూరిలో నాట్యశాలాది నిర్మాణములు అభిలషితార్థ చింతామణి, సామ్రాజ్యలక్ష్మీపీఠికా తంత్రాది గ్రంథోక్తరీతుల ననువర్తించుచున్నవి. ఆయా విషయములనెల్ల సరిపోల్చి చూపుటకు ప్రత్యేక పరిశీలనము చాల గావలెను.

తంజావూరిలో చెవ్వప్పనాయకుడు, అచ్యుతప్పనాయకుడు ప్రధానముగ రాజ్యపాలన స్వాస్థ్యముల యందధికముగా నాదరము చూపిరి. కాని రఘునాథ, విజయరాఘవనాయకులు క్రీ.శ.1650 ప్రాంతములనుండి రాజ్యవైభవానుభవములతో పాటు దేవాలయాది నిర్మాణములు, తదుత్సవాది విశేషములు, సంస్కృతాంధ్ర ద్రవిడరచన ప్రోత్సాహములు, తత్కవిసత్కారములు, సంగీతవినోదములు, నాట్యవినోదములు, అందు నధికముగ నాంధ్రకవితాగాన నాట్యవినోదములు గలవారై యఖండానంద మనుభవించి, ప్రజాసామాన్యమును గూడ ననుభవింపఁ జేసిరి. ఏవంవిధ వినోదమునఁ బాల్గొను వారికి నిరంతరాన్నదానసత్రములను వెలయించిరి. ఆ నాఁడాంధ్ర దేశము నుండి సత్కారముఁ బడయుట కెందఱో తంజావూర్యాది స్థలములకరిగి రాజాదరము పడసి యక్కడనే నెలకొని పోయిరి. వారు రచించిన గ్రంథము లనేకములున్నవి. ఆ యా కవుల గ్రంథముల జాబితాల నిక్కడ ప్రకటించుట నా పని కాదు. అది సుందరమును గాదు. లభించిన యన్ని గ్రంథములను గూర్చి విమర్శము వెలయించుటయు నల్పవ్యవధిలో నంత సుకరము గాదు.

తంజావూరి గ్రంథములలో విశిష్టయోగ్యతగల గ్రంథములను గొన్నింటిని గూర్చి మాత్రమే, విశేషాంశములనే, క్రొత్తవానిచే యిక్కడ వివరింపఁ బూనితిని.

తంజావూరిలో రఘునాథనాయని విద్యావినోదము భోజమహారాజు విద్యావినోదమును, గృష్ణదేవరాయని విద్యావినోదమును దలపించునంతటిది. స్వయము రఘునాథరాయఁడు భోజునంత మహావిద్వాంసుఁడు. అతని కుమారుఁడు విజయరాఘవనాయకుఁడు మహారసికుఁడు. కవి. మహాదాత, గాయకుఁడు, పరమవైష్ణవుఁడు.

రాజసభలో నారితేరిన కవిచౌడప్ప రఘునాథరాయని రాజసభలో–

"నేరుతు నని మాటాడను
వారిజభవునంతవాని వశమా తంజా
వూరి రఘునాథరాయని
గారి సభను గుందవరపుఁ గవిచౌడప్పా!"

"తముఁ దామె వత్తు రర్థులు
క్రమమెఱిగిన దాతకడకు రమ్మన్నారా
కమలంబులున్న చోటికి
భ్రమరంబుల నచ్యుతేంద్రు రఘునాథనృపా."

అనెను. ఈతఁడు విజయరాఘవనాయని రసికతను మెచ్చి యాతనిపై గొన్ని పదముల రచించెను. అవి శృంగారరసగుళికలు.

రఘునాథనాయకుఁడు సంస్కృతమునఁ గూడ గొప్ప విద్వాంసుఁడు. యజ్ఞనారాయణదీక్షితు నంతవానికి కావ్యాలంకృతి నాటకాది సాహిత్యవిద్యలో గురుత్వము నెఱపినవాఁడు, అనేకులచే సంస్కృతగ్రంథములఁ గృతు లందిన వాడు, తన చరిత్రమునే యనేకులు, ఒకరే యనేక విధముల రచింపగా విని తనిసినవాఁడు నయినను దాను కవీశ్వరుఁడయి సంస్కృతమున కంటెఁ దెలుఁ గుననే పలుగ్రంథములను రచించెను. అందు రామాయణభాగము, వాల్మీకి చరిత్ర, నలచరిత్ర ముద్రితములయియున్నవి.

రఘునాథరాయఁడు సంగీతమున గొప్ప విద్వాంసుఁ డగుటచే నందుఁ గూడ గొప్ప గ్రంథము రచించెను. రచింపించెను. రఘునాథనాయని సంగీత సుధ, వేంకటమఖి చతుర్దండిప్రకాశిక నాఁటి సంగీతగ్రంథములు.

రఘునాథనాయనినాఁటి గ్రంథములెల్ల సంస్కృతాంధ్రములలో శాశ్వత ప్రతిష్ఠ గాంచదగినవే కాని తేలికపాఱు రచనవి గావు.

ఆంధ్రమునఁ జేమకూర వేంకటకవి గ్రంథములు సర్వ సహృదయవిదిత ములే కదా; ఆతఁడు

" తా రసపుష్టిమైఁ బ్రతిప
దంబును జాతియు వార్తయుం జమ

త్కారము నర్థగౌరవము
గల్గ ననేకకృతుల్ ప్రసన్న గం
భీరగతిన్ రచించి మహి మించినచో
నిక నన్యులెవ్వర
య్యా! రఘునాథభూప రసి
కాగ్రణికిం జెవి సోక జెప్పఁగాన్."

అన్నాఁడు. రఘునాథరాయఁడు కృతిగొన్న గ్రంథములలో నైషధ పారిజాతీయ మొక్కటి; తద్గ్రంథకర్త కృష్ణాధ్వరి సంస్కృతాంధ్రములలో గొప్ప కవి. ఆంధ్రమునకంటె సంస్కృతమున మఱీ గొప్పకవి. రఘునాథరాయల పేర నాతడు సంస్కృతమున నైదుగ్రంథముల రచించినాడు.

సీ॥ 'నవరస 'శ్రీరఘునాథభూపాలీయ'
నామభామాభీష్ట నాయకుండు
సరస 'నైషధపారిజాత' కాహ్వయకావ్య
వర్యా స్వయంవర వల్లభుండు
కల్యాణ 'కౌముదీకందర్ప' నాటక
కన్యోద్వహన బద్ధకంకణుండు
అమరుకాహంకారహారి భంగీక శృం
గారసంజీవనీ కాముకుండు

గీ॥ తాళచింతామణీవధూతత్పరుండు
మంచిజామాత రఘునాథమనుజనేత!
తెలియ (తెలుగు?) నైషధపారిజాతీయకృతియు
నేవు రక్కల చెల్లెలై హెచ్చు ననుచు.

క॥ పరదోషాఽ పరయోషా
పరభాషారహితభూమిపాలక ఋషికిన్
మరుదుర్వీధరదర్వీ
కరగుర్వీద్యప్రతాపఘనశేముషికిన్.

క॥ వాణీనిపుణసభాంత
ర్వాణి హితసువస్తుమహిత వాదాన్యకయు
క్పాణికిc బరగిరిc బిరుద కృ
పాణికి రఘునాథభూమిపాలాగ్రణికిన్."
-నైషధపారిజాతీయము.

వర్ణ్యవస్తువు మంచిదైనపుడు కవి యెట్టివాcడయినను వర్ణనము ప్రశస్తము గానే యుండుననుటకు రఘునాథరాయనిc గూర్చి వర్ణనలు చేసిన సంస్కృతాంధ్రకవుల రచనలన్నియు సాక్షులే - విజయవిలాసకథారచన మొక పెద, దాని కృత్యవతరణిక యొకపెదగాc ద్రాసులో దులదూcపదగిన యోగ్యతకలది రఘునాథరాయవర్ణన.

కృష్ణాధ్వరి రఘునాథరాయని గూర్చి చెప్పిన పద్యముల నుదాహరింపక విడనాడcజాలను.

ఉ॥ నైషధపారిజాతహరణద్వికథార్థసమర్థన ధ్వని
శ్లేషగతి ప్రబంధము రచించిన మా రఘునాథశౌరి సం
తోషము నందునన్ కణcకతో దశదిగ్జయ శోభితద్యశో
భూషణమైన యీ కృతికిc బూనితిcబ్రౌఢి నిరూఢి చెందగాన్.

చ॥ ఫణితి ఫణీంద్రులార! రసభావవశంవద భావనాఘణం
ఘణితమదుక్తి ధోరణులగల్గిన తప్పులు దిద్దరయ్య త
ద్గుణ మగుణంబు దూషణ మదూషణమౌ ననువారు గాక త
ద్గుణము గుణంబు దూషణముదూషణమౌ నను వారలాప్తులే?

శా॥ ఆలంకారికహర్ష మత్కృతివరంబాజానసారస్వత
శ్రీలుండౌ రఘునాథశౌరిc గని హర్షింపంగ నన్యుల్ వృథా
స్థూలంభావుకులైన కొందఱు దృఢస్యూతోష్ఠతాసూచితో
హాలంభు ల్గనకున్న నేమి కుహనాహల్లోహలుల్ లోహలుల్.

ఉ॥ ఆజి జితారికోటినతినన్వహమన్న సువర్ణదాన సం
పూజిత విప్రకోటినుతిcబొందుచు నార్గురు చక్రవర్తులన్

రాజులcc జేయునట్టి రఘునాథనృపాలుcడె చక్రవర్తియౌ
నీ జగమందు నేడు మొదలిర్వదియిద్దఱు రాజు లెన్నగన్.

ఉ॥ ఆయతకీర్తిధౌతహరిదంచలు దంజనలక్షణాభిధో
పాయదృఢప్రయోగపరిపాటి గృతుల్ రఘునాథభోజ భూ
నాయకుడందు గాక విగుణ" స్ఫుటదోషములౌ ఘుణాక్షర
న్యాయజడప్రబంధములనందు మనంగలనైన నందునే.

మ॥ స్వయముక్తాత్మకృతిస్తుతుల్ జడులు భాషామంజరిన్ లింగ ని
ర్ణయమున్ గొంత సమాసచక్రము క్రియల్‌నైఘంటుకాఖ్యల్ నిర
న్వయతం గూర్చి కవిత్వమంచు సభలన్‌వర్ణింప విద్వత్కవి
ప్రియమౌనా పదవాక్యమానసువచశ్రీమత్కృతుల్ దక్కcగాన్.
-నైషధపారిజాతీయము.

కావ్యములలో నాశ్వాసాద్యంతపద్యములున్నను వానిని బాఠకులు, శ్రోతలు నంతగా బాటించి చదువుట, వినుట యుండదు. ఈ గ్రంథమున నా కవి చవిగొల్పుచు జదువను, వినిపింపను సముత్సాహపఱుచుచుండును.

కృష్ణాధ్వరి రచించిన రఘునాథభూపాలీయాది గ్రంథము లయిదును సంస్కృతగ్రంథములు. అందు రఘునాథభూపాలీయ మలంకారశాస్త్రగ్రంథము. దాని వ్యాఖ్యాన మొక యతీశ్వరుc డానాcడే రచించినాడు. కడమగ్రంథము లిప్పుడు గానరావు. సంస్కృతమున గొప్ప గ్రంథకర్తయగు కృష్ణాధ్వరి రఘునాథ రాయcc డాంధ్రకవిత నధికముగా నభిమానించునని యాతని వినోదపఱుచుటకై పరమోత్సుకతతోc బ్రయత్నించి యతిప్రౌఢముగా నాంధ్రకవితారచన నలవఱుచుకొని యీ గ్రంథము రచించినాcడు. నైషధపారిజాతీయ మాముక్తమాల్యదరచనమును దలcపించుచు గూఢప్రౌఢశబ్దార్థశ్లేషాలంకార చిత్రితమై యొప్పారుచున్నది. రాఘవపాండవీయము, హరిశ్చంద్రనలోపాఖ్యానము నీ గ్రంథమునకు మేలుబంతులే యయినను నా గ్రంథముల నీతcడు గ్రంథరచనోపక్రమమున మాత్రమే యనుకరించె ననవచ్చును. కవి తానే దీనిని వ్యాఖ్యానించి యుండిన బాగుగానుండెడిది. పెక్కేండ్లకు ముందే యథామాతృకముగా దీని ప్రతి వ్రాయించుకొని సవ్యాఖ్యానముగాc బ్రకటింప నుత్సాహపడితిని గాని

పెక్కుచోట్ల శ్లేషచమత్కృతి దుర్గ్రహముగా నుండుటచే నింతదాఁక దానిని ముగింపఁజాలకుంటిని. కుదిరినంతవఱకయిన లఘుటీక గూర్చి ప్రకటించ వలెను. దీనిని బ్రకటించుటలో కృష్ణాధ్వరి మీఁది గౌరవము గాని, శ్లేషకవిత మీఁది యాదరము గాని, యముద్రితగ్రంథ ప్రకటనముమీఁది యౌత్సుక్యము గాని కారణములుగావు. మహనీయుఁడయిన రఘునాథరాయలమీఁది యాదరమే యేతద్గ్రంథప్రకటనమునకు నన్నుత్సాహపఱుచుచున్నది.

ఈతని గ్రంథములోని రచనాచమత్కారములు గొన్ని చూపుదును. కథారంభ పద్యము.

మ॥ "బలభద్రస్థితి వైరివర్గము నడంపన్ సత్యభామాదు లు
జ్జ్వలసామ్రాజ్యభరార్హతం దెలుపఁగా శౌర్యాఖ్యచే మాగధా
దులు దీర్ణానతవర్ణతం జెలఁగ సంతోషశ్రిత శ్రీకుఁడౌ
నలభూమీపతి గారవించె మహినిన్ న్యాయంబునన్ రుక్మిణిన్.

–నైషధపారిజాతీయము.

ఇందు నాల్గవ చరణమున రెండర్థములకు సరిపడునట్లు నల – అల, 'న్యా'యతి కలదు. బలభద్ర, సత్యభామాదులు, శౌర్యాఖ్య, మాగధాదులు దీర్ణానత వర్ణతన్, ఔనలభూమీపతి, మహినిన్ రుక్మిణిన్ – పదములు రెండర్థము లకు గుదురుపడునవి.

క॥ ఆకార నున్న మణిగిరి
రాకన్నెల చూచు సొంపు రా భీమజన
వ్యాకుల నప్పురి బుణ్య
శ్లోకుఁడు గనె భావికుశలసూచిశకునుఁడై.

సీ॥ పాదమూనినచోటఁ బగడాలధగధగ
లింపారఁ బుటికెల నింపవచ్చుఁ
గేలుసోకినచోటఁ గెంపులచకచకల్
సొంపార గంపల ముంపవచ్చు
నంగమంటినచోట నపరంజిధళధళల్
పొంగార గాదెలఁ బోయవచ్చు

నిక్కిచూచినచోట నీలాలనిగనిగల్
నిండారఁగణజాల నింపవచ్చు

గీ॥ నాత్మభూయత్న రుచితమోహారివిభవ
పూరమాటోప మేజాడఁబొగడువాఁడ
నింద్రజాలంబొ మాయయో యెఱుఁగనైనఁ
జూడఁ గలుగుట మామక సుకృతఫలము.

సీ॥ వచ్చినాఁడమ్మ నీ వాంఛితాఖిలపూర్తి
వైభవంబున దేవవల్లభుండు
చనుదెంచెనమ్మ నీ సౌభాగ్య మలరింప
వరతేజమున హవ్యవాహనుండు
వేంచేసెనమ్మ నీ వేడుక లీడేర
దాక్షిణ్యవర్తన ధర్మరాజు
ప్రాపించెనమ్మ నీ భాగ్యంబు ఫలియింప
రత్నసంపద సింధురాజటంచు

గీ॥ వలపు దెలియంగ నమరశంభళులు దెలుప
విప్రవరసూక్తి విధృతజీవితఫలంబు
న్యాయవర్తనమహిమ నన్నలవిభుండు
హరిదయావహమూర్తి గా కన్యుఁడగునె?

రఘునాథరాయని కుమారుఁడు విజయరాఘవనాయఁడు చాల రసికుఁడు సంగీతసాహిత్యకవితాగాననాట్యనాటక వినోదపరాయణుఁడగుటే కాక వైష్ణవమతైకాభిమానమహితుఁడై విష్ణ్వాలయములకే విశేషవైభవము గల్పించుచు వెలుగొందెను. అతని కాలమున నంధ్రకవితారచన శృంగారరసైక మయమై పలుచబడినది. గుజలీపుస్తకములలోఁ బెద్దిదాసుచరిత్రమని యొక లఘుగ్రంథము ముద్రితమై దొరకుచున్నది. అందుఁ గథానాయకుఁడు పెద్దిదాసు. విజయరాఘవనాయకుని నాఁటివాడు. అతఁడు మహాభక్తుఁడు. విజయరాఘవనాయకుఁ డాతని గేలిచేసి యాతని వేషమును గాడిదకుఁ గల్పించి యూరేగించి యవమానపఱిచెనఁట! ఆ భక్తుని సంకీర్తనములును, రాయని యవకరపుఁజెయ్దమును నా లఘుకృతిలోఁ గాననగును. భక్తునొకని

నట్లు పరిహసించుట చేతనే యాతని రాజ్యమంతరించెనని కూడ నందున్నట్లు న్నది. అందెంత సత్యముగలదో కాని యాతఁడు సంగీతసాహిత్యాదిలోలుఁ డగుట తథ్యము. ఆతని నాఁటికృతులు చాల యక్షగానములు. రఘునాథ నాయనిచరిత్రము నాతఁడు ద్విపదకావ్యముగా రచించినాఁడు. ఇప్పటి కించుమించుగా నలువదియేండ్లకు ముందు నే నా యా గ్రంథములెల్లను బరిశీలించి ముఖ్యాంశములు వ్రాసికొనివచ్చితిని. రఘునాథరాయచరిత్ర మందలి తంజావూరిరాచనగరి వర్ణనాదులఁబట్టి యా యా రాజసభాది స్థానములను గుర్తించి యప్పుడక్కడి పండితులకుఁ బ్రజలకు వాని నెఱుకపఱిచి వచ్చితిని. తంజావూరియాంధ్రరాజులచరిత్రమని పుస్తకముగా నాయా విషయముల సంగ్రహమును బ్రకటించితిని. అప్పటి సేకరణములోని విశేషము లనే యిందు వెల్లడించుచున్నాను, విజయరాఘవనాయని నాఁటి యక్షగానము లలో రచనాచమత్కృతులు కొన్ని:

విజయరాఘవు పట్టంపుకవియైన కామర్సు వేంకటపతి సోమయాజి 'విజయరాఘవ చంద్రికావిహారము'న –

చోళదేశవర్ణన

కవులెంతురు చోళదేశము, దివ్య
　　కావేరీవారి ప్రకాశము;
నవరత్నములున్న కోశము, సుర
　　నాయకరాజసంకాశము;
చెఱకురాజనంపుబైరులు, కాపు
　　సేమము గలిగిన యూరులు;
తిరముగాఁ బ్రవహించు నేఱులు, చోళ
　　దేశంబున వెయ్యాఱులు;

ఆ రాజ్యరమకు మంజీరము, అల్ల
　　అమరావతికన్న సారము;
భూరమణీమణిహారము, తంజ
　　పురము సంపదలకొటారము;

నవరత్నంబుల పేటలు, దివ్య
　　నారికేళంబుల తోటలు,
సవరణ సేసినకోటలు, వీట
　　సరసులు నూఱాఱుకోటులు;
వలరాయనిమీఁది యేలలు, చాల
　　వర్ణింప నేర్చినబాలలు,
విలసిల్లునాటకశాలలు, అందు
　　వింతవింతలు కృష్ణలీలలు,
పరులను గెల్చినపౌజులు, మెచ్చ
　　పాలింతురు దినరాజులు,
సరిలేని విద్యాభోజులు, వీట
　　సడిసన్న రాజాధిరాజులు.

ఆ రాజధానికి రాజై రాజిల్లు రాజచంద్రుని నాతని పట్టంపుఁగవి యేమని కొనియాడుచున్నాడు –

శ్రీరామగోపాల సేవచేఁ జాల
　　బేరుగాంచినతేడు బిరుదుమన్నీఁడు
లక్షణాన్వితుఁడు కళావతీసుతుఁడు
　　దాక్షిణ్యశాలి యుత్తమరాజమౌళి
రణముల జగజెట్టి రఘునాథుపట్టి
　　గుణరత్నములదీవి గురుజనసేవి
బహుదానపరుఁడు భూపాలశేఖరుఁడు
　　సహజకీర్తిస్ఫూర్తి సర్వజ్ఞమూర్తి
రతులకు రతిరాజు రాజుల రాజు
　　వితరణగుణహారి విభవజంభారి
జగదుపకారి వైష్ణవమతోద్ధారి
　　తగవుల వీడు చింతామణి జోడు

నీతికి మాంధాత నియమసంధాత
జాతివార్తల మేటి శౌర్యకిరీటి
సరసుండు నెఱజాణ చక్కనివాఁడు
పరమవైష్ణవుల చేపట్టుకుంచంబు
బాహువిక్రమశాలి భరతకోవిదుఁడు
సాహిత్యభోజుండు సంగీతవేది
కోరినవారికిఁ గొంగుబంగారు
చేరువమేరు వాశ్రితవర్గమునకుఁ
బేదలపాలింటి పెన్నిధానంబు
వేదకోవిదులకు వెలలేని సొమ్ము
పలికి బొంకనిరాజు పరమవివేకి
నిలుకడ గలవాఁడు నిత్యాన్నదాత
పట్టభద్రుండు కృపాసముద్రుండు
చుట్టలసురభి రాజుల మేలుబంతి
వరశరణాగతవజ్రపంజరుఁడు
నరులపాలింటి పున్నమచందమామ
ఏకవీరుండు జగదేకవదాన్యుఁ
డాకారమన్మథుం డసమసాహసుఁడు
మానినీనూతనమకరకేతనుఁడు
భానుసమానుండు పరతత్త్వవేది
అనుమానమునఁ దేలి యా వనమాలి
చనవరి యిల్లాలిచనుబాలుఁగోలి
పెరిగినయన్న గోభిలమౌనికన్న
పరతత్త్వరుచి గన్నపాయంపుమిన్న
విజయరాఘవశౌరి విద్యావిహారి
భుజబల కంసారి పూర్ణసంహారి

అన్నిట నవధాని యా రాజధాని
మన్ననతో నేలు మహి మేలుమేలు.

(విజయరాఘవనాయకుని విప్రనారాయణచరిత్రమున పదము)

హరిభక్తి దప్పింతునా నాపై
ననురక్తి రప్పింతునా
పరమపావను డీ బాపడు నిను జూచి
పడసేవాడు గాడే, ఓ చెల్లె
విటునిగా నడపింతునా దాసరి
నటనలు విడిపింతునా
కటకట నీ కింత గర్వ మేలె వీ
డటువంటివాడు గాడె, ఓ చెల్లె
గీతము వినిపింతునా మరునికై
జీతము కెనయింతునా
నాతిరో హరికీర్తనకు జొక్కువాడు
నీ గీతమునకు దక్కునా, ఓ చెల్లె
అడపము గట్టింతునా వానిచే
మడుపులు చుట్టింతునా
గడిదేరి పలికేవు కైంకర్యపరుడు నీ
కడపము గట్టునట్టె, ఓ చెల్లె.

(పదం, కాంభోజరాగం, ఆటతాళం)

చదివేది దివ్యప్రబంధము, మాకు
సైపదు సంసారబంధము
ఎదనుండు హరిభక్తిగంధము యో
గీంద్రులతోనె సంబంధము
మాతో మీ కేటి మాటలు, విన
బాతి గాదు మీ పాటలు

భవనంబులు పర్ణశాలలు మా
పాటలు హరిమీదియేలలు
తగిలి యుందురు ముక్తిబాలలు మా
దాపురములు హరిలీలలు
మేమున్నయూరు శ్రీద్వారకా ముక్తి
కామినిపైనె మా కోరిక
స్వామిభక్తి మాకు చేరికె వో
కోమలి నీ వికవూరకే, పోవే
ఆలుబిడ్డల పొందు కోరము మేము
కోరేది హరిభక్తిసారము
నీలవర్ణుని గొల్చువారము మీ
యాలాపములు విన నేరము
పరమాన్నములు కాయగూరలు మా
పరిధానములు నారచీరలు
సరిపోవు మీకు మా మేరలు మా
సంగడివాండ్రు పకీరులు.

కII శంపాలతలు నటింపఁగఁ
దుంపురులై చినుకులగుచుఁ దోరణలగుచున్
జంపకగంధి చలింపఁగ
నంపాజాలంపువాన లప్పుడు గురిసెన్.

తాటోటు బాపనదాసరి నీవు
తోటపనుల్ సేసి తొడు సెల్ల మాని
వోరి మా యింటి కెందుండి వచ్చితివి
వూరకె నా బిడ్డ యోజలు చెఱిచి.

తిరుమణి యేమి? నీ తిరుచూర్ణ మేమి?
కరమున శంఖచక్రంబు లివేమి?

దాసరితనమేమి? తావడా లేమి?
నీ సరివారెల్ల నినుఁ జూచి నవ్వ
జడియక రావణసన్యాసి వగుచు
నడుచుచున్నావు వైష్ణవుఁడవా నీవు?

(పదం, కాంభోజ, ఆటతాళం)

ద్రావిడవేదము చదివినవాడనే
ధవళాక్షి! నీవు నన్నేలవే
ద్రావిడవేదము చదివినవారు కం
దర్పునివేదము విందురా?
అంగన మన్నారు దళిగె ప్రసాదమౌ
పొంగలి చవిగొన్నవాడనే
పొంగలి చవిగొన్న వానికి వనితల
యెంగిలి చవి మనసాయనా?
ఆ రామకైంకర్య మాచరించి మ
న్నారుని గొలిచినవాడనే
ఆ రామకైంకర్య మాచరించువాని
కీ రామకైంకర్య మేలయా?
చెలువ! మన్నారుపాదతులసీదళములు
శిరసున ధరియించువాడనే
తులసీదళములు ధరియించువానికి
తొలుతటి ముడిపువ్వు లేలయా?

(పదం, శంకరాభరణం)

అయ్యయ్యో! నిను నమ్మవచ్చునా, యి
ట్లైతే దైవము మెచ్చునా?
నీయందు వేఱు లేనైతిగా, నేను
నిను నమ్మి యిటు బేలైతిగా

బాసలిచ్చి తప్ప నంటివి, నా
భావమెల్ల జూఱగొంటివి
ఆస జూపి వద్ద నుంటివి, ఇంత
దోసమేల కట్టుకొంటివి?
బెల్లించి యెడబాయ నంటివి, అట్టు
తల్లిమాటలే వింటివి?
తెల్లనివెల్లా పాలౌనా, ఇట్లు
కల్లలాడితే మేలౌనా?

* * *

పై విధమున విజయరాఘవనాయని రచనలు, నాఁటి కవయిత్రు లయు, కవులయు రచనలు, పలుకుపొంకము, సౌలభ్యము, మృదుపాకము గలవయినను, బరువముదప్పిన పచ్చిశృంగారముతో గోవాళ్లను ద్రోవ దప్పించునవిగానున్నవి. యక్షగానములే యందనేకములు. తంజావూరి నాటకశాలలో నా యక్షగానములను బిరుదుపాత్ర లభినయించువారు. విజయరాఘవనాయనిగా రా యా బిరుదుపాత్రలకు శారదాధ్వజాదు లొసఁగి సత్కరించుచుండువారు. అంతయు నాటలమయము, పాటలమయముగా విజయరాఘవనాయని గోష్ఠి విరాజిల్లినది. నాయకరాజులతర్వాత వచ్చిన మహారాష్ట్రరాజులుగూడ నీ యక్షగానవినోదములలో మునిఁగి తేలుచుండు వారనుటకు వారి నాళ్ళలోఁ గూడ వెలసిన యక్షగానము లనేకములు తార్కాణ.

రఘునాథరాయలవారి నాఁటిరచనలే తంజావూరి రచనలలోఁ బ్రశస్త మయినవి. రఘునాథరాయలు, చేమకూర వేంకటకవి, కట్టా వరదరాజు, ముకుందయోగి, కృష్ణాధ్వరి, చెంగల్వ కాళయ, చల్లపల్లి రంగన్న, వేంకటాచల విలాసకర్త మొదలగువారి రచనలు తంజాపురాంధ్రరచనలలో మెచ్చఁదగినవి.

అన్నింటిలోను కట్టా వరదరాజు ద్విపదరామాయణము[1] ముద్రితమై ముందర వెలయఁదగినది. ఆతని శ్రీరంగమాహాత్మ్య మొక్కటే ముద్రితమయినది పరమభాగవతచరిత్రము సమగ్రముగా దొరకకున్నను ముద్రింపఁ దగినదే.

1. తంజావూరిలైబ్రరీ వారిచేవలనే దీనిని ముద్రించిరి.

కవితలంటే విసువు పుట్టే
కాలమున శృంగార రచనల
దవిలి యేదే వ్రాయబోతే
తారుమారులవున్
అవకతవకలు నౌ నికేమో
అవును, గావున రసిక యువకులు
సవరణలతో సయిరణలతో
జదువుకొనవలయున్.

(భారతి
జనవరి, 1949)
తమీగడ తఱకలు 1951
సారస్వతావ్యాసాలు సం॥1197)

దేశిసాహితిసొంపు

వీరపదాలు

దేశికవితలంటే ఎలాటివనగా, ఆ కవితలోని భాష ప్రజాసామాన్యము మాటాడుకొనేదిగా ఉంటుంది. అందులో ముఖపద్మాలు, బాహుపరిఘలు మొదలయిన ప్రౌఢకవుల యుపమానములు ఇంకా రూపకాద్యలంకారములు ఉండవు. సామాన్యప్రజల యెఱుకలో ఉండేవే దృష్టాంతాలు, అర్థాంతర్యాసాలు, ఉపమానాలు ఉంటవి. ప్రౌఢదీర్ఘములుగా సమాసాలూ వాక్యాలూ ఉండవు. వాక్యాలలో కారకాన్వయకౌటిల్యమూ ఉండదు. ఛందస్సు సామాన్యజనులు సులువుగా గుర్తించి పాడదగిన ద్విపదలు, మంజరులు తద్వికారములునై ఉంటుంది. అక్షరగణనియమం సరిగా ఉండకపోయినా తాళలయాన్వితంగా పాటసాగుతుంది. భాష, ఛందస్సు ఇట్టిదిగా ఉండడమేకాక అందులోని వర్ణ్య వస్తువుకూడా ప్రాయికముగా ఆయా దేశ ప్రజలకు సంబంధించినదిగానే ఉంటుంది. అందులో, నాటి ప్రజల అలవాట్లు, సంప్రదాయములు, ఎఱుకలు, ప్రతిఫలిస్తూ ఉంటవి. అవి ప్రాయికముగా ప్రజాసామాన్యము నాలుకలమీద నాట్యమాడేవిగానే ఉంటవి. బాలకులపాటలు, బిచ్చగాండ్రపాటలు, పనిపాటుల వారిపాటలు, అంటే దంపుడుపాటలు, వడుకుపాటలు, ఊడ్పుపాటలు, కోతపాటలు, నూర్పిడిపాటలు వగైరాలు, స్త్రీలపాటలు, ఈ వగైరాలన్నీ దేశిరచనలే అనవలెను. అందులో తెలుగున ప్రాచీనకాలమునాటివి – దేశిరచన లనదగినవి – వీరకథాగేయములు కూడా కొన్ని ఉన్నవి. అవి యేవేవి అంటే ప్రధానముగా ఈ క్రింది వాటిని పేర్కొనవలసి ఉంటుంది.

కాటమరాజుకథ, పల్నాటివీరులకథ, కుమారరామునికథ, దేసింగు రాజుకథ, బొబ్బిలికథ, ఆరెమరాఠీలకథ, సర్వాయపాపనికథ, కామమ్మకథ, ఇత్యాదులు. వీటిలో ఆద్యంతములలో పేర్కొన్నకథలు, కాటమరాజుకథ, కామమ్మకథల మీద నాకు మక్కువ ఎక్కువ. కాటమరాజుకథలో పదమూడవ శతాబ్ధినాటి కడప, కర్నూలు, నెల్లూరు మండలముల ప్రజాజీవితము ప్రతిఫలిస్తూ ఉంటుంది. ఎఱ్ఱగొండలు, వెల్లగొండలు అని పేర్కొనబడే తూర్పు కనుమల ప్రాంతములలో ఆనాడు జరిగిన యుద్ధములయొక్క యుద్ధవీరుల

యొక్కచరిత్రలు మనోహరముగా కాటమరాజుచరిత్రలో వర్ణితములయి యున్నవి. కాటమరాజుకథను తొలుత శ్రీనాథుడే ద్విపదగా రచించినాడట... దాని ననుసరించి కొన్ని యవాంతరకథలుచేర్చి మరికొందరు దేశికవులు దానిని పెంపొందించినారు. బట్టురాయబారము, ఖడ్గతిక్కనవిఱుగు, ఎఱ్ఱగడ్డ పాటిపోరాట, బొల్లియావుయుద్ధము, కోటపాటి తాటిచెట్టుకథ, అగుమంచి కథ, ఇత్యాది విభాగములతో కాటమరాజుకథ మహావిపులముగా ఉన్నది. 'ఈగంత' కథ యేనుగంత గ్రంథము' అని దీనిని గూర్చి బ్రౌనుదొర పరిహాసము చేసినాడు. ఈ గ్రంథరచనమంతా మంజరీరచనలో ఉన్నది. ఎఱ్ఱగొల్లలు, పిచ్చుకుంట్లు, ఈ గ్రంథమును పల్లెటూళ్ళలో రాత్రివేళలందు వాద్యాభినయము లతో గ్రామసావిళ్ళదగ్గర ప్రజలకు వినిపించడం సంప్రదాయము. దీని కథాసారమును ప్రాచీనులే వ్రాసిఉంచిన దానిని ముందువినిపించి, కాటమరాజు కథారచనలోని పట్టులను కొన్నింటిని తర్వాత వినిపిస్తాను.

"నల్లసిద్ధిదేవచోడమహారాజు నెల్లూరి పట్టణమందు పృథివిసామ్రాజ్యం చేయుచుండగాను వారివద్ద రణతిక్కన అనే బ్రాహ్మణుడు సేనాధిపతి. ఇతనికే ఖడ్గతిక్కన అనిన్నీ పేరుకలదు. అప్పుడు యాదవవంశోద్భవుండైన కాటమరాజు, ఇతని పినతండ్రి పోలమరాజు, ఈ పోలమరాజు కుమారుడు కరి ఆవులరాజు, వీరులంకమల, పాలకొండ, నల్లమల మొదలయిన పర్వత ప్రదేశమందు అరణ్యములో పచ్చికపట్లను తమయొక్క విస్తారమయిన గోగణమును సంరక్షణ చేసుకుంటూ నల్లసిద్ధిచోళ మహారాజుకు పుల్లరిగా తమ యావులమందలో పుట్టే కోడెదూడలు కొన్ని యిచ్చేటట్టున్ను వారు వారి దేశమందు ఉండే కసపు పచ్చికపట్లు తమ గోగ్రాసముగా యిచ్చేటట్టుగాను నిర్ణయించుకొని కొంతసైన్యము అందలాలు ఏనుగులతో ప్రసిద్ధిగా ఉండేవారు. ఇట్లు సాగుతూఉండగా కొన్ని దినములకు క్షామదశవల్లను గ్రామములో అక్కడక్కడ ఉన్న సస్యాదులను గోవులు మనుష్యుల అంకిలో నిలువక మేసేవి, గనుక ప్రజలు రాజుతో యీ సంగతి విజ్ఞాపనము చేసికొన్నంతట 'బీడు పచ్చికపట్లు యావత్తూ కాటమరాజువారి గోవులు మేపుకునేలాగున మాట యిచ్చినాము. పైర్లు వారు మేపుకోవలసిందికాదు. ఐనా గానీ మీరు పైరు జాగ్రత్త చేసికొనేది 'అని సెలవు యిచ్చి 'పైర్లు మేపవద్దు. బీడుపచ్చిక మేపుకునేది' అని

కాటమరాజుగారికిన్ని వ్రాసి పంపించిరి. ఇదిగాక కాటమరాజువారి విస్తారమైన గోగణం అరణ్యప్రదేశమందు తిరిగిమేస్తూఉండేది. అది మొదలు కొని గోసంరక్షణార్థమై కాటమరాజువారు అగుపడ్డచోట క్రూరమృగములను వారే వధచేస్తూ వచ్చేవారు. కనుక అరణ్యమందు గోగణ గోపాలకులయొక్క సమ్మర్దము విస్తారమైనందున సాధారణముగా మృగములు అరణ్యమందు నిలవకపోతూ వచ్చినందుననున్ను, మృగవధ చేసుకుని తత్సామాన్యవృత్తివల్లను జీవనోపాయం కనివుండే కిరాతకులకు జీవనహాని అయినందుననున్ను ఆ కిరాతకులు కాటమరాజునందు ద్వేషులై వుండిరి. ఇదిగాక నల్లసిద్ధిరాజుగారు ఉంచుకొన్న బోగముదానివద్ద ఒక పెంపుడు చిలుక ఒకనాటికాలమందు మేడలోనుండి తప్పించుకొని వెలుపలికివచ్చి అరణ్యశుకములనుకూడి కాటమరాజుగారి ఆవులమందలకు సామీప్యములకు సమూహముగావచ్చి ధ్వనులుచేయగా కాటమరాజు పినతండ్రియయిన పోలమరాజు దానిని చంపెను. ఆ సంగతి కిరాతకులు బోగముదాని ద్వారా నల్లసిద్ధి రాజుకు వినికిడి చేయించిరి. నల్లసిద్ధిరాజుగారి ఆజ్ఞచొప్పున కిరాతకులు కాటమ రాజుగారి గోవులను చంపసాగిరి. కాటమరాజుగారు కిరాతకులను చంపిరి. తగవు పెరిగెను. ఈ యుద్ధములోనే ఖడ్గతిక్కన నిహతుడయ్యెను. కాటమరాజు వారు ఓడిపోయిరి. కాటమరాజువారి సైన్యములు, హతశేషులైన యాదవులు యుద్ధరంగమునందు తమతోకూడా నిలిచి శత్రువులను హతంచేసినవారియొక్క రూపములు, శిలలపైన చెక్కించిరి. 'వీరులు' అనే ప్రతిమలు మజుకూరు, సగిలిపాయకట్టు, మౌజేకుందగిరి అనే గ్రామములలో ఉన్నవి. ఇదిగాక యుద్ధరంగంబున ప్రాణములువదలి సద్గతినిబొందిన గోగణములయొక్క శిరస్సులు శృంగములతోకూడా తీసుకువచ్చినవాటికి పసుపురాచి సాంబ్రాణి ధూపములిచ్చి యిండ్లలో వుంచుకొనిరి. ఇదిగాక గోవుల అకృత్యాలు శిలలపైన చెక్కించి అవిన్నీ ఒక స్థలమందు వుంచి పూజలు చేస్తున్నారు. ఆ శిలలు వుంచిన స్థలాలకు జనులు 'ఆవులమాలె' యని చెప్పుకుంటున్నారు. ఆ ఆవుల మాలె యొద్ద పైన చెప్పిన యాదవులు ప్రతి సంవత్సరమున్ను తాళమేళములు, పంబజోళ్ళు, జమిడికెలు, పురవనమద్దెళలు, యీ వాద్యములతో సంభ్రమం చేస్తున్నారు. ఈ సంభ్రమాలకు వారి సంబంధికులైన వారున్నూ, వారు కట్టించిన

ఆవులమాలెయందు అభిమానం కలవారున్నూ ఎంతదూరములో వున్నాగానీ వస్తున్నారు. వారిని కాటమరాజుగారి పాంగ్యస్తులు అని వాడుతున్నారు. అలా గంటిపాంగ్యస్తులు అయినవారికి పసుపుగుడ్డను అక్షతలుకట్టి సంభ్రమంచేసే దినం నిర్ణయంచెప్పి పంపించి వారిని పిలువనంపించి అందరు గుంపుకూడి ఆవులమాలెవద్ద సంభ్రమం చేశేటప్పుడు పాంగ్యస్తులైన వారిలో వారివారికి యల్లఎద్దుతానకం, బొల్లెద్దుతానకం, బోడియెద్దుతానకం, కర్రెద్దుతానకం, పైడెద్దుతానకం – యీ ప్రకారం అనేక తానకముల నిర్ణయంకలవు. తానకసంజ్ఞ యేమంటే యల్లెద్దుతానకం వాడు ఆవులమాలెవద్దకి వచ్చి నిలిచివున్నప్పుడు పంబవారు అంటే పంబజోడు వాయించేవాడు యల్లెద్దుపరాక్రమం తలచి ఆ ఆవుమేయుట, నీరు త్రాగుట, గంతులువేయుట, అక్కడక్కడ తిరుగుట తుదకు యుద్ధరంగంలో చేసిన పరాక్రమం సహాగా పొగడితే ఆ తానకల అనుసరించి వుండే వానికి శివం వచ్చేది కలదు. ఈ ప్రకారం కొంతసేపు తానకం పాడిన తర్వాత కాటమరాజు వారి పరాక్రమమున్నూ 'సుద్దులు' అని పాడేదికలదు. ఈ సంభ్రమంలోను ఇండ్లవద్ద ఉండే శృంగసహితములైన గోశిరస్సులు తెచ్చి మాలెలో వుంచేది కలదు. అందుకు సెనగలు, పెసలు నానవేసి శిలలపైన ఆవుల ప్రతిమలకున్నూ దేవరావులు అనే గోశిరస్సులకున్నూ నైవేద్యం చెల్లించి ఆ పణ్యారం బ్రతికివున్న గోవులకు తినిపించేదికలదు. ఈ సంభ్రమము పేరు 'ఆవులపఱపు' అని వాడుకునేవారు.

కాటమరాజు కథారచన సుద్దులలోని దేశికవితసొంపు కొంత వినిపిస్తున్నాను.

నెల్లూరి నలసిద్ధిరాజు పంపగా రాయబారపు బట్టు కాటమరాజువారి దగ్గరకు వచ్చి పలికేవిధం –

"బ్రహ్మాయువగు నీకు పార్థివేంద్రుండ!
ప్రాలుగలరాజవు బహుకీర్తి దీప!
ఘనరిపుసంహార! కాటమరాజ!
ఒడబడినపుల్లరి యొప్పనియకుంట

అపకీర్తి చేకూర్చు నడుగుదాటకుము
అలనాడు యాదవులందరు మీరు
నెల్లూరి కేతెంచి నిందుకొల్వునను
సిద్ధిరాజునుజూచి చేదోయి మోడ్చి
అర్థింపవేడిన దది జ్ఞప్తి లేదొ?
అమరావతీభూమి యాదవుల మేము
పదమూడులక్షల పసి గలదు మాకు
అడిగినపుల్లరి యర్పించగలము
పూరికి నీళ్ళకు భూము లియ్యండి
పూరికి నీళ్ళకు పుల్లరిగాను
మాడలు కోడెలు మఱి పసుల్ వేయి
యేడాదినాటికి నిచ్చెద మనుచు
నాడితి రామితి యట్టె తప్పితిరి
'గొల్లలపుల్లరి గోగుపై బచ్చ'
లన్నట్లు చేసితి రది ధర్మమౌనె?
మాటాడితప్పుట మర్యాదగాదు
పుల్లరి యీయక పోరాదు మీకు
మారాజు నలసిద్ధి మహనీయగుణుఁడు
మారాజుతోపొందు మంచిది మీకు
మీకు హితం బెంచి మించిపోకుండ
కర్జంబు తెలిపితి కాటమరాజ!
అదియిది యర్థించు నర్థినిగాను
పల్లవాధీశ్వరుభట్టను నేను'

అనగా

ఆ మాటలకు రాజు అగ్నియై మండి
కొమరుబంగరుభట్టు గొబ్బున బిల్చి
పలికించె నల్లసిద్ధిభట్టుతో నిట్టు
'పల్లెత్తి పుల్లరన్ పలుకాడెదేని
కదువేగ మిటనుండి కదలిపొమ్మనుమి'

భట్టుభట్టును గలసి భాషించి రపుడు
రాయబారము చాలు రసికుడై వినుము
వెట్టివజీర! ఓ వెట్టి భట్టుండ!
ఉలవ లెత్తుమటన్న నూళ్ళులడిగెదవె?
భూనాథునెదుటను పుల్లరడిగెదవె
కూడొగుడ్డో వేడుకొనకుండ నీవు
పుల్ల రేడది తిరిగి మళ్ళి వోయి
పుల్లరంటే కాసు పుట్ట దిచ్చోట
నీ మాట మీ రాజు కెరిగింపుమోయి.
సమ్మతిగాదేని సరగ మా మీద
దండెత్తి మీ రాజు తరలి రమ్మనుము
కాక మా పెద్దల కదుయుద్ధమహిమ
చెవికెక్కియుండు మీ క్షితిపాలకునకు
కదనమంటె వీడు కదలలేడేమొ
తరచుమాటలు మాని దాగుండు మనుము.

అని తెగడగా మరల రాయబారపు భట్టు పలికేవిధం –

అడవుల దిరిగెడి యాదవులకును
ఎక్కడి పౌరుషం? బెక్కడి తెగువ?
గుఱ్ఱాన్ని పొడగన్న గుట్టలబట్టు
వెట్టిగొల్లబిరుదులు వేలవిధాలు
ఏకులతో బాకు లెంతచేసినను
నాటగా నోపునా నలియౌనెకాని
పచ్చిపాలనుత్రాగు పసులకాపరులు
మచ్చరించెద రంతె మరియేమికలదు?
పేదవానికోపము పెదవులతీట
చేతగా దతడేమి చేయంగగలఁడు
ఎంతగాత్రంబైన యెద్దులపోజుతా
నేనుగుగుంపుపై నెదిరింపఁగలదె?

చెప్పట్టకత్తులు చెంపసిగలేగాని
చెనకి పోరాడ మీచేతనేమౌను?
పారిపోయేయావు పట్టిపితుకనెకాని
చేరిపోరాడ మీచేత నే మౌను?
ఎఱ్ఱమట్టిపొర్లాట యెఱుగుదురో యేమొ
ఎఱ్ఱలు పొర్లవా యెఱ్ఱమట్టిలోను
సామునేర్చినవారు జగడంబు చేస్తేను
ఇమ్మహి ప్రజకెల్ల నెక్కడిది బ్రదుకు?
తలపొలములో బెదరి నిలుచుగోవులను
కలవిలుచుకొన్నట్టుకాదు కయ్యంబు
అలకాపరివి నీ వాపాలు నీళ్ళూ
కలిపిత్రాగేతీరు కాదుకయ్యంబు
ముఱ్ఱుపాలును జొన్నముద్దలు మెసగి
గఱ్ఱున త్రేపినట్లు కాదు కయ్యంబు
చేసిన వెన్నను సెగపొంతగాచి
కాసుల కమ్ముట కాదు కయ్యంబు
గోవులపాలెల్ల కుండలలోనించి
కావళ్ళ నమ్మినట్లు కాదు కయ్యంబు.

ఇందుకు గతియేమి యెఱిగింపుమనగ
ప్రఖ్యాతిగల మంత్రి బ్రహ్మరుద్రయ్య
ధీరుఁడు తానిట్లు తెగి విన్నవించె
చింతింప నీకేల క్షితితలేశ్వరుడ?
చలము కొని పోరాడ చనుదెంచునపుడు
కులవివేచన చేయకూడ దెవ్వరికి
పఱతికై రాముడు పాపి రావణుని
రణమున ద్రుంచడా బ్రాహ్మణుండనక
వైరి నెక్కువ యనక వధియింపవలెను
యెదిరింపవలెగాని వర్ణింపఁ దగదు

ఇట్టుండె ధర్మం బికేలచింతింప
నట్లుగాకయు బ్రహ్మహత్యకై నీవు
వెనుకాడెదవ యేని విను చల్లపిన్న!
నే జేతు నతనితో నిలిచి యుద్ధంబు
బ్రాహ్మడాతడు శివబ్రాహ్మడ యేను
బ్రాహ్మణులము పోరుపాటింపఁగలము
ఆతనిని నే జంపుటది ముఖ్యమాయె
అతనిచేతనె నేను హతమైతినేని
యాదవకులనాథ! యది వినవయ్య
గోదావఱియు నెఱ్ఱగొండ లెన్నాళ్లు
ఆదిత్యచంద్రులు నవని యెన్నాళ్లు
అన్నాళ్లు వెలయు నీ యాదవకథయు
గలియుగమెన్నాళ్లు గలుగు నన్నాళ్లు
అవనిలో నా పేరు నది నిల్చియుండు
హరహరా! హరహరా! యని బ్రహ్మరుద్రు
దరుదైన తలమీది యా లింగమూర్తి
నచ్చోట వెలయించి యర్చనలిచ్చె
....
సరి తిక్కడంత నశ్వంబు దూకించె
మఱిబ్రహ్మరుద్రుండు మార్కొని నిలిచె
తీడ్రించి తిక్కన్న త్రిప్పె ఖడ్గంబు
కరవాలు ఝుళిపించె ఘనుడు రుద్రయ్య
అప్పుడు రణములో నట్టచట్టలుగ
తలలు బాహులు గరుండములు మొండెములు
కుప్పలుకండలు గుండెలు రాలె
అప్పుడు తిక్కన్న కాయె గాయాలు
తప్పక తిక్కన్న దళమెల్ల నొఱగె
చూచిరి యాదవుల్ చోద్యమందుచును
తిక్కన్న యొక్కడై దిగువాఱనాడు

పెక్కు రొక్కనితోడ పెనగాడరాదు
అని బ్రహ్మరుద్రుఁ డల్లంతన నిలిచి
నిలిపిన తోడ్తోన నీతిజ్ఞులగుచు

నిలిచిరి యని మాని నెఱజోదులెల్ల
అప్పుడు తిక్కన్న యగ్నిచందమున
కదిసెను కోపాగ్ని కన్నుల నురల
నదలించి రుద్రుని నడ్డానవైచె
వడి రుద్రుఁ డంతనా వాటు దప్పుకొనె
గరవాలు గైకొని కదిసె రుద్రుండు
విడివడి రిద్దఱు వీరయుద్ధమున
ధరణిపై నొండొరుం దప్పించుకొనుచు
లంఘించి వెనుకకు రాగడిల్లుచును
ప్రాకుచు దూకుచు పైకి రేగుచును
తాటించి నఱకుచు తాకి పొడ్చుచును
ఉరవడివచ్చిన పరువడిచేసి
కటపెట ఖంగుఖంగు ఖల్లుఖల్లనుచు
మెఱపులవలె మీద మెఱయుచు బిడుగు
చఱపులవలె గొప్పసడిని వ్రేయుచును
యిర్వురు పోరిరి దుర్వారులగుచు
తిక్కదుద్రిక్తుడై తెగవ్రేయ రుద్రు
డుక్కఱి చెక్కలై యుర్విపై బడియె
పడుచునె రుద్రు డాపక ఖడ్గధార
దడయక తిక్కన తల ద్రుంచివైచె
బలియుఁ దిక్కనఁ జంపె బంత మీడేర్చె
బ్రహ్మరుద్రయ్య తా ప్రాణాలు విడిచె
అంతలో చల్లపిన్నమనాయనికిని
బ్రహ్మరుద్రుని మృతివార్తలు చేరె
పిన్నమనాయుండు బిట్టుదుఃఖించె
సాహసాత్ముఁడు చన్నచందంబు జూచి

తెగివ్రయ్యలైయున్న దేహంబు పొదిగి
ముందఱ నిడుకొని మునిగె దుఃఖమున
గటకట! రుద్రదాకట్టడి దైవ
మిటులౌనె? బ్రాహ్మడా! యీశ్వరుమహిమ
యాదవులకు బ్రహ్మహత్యరాకుండ
తిక్కన్నఁ దెగటార్చి దివి కేగినావె
పరమోపకారివి పావనమూర్తి
పరగ మా కొఱకయి ప్రాణ మిచ్చితివి
యెన్నెన్ని జన్మాల నెత్తినగాని
తిన్నగా నీ ఋణము తీర్చుకోగలమె?
మాతో నాడినమాటలక్రమమె
భూతలంబున నీకుఁ బూజలొనరించు
నరుదైన యిలవేల్పవని కొల్చికాని
పరికింప నీ ఋణము బాపుకోలేము
అనుచు పిన్నమనాయ దనుజులుతాను
బ్రహ్మరుద్రునిగుణప్రస్తుతిజేసి
మహనీయమైన సమాధిగల్పించె
మాఘమాసమున నమావాస్యతిథిని
మంగళవారాన మధ్యాహ్నవేళ
గోబిలమున రుద్రుఁ గూర్చుండఁబెట్టి
నీలకంఠునియందు నిక్షేపపఱిచి
యందఱు నిండ్లకు నరుదెంచి రంత
సిరిగల తిక్కన్న చెల్లగానంత
చిల్లరసైన్యంబు చేరే నెల్లూరు

బీరినేనియుద్ధములో నాత్మోద్భవపు సుద్దులు కొన్ని -

బిరుదుగలబలశాలి బీరినేడంత
పరువడి నా కత్తిఁబ్రార్థింపఁదొడగె

పిడుగుల తునియవో బిరుదులకత్తి!
నీ పదను నీ బలము నే నెరుంగుదును
భూమినుంటివికాని భుజమునకురమ్ము
అనుచు బ్రార్థింపంగ నరదరి లేచి
వలపటిభుజమందు వాలెను కత్తి
కత్తికప్పుడు నమస్కారంబుచేసి
పరుజులో చెయివేసి పదిలముగబట్టి
బీరన్న తనమనసుఁ బిలిచి యిట్లనియె
యమునిసన్నిధికి జీవాత్మగొనిపోకె
పరమాత్మతో నైక్యపడవలెనుగాని
వీరులఁ బొడగని వెరవకే మనస!
తెగువతో రోషంబుఁ దెత్తువుగాని
అదరకే యో గుండె యాయుధముజూచి
యుక్కుగుండై పగఱ నుడికింతుగాని
బెదరకే యో మనస! పెల్లుమోతలకు
మోతలకు యెదురెక్కి మోదవలెగాని
పగతుల గని కత్తి! పదను దియ్యకుమి
మదగజములఁబరిమార్తువుగాని
అని తెల్పె మనసుతో నా బీరినేడు

ఎందఱో యుద్ధమున మడిసిరి. గోవులెన్నో యుద్ధము చేసినవి. గోవుల పరాక్రమగాథ చాలపెద్దది. ఇది దిక్ప్రదర్శన మాత్రమే–

(రేడియో ప్రసంగము
మదరాసు
3-8-1945)

ఎఱ్ఱగడ్డవారి పోరాటము

హైందవ సారస్వతమునకు గనియని చెప్పదగు చెన్నపురిలోని ప్రాచ్య లిఖితపుస్తకభాండాగారమున గల విషయరత్నవిశేషములు ప్రపంచమునకు దప్పక వెల్లడి కాదగినవి. మెస్తరు మెకంజీ, బ్రౌన్ అను నాంగ్లేయులు మనకు జేసిన మహోపకారము మఱవరానిది. పత్రికాధిపతులును, భాషాభిమానులును నిందలి విషయములను వెలిపుచ్చ బ్రార్థితులు. వీలునుబట్టి యప్పుడప్పుడు కొన్నికొన్ని చిన్నిచిన్ని యుపయుక్తాంశములను వెల్లడింప దలంపు గొని ప్రస్తుత మిద్దానిని వ్రాయించి పంపితిని. బ్రౌన్, మెకంజీ దొరలు వ్రాయించిన వ్రాతలు భాషావిషయమున సంపూర్ణసంస్కార మందనివైనను (అందమి చేతనే కాబోలు) పసిబాలునకైన నర్థమగునట్లు తేటతెల్లముగ నుండును. అట్టి వానిని మన మతికౌశలమును జూపి సంస్కరింప బూనిన సులువుగా నర్థము కాకపోవునేమో యను తలంపున నున్నదున్నట్లే వ్రాయిచి పంపగడగితిని

చెన్నపురి, వేటూరి ప్రభాకరశాస్త్రి
4-3-1911.

(ఈ లేఖను శ్రీ ప్రభాకరులు కృష్ణాపత్రికాధిపతులకు 4-3-1911న వ్రాసినారు. వారు ఈ లేఖతోపాటు ప్రభాకరులు వ్రాయించి పంపిన ఎఱ్ఱగడ్డ వారి పోరాటము" అను వచన భాగమును ఏప్రెల్ 7వ తేదీ కృష్ణాపత్రికలో ప్రకటించిరి. సం.పా॥)

(మెకంజీ, బ్రౌనుదొరల వాఙ్మయసేవను గూర్చిన పరిశోధనకు మన దేశంలో శ్రీకారంచుట్టి ఆహ్వానం పలికినవారు ప్రభాకరులే. ఆ పని వారి యీ (4.3.1911 నాటి) లేఖానుబంధంతోనే ఆరంభమైనది. –సం॥)

ఎఱ్ఱగడ్డవారి పోరాటము

నల్లసిద్ధిదేవచోళమహారాజు నెల్లూరి పట్టణమందు సింహాసనారూఢుండై పృథ్వీసామ్రాజ్యం చేయుచుండగాను వారివద్ద రణతిక్కన్న అనే బ్రాహ్మణుడు సేనాధిపతి. ఇతనికే ఖడ్గతిక్కన్న అని పేరు కలదు. అప్పుడు యాదవవంశోద్భవుండైన కాటమరాజు, ఇతని పినతండ్రి పోలమరాజు. ఈ పోలమరాజు

కుమారుడు కరిఆవులరాజు. వీరు లంకమల పాలకొండ నల్లమల మొదల యిన పర్వతప్రదేశములందు అరణ్యములో పచ్చికపట్లను తమయొక్క విస్తారమైన గోగణమును సంరక్షణ చేసుకుంటూ నల్లసిద్ధి చోళ మహారాజుకు పుల్లరికిగాను తమమందలో ఆవులకు పుట్టే కోడెదూడలు కొన్ని యిచ్చేటట్టున్నూ వారి దేశమందు వుండే కసపు పచ్చికపట్లు తమ గోగ్రాసముగా ఇచ్చేటట్టుగాను నిర్ణయించుకొని కొంతసైన్యం అందలాలు ఏనుగులతో ప్రసిద్ధముగా వుండేవారు. మఱికొన్ని దినములకు క్షామం దశవల్లను గోవులు గ్రామంలో ఎక్కడెక్కడ వుండే సస్యాదులను గోవులు మనుష్యుల అంకిలిలో నిల్వక మేసేవి. కనుక ప్రజలు రాజుతో యీ సంగతి విజ్ఞాపన చేసుకున్నయెడల బీడు పచ్చిక పట్లు యావత్తు కాటమరాజువారి గోవులు మేపుకునే లాగున మాట యిచ్చినాము. పైర్లు వారు మేపుకోవలసినదికాదు. అయినాగాని మీరు పైర్లు జాగ్రత్త చేసుకునేది. అని సెల్వు యిచ్చి పైర్లు మేపవద్దు. బీడు పచ్చిక మేపుకునేది అని కాటమరాజు గారికిన్నీ వ్రాసి పంపించిరి. ఇదిగాక అరణ్యప్రదేశమందుల కాటమరాజుగారి విస్తారమైన గోగణం తిరిగి మేస్తూ వుండేది మొదలుకొని గోసంరక్షణార్థమై కాటమరాజుగారు అగపడ్డచోట క్రూరమృగములను వారే వధచేస్తూ వచ్చేవారు గనుక నున్నూ అరణ్యమందు గోగణగోపాలకులయొక్క సమ్మర్దము విస్తారమైనందున సాధారణముగా మృగములు అరణ్యమందు నిలవకపోతూ వచ్చినందుననున్నూ మృగవధ చేసుకుని తత్సామాన్యవృత్తివల్లను జీవనోపాయం కనివుండే కిరాతకులకు జీవనహాని యయినందుననున్నూ ఆ కిరాతకులు కాటమరాజుయందు ద్వేషులై వుండిరి. ఇదిగాక నల్లసిద్ధిరాజుగారు ఉంచుకున్న భోగముదాని వద్దనొక పెంపుడు చిలుక నొకనాటి కాలమందు మ్యాడలోనుండి తప్పించుకుని వెలుపటికివచ్చి అరణ్యశుకములను గూడి కాటమరాజు ఆవులమందల సామీప్యములకు సమూహముగా వచ్చి ధ్వనులు చేయగా కొన్నిగోవులు బెదరి ల్యాగలను కలగతొక్కుకుని పారిపోయినవి. అప్పుడు కాటమరాజు పినతండ్రియయిన పోలమరాజుచూచి బాణము సంధానముచేసి వేసినందున ఆ బాణము సమూహములో వుండే పెంపుడు చిలుకకు తగిలి ప్రాణం విడిచెను. ఆ చిలుక కాళ్లలో గజ్జెలందెలు వుండేవి పోలమరాజు చూచి ఇది పెంపుడు చిలుక అని నిశ్చయము చేసెను. అంతట ఆ రాజు ఉంచుకొని వున్న భోగముదానివద్దకు తీసుకుని వెళ్ళి అగపఱచి నీ

చిలుక తప్పివచ్చి నంతట అన్యాయముగా కాటమరాజు పినతండ్రియయిన పోలమరాజు బాణ ప్రయోగంచేసి చంపినాడనిచెప్పి నంతట అది చాలా దుఃఖస్తురాలయి అరణ్యములోవుండే క్రూరమృగాదులను వధచేసేటట్టుగాను వ్యాటలాడుతూ వుండి కాటమరాజుగారి గోవులనున్నూ వధియించమని వుపదేశించెను. కనుక ఆ కిరాతకులు కాటమరాజువద్దకి వచ్చి మేము సామాన్య మృగములను వధచేసుక జీవనంచేస్తూవున్నామని మనవి చేసినంతట కాటమరాజు అనుకూలించి సెలవు యిచ్చినందున ఆ కిరాతకులు అరణ్య మధ్యమందు మృగాదులను చంపినట్టుగా వుండి కొన్నిగోవులను గుండుతో వధచేసిరి. ఈ సమాచారములు కాటమరాజు విని చాలా ఆక్రోశముతో ఆ కిరాతకులను చంపించి తదారభ్య నల్లసిద్ధిరాజుగారికి యిచ్చే పుల్లరి యివ్వక నిలిపెను. అంతట నల్లసిద్ధిరాజుగారు పుల్లరి యివ్వమని అందులకు ఆవులమందలో వుండే కోడెదూడలు తమకు తోలి అంపించమని వర్తమానం అంపించగా అందుకు కాటమరాజుగారు మీ శీమలో మా ఆవులమందకు నిరుపాధిగా వుండినట్టయితే మీకు పుల్లరి యివ్వవలసిన కర్తవ్యం అటుగాక మీ దేశములో వుండే కిరాతకులు మా ఆవుల మందలకు వుపద్రవంచేసి కొన్ని ఆవులను నిష్కారణంగా వధించినారు గనుక మేము పుల్లరి యివ్వవలసిన నిమిత్తం లేదని ఖండనగా వ్రాసి పంపించినందున అదివరకు మందలలోవున్న కోడె దూడలను తోలుకరమ్మని కొంత సైన్యమును నల్లసిద్ధిరాజు పంపించి నందున వారువచ్చి కోడెలను తోలుకపోవచ్చినంతట కాటమరాజువారు వచ్చిన సైన్యమును లక్ష్యము చేయక తిరుగ గొట్టినారు కనుక వారు తిరుగా నల్లసిద్ధిరాజు వద్దకి పోయి యీ వర్తమానములు యెరకచేసినంతట. నల్లసిద్ధి చోడ మహారాజులంగారికిన్ని కాటమరాజుగారికిన్ని ప్రబలమయిన యుద్ధము జరిగినది.

(కృష్ణాపత్రిక,
ఏప్రెల్ 7వ తేదీ 1911
మణిమంజరి సం. 8
ఆగస్టు, 1984.)

సాహిత్యం

అన్ని తరగతులవారికి అనుభవింపతగి ఉండాలి

(చమత్కారాధాయకములయిన సర్వవిధభాషారచనలూ, ప్రాచీన కాలమునాటివి సంరక్షితములైతే, అందులో మేలేర్చుకొని భావిభాషారచయితలు తమరచనములలో అనుగతపఱచుకొంటారు. ప్రాచీనదేశిరచనల పరిశీలనము జరగకపోతే, జాతిభాషాస్వభావానుగుణములయిన హృద్యార్థముల నుజ్జగించడమూ, వానికి బదులుగా అననుగుణములయిన వైజాత్యార్థముల నవలంబించడమూ జరగవచ్చును, జరుగుతున్నది కూడాను. మఱిన్నీ సాహితీవినోదమన్నది జాతిసౌధములో పై అంతస్తుమీద కూర్చున్న ప్రౌఢ రసికప్రజానీకమునకు మాత్రమే యుపయోగపడునదిగా నుండరాదు. అది అన్ని అంతస్తులవారికి వారివారి యభిరుచులకు అర్హతలకు తగినరీతులతో అందుబాటులో నుండతగినదై యుండవలెను. బాలురకు, పామరులకు, స్త్రీలకు, పనిపాటలవారికీ, దేశము పలుమూలలవారికి, పలుతరగతులవారికి, అందరికీ, అన్ని యంతరములలోనూ అనుభవింపతగినదై యుండవలెను.
– రచయిత)

జరగవలెను, జానపదగీతములను సమకూర్చి, ససిపఱిచి, సముచిత ప్రచారముతో వాటిని సంరక్షించడం వెంటనే జరగవలెను. జగద్గురుని దగ్గఱ నుండి చచ్చెడివాని దాకా ఉండే ప్రజలతరగతులలోనూ, ఉగ్గుపాలనాట నుండి ఉసుఱుడిగేనాటి దాకా ఉండే వయోదశలలోనూ, పట్నంనుంచి బరంపురందాకా ఉండే దేశవిభాగములలోనూ, అంతరాంతరములతో విలసిల్లుతూ ఉన్న, ఆంధ్రసాహితీ సంపదకు సర్వతోముఖాభ్యుదయము జరగవలెనూ అంటే, దాని పునాదులు గట్టిగా, దిట్టముగా కూలిపోకుండా కుదుర్కొనవలెను గదా! ఆంధ్రసాహిత్యసౌధమునకు అసలు పునాదు లేవీ అంటే, అవి, నానుళ్ళు, పలుకుబళ్ళు, సామెతలు, జంటపలుకులు, పనిపాటల వారి పరిశ్రమగీతాలు, బాలకుల ఆటపాటలు, స్త్రీలసౌభాగ్యగేయాలు, నోము పాటలు, బిచ్చగాండ్ర పరిదేవనపుపాటలు, భక్తుల ప్రార్థనగీతాలు, వృద్ధుల వేదాంతకీర్తనలు, జానపదుల వీరకథాగేయాలు, జాతులచరిత్ర కథాగేయాలు,

రాజులబిరుదావళులు, భట్టురాజులప్రశంసారచనలు, చాటూక్తులు, చమత్కార కథలు, పొడుపుకథలూ ఈ వగైరాలన్నీని ఇటువంటివన్నీ పల్లెటూళ్ళలో ప్రజలనాలుకలమీదనే నాట్యమాడుతూ ఉంటై. ఇటువంటి వాటిలో ఆయాజాతుల ప్రజలకు సహజమయిన యభిరుచులూ, పలుకు తీరులూ, కూర్పునేర్పులూ, ఛందస్సందర్భములూ, సారస్యవైరస్యములూ, ఆశావాసనలూ, అన్నీ అమాయకముగా అద్దములోవలె ప్రతిఫలిస్తూ ఉంటై. వాటి తీరుతీయముల ననుసరించి సాగించె వాఙ్మయనిర్మాణము నిర్వక్రమై జాతివార్తాచమత్కారపూరితమై అతుకులబొంతగా కాకుండా, జాతిశరీరము నకు అందచందముల నాపాదిస్తూ, అత్తుకొని వెలయ గలుగుతుంది. పూర్వము సంస్కృతాధిక్య సంబంధమూ, ఇటీవల బెంగాలీ, హిందీ, ఇంగ్లీషు రచనాధికాను కరణమూ జాతిభాషాస్వభావమున కత్తుకొనియున్నదా? వికృతి కలిగించు చున్నదా? వీని మూలమున జాతిభాషాస్వభావానుగుణరచనలకు సంక్షయము కలుగుతున్నదా? అందు గుణమేది? దోషమేది? గ్రాహ్యమేది? త్యాజ్యమేది? ఇత్యాది సందర్భములను సరిగా గుర్తించుటకును కూడా మీద నేను పేర్కొన్న పునాదిరచనలసేకరము పరిశీలనము, సముద్ధరణము ముఖ్యకర్తవ్య మవుతుంది.

హిందీఛందస్సు తెల్గుకు కుదురుపడక పోవచ్చును – దిగద్రొక్కబడిన మనపాటల, పదాలఛందస్సు ప్రౌఢకావ్యరచనకుకూడా పనుపడ వచ్చును. (చమత్కారాధాయకములయిన సర్వవిధ భాషారచనలూ, ప్రాచీనకాలము నాటివి సంరక్షితములైతే, అందులో మేలేర్చుకొని భావిభాషారచయితలు తమ రచనములలో అనుగతపఱచుకొంటారు. ప్రాచీన దేశిరచనల పరిశీలనము జరగకపోతే జాతిభాషాస్వభావానుగుణములయిన హృద్యార్థముల నుజ్జగించ డమూ, వానికిబదులుగా అనుగుణములయిన వైజాత్యార్థముల నవలంబించ డమూ జరగవచ్చును. జరుగుతున్నది కూడాను; మరిన్నీ సాహితీ వినోదమన్నది జాతిసౌధములో పై అంతస్తుమీద కూర్చున్న ప్రౌఢ రసిక ప్రజానీకమునకు మాత్రమే యుపయోగపడునదిగా నుండరాదు. అది అన్ని అంతస్తులవారికి వారివారి యభిరుచులకు, అర్హతలకు తగినతీరులతో అందుబాటులో నుండతగినదై యుండవలెను. బాలురకు, పామరులకు, స్త్రీలకు, పనిపాటల

వారికి, దేశము పలుతరగతులవారికి, పలుమూలలవారికి, అందరికీ అన్ని యంతరములలోనూ అనుభవింపతగినదై యుండవలెను) కనుక అనాది కాలమునుండి యిన్ని యంతస్తుల వారికీ ఇన్ని యంతరముల లోనూ ఉపయోగపడుతూవచ్చిన సాహితీరచనావిభేదములు అంకుర ప్రాయములే యయినా మనకు ఆదరించిపెంచి పెద్దచేయవలసినవే అవుతున్నవి.

కాని యిది చాలదు

ఇందుకై యూనివర్శిటీవారు, దొరతనమువారు, సాహిత్యపరిషత్తువారు, మునిసిపాలిటీలవారు పనిబూని అక్కడక్కడి సాహితీపరికరములను వెంటనే సమకూర్చేయత్నముల సాగింపవలసియున్నారు. దేశము నలుముఖముల ఉన్న పండితులు భాషాభిమానులు జేబులలో నోటుబుక్కులుంచుకొని ఎక్కడివా రక్కడనే తమ తమ ప్రదేశములందలి చమత్కారాధాయకమయిన సర్వసాహితీ పరికరములనూ సంధానింపబూనవలెను. యూనివర్శిటీవారు మొదలగువారు వారి నందుకై నియోగింపవలెను. ఆ సభలలో సంధానితములయినవాని పరిశీలనము జరుగుచుండవలెను. పరిశీలితములు ప్రకటితము లవుచుండ వలెను. ఈ విధానము సాగించినచో కొన్ని వాల్యుముల పరిమాణపు భాషా సాహితీపరికరము బయల్పడగలదు. ఈ నాటికే కొందరు యథాశక్తిగా నిట్టి పరిశ్రమము జరపిరి. జరపుచున్నారు. కాని యది చాలదు. సామెతలు, పాటలు, పదాలు మొదలయినవి కొన్ని యక్కడక్కడ ప్రకటితము లగుచున్నవి. అంతేకాని, నానుడులు, జాణ్ణుడులు, పలుకుబళ్ళు, నుడికారములు, జాతివార్తలు మొదలగున వెన్నో యింకను పరిశీలనోపక్రమమే జరుగనివున్నవి. గేయరచనము లింక నెన్నో యపరిశీలితములు అప్రకటితములుగానే యున్నవి.

తెలుగు రచనల మూల ప్రకృతులు

నే నీ నడుమ శ్రీశైల ప్రాంతారణ్యమున ఫారెస్టు రేంజరుగా నున్నవారి నొకరిని గలిసికొనగా వారక్కడి యాటవికులగు కోయచెంచుజాతుల వారి తెలుగుభాషనుగూర్చి వారికి నేడు జరుగుచున్న తెలుగుస్కూళ్ళ విద్యా విధానాదికమునుగూర్చి వారి యాచారవ్యవహారములనుగూర్చి, యాట

పాటలనుగూర్చి కొన్ని వింతవిషయము లెరిగించిరి. వారి యాటపాటలను సేకరించి, వెల్లడింపగా వారిని కోరితిని. తెలుగుసాహిత్యరచనలలో నొక విభాగమగు 'కురవంజి' కురువ – అనగా కోయజాతివారి, యంజె = నృత్యముతో సంబంధించిన గేయరచనమని నా తలంపు. ఆ కోయకురువ చెంచుజాతులవారి పాటలుపదాలు తెలుగురచనల మూలప్రకృతులు,

కాటమరాజుకథ రామాయణం నాటిదా?

మతిన్నీ పల్నాటివీరచరిత్రము కాటమరాజుకథ అన్న ప్రాచీన వీరకథా పదరచన లింకను నప్రకటితములుగానే యున్నవి. కాటమరాజుకథను నేను సముద్ధరించి, సరిపఱిచి ప్రకటించే ప్రయత్నములో ఉన్నాను. ప్రకటించే అనుకూల్యం ఏర్పడితే దానిలోని మెరుగులు వెల్లడికాగలవు. కాకతీయులకు సంబంధించిన కాకతమ్మకథ, ఏకవీరకథ, మాతంగికథ మొదలయిన చారిత్రక కథాగేయములు సేకరింపవలసియున్నవి. ఈ నడుమ రంగనాథరామాయ ణము సంస్కరణపరిశ్రమలో నేను రాయలసీమలో బహుళప్రచారముగల గేయరచనమును విన్నాను. అది రంగనాథరామాయణ కర్తయిన గోనవంశపు రెడ్లకు, అంతేకాకుండా రామాయణకథకుగూడా సంబంధించిన కథ. దాని కథాసారమిక్కడ కొంచెము వినండి –

గోనకాటారెడ్డి అయోధ్యకు రెడ్డి. అంటే గ్రామాధికారి. ఇది శ్రీరాములు నాటి కథ. రాములవా రరణ్యవాసమున నుండిరి. రామరాజ్యం, భరతుడిపట్టం, భరతుడు రాచకర్జములు చూస్తున్నాడు. దశరథునినాడు ఎక్కువ శిస్తు లిచ్చి బాధలుపడిన రెడ్డివారంతా యోచించి అయోధ్య భూములన్నీ భరతుని రాజ్యం పదునాలుగేండ్లూ కోరుకుపుచ్చుకున్నారు. అందు భరతుని మోసగించినవారు చాలా ధనవంతులయిరి. భరతుడు బీద యయ్యెను. రాములవారు మరల రాజ్యమునకువచ్చి సంపన్నులయిన రెడ్ల నెల్ల సమ్మానించిరి. అప్పుడు దశరథ ప్రత్యాబ్దికమునకు గానుకగ గుమ్మడిపండును రాములవారు గోన కాటమరెడ్డి గారి నడిగిరి. అతడు వేలకొలదిగా తెప్పించి యిత్తుననెను. ఆ యేడు గుమ్మడి తీగలన్నియు చీడపట్టి కాయలులేనివవుటచేత ఎంతవెదకినా రెడ్డికి

గుమ్మడికాయ దొరకలేదు. గుమ్మడికాయంత బంగారిత్తుననెను. శ్రీరాముల వారి కోటలో నొక గుమ్మడితీగ కాయకాచెను. ఆ కాయతో తూచగా రెడ్డి కుటుంబములవారు భరతుని మోసగించి యార్జించిన బంగారమంతా వేసి తూచినా చాలకపోయెను. అప్పుడు రెడ్డిగారి పెద్దకోడలు పెదరాచమ్మ పరమసాధ్వి తన తాళిబొట్టు బంగారువేసి తూపించెను. దానితో తూకము సరిపడెను. అంతటితో రెడ్లు బీదలయి యాదేశమున నుండలేక నొక కుంటియెద్దుతోను, ఒక గ్రుడ్డిదున్నతోను దేశాంతరములపాలయి వచ్చి, దక్షిణమున ఆంధ్రదేశమున అడవిలో విడిసి క్రమముగా నక్కడ నొక యూరు నిర్మించుకొనిరి. అదే రాచూరు. (నేటి రాయిచూరు). అడవికొట్టి సాగుచేసి సంపన్నులై యిక్కడ కోట కట్టిరి. అదే రాయిచూరి కోట. ఇత్యాదిగా నా కథ కొంత చరిత్ర జాతికథాంశ సమన్వితమై ఇంకా యెంతో వింత తీరుతో నున్నది. ఇట్టి రచనలెల్ల నుద్ధరింపవలసియున్నవి. మఱీన్నీ రుచిగల తెలుగు పలుకుబళ్ళ నింతకుముం దెవ్వరూ సేకరించి వెల్లడింపలేదు. మాటవరుసకు అట్టివాటిని కొన్నింటిని వినిపిస్తున్నాను. ఇప్పుడు నేనన్న మాటవరుస అనేది కూడా ఒక మంచి పలుకుబడే. మంచి మంచి పలుకుబళ్ళను నానుళ్ళను చిలుకలు పండ్లపలుకులను కొట్టిపోసినట్టు కొట్టిపోసే జగజాణలు దేశమున పలు వురున్నారు. వారి పలుకుతునుకలన్నీ సేకరించి ప్రకటింపవలసినవి.

నానుళ్ళూ పలుకుబళ్ళూ

ఇంకా ఊర ప్రొద్దుక్రుంకలేదు – ఏదీ గానివేళ – చేతావాతా గాదు –గొడ్డూబిడ్డా అన్నారు – ముత్యాలముగ్గులూ రత్నాలరంగవల్లులూను – పల్లెత్తుమాటైనా పలుకడు – బుగ్గపోట్లు పొడిచారు. పుంజు కూతపట్టింది – ఊపిరి సలపకుండా పనివున్నది – ఆ వూళ్ళో పచ్చిమంచినీళ్లు కూడా దొరకవు – కాళ్ళావేళ్ళా పడి బతిమాలుకున్నాడు – కాళ్ళకడ్డాలు వస్తాడు – పదికాలాలపాటు బాగుండవలెను – కొలకుల నీళ్లు గోళ్ళచిమ్మినాడు – పద్దాకా అదేపనా? – చేదోడూ వాదోడూను– పుట్టెడు నీరు మోసుకొన్నది – చీమ చిటుక్కుమంటే వినబడుతుంది – ఎదటున్నవాడు పెళ్ళికొడుకు – ఇత్యాదులు పలుకుబళ్లు త్రవ్వితండములుగా తెలుగులో ఉన్నవి. ఇటువంటి

వాటినన్నీ సేకరించేవారినీ, ప్రకటించేవారినీ సముత్సాహపఱిచి, వారి వారి సేకరములు ప్రచారమున కెక్కునట్లు చేయుట మిక్కిలి కావలెను.

(రేడియో ప్రసంగం.,
మదరాసు - 24-4-43.,
ఆంధ్రపత్రిక- 25-4-1943)

కాటమరాజుకథ

(ఈ కాటమరాజుకథ, ద్విపదప్రాయమయిన గేయరచన గలది. అనేకావాంతర విభాగములు గలది, చాలా జాగ్రత్తగా ఉద్ధరించి సంస్కరించి ప్రకటించుచున్నాను. దాని కథాసార మిక్కడ ప్రకటితమయినది. ఇది యింకను గలదు. – వే. ప్ర.)

నల్లసిద్ధిదేవచోళమహారాజు నెల్లూరిపట్టణమందు సింహాసనారూఢుండై పృథివిసామ్రాజ్యం సేయుచుండగాను వారివద్ద రణతిక్కన అనే బ్రాహ్మడు సేనాధిపతి. ఇతనికే ఖడ్గతిక్కన అని పేరు కలదు. అప్పుడు యాదవవంశోద్భవుండైన కాటమరాజు, యితని పినతండ్రి పోలమరాజు, యీ పోలమరాజు కుమారుడు కరిఆవులరాజు. వీరు లంకమల పాలకొండ, నల్లమల మొదలయిన పర్వతప్రదేశములందు అరణ్యములలో బచ్చికపట్లను, తమ యొక్క విస్తారమైన గోగణమును సంరక్షణచేసుకుంటూ నల్లసిద్ధిచోళమహారాజుకు పుల్లరికిగా తమ మందలలో పుట్టే కోడెదూడలు కొన్ని యిచ్చేటట్టున్ను వారి దేశమందు వుండే కసపు పచ్చికపట్లు తమ గోగ్రాసముగా యిచ్చేటట్టుగాను నిర్ణయించుకొని కొంత సైన్యము అందలాలు ఏనుగులతో ప్రసిద్ధిగా ఉండేవారు. ఇట్లు కొంతకాలము జరుగగా క్షామదశవల్లను గ్రామములో అక్కడక్కడ ఉన్న సస్యాదులనుగోవులు మనుష్యుల అంకిలో నిలువక (Cannadi word for authority) మేయసాగినవి. గనుక ప్రజలు రాజుతో యీ సంగతిని విజ్ఞాపనము చేసుకొనిరి. రాజు " బీడు పచ్చికపట్లు యావత్తూ కాటమరాజు వారి గోవులు మేపుకునేలాగున మాట యిచ్చినాము. పైర్లు వారు మేపుకోవలసినది కాదు. ఐనాగాని మీరు పైరు జాగ్రత్తచేసికొనేది". అని శలవుయిచ్చి పైర్లు మేపవద్దు. బీడుపచ్చిక మేపుకునేది అని కాటమరాజు గారికిన్నీ వ్రాసిపంపించిరి. ఇదిగాక అరణ్యప్రదేశమందుల కాటమరాజుగారి విస్తారమైన గోగణం తిరిగి మేస్తూ ఉండేది మొదలుకొని గోసంరక్షణార్థమై కాటమరాజువారు అగపడ్డచోట క్రూరమృగములను వారే వధచేస్తూ వచ్చేవారు. గనుకనున్నూ అరణ్యమందు గోగణగోపాలకులయొక్క సమ్మర్దము విస్తారమైనందున సాధారణముగా మృగములు అరణ్యమందు నిలువక

పోతూవచ్చినందుననున్నూ మృగవధ చేసుకుని తత్సామాన్యవృత్తివల్లను జీవనోపాయం కని ఉండే కిరాతకులకు జీవనహాని అయినందుననున్నూ ఆ కిరాతకులు కాటమరాజుగారియందు ద్వేషులైయుండిరి. ఇదిగాక నల్లసిద్ధిరాజుగారు ఉంచుకున్న భోగముదానివద్ద ఒక పెంపుడుచిలుక వొకనాటి కాలమందు మేడలోనుండి తప్పించుకుని వెలుపలికివచ్చి అరణ్యశుకములకూడి కాటమరాజు గారి ఆవులమందలకు సామీప్యములకు సమూహముగావచ్చి ధ్వనులు చేయగా కొన్నిగోవులు బెదరి ల్యాగలను కలగద్రొక్కుకుని పారిపోయినవి. అప్పుడు కాటమరాజు పినతండ్రి అయిన పోలమరాజు చూచి బాణము సంధానముచేసి వేసినందున ఆ బాణము సమూహములో వుండే పెంపుడుచిలుకకు తగిలి ప్రాణమువిడిచెను. ఆ చిలుక కాళ్లలో గజ్జెలు అందెలు వుండేవి. పోలమరాజు చూచి ఇది పెంపుడు చిలుక అని నిశ్చయము చేసెను. అందున సామీప్యమందున వున్న కిరాతకులు ఆ చిలుకను నలసిద్ధిరాజుగారు ఉంచుకొన్న భోగముదాని వద్దికి తీసుకొని పోయి అగపర్చి నీ చిలుక తప్పి వచ్చినంతట అన్యాయముగా కాటమరాజు పినతండ్రి అయిన పోలమరాజు బాణప్రయోగంచేసి చంపినాడని చెప్పినంతట అది చాలా దుఃఖస్తురాలై అరణ్యములో వుండే క్రూరమృగాదులు వధచేసేటట్టు గాను, వ్యాటలాడుతూవుండి కాటమరాజుగారి గోవులనున్ను వధియించమని వుపదేశించెను. గనుక ఆ కిరాతకులు కాటమరాజుగారి వద్దకు వచ్చి మేము సామాన్యమృగములను వధచేయక జీవనంచేస్తున్నామని మనవిచేసినంతట కాటమరాజు అనుకూలించి శలవు యిచ్చినందున ఆ కిరాతకులు అరణ్యమధ్యమందు మృగాదులను చంపినట్టుగావుండి కొన్నిగోవులను గుండుతో వధచేసిరి. ఈ సమాచారములను కాటమరాజు విని చాలా ఆక్రోశముతో ఆ కిరాతకులను చంపించి తదారభ్య నల్లసిద్ధిరాజుగారికి ఇచ్చే పుల్లరి యివ్వక నిలిపెను. అంత నల్లసిద్ధిరాజుగారు పుల్లరి యివ్వమని అందుకు ఆవులమందలలో వుండే కొన్నిదూడలు తమకు తోలి అంపించమని వర్తమానం అంపించగ, అందుకు కాటమరాజుగారు మీ శీమలో ఆవులమందలకు నిరుపాధిగా ఉండనట్టైతే మీకు పుల్లరి యివ్వవలసిన కర్తవ్యం. అటుగాన మీ దేశములో వుండే కిరాతకులు మా ఆవులమందలకు ఉపద్రవంచేసి కొన్నిఆవులను నిష్కారణంగా వధించినారు. గనుక మేము పుల్లరి యివ్వవలసిన నిమిత్తంలేదు.

అని ఖండనగా వ్రాసి అంపించినందున అదివర్కుమందలలో వున్న కోడెదూడలను తోలుకొని రమ్మని కొంత సైన్యమును నల్లసిద్ధిరాజుగారు పంపించినందున వారె వచ్చి కోడెలను తోలుకు పోవచ్చినంతట కాటమరాజు వారు వచ్చిన సైన్యములను లక్ష్యము చేయక తిరుగగొట్టినారు గనుక వారు తిరుగ నల్లసిద్ధిరాజువద్దకుపోయి యీ వర్తమానములు యెఱుకచేసినంతట నల్లసిద్ధిచోళమహారాజులుంగారు ముఖ్యసేనాధిపతియైన రణతిక్కన్నతోకూడ కొంతసైన్యమునుకూర్చి కాటమరాజువారు సమాధానముగా కోడెలు యిచ్చినట్టు అయితే ఉత్తమము. అటుగానిపక్షమందు వారిమీద – కార్యపెట్టి వున్న కోడెలు యావత్తు మళ్లించుక రమ్మని పంపించిరి. అదేప్రకారం సేనాధిపతి రణతిక్కన్న వచ్చి సమాధానంగానే విహితముతో ఎప్పుడు యిచ్చే ప్రకారం మందలలో కోడెలను యిప్పించమని కాటమరాజువద్ద వర్తమానం అంపించగా వారు అనుకూలించక ప్రతిఘటించి ఉత్తరువు యిప్పించినందున ఖడ్గతిక్కన్న యుద్ధసన్నద్ధుడాయెను. ఈ యత్నము విని కాటమరాజువారున్నూ వారికి విహితులైన వారిని కొందఱిని సహాయంగా కూర్చుకొని బలిమిగల ఆవులు మేలైన కోడెలుసహా వెంటకూర్చుకొని యుద్ధసన్నాహమై నిలిచిరి. కనుక ఉభయపక్షములవారికి అఘోరమైన యుద్ధమాయెను.

(ఆంధ్రపత్రిక
ఆదివారం, జూన్ 18, 1944)

(1911లోనే మెకంజీ బ్రౌనుదొరలను గూర్చిన వాఙ్మయ పరిశోధనకు శ్రీకారముచుట్టిన ప్రభాకరులు, ఆ దినములలోనే, లోకంనుండి లోకల్ రికార్డుల నుండీ వినవచ్చే దేశి సారస్వతాన్ని సేకరించి, ఉద్ధరించి, ప్రకటించే ప్రయత్నంచేశారు. కాటమరాజుకథకు సంబంధించిన యీ వ్యాసపరంపర నాటి వారి లేఖానుబంధమునకు గావించిన విస్తృతప్రయత్నములోని భాగమే. – సం)

2

ఆ యుద్ధసమయమందు కాటమరాజు వారి గోవులు యుద్ధభూమిని వచ్చి నిలిచి యెదరి సైన్యములలో కొంతసైన్యమును హతముచేసినవి. అంతట రణతిక్కన కార్యం నిర్వహించలేక తిరిగి తన యింటిస్థలములోకి లేచిపొయ్యెను. ఇంటివద్ద భోజనసమయమందు తిక్కన్నభార్య తాను స్నానము చేసి రహస్య స్థలమందు రణతిక్కనకు స్నానానికి నీళ్లు వుంచి స్నానం చేయమని చెప్పినంతట అత డా స్థలానికి పోయి చూచి ఆడంగులు స్నానంచేసే రహస్య స్థలమందు నాకు నీళ్లు వుంచిన కారణం యేమి అని అడిగినంతట తిక్కన భార్య ప్రత్యుత్తరం యిచ్చిన క్రమము "యేస్థలమందైతే నేమి? రూపభేదములవల్ల విశేషం లేదు గనుక ఇక్కడనే స్నానము చేయవచ్చు" నని చెప్పినంతట తాను కార్యములోనుంచి తిరిగివచ్చినందున భార్య యీ మాట చెప్పెనుగదా అని తెలిసికొని స్నానానంతరం భోజనసమయమందు తిక్కనకు తల్లి విరిగినపాలు వడ్డించినందున అతనుచూచి విరిగినపాలు వడ్డించిన కారణ మేమని అడుగగా 'ఈ దినమున గోవులున్ను నీవు పోయిన స్థలానికే పోయి తిరిగివచ్చినవి' అని చెప్పెను. గనుక తాను కార్యములోనుండి తిరిగివచ్చినందున ఇందుకు దృష్టాంతముగ తల్లి ఆ మాట చెప్పినదని గ్రహించినవాడై భోజనోత్తరమందు తిరిగి కొంతసైన్యమును సమకూర్చుకొని యుద్ధానికి పొయ్యేటప్పుడు తల్లిని, తన భార్యను పిలిచి పూర్వము వఖ భట్రాజు నా మీద కృతిగా వకపద్యం చెప్పవలెనని ఉద్దేశించి నాల్గు చరణములు చెప్పినాడు. అది యేమంటే

సీ॥ ధైర్యంబు నీ మేనఁదగిలియుండుటఁజేసి
చలియించి మందరాచలము తిరిగె
గాంభీర్యమెల్ల నీ కడన యుండుటఁజేసి
కాకుత్థ్సుచే వార్ధి కట్టుఁవడియె
అల లక్ష్మి నీ యందు నలరియుండుటఁజేసి
హరిపోయి బలిదాన మందుకొనియె
ఆకారమెల్ల నీ యందు నుండుటఁజేసి
మరుడు ధూర్జటి కంటి మంటగ్రాగె.

యీ ప్రకారం భట్రాజు నాల్గుచరణములు చెప్పినందున అతనికి యెనిమిదివేలవరహాలు యిచ్చినాము. ఈ పద్యాలకు యింకా నాలుగు

యెత్తుగీతలు చెప్పవలసియున్నది. అవి నేను సజీవుణ్ణయి వుండగా చెప్పరాదు గనుక నిల్పినాడు. తరువాత నాలుగు యెత్తుగీతలు పూర్ణముగా జెప్పి తీసుక వస్తున్నాడు. అప్పుడు ఆ భట్రాజు మరిన్ని నాల్గువేలవరహాలు యిప్పించుమని చెప్పినంతట ఆ ప్రకారం అంగీకరించిరి. అంత తిక్కనభార్య పెనిమిటిగూర్చి చెప్పినమాట యుద్ధరంగంలోనుంచి తిరిగిరావడములేదని ఆజ్ఞాపిస్తిగదా! తమ్మును విడిచి దేహము వుంచే బుద్ధిలేదు గనుక యిప్పుడే శలవుయిమ్మని అడిగినందున నీకు అనుకూలం అయితే ఉత్తమపక్షము అని సమాధానము చెప్పి తాను యుద్ధానకు తర్లివెళ్లి వచ్చి కాటమరాజువారి సైన్యముకు సమ్ముఖుడై కార్యపెట్టి అఘోరమైన యుద్ధముచేసి అనేకమందిని హతంచేసెను. భట్రాజు రణతిక్కన్నకు కృతిగా అటుపై పద్యం సంపూర్ణముగా చెప్పిన నాలుగు యెత్తు గీతలు.

ఆ.వె॥ తిక్కదండనాథ! దేవేంద్రపురము నీ
వరుగుడెరిగి నగముదిరుగు టుడిగె
అబ్ధికట్టుబాసె నచ్యుతుకొఱదీరె
మరుడుమళ్లి బుట్టె మగలరాజ!

ఈ ప్రకారమున భట్రాజుపద్యము పూర్ణంగా నాలుగుయెత్తుగీతలు రణతిక్కన తల్లివద్దకుపోయి చెప్పగా ఆమె బహుసంతోషురాలై నా గర్భవాస మందున పుట్టిన పుత్రుండు సుపుత్రుండని రణతిక్కన్న పూర్వమందు చెప్పిన ప్రకారంగానే నాల్గువేలవరహాలు భట్రాజుకు యిచ్చి మరిన్ని తగిన బహుమతు లున్ను చేసెను. అంతట రణతిక్కనయొక్క భార్య తనపతియైన రణతిక్కనతో సహగమనముచేసే నిమిత్తమై సచేలస్నానంచేసి అనేకదానములున్ను బ్రాహ్మల కిచ్చి రణభూమిని ప్రదక్షిణ నమస్కారంచేసి తనపతియొక్క కళేబరము గురుతు కనబడకయున్నందున స్వామిని ప్రార్థించి నేను పతివ్రతనైతే పతియొక్క శిరస్సు కనబడునని నిశ్చయంచేసుకొని "రణతిక్క" అని నంతట ఆ రణతిక్కన శిరస్సు యుద్ధభూమిని పడియున్న కళేబరములమధ్యనుంచి పైకి యెగసినది గనుక ఆ శిరస్సును గుర్తుపెట్టి తీసుకవచ్చి అందుతోకూడా అనుగమనము చేసినది. కాటమరాజువారి సైన్యములు హతశేషమైన యాదవులు యుద్ధరంగంబునందు తమతోకూడా నిలిచిన శత్రువులను హతంచేసిన వారియొక్క రూపము శిలలపై చెక్కించి, వీరులు అనే ప్రతిమలు తాలూక మజుకూరు సగిలిపాయకట్టుమౌజే

కుంభగిరి అనే గ్రామములలోను వున్నది. ఇదిగాక యుద్ధరంగంబున ప్రాణములు వదలి సద్గతిపొందిన గోగణముల యొక్క శిరస్సులు శృంగము లతో కూడా తీసుకవచ్చి వాటికి పసుపురాచి నిత్యసాంబ్రాణి ధూపము లిచ్చి యిండ్లలో వుంచుకొని యిదిగాక గోవు ఆకృతిగా శిలలపైన చెక్కించి, అవిన్నీ ఒక స్థలమందు పూజలు చేస్తున్నారు.. ఆ శిలలు వుంచిన స్థలానికి జనులు 'ఆవులమాలె' యని చెప్పుకుంటున్నారు. ఆ ఆవులమాలె యొద్ద పైన చెప్పిన యాదవులు ప్రతిసంవత్సరమున్ను తాళమేళములు, పంబజోళ్లు, వీరతాళ్లు, జమిడికెలు, పురవనమద్దెళలు యీ వాద్యములతో సంభ్రమంచేస్తున్నారు. యీ సంభ్రమానకు వారి సంబంధికులైన వారున్ను, వారు కట్టించిన 'ఆవులమాలె' యందు అభిమానము కలవారు యెంతదూర ములో వున్నాగాని వార్ని కాటమరాజుగారి 'పాంగ్యస్తులు' అని వాడుతున్నారు. అలాగంటి 'పాంగ్యస్తులు' అయినవారికి పసుపుగుడ్డలు అక్షతలుగట్టి సంభ్రమం చేసే దినం నిర్ణయం చెప్పి పంపించి వారిని పిలువనంపించి అందరు వారి వారికి తానకములు అనే నిర్ణయం కలవు. తానకమంటే యేమంటే యల్లెద్దు తానకం, బొల్లెద్దుతానకం, బోడియెద్దుతానకం, కర్రెద్దుతానకం, పైయెద్దుతానకం యీ ప్రకారం అనేక తానకములు నిర్ణయం కలవు. తానకసంజ్ఞ యేమంటే యెల్లెద్దుతానకంవాడు ఆవులమాలెవద్దకివచ్చి నిలిచివున్నప్పుడు 'పంబవాడు' అంటే 'పంబజోడు' వాయించేవాడు, యెల్లెద్దు పరాక్రమం తలచి ఆ ఆవు మేసుట, నీరుత్రావుట, గంతులువేసుట, యక్కడ యక్కడ తిరుగుట తుదను యుద్ధరంగంబులోచేసిన పరాక్రమం సహాగా పొగడితే ఆ తానకం అనుసరించి వుండే వానికి శివం వచ్చేది కలదు. ఈ ప్రకారం కొంతసేపు తానకములు పాడినతర్వాత కాటమరాజుగారి పరాక్రమమును 'సుద్దులు' అని పాడేది కలదు. ఈ సంభ్రమములోను ఇండ్లవద్దవుండే శృంగసహితములైన గోశిరస్సులు తెచ్చి మాలెలో ఉంచేది కలదు. అందుకు శనగలు, పెసలు నానవేసి శిలలపైన ఉండే ఆవుల ప్రతిమలకున్ను, దేవరావులు అనే గోశిరస్సులకున్ను నైవేద్యం చెల్లించి ఆపణ్యారం బ్రతికివున్న గోవులకు తినిపించేది కలదు. ఈ సంభ్రమము పేరు 'ఆవులపరువు' అని వాడుకునేవారు.

(లోకల్ రికార్డులు)

(ఆంధ్రపత్రిక.,జూన్ 25, 1944)

3

నెల్లూరి ఱేడగు నల్లసిద్ధిరాజులుం గారికి ఒడబడిక పుల్లరి యియ్యక యిబ్బందిపెట్టుచున్నందుకు కాటమరాజుగారి దగ్గిరికి నెల్లూరినుండి నల్లసిద్ధి పంపున భట్టు రాయబారము వచ్చి

"బ్రహ్మయువగు నీకు పార్థివేంద్రుండ!
ప్రాలుగల రాజువు బహుకీర్తిదీప!
ఘనరిపు సంహార! కాటమరాజ!
ఒడబడికపుల్లరి యొప్పనియకుంట
అపకీర్తి చేకూర్చు నడుగుదాటకుము
యిప్పించుపుల్లరి యిటునటు కదలు
తప్పునాడకు నీతిధర్మంబులనగ
ఆ మాటలకు రాజు అగ్నియైమండి
కొమరుబంగరుభట్టు గొబ్బున బిలిచి
పలికించె నల్లసిద్ధి భట్టుతో నిట్టు
పల్లెత్తి పుల్లరన్ పలుకాడెదేని
కడువేగ మిటనుండి కదలి పొమ్మనుమి."
భట్టుభట్టును గలసి భాషించిరపుడు
"రాయబారము చాలు రసికుఁడ వినుము
పుల్లరంటే కాసుపుట్ట దిచ్చోట
నీ మాట మీ రాజు కెఱిగింపుమోయి
సమ్మతి గాదేని సరగ మా మీద
దండెత్తి మీ రాజుఁ దరలి రమ్మనుము
కాక మాపెద్దల కడుయుద్ధమహిమ
చెవికెక్కియుండు మీ క్షితిపాలకునకు
కదనమంటే వీడు కదలలేడేమొ
తరచుమాటలు మాని దాగుండు మనుము"
అంత చింతాక్రాంతుడై రాయభట్టు
రాయబారము చెడెరా యన్నవంత

కొండంత నెత్తిపైకొన నూరి కరిగె.
కలియుగ కర్ణుండు కాటమరాజు
భట్టు మఱ్ఱులట జూచి ఫక్కున నవ్వె
....
అంతట నెల్లూర నా సిద్ధిరాజు
వంతుగా వీరపరివారము గొల్వ
నాయకులందఱు నాట్యశాలకడ
ఆయత్తులగుచు దామపుడు కూర్చుండి
రాయెడభట్టును రాయబారంబు
ముగియించుకొని వచ్చి ముందఱనిలిచి
ముకుళితహస్తుడై మొఱ చెప్పసాగె
సిద్ధిరాజ! నీ యాన శీఘ్రమే పోయి
పాలేటియొద్దను పంచలింగాల
కొండకు తూర్పున కొదవేమి లేక
వన్నె వన్నె గుడార్ల వాడ లేర్పడగ
నందందయెత్తించి యాదవరాజు
నలభైనాల్గుస్తంభాల నడుగు దారమున
పగడసాలలనాడ పగ లడంచుకొని
దర్శించి మన్నన దగ ప్రస్తుతించి
పసులపుల్లరి యీక మసలి వచ్చితిరి
ఒప్పుకొన్న ధనమియక యూరకుండితిరి
శిలాక్షరమువంటిది సిద్ధిరాజు ధనము
నెమ్మి ముడుపులుగట్టి నెల్లూరికంపి
అడుగుసాగుట యుక్త మన్నంతలోన
గొనకొని యాదవుల్ కోపానలేచి
ఆగ్రహోదగ్రులై యవనీశ! నిన్ను
తూలనాడుచును దుందుడుకులాడుచును
పుల్లరి యిమ్మంటె పొడిపింతు మనిరి
భట్టవు నీవని పలుకుచున్నాము

కయ్యంబు తప్పక కాబట్టియుండె
రమ్మను మనికి మీరాజు నింతటనె
శక్తిలేకుండిన శరణద్గుమనుము
అని తూలనాడి నన్ననిపి రటన్న
విన్నంత నలసిద్ధి వివశుడై వ్రాలి
మన్నీల దొరలను మంత్రుల బిలిచి
సాహసులార! యోక్షత్రియులార!
భారతవేత్తలౌ భావజ్ఞులార!
వినుడి యాదవుల యీ వెకలి సాహసము
తొలి కౌరవులనాడె ధూర్తులటంచు
వారిపై నాకెంతొ వైరస్యముండె
భీమనాయడనేక ప్రియములు చెప్పె
భూమియాదవు లెంతొ పుణ్యాత్ములనుచు
సత్యము దప్పని సరసులటంచు
ఆ మాట నమ్మి నేనావుల కొఱకు
భూమి నిచ్చితి నంత పూరెల్ల మేసి
ఆ యావు లెంతెంత హానిచేసినను
తనువులో సత్యంబు తప్పకుండితిమి
వీడక గొల్లలు విపరీతముగను
ఆడుచున్నా రిప్పు డడకువలేక
పదనైనమాటలు పలికిన వెనుక
గొల్లరాజును లెక్కగొనకుండ దండు
వెళ్లకుండగ గాదు వెస రాచపాడి
సిద్ధనతిక్కన శీఘ్రమె పిలిచి
లేఖ లుద్ధగిరికి లిఖియించు మనెను
కోట్లపర్యంతము కూడును దండు
చీట్లు వ్రాయించుమా శీఘ్రాన తిక్క!
వాలాయముగ దండువత్తురుగాని
కోలలకయి బోయగొట్టాలకంపు

వేలులక్షలు వచ్చు వివర మేర్పడును
అనిన తిక్కనమంత్రి అన్ని దిక్కులకు
కడువేగమున బంపె కమ్మ రమ్మనుచు
అంపినలేఖల కవని యాకసము
కంపింపగా దండు కదలి యేతెంచె
తిరువణామల తిప్పరాజు తిరుకంటరాజు
యిరువదివేలతో యేతెంచె నపుడు
పెదవేగి బొక్కరాజు పెదగరుడరాజు
మదగజములతోడ మఱి వేగవచ్చె"

వ॥ నలసిద్ధిరాజు తమబలమెంత ప్రబలమైనదైనను యాదవులబలము కూడ తృణీకరింపరానిదే యని తన సేనాపతులతో నిట్లు వివరించుచున్నాడు.

వారి మందలలోన వాసుదేవుండు
ఆరూఢి బొల్లియావై పుట్టినాడు
అందుచే కృష్ణసహాయమున్నదని
పదిబదియాదవుల్ పదరుచున్నారు
అదిగాక వారికి నధికధైర్యంబు
పురణింప గనివాత పులులున్న యట్లె
అతిధీరసాహసు లాచల్లవారు
వారితో సరిపోలువారు దుర్లభులు
అని మది సిద్ధిరా జనుమానపడగ
ననియె సిద్ధనమంత్రి యధిక సంప్రీతి
పల్లవనలసిద్ధి పట్టాభిరామ
చల్లవారిని చాలసన్నుతించకుము
మనముందు వారెంతమాత్రయు గారు
చల్లవారెంత యా సైన్యం బదెంత
యాదవబల మది యంతయు నెంత
మన దళంబులు చూడుమా యెన్ని గలవో
సైన్యోపసైన్యాలు చాలగా గలవు

అందలాల నృపాలు రెందఱో కలరు
పాలకీ రాజులు చాలగా గలరు
కనుచూపు మేరకింకను పైన గలరు
పగయన్న నెల్లూరు పొగులుచున్నదియు –
....
ఓ సిద్ధిరాజ! నేనొకడనేపోయి
సంహరించి వత్తును శత్రుసైన్యంబు
చల్లవారి నందఱిని సమయించివత్తు.
....
అనిన భూనాయకుం డందుకే మనక
యట్టె యూరక యుండె; నా మరునాడు
ఒనర తిక్కనమంత్రి యొప్పుగా బలికె
ధరణీశ! నిన్న నే దండంపుమన్న
అందుకు బదులు మాటాడకుండితివి
యేమి నీ యుద్దేశ మెఱిగింపుమనగ
నవ్వి తిక్కనతోడ నలసిద్ధి పలికె
కరణాల దే యూరు కయ్య మే యూరు
చదువను చదివింప సరిసంప్రతింప
వ్రాయను వ్రాయింప వ్యవహార సరణి
లెక్కింప మీకు చెల్లినదంతె కాని
పగతుల నిర్జింప పనికాదు మీకు
అరులకండలురాల్ప నలవాటు లేదు
అన్న భూపతికి తిక్కన్న యిట్లనియె
కరణమంచును గృపకల్గినజాలు
ఈ పని కనుపుమీ యీడేర్చివత్తు
గట్టిగా సెలవిచ్చి కలనికి పంపు
అంచు పైపై నడ్గ ననుమతి చేసి
గంధము కస్తూరి కలయగాబూసి

తముకుతో కపురంపుతముల మిప్పించి
పోయిరమ్మని చాలపోషించి పంపె"

వ॥ తిక్కన యుద్ధమునకు వచ్చి చల్లవారి ముందఱ నిలువలేక తన సైన్యమెల్లెడ చెల్లాచెదరుకాగా యొక్క చేయయి చీకాకుపడుచుండగా

చల్లపిన్నమనేడు సార్వభౌముండు
అల్లంతటను నిల్చి యతని కిట్లనియె
పోరు నిల్పగదోయి భూసురోత్తముడ!
సరిగాదు మా తోడ సమరంబుసేయ
అగ్రజన్ములు మీరు యాదవుల మేము
ఉగ్రము మీ మీద యుంచంగ రాదు
తరతరముల తాత తండ్రులు మేము
బట్లు, బ్రాహ్మణులను, వైష్ణవోత్తముల
వెట్టిచెఱలు మాన్పి వెనుక వేసికొని
ప్రాణాలొసగి కీర్తి ప్రబలి యున్నాము
కడకు బ్రాహ్మణహత్య కట్టుకోరాదు
ఆ మీద నెఱుఁగుదు వన్నియు నీవు
భూమీశుఁ డెఱుఁగని పోరు నీకేల?
దవ్వుననుండె మీ ధారుణీశ్వరుఁడు
ఇచట నీ యుద్ధంబు నెవరు చూచెదరు
పోరు నీకేల? పో బుధపుంగవుండ!
యిట సిద్ధిరాజు దండెత్తి రమ్మనుమి
అని యిట్లు చల్లపిన్నయ్య వారింప
నశ్వంబుపై నుండి యపుడు తిక్కన
మనసులో నొక నీతిమార్గంబు దలచె
యతులు ప్రాసలులేని యా కైతయేల?
శ్రుతిగూడి నడవని సొగసు పదమేల?
యితరులు మెచ్చని యీటె సాధనయేల?
పతిచూచి మెచ్చని బంటుతనమేల?

నేబోయి రాజున కిపుడు చెప్పినను
దగుబలముతో రాజు దండెత్తివచ్చు
మునిదళముతో వచ్చి మందుగా నేను
పగతుల జంపుదు పల్లవుల్ మెచ్చ
చల్లవారిని ద్రుంతు సమరంబులోను
అనుచు దిక్కనమంత్రి యాత్మఁ దలపోసి
యనిసేయ కప్పుడే యచ్చోటు వాసి"–
యింటి కరిగెను

....

అప్పుడు పురజనులందఱు నతని
చప్పట్లు గొట్టుచు జాతులాడుచును
కేకలువేయుచు గేలించిరిట్లు
వివేక మెఱుగని వెఱ్ఱికరుణగాక!
అవనీశ! నేబోయి యనిసేతుననుచు
ఊరికే చెప్పని యొక్కపొద్దనగ
జగడానికై నీవె సాగిపోయితివి
తాటియాకులు గీచి తగవ్రాయగాని
చెలగి యుద్ధముసేయ చేతనేమౌను
యెదిరించి నిలచిన హెచ్చు సేనలను
సరిసేయగా యజ్ఞశాలలు గావు
అరుల పోరులుగాని యక్షతలుగావు
మారణాగ్నులుగాని మంత్రాలుగావు
చనుదెంచుచక్రాలు చక్కిలాలుగావు
ఘనచక్రబాణాలు గారెలుగావు
అర్చి నఱకే కత్తు లరిసెలుగావు

ఇత్యాదిగా పౌరులు గేలిసేసిరి. తండ్రి, తల్లి, భార్య, యీసడించిరి.

(ఆంధ్రపత్రిక
ఆగస్టు 6, 1944)

4

అతిపెద్ద వింతకథ. దాని సారము కొంతకుకొంత చరిత్రజ్ఞు లెఱింగినదే.

వ॥ మఱునాడు తిక్కన్న మరికొంత సైన్యము తోడ్కొనిపోయి యాదవులతో యుద్ధమునకు దలపడెను.

పెళ్లున నవ్వి యా విప్రుని జూచి
చల్లపిన్నమనేడు సరగ నిట్లనియె
మానవాధీశ్వర! మంత్రివర్గంబు
పూనిరోషంబును బుట్టించినారు
బంధుజనులు దూరి పగరేపి మారు
అంతకొంత దళంబు లనుసరింపంగ
బుద్ధిచాలనియట్టి భూసురోత్తముడు
యుద్ధంబుసేయ నుద్యోగించినాడు.
సర్వథాబ్రాహ్మడు చావకబోడు
బ్రహ్మహత్య మనకు పట్టకపోదు
అని బ్రాహ్మణుని జంపనైతిమేనిపుడు
ఇందఱ నతడు మాయింపకపోదు
చంపకుండగరాదు చావగారాదు.
ఇందుకు గతియేమి యెఱిగింపు మనగఁ
బ్రఖ్యాతిగల మంత్రి బ్రహ్మరుద్రయ్య
ధీరుఁడు యిట్లని తెగి విన్నవించె
చింతింప నీకేల క్షితితలేశ్వరుడ?
చలముకొని పోరాడ చనుదెంచునపుడు
కులవివేచన చేయకూడ దెవ్వరికి
పఱతికై రాముడు పాపిరావణుని
రణమున ద్రుంచడా బ్రాహ్మణుండనక
వైరి నెక్కువనక వధియింపవలెను
యెదిరించినప్పుడు యెవరైతె నేమి?
వధియింపవలె గాని వర్జింప దగదు

ఇట్లుండె ధర్మం బింకేల చింతింప
నట్లు గాకయు బ్రహ్మహత్యకై నీవు
వెనుకాడెదవయేని విను చల్లపిన్న!
నేజేతు నతనితో నిలిచి యుద్ధంబు
బ్రాహ్మడాతడు శివబ్రాహ్మడ నేను
బ్రాహ్మణులము పోరు పాటింపగలము
అతనిని నే జంపు టది ముఖ్యమాయె
అతనిచేతనె నేను హతమైతి నేని
యాదవకులనాథ! యది వినవయ్య
గోదావరియు నెట్టిగొండ లెన్నాళ్లు
ఆదిత్యచంద్రులు నవని యెన్నాళ్లు
అన్నాళ్లు వెలయు నీ యాదవకథయు
గలియుగ మెన్నాళ్లు గలుగునన్నాళ్లు
అవనిలో నా పేరు నది నిల్చియుండు
హరహరా! హరహరా! యని బ్రహ్మరుద్రు
డరుదైన తలమీది యాలింగమూర్తి
నచ్చోట వెలయించి యర్చన లిచ్చె.
గంధాక్షతలచేత గావించె బూజ
మారేడుపత్రియు మల్లెపూవులును
శిరమున వెలయించె శివలింగమునకు
వీరబోనంబును వేగ చెల్లించె
గపురతాంబూలంబు గానుకలిచ్చె
ధూపదీపములిచ్చి స్తుతులుగావించె
చంద్రసూర్యాదులు సాక్షిగా నిట్లు
మీరక నడపింపుమీ మా తలంపు
మాకు లింగైక్య మీ మాడ్కి చెల్లింపు
మని చల్లపిన్నని కానతియిచ్చి
కడువేగమున వీరకాసె బిగించి
అదరి విభూతి రుద్రాక్షలు దాల్చి

వీరాంకములు మేన వెలయించి మించి
ఆత్మలింగము మనమందున జేర్చి
కరవాలమునుబట్టె ఘనుడు రుద్రయ్య
పరికింప నా వీరభద్రునిరీతి
యాదవు లొక కొందఱపుడు గొల్వంగ
ముఖ్యనాయకుడయి ముదముదీపింప
వే వేగ రుద్రుండు వృషభంబు నెక్కె
సరితిక్కడంత నశ్వంబు దూకించె
మఱి బ్రహ్మరుద్రుండు మార్కొని నిలిచె
తీవ్రించి తిక్కన్న త్రిప్పె ఖడ్గంబు
కరవాలు ఝళిపించె ఘనుడు రుద్రయ్య
అప్పుడు రణములో నట్టచట్టలుగ
తలలు బాహులు గరుండములు మొండెములు
కుప్పలై కండలు గుండెలురాలె
అప్పుడు తిక్కన్న కాయె గాయాలు
తప్పక తిక్కన్న దళమెల్ల నొఱగె
చూచిరి యాదవుల్ చోద్యమందుచును
తిక్కన యొక్కడై తిగువాఱినాడు
పెక్కు రొక్కనితోడ పెనగాడరాదు
అని బ్రహ్మరుద్రు డల్లంతన నిలిచి
నిలిపిన తోడ్తోన నీతిజ్ఞులగుచు
నిలిచిరి యని మాని నెఱజోదులెల్ల
అప్పుడు తిక్కన్న యగ్నిచందమున
కదిసెను కోపాగ్ని కన్నుల నురల
నదలించి రుద్రుని నడ్డాన వైచె
వడిరుద్రుడంత నావాటు దప్పుకొనె
గరవాలు గైకొని కదిసె రుద్రుండు
విడివడి రిద్దఱు వీరయుద్ధమున
ధరణిపై నొండొరుం దప్పించుకొనుచు

లంఘించి వెనుకకు రాగడిల్లుచును
ప్రాకుచు దూకుచు పైకి రేగుచును
తాఱించి నఱకుచు తాకిపొడ్చుచును
ఉరవడి వచ్చిన వరవడిచేసి
కటపెట కంఖంగు ఖల్లుఖల్లనుచు
మెఱపులవలె మీద మెఱయుచు బిడుగు
చఱపులవలె గొప్ప సడిని వ్రేయుచును
యిర్వురు పోరిరి దుర్వారులగుచు
తిక్క దుద్రిక్తుడై తెగవేయ రుద్రు
దుక్కతి చెక్కలై యుర్విపైబడియె
పడుచునె రుద్రుఁ డాపక ఖడ్గధార
దడయక తిక్కన తలద్రుంచి వైచె
బలియు దిక్కన జంపె బంతమీడేర్చె
బ్రహ్మరుద్రయ్య తా బ్రాణాలువిడిచె
అంతలో చల్లపిన్నమనాయనికిని
బ్రహ్మరుద్రుని మృతివార్తలు చేరె
బిన్నమనాయండు బిట్టు దుఃఖించె
సాహసాత్ముతు చన్న చందంబు చూచి
తెగివ్రయ్యలయి యున్న దేహంబుపొదిగి
ముందఱనిడుకొని మునిగెదుఃఖమున
గటకట! రుద్రుడా! కట్టిడి దైవ
మిటులౌనె బ్రాహ్మణ యీశ్వరుమహిమ
యాదవులకు బ్రహ్మహత్యరాకుండ
తిక్కన్న దెగటార్చి దివి కేగినావె
పరమోపకారివి పావనమూర్తి
పరగ మా కొఱకయి ప్రాణమిచ్చితివి
యెన్నెన్ని జన్మాల నెత్తినగాని
తిన్నగా నీ ఋణము తీర్చుకోగలమె?
మా తోడ నాడిన మాటలక్రమమె

భూతలంబున నీకు బూజలొనరించు
నరుదైన యిలువేల్పవని కొల్చికాని
పరికింప నీ ఋణము పాపుకోలేము
అనుచు పిన్నమనాయదనుజులు తాను
బ్రహ్మరుద్రుని గుణప్రస్తుతి జేసి
మహనీయమైన సమాధిగల్పించె
మాఘమాసమున నమావాస్యతిథిని
మంగళవారాన మధ్యాహ్నవేళ
గోబిలమున రుద్రు గూర్చుండబెట్టి
నీలకంఠునియందు నిక్షేపఱిచి
యందఱు నిండ్లకు నరుదెంచి రంత
సిరిగల తిక్కన్న చెల్లగా నంత
చిల్లరసైన్యంబు చేరె నెల్లూరు
సిద్ధనకొల్వుకు శీఘ్రుంబె పోయి
తెల్పిరి తిక్కన తీవ్రశౌర్యంబు
"అనిలోన దెగటార్చె యాదవబలము
కొదమసింగము లేళ్లగుమి గూల్చినట్లు
కఱకులుకఱకులుగా సేననఱికె
గసిమసంగుచు నుప్పుగల్లుగా జిదిమె
బ్రహ్మరుద్రునితోడ ప్రతినిల్చి పోరె
ధీరవిహారులై తెగిరి యిద్దఱును
దిక్కన్న రుద్రయ్య దివి కేగినారు"
ఆ మాటవిని సిద్ధనామాత్యు డరిగె
రణభూమి గొడుకుమారణము గన్గొనగ

(ఆంధ్రపత్రిక
ఆగస్టు 13,1944)

తెనుఁగుతేటదనము

తేటతెనుఁగును గూర్చి కొంచెమంత తెలుపుచున్నాను. ఆంధ్రద్రవిడ కర్ణాటభాషలలో తెనుఁగుమాట ప్రసన్నమయినదిగా ఉండుటచేత 'తెనుఁగు తేట అనియు, 'తేటతెనుఁగు' అనియు, 'తెనుఁగుతేనె' అనియు, 'దేశభాష లందు తెలుఁగు లెస్స' అనియు నానుళ్ళు పుట్టినవి. తెనుఁగు కీ తేటదనము, లెస్సదనములు సంస్కృత ప్రాకృతముల పాళ్ళు సమరసముగా కలియుటవల్లను, ద్రవిడకర్ణాటకములకంటె తెలుఁగుమాట మార్దవ, సౌలభ్యములు కలదగుట వల్లను ఏర్పడినవి. ఈ తేటతెలుఁగు చచ్చుడివాని దగ్గఱనుండి జగద్గురువు దాఁక, ఉగ్గుపాలనాఁటినుండి ఉసురుడుగుదాఁక, బాలశిక్షదగ్గఱనుండి మోక్షవిద్యదాఁక అన్నిజాతులలో, అన్నిదశలలో, అన్నివిద్యలలో, క్షణక్షణ పరిణామముతో, నవనవవికాసముతో కలకలలాడుచుఁ, దొలఁకులాడుచు నున్నది. హెచ్చుకాలము లిపిరూపముపొంది నిలిచియుండ నక్కఱలేని సంభాష ణాదులు, నవ్వుటాలు, తగవులు మొదలయిన వాగ్వ్యాపారములను విడిచిపెట్టి నప్పటికిని లిపిరూపముపొంది కొన్ని పురుషాంతరములదాఁక ఉండవలసిన వర్తకము, దేశపాలనము, ఆచారవ్యవహారములు, దస్తావేజులు, రాజశాసన ములు, దానశాసనములు మొదలయినవానిలోను, దేశము, భాష ఉన్నంత కాలము ఉండవలసిన కథలు, కళలు, పాటలు, పదాలు, నాటకములు, నానా శాస్త్రములు, కావ్యములు మొదలయినవానిలోను, భాషాప్రవాహము పాయలు వాఱి పాఱుచు, మాఱుచు, తేఱుచు కావ్యసరస్సులలో నిండార్లుగా నెలకొనుచు నుండును. భాషకున్న ప్రయోజనము లన్నింటిలోను ప్రౌఢకావ్యరచన పరమ ప్రయోజనమనవచ్చును. భాషచెందు క్రమపరిమాణపుమెట్లలో ఉత్తమ కావ్యరచన కడపటిమెట్టు. వాడుకభాష అను ముడిసరకునుండి ఉత్తమ కావ్యమను సున్నితపు మేల్మిసరకు తయారవుచుండును. అయినను భాషాప్రయో జనములన్నింటికిని ఈ మేలిమిసరకు ఉపయోగపడదు. వాడుకభాష మంచినీటివలె బహుప్రయోజనము కలది; కావ్యభాష పంచదారపానకము వలె పరిమితప్రయోజనము గలది.

ప్రౌఢకావ్యప్రయోజన మొకటి విడనాడినచోఁదక్కిన భాషాప్రయోజ నములన్నింటిలోను వాడుకభాషయే ఓలలాడుచునున్నది. కొందఱు సంస్కృతాంధ్ర

కవీశ్వరులు శాసనకావ్యమను పేరుతో ప్రౌఢగద్యపద్య రచనలలో వెలయించి నను ప్రాచీనశాసనము లెన్నియో వాడుకభాషలో నున్నవి.

ఇంకను ప్రాచీన కావ్యవ్యాఖ్యానములు, కథలు. శాస్త్రగ్రంథములు, వ్యవహారగ్రంథములు, దేశచరిత్రలు చాల చాల వాడుక భాషలోనే ఉన్నవి. వాని నన్నటిని ఉదాహరించుట కిక్కడ చోటు చాలదు. శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారి గద్యచింతామణిలో చూచుకోవచ్చును. ఇంకను పద్యగంధు లయిన బాలకథలు, పొడుపుకథలు, నానుళ్ళు, పలుకుబళ్ళు, సామెతలు, స్త్రీలపాటలు పదాలు, పనిపాటుల వారి పాటలు పదాలు, వృద్ధుల వేదాంత వైరాగ్యపు పాటలు పదాలు, ఎఱ్ఱిగొల్లలు, పిచ్చుకుంట్లు, పంబవారు మొదలగు వారు పాడు దేశికథా రచనలు– అన్నియు వాడుకభాషలోనే ఉన్నవి. ఇవి కూడా వాఙ్మయములో చేరునా అని పండితులుకొందఱు పరిహసించు చుందురుగాక! వాని రుచిని గుర్తింపఁగల్గుటకుఁ గూడ నొక యనుభవవిశేష ముండవలెను. ఒక్క తార్కాణ చూపుచున్నాను. చల్లపల్లి జమీందారుగారి పట్టాభిషేకోత్సవపునాళ్ళలో వారికోటలో రాత్రులు నాటకములు, పాట కచ్చేరీలు, బోగమాటలును సాగుచుండెడివి. కోటవెలుపల మాలదాసరుల వీథినాటకములు, తోలుబొమ్మలాటలు సాగుచుండెడివి. వచ్చిన పండితు లందఱును కోటలోని ఆటలు, పాటలు, నాటకములు చూడఁబోవు చుండెడి వారు. మా గురువులు శ్రీ చెళ్ళపిళ్ళశాస్త్రులుగారు కోటవెలుపల మాలదాసర్ల వీథినాటకములు చూడఁబోవువారు. రాత్రి తామాస్వాదించిన రసానుభవమును మర్నాఁడు పునశ్చరణచేయుచు ఆనందించుచు మాకు వినిపించి మమ్ము ఆనందింపఁ జేసెడివారు. వారు గుర్తించి చెప్పినప్పుడే వాని రుచి ననేకులు గ్రహింపగలిగెడివారు. వా రీ మధ్య పత్రికలలో లోకాభి రామాయణములను మంచి వాడుకపలుకుబళ్ళతో ముంచెత్తినారు.

ఆంధ్రభాషలో ఆదికాలమునాఁటి కావ్యరచన ముడిసరకు భాషతో, దేశిచ్ఛందోరచనతో ప్రజాసామాన్యమునకు సులభముగా ఉండెడిదనియు, అదియే ఇప్పటి పాటలు పదాల వాడుకభాష అనియు నా నమ్మకము. నన్నయ భట్టారకునికి పూర్వము శాసనములలో సీసగీతమధ్యాక్కరలు పద్యములు

కనఁబడుచున్నవి. వానిలో మధ్యాక్కరను నన్నయాదులయిన ఆదికాలపు ప్రౌఢకవులు కొందఱే కొంచముగా పాటించినారు. ఆదికాలపు మధ్యాక్కర ఒకటి ఉదాహరించుచున్నాను:

"స్వస్తి నృపాంకుశాత్యంతవత్సలసత్యత్రినేత్ర
విస్తర శ్రీయుద్ధమల్లుఁ డనవద్యవిఖ్యాతకీర్తి
ప్రస్తుత రాజాశ్రయుండు త్రిభువనాభరణుండు సకల
వస్తుసమేతుండు రాజసల్కిభూవల్లభుం డర్థి."

ఇందులో కొన్ని యక్షరములను జేర్చినను తీసివేసినను పద్యము పద్యముగానే ఉండునట్లు రచన ఉన్నది. పఠన ఫణితి తాళగతి కలదిగా గోచరించుట లేదు. సంగీతరుచి గుర్తించిన తెలుఁగుకవులు ఈ పద్యమును ఎందుకు పాటించినారా అని సందేహించుచుండువాఁడను. అర్వాచీనకవులు దీనిని అందుకనియే విడిచిపెట్టినారు కాఁబోలును. ఒకనాఁడు మా యింటిలో మా అమ్మగారు ప్రాఁతకాలపు పాట లేవో పాడుచుండగా వినుచున్న నాకు అందొక పాటఫణితి చాల ఆనందజనకమయినది. నేఁటి కావ్యరచనల కనుకూలింపఁ జేసికొందమని గణవిభజనచేసి చూతునుకదా అది మధ్యాక్కర లక్షణము కలదయియున్నది. మధ్యాక్కర పఠనఫణితి నా కపుడు తెలియవచ్చి నది. దాని మాదిరి చూపుచున్నాను. చూడుఁడు:

"అంతట రాములవారూ – అంగన సీతను గూడీ
సంతసమందుచు వేగా – స్వపురమునకు చనుదెంచీ
తమ్ములతోడను గలసీ – నెమ్మది రాజ్యములేలే
ధర్మముతో ప్రజలెల్లా – తామరతంపరలైరీ."

ఇందు రెండు ఇంద్రగణములు, ఒక సూర్యగణము, రెండు ఇంద్రగణములు, ఒక సూర్యగణము – వెరసి ఆఱుగణములు కలది ఒక చరణము, మూఁడవగణము కడపట సీసచరణ దశమువలె మధ్యాక్కరచరణము మధ్యకు విఱుగును. ఆదికాలపుకవులు పాటించిన సీసద్విపదగీతపద్యములు కొంచెము మార్పులు చెందియు, చెందకయుకూడ స్త్రీబాలపామరాదులు పాడు పాటలలో, పదాలలో కానవచ్చుచున్నవి. స్త్రీలుపాడు శ్రావణమంగళ వారపు పాట సీసపద్యమే.

"శ్రావణామాసాన శుద్ధపాడ్యమినాఁడు
మహలక్ష్మి ముత్యాల చీరగట్టి"

అని దాని మొదటిచరణము. మఱియు ద్విపద అను ఆదికాలపు రచన అనేక ఫణితిప్రభేదాలతో పాటలలో, పదాలలో చేరివున్నది. ఒకటి రెండు ద్విపదఫణితిప్రభేదములు చూపుచున్నాను:

"ఒకరూ కట్టిన చీరా ఒకరూ కట్టారూ
ఒకరూ తొడిగిన రైకా ఒకరూ తొడగారూ
ఒకరూ పెట్టిన నగలూ ఒకరూ పెట్టారూ
వార్నీ పొసగింపా నా వశమూ కాదనెనూ."

ఇది ద్విపదవికారమే.

"వెన్నెలబైలనే వేలసంఖ్యలనూ
పందిళ్ళు వేయించీ పరమాపావనులూ"

ఇదియు ద్విపదయే.

ఇట్లు ఒక ద్విపదయే పలురసములలో, పలుఫణితులలో వాడుకభాషలో పలుపాటలుగా వెలసినది.

ఆదికాలమునాఁటి పాటల ప్రబేధములను కొన్నింటిని పాల్కురికి సోమనాథుఁడు పేర్కొన్నాఁడు. వాని నన్నింటిని ఇక్కడ వివరింపఁగుదురదు.

సంస్కృతాంధ్రములలో ప్రౌఢభాషామయములైన భారతరామాయణాదులను చదివి తత్కథాప్రయోజనమునుభవించువారికంటె వాడుకభాషలో పాటలు పదాలుగానున్న భారతరామాయణకథలను బొమ్మలాటలలో, వీథినాటకములలో వినియు, చూచియు ఆ ప్రయోజనము ననుభవించు ప్రజలు దేశములో చాలహెచ్చు. పై తీరున లోకసామాన్యమునకు అర్థము కాఁదగినదియు, తేటతెలుఁగని, దేశితెలుఁగని, అచ్చతెలుఁగని ప్రాచీనులు పలుతెఱఁగులతో పేర్కొన్నదియు అయిన వాడుకభాషలో ఉన్న యంద చందములు వ్యాకరణముతో దిద్దితీర్చుట పువ్వునునలిపి వాసన చూపించుట వంటిదనియు ' సంకీర్తనలక్షణ' మను లక్షణ గ్రంథములో వారిట్లు చెప్పినారు.

"పల్లవనారీమ్లేచ్ఛా
ద్యుల్లాసమనోజ్ఞ బంధురోక్తులు చవులై
చెల్లును గ్రామ్యములైనను
హల్లీసకముఖ్యనాటకాదిక ఫణితిన్.

జగతిఁగల చెల్లుబళ్లై
నగినగి భాషించునట్టి నానుడిపలుకుల్
తగదన రహి చెడుఁ బువ్వుల
సొగసుడుగన్ బిసిగి కంపు చూపినభంగిన్."

ఈ లక్షణముచొప్పున యక్షగానములను నాటకప్రభేదములలో ఉందు దేశిచ్ఛందోరచనావిశేషములను పేర్కొనుటకిక్కడ చోటుచాలదు. ఇంకను వాడుకభాషలో, ద్విపదలలో కాటమరాజుకథ, పల్నాటికథ, కుమార రాముని కథ, మఱీక్రొత్త తరపుఁబదములయిన బొబ్బిలికథ, దేశింగురాజుకథ, లంకాసారథి మొదలయిన రసవద్రచనలు ఎన్నియో ఉన్నవి.

దేశము నలుముఖములను గాలించి మంచిమంచి పలుకుబళ్ళను, కథలను, సామెతలను, పాటలను, పదాలను, వింతశబ్దజాలములను సేకరించ వలెను. అచ్చురాకముందు అన్నిరకాలరచనలు తాటాకుల మీఁదను, నోటి వాడుకలమీఁదను నెలకొని ఉండెడివి. అచ్చువచ్చిన తరువాత ప్రాయికముగా ప్రౌఢకావ్యరచనకే పరిపోషము కలుగుటచేత, ప్రాంతకాలపు దేశిరచనలెన్నో అడగారిపోఁజొచ్చినవి. ఆంధ్రభాష యందచందములు సరిగా గుర్తించుటకు వీని సర్వే యత్యావశ్యకము.

(రేడియో ప్రసంగము
మదరాసు -25-1-1941
భారతి - ఫిబ్రవరి, 1941
తెలుగు మెఱుఁగులు
ప్ర.ము 1948
తృ.ము 1960)

తెలుగుపలుకుబళ్లు

గ్రంథములలోని కెక్కినవిగాక వాడుకలో ఎన్నో వింతవింతల పలుకు బళ్ళు నాలుకలపై నాట్యమాడుచుండును. స్త్రీలు, బాలులు, పామరులు, పండితులు, వడివడిగా మాట్లాడేటప్పుడు అప్రయత్నముగా చమత్కార గర్భితములైన పలుకుగుత్తులు ఎన్నో గ్రుచ్చుతూ ఉంటారు. శక్యమయినంత వరకు వాటిని సంధానించి ప్రకటింపబూనినాము. అకారాదిక్రమాన వాటిని సమకూర్చవచ్చుగాని, యిప్పుడు మాత్రము అట్టిక్రమము పాటించకుండా స్ఫురించినవి స్ఫురించినట్లు ప్రకటిస్తాము. అవసరమైనచోట్ల పలుకుబళ్ళకు వివరణముకూడా చేరుస్తున్నాము. పత్రికాపాఠకమహాశయులు తమకు స్ఫురించినవాటిని కూడా సమకూర్చి ప్రకటింపబంపితే వారి వారి పేర్లతోనే వాటిని ప్రకటిస్తాము.

అదృష్టం పండింది; అదుగో అంటె ఆర్నెల్లు; బ్రహ్మదేవుడి శంకనార్తి. శంకనార్తి అనే పదము 'శంకానివృత్తి' అనే పదానికి వికృతి. 'మలవిసర్జనము' దాని కర్థము. (బ్రహ్మదేవుడు మలబాధకువెళ్ళి తిరిగిరావడంలో యుగాలు చెల్లుతై అని పుక్కటిపురాణము); ఆఱు మూడయింది (కార్యం చెడ్డదన్న మాట;) కార్యం తల్లక్రిందైందని వాక్యార్థము. తెలుగు అంకె ఆఱు ౬ తల్లక్రిందై మారితే మూడు ౩ అవుతుంది. వ్రాసిచూస్తే తెలుస్తుంది;) ఆర్చేవారూ తీర్చేవారూ లేరు; ఆపదవస్తే అడ్డపడేవారు లేరు; అక్కరవస్తే మూల్గేవారు లేరు; ఆకలైతే అన్నం పెట్టేవారు లేరు; అక్కరవచ్చినప్పుడు అతికించుకొంటారు– కోపం వచ్చినప్పుడు కోసివేసుకొంటారు; అధ్వాన్నం శత్రుమధ్యం (శత్రువులు నలుతట్టులా చుట్టిముట్టి వస్తూ ఉండగా నడిత్రోవలో అన్నం వండుకుతినవలసి వస్తే అప్పుడు స్వాస్థ్యం, సౌకర్యం, ఉండదు గదా!); ఆ – అంటే అపరాధం; ఉ– అంటే ఉపరోధం (నోరు మెదల్చేటంతలోనే తప్పు లెన్నుతారన్న మాట); ఆదరా బా (బీ)దరా (తొందర తొందరగా అనే అర్థంలో వాడుతారు); అన్నం దాలా అవస్థ పడుతున్నాడు; (సర్వవిధాలా అని అర్థము,; అభ్యాసం కూసువిద్య; ఆడువాళ్ళమాట నీళ్ళమూట; అంతూపొంతూ లేదు (ముగింపు, చేరిక, లేదు); అజాఅంబారం లేదు; అసలుసందెవేళ; అప్పుసప్పు; అంటూసొంటూ;

అరచేతిలో వైకుంఠం చూపిస్తాడు; అంటే 'అన్నావ'ంటావుగానీ; అడకువగల కోడలు వెనకకు చిచ్చెట్టి జల్లెడపుచ్చుకు నీళ్ళకెళ్ళిందట; అయినాగాని అయితే గియితే కయితేపల్లి; అతీగతీ లేదు; అతిరహస్యం బట్టబయలు; అదుపూ ఆజ్ఞా లేదు; అచ్చుపోసిన ఆంబోతు; అష్టకష్టాలూపడ్డారు; పదరాని పాట్లెల్లా పడ్డారు; అద్దం దిగటం; అల్లాడి ఆకులు మేశారు; అద్దంలో నీడలకు ఆశపడ రాదు; అరకాల ముల్లు నాటకుండా చేరుకున్నారు; అరచేత అనుకుంటాను మీకు మరేమీ ఫరవాలేదు; అది మనకు అచ్చిరాదు; అమ్మా! తల్లీ! అని బతిమాలు కున్నారు; ఆలికి అన్నంపెట్టడం ఊరికి ఉపకారమా?; ఆశకు అంతంలేదు.

అందిందంతా హరించడమేనా?; ఆకూపాకూ తెలియదు; అట్లుడికినట్లు డికిపోయినారు; ఆవగింజలో అరభాగం గాలేదు; అనుభవించే అదృష్టం ఉండవలెను; అదేపనా 'పద్దాకా' (పొద్దుదాకా); అర్ధాకలి తిండి; ఆవగింజ మోకాట విరుస్తుందమ్మ ఆవిడ!; అచ్చగలిగితే పూటపడవలెగాని; అటుపోతే గోడపెట్లు ఇటుపోతే చెంపపెట్లు! ఆడలేకపోతే మద్దిలవోడు; అయ్యో తెలివీ తెలివి!; అని అనిపించుకోవడం అత్తగారా నీ స్వభావం; ఇంట్లో కుంబంభట్లు – బైట వెంకంభట్లు; ఆడవాళ్లను గోడుకుడుపరాదు; అరవకాకీ; పిలువపేరూ లేకుండా అంతరించారు; అయినదానికీ కానిదానికీ, ఇట్టా కలుగజేసుకోవవడం మంచిదిగాదు; అరకాలిమంట నెత్తికెక్కేటట్టు మాట్టాడాడు; అప్పిచ్చి పొత్తు కలపడం మంచిదిగాదు; అక్కడ భోంజేసి ఇక్కడ చెయ్యి గడగవలసినది. (అంత వేగంగా రావలసిందన్నమాట); అంతా క్షేమంగదా; అవుగాములు ఆలోచించుకుందాం; అడుగులో అరవైయారుగుణాలు; అక్కుగొఱ్ఱుగా వుంది; అట్లా చేసినా అందం చందమూను; ఆకలైతే రోకలిమింగు; అయ్య వాతపెట్టా బఱ్ఱె బతకానా?; ఆర్నెల్లు సావాసం చేస్తే వారు వీరౌతారు; ఆళ్ళు కొత్తయితే తిరగళ్ళు కొత్తా?; అదుగో అంటే ఆర్నెల్లు; అంభంలో కుంభం ఆదివారంలో సోమవారం; అన్నావో పడ్డావో!; ఎక్కేటందుకు ఏనుగులు ఏలేటందుకు రాజ్యాలు; ఊరపొద్దు గుంకలేదింకాను; ఏదీగాని వేళ; ఎగిరిపాటు ఎక్కువ, జరుగుపాటు తక్కువ; ఓ అంటే నా రాదు; ఓ కెన్ని వంకరలో యెరుగడు; ఏ యెండ కా గొడుగు పట్టుతాడు; ఎక్కడి లోకం ఎక్కడి కథ!; ఉన్నమాటంటే

ఉలుకు; ఏడుపులు పెడబొబ్బలు; ఉపాయం లేకపోతే ఊళ్లోనుంచి వెళ్లగొట్టు మన్నారు; ఊపిరి సలపకుండా పని ఉంటుంది; ఎడతెఱపి లేదు; ఎందుకు చెప్పవచ్చానంటే; ఉగ్గుగిన్నె ఉయ్యాల చేరు; ఏతి అంటే ప్రైతి అంటాడు. (ఎతి, అంటే ప్రతి అంటాడు' అని వాడుక); ఇంటింటా ఇంకో పొయ్యి, మా యింట మరో పొయ్యి; ఇంటిల్లు పాతీ; ఉట్టి కట్టుకు ఊరేగుతామా యేమిట?; ఈదబోతే తాగనీళ్లు లేవు; ఏళ్లూ కోళ్లూ యేకమయ్యేటట్టు వాన కురిసింది; ఏది యెట్లావున్నా; ఎవరికి ఎవరవుతారు?, ఏలేటందుకు ఊళ్ళులేవుగాని యెత్తుకుతినేటందుకు లేకపోయినయ్యా; ఉరిమిచూచాడు; ఉడ్డుకుడుచు కున్నాడు.

(ఆనందవాహిని
అక్టోబరు, 1930)

గాలికబుర్లు

పాటలు, పదాలు, పొడుపుకథలు, సామెతలు, పలుకుబళ్లు, నానుళ్లు, దేశీయములు, నొడికారములు, జాతివార్తలు, చమత్కారములు, పొడుపు పద్యములు, చాటుధారలు, లక్షణోదాహరణములు మొదలయినవాటిని, భాషాసస్యపుపంటలలో ఇదివఱకు సేకరముగాక గాలికికొట్టుకొనిపోతూ ఉండే చెదరుడు, రాలుడు, పరిగగింజలను, బిచ్చగాడినై ఊళ్ళూనాళ్ళూ తిరుగుతూ, ముప్పైయేళ్ల ముందు నుండి ఎక్కడపడితే అక్కడల్లా యేరుకు తెచ్చుకుంటూ ఉన్నాను. వాటిలో, ఏవో కొన్ని ప్రకటించినానను కొంటున్నాను. భారతిలో పూర్వము నేను బాలభాష అనే పేరుతో అప్పుడప్పుడు ప్రకటిస్తూ వచ్చిన వాటిని, నేను పుస్తకరూపముగా ప్రకటించవలెననుకొంటూ ఉండగానే అఱ కొఱగా ఎవరో ఒకరు ఎత్తి పుస్తకీకరించుకొన్నారు. శ్రీ కామేశ్వరరావుగారి 'పాతపాటలు' కాదు. అది వారి స్వార్జితమే. కడచిన ఏప్రిల్ 25 తేదీని (1943) నేను రేడియోలో ప్రసంగించిన విషయము[1]– ఆంధ్రపత్రికలో కూడా అప్పుడు ప్రకటితమయినది. అందు తెలుగుసామెతలెవరో పలువురు ప్రకటించి నారనీ పలుకుబళ్లూ (Phrases) నానుళ్లూ, లబ్జులూ– పలుకుగుత్తులు, అనే పేళ్లతో పేర్కొనదగినవాటిని ఆంధ్రప్రజల నాలుకల మీద నాట్యమాడుతూ ఉండే వాటిని ఎవరూ ప్రకటింపలేదనీ, వాటిని దేశము నలుమూలలవారు సేకరించడం మంచిదనీ భాషాక్షేత్రమును సర్వేచేయవలసి ఉన్నదని ప్రసంగించితిని. మాదిరిపలుకుబళ్ళనుకూడా కొన్నింటిని పేర్కొంటిని. పదిహేనేండ్లకుపూర్వము నేను 'ఆనందవాహిని' అనే పత్రికలో అటువంటివాటిని కొన్నింటిని, ప్రకటించితిని. ఇంచుమించుగా నెలకింద శ్రీ నారాయణరావుగారు భాషాయజ్ఞము చేస్తున్నట్టున్నూ, అందు లక్షసామెతలను సంపాదింపబూనినట్లు వాటిని అకారాది క్రమమున కూర్చుచున్నట్లున్నూ ఆంధ్రపత్రికలో వ్రాసిరి. వారు ఆంధ్రవాఙ్మయసముద్రమును పుడిసిలించి గుటకాయస్వాహా అంటున్న కుంభసంభవులు. వారి పరిశ్రమకు వందనములు.

1. సాహిత్యము – అన్ని తరగతులవారికి అనుభవింపదగి ఉండాలి.

వర్గవిభాగం

నేను సేకరింపగోరినవి వారు సేకరిస్తున్న సామెతలే కావు. కడచిన జూలై నెలలో నారాయణరావుగారు నేను సేకరించిన సామెతలు తమ కియ్య వలసినదిగా కోరిరి. సరే నన్నాను. సామెతలు వారు ప్రకటిస్తామంటున్నారు గనుక అవి అట్లే వారికిపంపిస్తాను. నేను సేకరించిన పలుకుబళ్ళను, నానుళ్ళను, లబ్జులను, పలుకుగుత్తులను నన్ను వారడుగనూ లేదు. నేనిస్తా ననసూ లేదు. గాబట్టి వానిని నేను ప్రకటించవలెననే తలుస్తున్నాను. నేను వానిని అకారాదిక్రమముగా, నిఘంటువుగా సేకరించడములేదు. అమరము వలె మనుష్యవర్గము, జంతువర్గము, గ్రామవర్గము, జాతివర్గము, శరీరవర్గము, బాంధవవర్గము, నిందావర్గము, వ్యవహారవర్గము, నామవర్గము, కథావర్గము ఇత్యాదివిధముల వర్గీకరించి వాటికి సంబంధించిన పలుకుబళ్ళను, ఆయా వర్గములలో కూరుస్తున్నాను. ఈ విధముగా సేకరిస్తే విషయము సులువుగా తేలుతుందనుకొన్నాను. నేను చేస్తూన్న తీరిది.

బిరుదువర్గం

పంతులు, పండితుడు, వజ్జలు, శాస్త్రి, అవధాని, భట్టు, భట్టారకుడు, భట్టరలు, జోస్యుడు, ఘటసాసి, చౌదరి, ఒజ్జ, వెజ్జు, ఉపాధ్యాయులు, నాయడు, నేడు, నీడు, భోజ, భుక్త, శర్మ, వర్మ, సెట్టి, రెడ్డి, రడ్డి, కాపు, అయ్య, అయ్యవారు, అయ్యావార్లంగారు, రాయడు, రాయలు, రాయనింగారు, రాయలవారు, అరసు, అన్న, అప్ప, గ్రామణి, లింగము, సాహెబు, భక్తుడు, బత్తుడు, శ్రేష్ఠి, అయ్యరు, గురుకులు, దాసరి, హంవీరుడు, నాయకుడు, వస్తాదు, బంటు, బంట్రౌతు, రౌతు, రావుత్తుడు, విద్వాంసుడు, శిరోమణి, రాజు, మహారాజు, సామంతుడు, చక్రవర్తి, సార్వభౌముడు, ప్రభువు, లెంక, నట్టువు, నట్టువొజ్జ, నట్టువోజ, వాగ్గేయకారుడు, బయకారుడు, కాడు, ఆడు, రావు, జీ, జియ్య, జియ్యరు, సింగు, గారు, లుంగారు, నింగారు, బహద్దరు, దొర, పేరు, వేలందు, జమీందారు, ముఖాసాదారు, జాగీరుదారు, దేశపాండ్యా, అగ్రహారికుడు, స్వామి, భట్టరు, భారతి, సరస్వతి, షాహుకారు, ఉ, ఉలు, మంత్రి, ప్రెగ్గడ, శర్మ, సోమయాజి, చయనులు, దీక్షితులు, పాకయాజి, భొట్లు, ఆరాధ్యుడు,

దేవర, గౌడు, లాలా, బాబు, గౌండ, మొదలియారు, భాగవతారు, ఓజ్, దత్తు, యాజి, పిళ్ళ, బోయ, తలారి, సాహు, సాహిణి, పాత్రుడు, మహాపాత్రుడు, గజపతి, జగపతి, ఆండి, ఆండారి, సన్యాసి, బైరాగి, దిగంబరి, ముని, యతి, యోగి, జోగి, గురువు, ఆసారి, ఆచార్యుడు, దుబాసి, అమ్మ, తాయి, సాని, దొరసాని, దేవేరి, దేవి, అమ్మాయి, ఆయి, గడసాని, అక్క అత్త, అణ్ణి, అమ్మణ్ణి, ఇ, ఉలు, అమ్మ, చిట్టి ఇత్యాదులు.

జాతివర్గం

వంట బ్రాహ్మడు, నీళ్ళబ్రాహ్మడు, బాపనకోపం, బాపనబొజ్జ, బ్రాహ్మణ వ్యవసాయం, పంచాంగపు బ్రాహ్మడు, బాపనపోటు, బాపనమ్మవారు, బాపన ఆశ, పప్పుబ్రాహ్మడు, బాపనపాలేరుతనము, జందెపుపోగు, బ్రహ్మచారీ శతమర్కటః, నకారగుడి, నియ్యోగినీటు, నియ్యోగినీలుగు, వైదీకచాదస్తం, వెర్రివెలనాట్లు, తెలగాణ్యపుతెలివి, తెలగాణ్యపుతెగులు, దుంపతెలగాణ్యం, చౌటితెలగాణ్యం, వైదికులువంటకు, నియోగులునీళ్ళకు, నియ్యోగిశ్రోత్రియం, వైదికికవిత్వం, కలంపోటు, కరణపుబిడ్డ, ఐతే ఆపస్తంబుడు, ప్రథమశాఖ ప్రాణఘాతకుడు, షడ్గుణ స్తైలగాణ్యకః, కాసలేయంనవిశ్వసేత్, మధ్యాహ్న మాలలు, వేపారిభోజనము, వేపారివేషము, ద్రావిడ ప్రాణాయామము, వైష్ణవులతెరచాటు, అయ్యవార్లంగారి నట్టిల్లు, అరవపితలాటకం, అరవరహస్యం, అరవగోల, వేగినాటిఅప్పు, రాచపాడి, రాచమర్యాద, వెలమబంతి, వెలమవేషం, కమ్మసంసారం, కమ్మనీడ, కాపుబుద్ధి, రెడ్డిరాజ్యం, రెడ్డిమడ్డి, కోమటిసాక్ష్యం, కోమటిసరసం, కోమటిసంగీతం, నంబివైద్యం, తంబళజోస్యం, కోమటిపిటికి, కోమటిత్యాగం, కొత్తకోమటిల్లు, కుమ్మరావం, దొమ్మరిపడుచు, దొమ్మరాట, వెట్టిగొల్ల, సాతానివైష్ణవం, సాతానినీతులు, ముష్టత్యం దాసరేః పదం, సాలిజాంద్రసభామధ్యే సాతానిః పండితాయతే, బోగంమెరుగు, చికిలింతైశ్వర్యము, కంసాలిపొయులు, కంసాలిమతము, పంచాణం (ననమ్) వారు, ఒడ్డెమంగలి, శూద్రసమారాధన, పనిలేనిమంగలికథగా ఉంది, తిరుపతిమంగలి, భట్టుపొగడ్త, చాకలిమడతలు, కంసాలి యెల్లి, మాదిగమల్లి,

మాలనేత, మాలనూలు, బెస్తల్లోపెద్ద, నల్లబ్రాహ్మడు, ఎఱ్ఱకోమటి, బాపనఅక్కెమ్మ, కోమటక్కెమ్మ, కంచరగాడిద, వేయిళ్ళ పూజారి, ఇష్టోవా శిష్టోవా యావజ్జీవం హోష్యామి ఇత్యాదులు.

అవయవవర్గం

(కాయలు) తలకాయ, బుఱ్ఱకాయ, గుండెకాయ, మెడకాయ, మొట్టి కాయ, లెంపకాయ, మొలకాయ, పొట్టకాయ, చెమటకాయ, పురుపుటికాయ, కాయకన్ను, తలపండుపగిలింది, మెడజీవాలు, మెడ లాగుతున్నది, వెన్ను పాము విరిగింది, చెంపపగిలింది, జవసత్తువలుడిగినవి, కాలుసాగింది, వేలుమణిచిలెక్కపెట్టిచెప్పు, వేలువంచలేదు, ముక్కోపము, పుప్పిపల్లు, గొగ్గిపల్లు, చిఱ్ఱవెంట్రుకలు, ఎదుఱురొమ్ము, కడుపునొప్పి, కాళ్ళతీపు, మడమశూల, మీసంమెలివేసినాడు, మీసందువ్వినాడు, కాలుదువ్వి కజ్జా కొచ్చినాడు, కాలిగుల, జబ్బ చరిచినాడు, జుబ్బనజూరలాడిరి, చెవిలో చీము, డగ్గుతిక, గువ్వగుత్తిక, కుత్తికంటు, తలంబ్రాలు, సేసకొప్పు, రొమ్ము విరుచుకు తిరుగుతాడు, భుజాలు మూడయినవి, మూడోహస్తం ఉంది, ముడ్డికుదురు లేదు, ముక్కు ముణగా తిన్నాడు, బుగ్గపోట్లు పొడిచాడు, చీలమండలు, పిక్కబలిమి, డొక్కశుద్ధి, గొంతునొస, చెవిపోటు, చావచఱచినాడు, చావదిన్నాడు, తెగదిన్నాడు, (తెగ ప్రయోగము) కొప్పు, చంకలోబిడ్డ, చంటిబిడ్డ, నిక్కి నీలిగి పండుకొన్నాడు. మూడంకె వేశాడు, కడుపులోనీళ్ళు కదలకుండా వచ్చినాము, గిల్లికజ్జాలు, చెట్టాపట్టాలు పట్టుకువచ్చాను, సెలవివాఱ నవ్వు, తలమాద, తలనాదు, మాడ(డు) ట్టు, నసాళం అంటింది, బుర్రగుజ్జు, బుజాలు కలుపుకొన్నారు, ఆఱోచెవినపడకుండా, కడిపెడుబిడ్డలు, చెవికొఱికి, మోచెయ్యి, మణికట్టు, మీగాలు, మీ చెయ్యి, చేయాడలేదు, నోరాడలేదు, చేతాగాదు వాతాగాదు, పట్టపగ్గాలూలేవు, కాళ్ళుకడుపులుపట్టుకున్నాను, నీరుమోసుకుంది, ఒళ్ళు నీరుపట్టింది, ఈచకాళ్ళు పడ్డవి, ఊదపొట్ట, బరికితల, పట్టుకొన్నవి చేతులు గావివి కాళ్ళు, కంటికి మంటికి యేకధారగా ఏడ్చాడు, రొంటిగజ్జి, రొంటితీత, ఏనుగుగజ్జి, లోదొడ, మీగడుపు, కంటవత్తివేసుకొన్నాడు, లోగడుపు, పైగడుపు, పరగడుపు, ఆకటిగడుపు, నిండుగడుపు, కడుపుమంట, బోడితలకుబొడ్డుమల్లెలు,

బోడిపెద్దమ్మ, బోడిముండ, కంటినలుసు, కాలిముల్లు, ఒంట్లో సరిగాలేదు, బట్టతల, బుట్టతల, బానకడుపు, ముడ్డిమంట, కడుపుతీపు, కడుపుకోత, లేగడుపు, గుండెపోటు, గుండెనంజు, వెన్నుపీట, చన్నుకుదురు, కంటిపోటు, పంటిపోటు, చెవిపోటు,పీనస, కర్ణకఠోరంగాఉంది, కాటికి కాళ్ళుసాచుకున్నాడు, ఉక్కిస, బుగ్గపోట్లు, ఒంటిమన్ను నలిపిపెట్టడు, కడుపునిండా అన్నం కంటినిండా నిద్ర ఎఱగడు, తొడపాశము, బుగ్గబూరెలు, నిలువుజీతము, పట్టువంట, కడుపుపండింది, తెట్టనోరు, పీకసన్నం, కడతల, (కణత)పణతల,(పణక) పడతల, పందల, ముందల, ముచ్చిలిగుంట, నిడువెంట్రుకనెట్టినాడు, కంటిపుసికారుతున్నది, చెవిగులివి, నోటిచొల్లు, చొల్లునోటివాడు, నోటిత్రేగుడు, చెంగుమాసింది, బైట ఉన్నది, వెలుపటఉన్నది, చెంబుపట్టుక వెళ్ళింది, రెంటికి వెళ్ళింది, ఒకటికి వెళ్ళింది, బిడ్డకుట్టు, సూకరాలు, మూడుకాళ్ళముసలి, పైలాపచ్చీస్, పాలపొంగువయస్సు, నూనూగుమీసాలు, మగచెంపలు, దూముడి, నూనెముడి, చెంపకొప్పు, జారుముడి, ముచ్చట ముడి, కొండిసిగ, బుట్టమీసాలు, చిట్టిగడ్డము, పాయగడ్డము, తీతువుకాళ్ళు, బారగాళ్ళు, తలమునకలు, చక్కిలిగిలి, మనసులోమనసు, పాముపరుగు, వీపువిఱిగేటట్లు మోశాడు, పొట్టపగిలేటట్టు నవ్వాడు, పదహారుపళ్ళు బైటపడ్డవి, పొట్టకోసినా అక్షరంముక్కలేదు, నల్లదబ్బ, చనుమర, చనుబాలు, పలుగురుపు, చనుగురుపు, మెడకంతి, అక్కుగొట్టు, రొమ్ములకుంపటి, అంగటిముల్లు, గుండెతాళం, గుండెబల్లెం, ఱొమ్ముగూటం, గొంతుకోత, కొండనాలిక, తొడపాము, చేతికిపుండుపుట్టింది, నీరుచుఱుకు, రాచపుండు, మదపిచ్చి, కంటిఅద్దము, కళ్లజోడు, ముక్కద్దం, సులోచనాలజోడు, చెవికొరికాడు, చెవిలో ఊదాడు, రామా!కృష్ణా! అంటాడు, చీముసీద్రము వదిలింది ఇత్యాదులు.

జంతువర్గం

కోడికూత, కోడినిద్ర, కోడికొక్కరింపు, కోడికునుకు, కుక్కమూతిపింద, దాలిగుంజకుక్క, పుంజుకూతపట్టింది, కుక్కబుద్ధి, కుక్కతోక, కుక్క విశ్వాసము, కుక్కజుట్టు, కుక్కపీకులాట, చిఱుతకుక్కలలాగు, చిత్తకుక్కలు, కాట్లకుక్క, పోట్లగొడ్డు, ఊరపిచ్చుకలేహ్యాం, పిచ్చికగూడు, ఆయన బంగారుపిచ్చికగుఱ్ఱపు సవారి నా మీద, ఘోటకబ్రహ్మచర్యము, గుఱ్ఱపువెండ్రుక, వాజీకరణము,

సింహస్వప్నము, సింహమధ్యము, సింహకేసరము, సింహముఖము, సింహతలాటము, సింహగర్జనము, సింహాసనము, సింహావలోకనము (సింహము తెలుగుదేశపుజంతువుకాదు గనుక దానిపేర పలుకుబళ్ళు అన్నీ సంస్కృతములే) నక్కజిత్తులు, నక్కెదురు, నక్కను త్రొక్కివచ్చాడు, తోకతెగిన నక్కలా అరిచాడు, నక్కటక్కులు, నక్కవినయము, నక్క వేటగాడు (కథ ఉంది), కొంగలమల్లాయ కొండ (కథ ఉంది), కొంగకాళ్ళు, కొంగనడక, కొంగమెడ, కొంగరెక్కలు, పిల్లి పొంచుండడం, పిల్లి గుడ్డిదైతే– ఎలుక ఏదోచూపుతుంది, పిల్లి పిండాలు కోరుతుంది, పిల్లిపెంట (కథ ఉంది), కాకిచూపు, కాకిగోల, కాకిపగ, లేడిపరుగు, మేకపోతుగాంభీర్యము, గడ్డం వపనముచ్యతే (కథ ఉంది), మేకవన్నెపులి, మేకఅపు, మేకలమంద, కంచిమేక, గొఱ్ఱెలమంద, గొఱ్ఱెతలకాయ, కొండగొఱ్ఱె, చింబోతు చీదర, కోతిగంతులు, కుప్పిగంతులు, కోతిచేష్టలు, కోతికొమ్మచ్చులు, కోతిముడ్డి మామిడి, కోతికడుపు, గాడిద కూసినా వదలడు, గాడిదకాళ్ళు, గాడిదకొడుకు, గాడిదగుడ్డు (కథ ఉంది), మన్నుదిన్నపాము, ఎద్దుకేంతెలుసురా పన్నీటివాసన, అవసరమైతే గాడిదకాళ్ళయినా పట్టుకోవలెను. కాకిపిల్ల కాకికిముద్దు, కాకిముక్కుకి దొండపండు, కప్పగంతులు, కప్పలతక్కెడ, కప్పల బెకబెక, కంపనుబడ్డ కాకిలాగా, గాడిదవాలకం, గాడిదతన్నులు, గార్ధభస్వరము, గాడిదనడక, పిట్టకడుపు, పిట్టకథలు, పిట్టగూడు, పిచ్చికగూడువలె ఉంది తల, పిట్టపోరు, ఉడతాభక్తి, కప్పయెలుగు, కప్పపోటు, బావురుకప్ప, గౌళిపలుకు, కోకిల స్వరము, కాకీకోకిలచందము, కొంగముక్కు, చిలుకముక్కు, గరుడముక్కు, కోతులకిచకిచ, జోరీగ, ఎండలో నల్లులు మాడినట్లు మాడినాము, పందిపెంట, పందిబురద, పందినడక, పందికిమల్లే బలిసి ఉన్నాడు, పందికొవ్వు, కోతికికొబ్బరికాయ, కోతిచేష్టలు, పీతబొక్క, మిడతలదండు, సొరముల్లు, చేపకన్ను, సొరకన్ను, దేగకన్ను, జలగపట్టు, ఏ పుట్టలో ఏ పామున్నదో, పులిమీద పుట్ర, అదిగో పులి అంటే అదుగో తోక అంటాడు, గండుచీమపట్టు, చలిచీమల్లే జారినాడు, చిలుకపలుకులు పలుకుతాడు, చిలుకలకొలికి, చిలుకముక్కు, చిలుకచెంబు, అంబారీ పుంజు, దోమతెర, సింహంమెడగంట, ఏనుగుబాట, ఏనుగుకన్ను, గజచర్మం, గజకచ్ఛపాలపోరు, గజస్నానం,

గజనిమీలితం, గజనిమ్మపండు, గజయీత, గజగమనం, గజాంతైశ్వర్యం, అజగజాంతరము, గజశ్రద్ధ, గజకబళము, ఏనుగుతుండమంతధార, తీతువుపిట్ట రాయబారము (కథ ఉంది), తుమ్మెదమోత, బొగ్గుల్లో రామచిలక, కోతి కొండెక్కింది, పిట్ట కూతపట్టింది, మిడతంభట్లు జోస్యం (కథ ఉంది) ఇత్యాదులు.

నిందావర్గం

కజ్జాకోరు, బడాయికోరు, పుంఢాకోరు, తంటాకోరు, లుచ్ఛాకోరు, జంభాలరాయడు, గళగ్రాహిగాడు, గండరగండడు, గందరగోళగాడు, గందరగూళడు, గయ్యాళిగంప (గయ్యాళికంప), కర్మచండాలుడు, అంకచండాలుడు, అగ్గిరాముడు, బుగ్గిరాముడు, సాపాటురాముడు, గుండారాయడు, తిండిపోతు, బుడ్డకేతిగాడు, జుట్టుపోలిగాడు, శుంఠకాయ, భటాచోరు, దేబెన్న, యంబ్రహ్మ, బ్రహ్మకాయ, బడుద్ధాయ, (డభిద్ధాయకు వికృతి), రణపెంకె, గుండుగొయ్య, గజదొంగ, జగాదొంగ, దుంపతెగ, తాడుతెగ, పాడెగట్ట, ధూత్తేరే, చవటకాళ్ళవెధవ, సన్నాసిరాముడు, దండగరాముడు, చొల్లునోటి వెధవ, దద్దన్న, పెద్దన్న, పెద్దమ్మ, నక్షత్రకుడు, అగస్త్యభ్రాత, రాకాసిగాడు, గోచిపాతరాయడు, యంబేద, కుండగోళకుడు, తొత్తుకొడుకు, లంజకొడుకు, ముండకొడుకు, ముండమోపి, ముండలముతాకోరు, లొడారిబుచ్చిగాడు, బోకి, పోరంబోకు, వెట్టివెంగళప్ప, దగుల్బాజీ, పిచ్చిపుల్లయ్య, మొగుడువిడిచిన ముండ, (మబ్బు విడిచినయెండ, వంచివిడిచినమండ), చవటవెధవ, కుంక, ఎద్దుమొద్దు, వత్తుథ, పొట్టలోసున్న, గుండేలుగాడు, చావల్‌కరాబి, గుభేలుదస్త్రంగాడు, పిచ్చకుంచం, పొట్టపొడిచినా అక్షరంలేదు, పుల్లింగాలు పెడతాడు, గూడుపుఠాణీ, క్షామదేవత, దరిద్రదామోదరుడు, దేశద్రిమ్మరి, త్రాగుబోతువెధవ, కయ్యాలకామి, దద్దిరాముఁడు, దద్దమ్మ, పెద్దమ్మ, శుద్ధ బుద్ధావతారం, పేలుడుగాయి, డాబులరాయడు, దగాకోరు, నిరక్షరకుక్షి, పరమఛండాలుఁడు, ఏడోగ్రహం, శనిగ్రహం, శుక్రాచార్యుడు, ఏకాక్షి, దుండగీడు, పరమమొండి, చెండిమొండి, అబద్ధీకుడు, రుద్రాక్షపిల్లి, గ్రంథసాంగుఁడు, వన్నెలవిసనకఱ్ఱ, కొంగజపంగాడు, కునుకునక్క, సత్యకాలం, భూకరగాడు, ముక్కోపి, కాకికండ్లు, పాముచెవులు, గాడిదగ్రుడ్డు, గాడిదెలాగు,

కంకరపీచు, తారుపులగంగాధరుడు, నివురుగప్పిననిప్పు, పచ్చిదొంగ, మేకపోతుగాంభీర్యం, పల్లెటూరిగబ్బిలం, కూపస్థమండూకం, బండముండ, అంకులాడి, ఉక్కుపిండము, ఏబ్రేసి, తేభ్యం, దున్నపోతుమహారాజులుంగారు, మొండిఘటం, మొండిశిఖండి, చిసింద్రీగాడు, కండక్రొవ్వు, కండకావరం, దుక్కదుంగ, త్వం శుంఠ అంటే త్వం శుంఠ, నీ యిల్లు నేలగట్ట, నీ బొడ్డుపొక్క తస్సగొయ్య, తస్సచెక్క, తస్సదియ్య, నీ కడుపుడక, పెండ్లిగొడక, నీ తాడూరేగ, నీ కడుపు కందవిత్తుగాను, గుండెలుతీసిన బంటు, కొఱకంచు, చిట్లకొఱవి, పొయ్యేకాలము, ఏడుకాలము, దాని సిగ్గొయ్య, దాని ముండమొయ్య, కొంటె కోణంగి, ఇంటికిజేష్టాదేవి పొరుగింటికి శ్రీమహాలక్ష్మి, పిడివాదము, దబ్బరాయిగిన్నె, సర్వంజగన్నాథం, చదువూసంధ్యాలేదు, నీతినియమాలు లేవు, కాట్లకుక్క,బండాయానుబ్రూహి, మాటలకుబ్రహ్మకాయ, తెలివి తెల్లవారింది, తెలివి ఒకరిసొమ్మా ఓ బెస్త గురవమ్మా, అచ్చోసిన యాంబోతు, దండించే దాతలేడు – మర్దించే మామలేడు, చిచ్చుఱపిడుగు, చిట్టిపిడుత, మొద్దురాచిప్ప, సన్నికలురాయి, కొరవిదాలి, పిసినిగొట్టు, జగజెట్టి, అసంబద్ధప్రలాపి, అధికప్రసంగి, చదువు దిగనాసిల్లిపోయింది, కొసవెఱ్ఱి, దిష్టిపిడతలా తలకాయ నీవూను, చింతచెట్టుకుగట్టిన చిల్లిడబ్బా, అడ్డాలపాప, శకునాలపక్షి, అబ్బే, ఛాఛా, ఛీఛీ, కండచీమ, చలిచీమ, పున్నతేలు, నంగనాచి, పరమానందయ్యశిష్యులు, పానకంలోపుడక, కప్పలతక్కెడ, పత్తిత్తు, పిండివంటలు పిడకమంటలు, నీ తలకాయ, బుద్ధిగడ్డితిన్నది, చదువుచట్టు బండలైంది, తరగనిదుంప, దాష్టీకప్పంతులు, దేవాంతకుడు, ముళ్ళముప్పి, గచ్చపొద, కొఱకరానికొయ్య, మొప్పెకాయ, ఆకతాయి, ఆతతాయ అగ్రపాకం, ముంగిసానమ్మ, బొగ్గుల్లో రామచిలుక, చెవులుతెగినవెధవ, చేతాగాదు వాతాగాదు, తిరుగుబోతు, పీత్వాగాడు, మెడసన్నంమింటడు, కైంకర్యపరుడు, శుష్కప్రియాలు, శూన్యహస్తాలు, రాలుగాయ, నీ నోట్లోకరక్కాయ, దడిగాడు వానసిరా, తికోడేవానసిరా, షాకోత్వమిస్తేగాడు, అడ్డగంధం బుడ్డతీర్థం, మొండి గురోర్బండశిష్యః, గంపశ్రాద్ధం, నీ శ్రాద్ధం, నీ బొడ్డుపొక్క, పెండ్లీ పెటాకులూను, తిక్కశంకరయ్య, కథలకామమ్మ, ఏడుపుమూతి పెద్దమ్మ, ఏడ్చి మొహం కడుక్కున్నట్టుంది, బెల్లంకొట్టినరాయి, ఏడ్చావులే, ఇంగువ కట్టినగుడ్డ, నవ్వుల

చేటు, ఊరుకో, సొరకోతలు, నాలుకబెల్లము, ఎదకత్తెర, నేతికుండపై యెలుక, గోడమీదిపిల్లి, కప్పయెలుగుపాము, కుడితితొట్టెలో బల్లి, తేనెపూసినకత్తి, గోముఖవ్యాఘ్రము, గంతకుతగినబొంత, పైకి బొడబొడ లోపలికి లొడలొడ, ఎత్తువారిచేతిబిడ్డడు, తల్లిచాటుబిడ్డ, వినపనగొయ్య, లంకణాలబోటు, కాలుగొర్రు, చెప్పులోనిరాయి, అతీగతీలేదు, సవతితల్లిప్రేమ, అర్ధచంద్ర ప్రయోగం, తంటసంగాడు, ఎదురుత్తరంగాడు, స్తంభంచాటుగాడు, ఊరిబసివి, సంతతగరు, కట్టివిడిచిన దూడ, జిగురుగండె, తెరువుపెసరు, పైపటారం లో లొటారం, ఆర్చేవారూ తీర్చేవారూ లేరు, సిగ్గులేదు ఎగ్గులేదు, ఛీ అంటే సిగ్గులేదు, ఇంట్లోకుంకంభట్లు బయట వెంకంభట్లు, దంచినమ్మకు బొక్కినదే కూలి, ఎడమాటలు, పెడమాటలు, అధ్వాన్నం శత్రుమధ్యము, ఎగిరిపాటు ఎక్కువ జరుగుపాటు తక్కువ, ఓ అంటే నా రాదు, నోరా? తాటిపట్టా?, శ్రీరంగనీతులు, కడుపా? కళ్ళేపల్లి చెరువా?, న్యాయానికి కాలంగాదు, కాలే కడుపుకు మండేగంజి, పుట్టి కొన్ని పుట్టక కొన్ని, పొట్టపొడిచినా అక్షరం లేదు, పుణ్యానికిపోతే పాపంఎదురువచ్చింది, శ్రుతిమించి రాగానపడింది, ముందుంది ముసళ్ళపండగ, పుట్టనిబిడ్డకు పూలవరహాలు, మొఖంచూస్తేనే తెలుస్తుంది మీగాళ్ళవాపు, నువ్వులూ నూనా ఒకటే తెలకులవాడే తేడా, తాడెక్కే వాణ్ణి ఎందాక ఎగసనదోస్తారు, ఏరుదాటి తెప్ప తగులవేస్తాడు, ఉన్నమాటంటే ఉండూరు అచ్చిరాదు, గారాం గజ్జల కేడిస్తే వీపు దెబ్బలకేడుస్తుంది, ఆడవాళ్ళ మాట నీళ్ళమూట, ఎక్కడలోకం ఎక్కడికథ, ఏడుపులూపెడబొబ్బలూ, కన్నులేకపోతే కలియుగంలేదు, కొత్తనీరు వచ్చి పాత నీళ్ళను కొట్టుకపోయింది, బంతిలో బలపక్షం, పాడుఊళ్లు పట్నాలైనవి, ఏతి అంటే ప్రైతి అంటాడు, అతిరహస్యం బట్టబయలు, అదుపూ ఆజ్ఞా లేదు, లోకమో పాడో?, లోకులు పలగాకులు, పలగాకి, ఉట్టికట్టుకు ఊరేగుతాడు, దిక్కులేదు దిశాలేదు, ఆడవారిమాటలు అద్దంలోతేటలు, స్వర్గమా? మోక్షమా?, దయాధర్మం లేదు, ఎవరికి ఎవరు?, ఏలేందుకు ఊళ్లు లేవుగాని ఎత్తుకుతినేందుకు లేకపోయినయ్యా!, వాడేమి, వాడి బిసాతేమి?, చెట్లమీదా గట్లమీదా చేటప్పులు తెచ్చుకుని, పట్టపగ్గాల్లేవు, నీ చావు నిచ్చావుగానూ, వంకాయనాడు లేనిది టెంకాయనాడు వస్తుందా?, కంటికి పెట్టేది తుంటికి పెట్టితే, కర్రలేనివాణ్ణి

గొఱ్ఱె కరిచింది, పుంటికి పుల్లమొగుడు, పులిపక్క జోరీగ, సింహంమెడగంట, నీ పుట్టెడు బూజుపట్టుకొని నా పందుం పారబోస్తావా, రాయిగుద్దేదేం చెయ్యి కట్టేదేం, అటుపోతే గోడపెట్లు యిటుపోతే చెంపపెట్లు, పొంగిందంతా పొయిపాలు, ఉప్పనిమాటలు చెప్పి– శెట్టివున్నచోటు పట్నం, తుదుందగ్గిర నుంచి దేవతార్చనదాకా, ఆడలేక పోతే మద్దెలవోడు, మేకవన్నెపులి, దేశవాళీ గోంగూర, చచ్చిన చావయింది, మాటలు మదూళ్లు దాట్తవి కాళ్లు గడపదాట లేవు, ఒకడే కొడుకని గడ్డపారతో ముక్కు కుట్టిందట, రణాకతాయ, రచ్చబండ, రాతినార, రామబాణం, మాయదారివాడు, చిల్లిపేరే తూటు, పెట్టేవా? పోసేవా?, పంచా దించడు, అని అనిపించుకోవడం అత్తగారా నీ స్వభావం, కలిగీకర్మం లేకాదరిద్రం....... పక్కలోబల్లెం, భయభక్తులు లేవు, తంత్రగొట్టు, వేలువంచలేవు, పిలువపేరు అరవ కాకి లేకుండా, రణగుణ ధ్వని, రాళ్ళవాన, ఏకు మేకయికూర్చున్నాడు, పందిలి యిల్లవుతుందా, ఇస్తావా? చస్తావా?, మింగి మీదులు చూస్తున్నాడు, సూది వెనక దారం, పక్కలోపుండు, పక్కలో పోటు, నందివలె నడిచి పందివలె పాకాడి గుఱ్ఱం అంత పరుగిచ్చి యేనుగంత సత్తువిచ్చి, తడిమన్ను పొడిమన్నుగా తిరిగినాడు, చెట్టయివంగంది మానై వంగుతుందా?, ఎదుటున్నవాడు పెండ్లికొడుకు, ఇంటావంటా లేని బుద్ధులు, ఒంటికట్టు రామలింగాయ, ఎంగిలిమంగలం, చించి సీసం పోస్తాడు, చేతులు పొడుగని మూతులు పొడుస్తావా? కాస్తాకూస్తానా, తుప్పతలముండ, జెట్టాన జెట్లు, దండగశ్రాద్ధం, దండగట్ట, నిలువెల్లా బొంకులపుట్ట, రొమ్ములకుంపటి, నెత్తిగాలము, నోటితాళము, పాండిత్యం లేకపోయినా పలగాకితనం ఉంది, మళ్లుగుమ్మిడికాయ, గలగుండు, హృదయశల్యము, మెడచుట్టినపాము ఇత్యాదులు. (ఆంధ్రపత్రిక జూన్ – 4, 1944)

ప్రశస్తివర్గం : ఊళ్ళమీద

బందరుబడాయి, గుంటూరులడాయి, నెల్లూరినెఱజాణలు, పట్నం మోసం, కొండపల్లిబొమ్మలు, తిరుపతిక్షౌరము, బందరువంకాయలు, రేపల్లె గొడుగులు, కొండవీటిచేంతాళ్ళు, గుంటూరునీళ్ళు, గుంటూరుగోంగూర, పల్నాటిజొన్నలు, తంజావూరిసత్రం, పెద్దాపురంబెల్లం, బందరుకలంకారీ, రేగతోటకూరకాడలు, పెద్దాపురపుబచ్చలి, కోనసీమకొబ్బరి, ఆత్రేయపురం

వంగవరుగు, కడపరాళ్ళు, వడ్లపూడినారింజలు, కోడూరునారింజలు, చిత్తూరు కంద, తిరుపతిసానలు, తిరుపతిబొమ్మలు, నెల్లూరిబియ్యం, ఒంగోలుగిత్తలు (పశువులు), బాపట్లవంకాయలు, పొందూరుఖద్దరు, జయపురంజ్వరము, అంబాజీపేటఆముదము, చీమకుర్తిచేమ, కలువాయివేదాంతము, కంచి మేకలు, మన్యపుజ్వరము, –'పాలగడ్డోదకం పీత్వా మర్నాడేమరణం ధ్రువం–, తాటిపాక జినదేవుడు, రెంటచింతలరాళ్లు, విజయనగరంవీణ, బరంపురం పట్టు, బరంపురంకంచు, కోనసీమసాహిత్యం, మంథెనఘనపాఠం, కృష్ణాతీర స్వాధ్యాయం, కాకవాకశ్రౌతం, పొన్నపల్లిశ్రౌతం, కూచిపూడి భాగవతం, ఏలూరిసానిమేళము, పల్నాటిపదాలు, మల్లంద్రంశ్రౌతం, పెద్దాపురం ఫకీరునుయ్యి, వెల్లూరివేమాలబావి, వినుకొండనిమ్మలబావి, గుంటూరు శివుడిబావి, కంభంచెరువు, కొంపల్లిచెరువు, మంగళగిరిగాలిగోపురం, కొలనుపాకగంటలు, బందరులడ్డూలు, కావేటికాల్వలు, కొల్లేటిసరసులు, బెజవాడయెండలు, శ్రీశైలశివరాత్రి, శ్రీరంగంముక్కోటి, కోటిపల్లితీర్థం, కోటిపల్లిసంతలు, బందరుతోటలు, కడపకూజాలు, కల్యాణదుర్గంకంబళ్లు, కోలారుకంబళ్లు, ఏలూరుతివాచీలు, చిత్తూరుచింతపండు, హిందూపురం బెల్లం, దుమ్మగూడెంపెసలు, కడపఖూని, వెంకటగిరివేశ్యలు, తంజావూరి నాయకసానులు, గునుపూడిజంగాలు, నగరిమేళము, ఏలూరిమేళము, తిరుపతిగొడుగులు, చంద్రగిరిచెఱకు, గండవరంవైష్ణవం, దూపాడుగిత్తలు, మార్కాపురముపలకలు, ధర్మవరంచీరలు, అద్దేపల్లిఆముదం, కారంచేడు బక్కదున్న, పెనుగొండద్రాక్ష, పెనుగొండదానిమ్మ, పెనుగొండఉరుసు, పెనుగొండ బాపయ్యచెఱువు, చీరాలచీరలు, గాజులమండెము గాజులు, ధూళిపూడి సిళ్ళు, వజ్రకరూరు వజ్రాలు, లేపాక్షి బసవన్న, మాచెర్లరథము, దిగువపాలెపు రచ్చబండ, బందరుచెప్పులు, లంకపొగాకు, కావలి కనుగోళమ్మ, పెంటపాటి బైరాగులు, కందుకూరి దుప్పట్లు, కామవరపుజీడి, రాయలచెఱువు తూము, బిక్కవోలితూము, సైదాపురంరాచ్చిప్పలు, బళ్ళారికంబళ్ళు, పుంగనూరి పశువులు, మైలవరపుపాత్రలు, నారాయణవనంనేత, ఉప్పాళబట్టలు, కంచిచీరలు, కాళహస్తి కంచు, పెండ్యాలచింతపండు, గుంటూరుదోస, తాడిపర్తి నెయ్యి, తునినూనె, కొండాపురంవేరుసెనగ, ఉద్దండపురంచేతికఱ్ఱలు,

తిరుచానూరుపంచమి, గంగాస్నానము, తుంగాపానము, కంచికామాక్షి, బెజవాడకనకదుర్గ, అద్దంకినాంచారు, ధనకొండంకమ్మ, కొల్లాపురం మహాలక్ష్మమ్మ, మరిడీమహాలక్ష్మమ్మ, మదారుసాహెబు మస్తానమ్మ, తెలుగు గోంగూర, అరవసాంబారు, కరవదిబ్రాహ్మలు, శాయపురంబ్రాహ్మలు, నెల్లూరి రెడ్లు, పంచారామములు, ద్రాక్షారామము, అమరారామము (అమరావతి), కొమరారామము, భీమారామము, క్షీరారామము, (ఈ అయిదూ తొలుత బౌద్ధారామములు కాఁబోలును తర్వాత శైవక్షేత్రములయినవి కాబోలును!) ఇత్యాదులు.

(ఆంధ్రపత్రిక
జనవరి, ఫిబ్రవరి, జూన్ 1944)

గ్రామ్యమీమాంస

మండలాల్లో మాటలు మాఱినయ్యని భాష చెడ్డభాషవుతుందా? అలా అయితే ఈ పయిమాటలన్నీ పాడైపోయేవే. ఇవన్నీ గ్రాంథికభాష కావలయు వానికి కావాలా? అఖ్ఖర్లేదా? ఇల్లాగే ఇంకోమండలంలో మాట్లాడే కొత్తమాటలు రాకపోతే భాషాపారగుడెట్లా అవుతాడు. అన్యమండలాల్లో కొత్తమాటలన్నీ రావాలిశిందే? కొత్తగ్రంథాలు చదువుకొని కొత్తమాటలు నేర్చుకొన్నట్లు అన్య మాండలికగ్రంథాలు చదువుకొని ఆ పదాలు నేర్చుకోవాలి. ఆ మాటలు తెలియవని ఆ భాష చెడ్డదని అనటం మంచిదికాదు. మనకు అఱవం రాదని ఆ భాష చెడ్డది అని అంటే అపహాస్యమవుతుంది. మనకు తెలియని భాషల్లా చెడ్డదని అనాలిశొస్తుంది. ఇంతకంటే వేరే నవ్వుబాటేమియులేదు. మాఱడం భాషకు సహజం. పై రూపాంతరాలన్నీ కాలక్రమంగా మారిపోయినవే. మాఱిపోక మునుపు వాట్లకుండే రూపందృష్ట్యా మారినరూపాలు తప్పే. మాఱి గ్రంథాల్లో పడ్డతర్వాత ఒప్పయి పోతాయి. ఇది సహజం. నన్నయగారి కాలంలో, చేసినవాడు (డవు) అనే పదం ఒప్పు. ఇంచుమించు రెండు శతాబ్దాల్లో ఆ 'వా' మాఱిపోయి, ఆ 'వా' మీది దీర్ఘం 'న' మీది కొచ్చి 'చేసినాడు' అని అయిపోతుంది. తిక్కన్నగారంగీకరించారు. 'చేసినవాడు' అనే పదానికి గ్రామ్యంగా వున్న 'చేసినాడు' తిక్కన్నగారి కాలంలో ఒప్పయి యిప్పుడు ఆ మాటకు అమలులో ఉన్న 'చేశాడు' అనేమాట ఒప్పుకాదూ, ఇది గ్రామ్యం అంటారు పండితులు. దానికి కొంచెంరూపం నోరు కనిపెట్టింది. నాలుక మాట్లాడుతూంది. గ్రంథం రాసేటప్పుడు చేయి వెనక్కి పీకుతుంది. ఆమాత్రం సాహసం దానికిలేదు, పాపము!

అన్యభాషాపదాలగతీ మొదటంతే. కాని తరువాత్తరువాత రాజ్యాలు మాఱేటప్పుడు పరిపాలనలు కొన్ని కలిసేటప్పుడు ఒహమండలంలో జనులు ఇంకొహ మండలంలో జనులు ఎక్కువగా కలుసుకొని దోస్తీగా వ్యవహారాలు జరుపుకొనేటప్పుడు ఆ మాటలు కొన్ని కలిసి అన్యభాషాపదాలు క్షీరనీరన్యాయంగా కలసి పోయినాయి. చాలా వాట్లోంచి తద్భవాలు పుట్టాయి. కొన్ని తత్సమాలు ఏర్పాటయాయి. ఇందుకు నిదర్శనం నన్నెచోడుని కుమారసంభవం,

బహులాశ్వచరిత్ర, తొండమాన్ భూపాలుని కుమారసంభవం – రఘునాథ భూపాలుని వాల్మీకిచరిత్ర మొదలైనవి. ఇపుడెన్ని ఇంగ్లీషు పదాలు కలిసిపోలేదు! బంగాలీపదాలు కొన్ని వచ్చాయి. పరాసుపదాలు కొన్ని వచ్చాయి. సంస్కృత పదాలు చాలావచ్చాయి. ఈ సమూహం అంతా తెలుగుభాషలో ఏకం అయిపోతూ ఉంటే అన్యభాషాపదాలు వొద్దంటే ఏలాకుదురుతుంది? నాకూ అన్యభాషాపదాలు చేరవలదనే ఉంది. కాని చేరాయి, చేరుతున్నాయి. ఆపితే ఆగే స్వభావం భాషకులేదు. అల్లా ఆగక కలిసిపోతుండబట్టే 'కలపకపోతే యేలా?' అని అంటున్నామ్. కంబట్లో అన్నంతింటూ వెంట్రుకలకి వెతుక్కోవాలా? గ్రామ్యాలకీ తద్భవాలకీ ఏమీ భేదంలేదు. ఒహభాషలో పదం యింకోల్లా మాఱిపోవడం అంగీకారమే. ఒహపదం యింకోలా మారడం అంగీకారమే. ఇహ గ్రామ్యం యేంకొట్టింది? గ్రామ్యం యిటువంటిదే! దీని కేమని యీ నిర్బంధం?

గ్రామ్యభాష చెడ్డదంటాని కో మాటన్నారు వావిలికొలను సుబ్బారావుగారు "ఉత్తమవిషయంబులు చెప్పుటకు గ్రామ్యంబున వలసినన్ని పదంబులు లేవు. అట్టి విషయంబు లశుద్ధభాషలో వ్రాయబూనిన బేడయు బెల్లము పిసికి నట్లగును."

ఇందులో మొదటివాక్యం నిజమే. కాని తెలుగుభాషలో అన్నిటికి పదాలు న్నాయా? కొన్ని పదాలు చూపిస్తాను, తెలుగుబాస కా పదాలు తెలుస్తాయేమో చిత్తగించండి

1. అంతఃకరణము,
2. బుద్ధి
3. చైతన్యము,
4. జడము,
5. లింగదేహము,
6. అధ్యాహవనికము.

ఇవి వేదాంత విషయాలైన మాటలు. ఇవేకాక అనేక పదాలు లేవగుట స్పష్టమే. ఇదంతా యెందుకు? మన కందఱికీ ఉపాస్యుడైన దేవునిపేరు తెలుగు

భాషలో ఉందా? లేదు. అచ్చ తెలుగు పుస్తకాలు రాసినవాళ్ళందఱూ 'దయ్యము' అనే వైకృత పదాన్ని వాడారు. గ్రాంథికభాషలోనే యిటువంటిపదాలు లేకపోతే గ్రామ్యంలోనూ లేవనుకోడం! శరీరానికి సంబంధించిన పదాలకి తెలుగులో మాటలున్నాయా? చూడండి.

1. మజ్జ
2. స్నాయువు,
3. వీణాదండము,
4. ప్లీహ,
5. పురీతత్.

స్థాలీపులాకన్యాయంగా కొన్నే చూపించాను. యోగశాస్త్రంలో చూడండి.

1. చిత్తము,
2. సమాధి,
3. కుండలిని,
4. యోగము,
5. ఆశయము.

దిక్ప్రదర్శకంగా చూపించాను. ఇక తర్కశాస్త్రంలో బోలెడు చూపించ వచ్చు. పూర్వమీమాంసలో అన్నీ తెలియని పదాలే. ఇవన్నీ పారిభాషికపదాలు కావు. మనం కళ్ళతో చూస్తూ 'మాటల్లో' అనుభవంగా ఉంటూండే పదాలే తెలుగులో లేవు. కాబట్టి లేని పదాలు నాగరకత వచ్చినకొలదీ కలుపుకోవాలి. గ్రాంథికభాషకే యీ పాటులుంటూంటే గ్రామ్యభాషను గ్రాంథికభాష ఆక్షేపి స్తుందా? అదిగాక గ్రామ్యభాషలో ఉత్తమ విషయాలు చెప్పదగిన మాటలు లేవనుకోవడం యుక్తంకాదు. అలా అంటే ఆ రెండుభాషలు వేఱుభాషలు కావలిశొస్తయ్. గ్రామ్యభాష అంటే వర్ణవికారం పొందినదే కదా. అట్టిది గ్రాంథికభాషకు చేరిస్తే ఉత్తమ విషయాలుతెలుపదగ్గదే అవుతుంది. అదిగాక గ్రాంథిక మేల పరిహరింపాలి? అదీ పరిహరింపబడకూడదు. సుబ్బారావుగారు గ్రాంథిక భాష గ్రామ్యభాష వేఱనుకొంటున్నారు. అది న్యాయంకాదు. వారు అరవానికి తెనుక్కూ యెంతభేదం వుందో గ్రామ్యానికీ గ్రాంథికానికీ అంతభేదం

వుందనుకుంటూ రాశారు. కాని అలా కాదు. దానికి దీనికి అంత తారతమ్యం లేదు. గ్రాంథికభాష గ్రామ్యభాష యత్కించిద్వర్ణ ప్రత్యయాల భేదంతో ఉన్నయ్. పదాలు గ్రాంథికభాషలో లేకపోతే గ్రామ్యభాషలోనూ ఉండవ్. గ్రామ్యభాషలో లేకపోతే గ్రాంథిక భాషలోనూ ఉండవ్. ఇహ గ్రామ్యభాషని అశుద్ధభాషగా తలచారు సుబ్బారావుగారు. తెలుగే శుద్ధభాష కానప్పుడు గ్రామ్యభాష అవుతుందా; భాషకు శుద్ధమేమిటి? అశుద్ధమేమిటి? సభ్యులెల్లా మాట్లాడుతుంటే అదల్లా శుద్ధమే. వేదకాలంలో 'కర్ణేభిః' 'అమమర్శతు' ఒప్పే. క్రమంగా ఆ పదాలు 'కర్ణైః' 'అవమృశతు' అని మాఱాయి. వేదకాలంలో ఈ పదాలు తప్పుకావచ్చు, లేకపోతే లేకపోవచ్చును, కాని యిప్పుడు 'కర్ణేభిః' 'అవమర్శతు' అనునవి తప్పులు. ఏల? మాఱాయి. లోకం ఆ మాటలు మఱిచింది, కాబట్టి లోకం అంగీకరిస్తే అది ఒప్పు. 'చేయువాడు' అనునది గ్రాంథికము. చేసేవాడు – చేసీవాడు – ఈ మొదలైనవి గ్రామ్యములు. ఈ రెండూ కూడ శుద్ధములే. శుద్ధములే కాకపోతే యెందుకు జనులంతా మాట్లాడు తారు? ఆ మాటలు బూతులుకావే? ఆ పదాలని మనం అసంఖ్యాకాలుగా వాడుతున్నామ్. అటువంటప్పుడు అవి అశుద్ధాలంటం సాహసం. ఈ చేసేవాడు – చేసీవాడు అనే పదాలకి బదులుగా 'చెసీవా' డంటే అది అశుద్ధమ్. అందరూ అలా అంటే అదీ శుద్ధమే!

గ్రామ్యము గ్రాంథికము కలుస్తే పేడ బెల్లము పిసికినట్లుంటుంది అంటారు సుబ్బారావుగారు. ఇక్కడ మేమిల్లా చెపుతాము: సంస్కృతము – ప్రాకృతము – శూరసేని – మాగధి – చూళిక – పైశాచి – అరేబియా – అఫ్గనిస్థానము – పర్షియా – మలయ – ఇంగ్లీషు – ఓఢ్రము – దక్షణీ – బంగాళము – ఐటేవియా – చీనా – తుర్కీ – తురేనియా – తార్తారము – మహారాష్ట్రము – పరాసు – లాటిన్ – పోర్చుగల్ – ఇటలీ – గ్రీసు – స్పెయిన్ – ద్రావిడము – కర్ణాటకము – తుళు ఈ భాషలన్నీ కలిస్తే పేడ – బెల్లము కలిసినట్లుండదా? ఇక గ్రామ్యం కలిస్తే పేడబెల్లం కలిసి నట్లుంటుందీ! ఇల్లా అంటం అస్వాభావికం. సుబ్బారావుగారు భాష బాగుచేయా లనే ఉద్దేశంతోనే రాశారు. కాని అది భాషకు అభివృద్ధికాదు. అస్వాభావికంగా అభివృద్ధిని కోరారు వారు. స్వాభావికంగా మేమభివృద్ధిని కోరుతున్నామ్. వీరన్న మాటల కీలా మనం సమాధానం చెప్పుకున్నామ్.

ఇంకా చాలామందిపండితులు, ఇతరులుకూడా గ్రామ్యం అంటే ఒహ చీడపురుక్కిందనో పెద్దపులిగానో కలరాగానో భావిస్తున్నారు. వారి భావాలు బయటికిరావు, అసలున్నాయో లేవో కూడాను. పట్టుదల పెట్టుక్కూ చుంటారు. 'తెలివితక్కువచేత మేము గ్రామ్యాలు మాట్లాడినప్పటికి మీరు మాట్లాడవద్దు. గ్రంథాల్లో వేయద్దు' అంటారు. 'దీనివల్ల యిది నష్టం. ఈ కారణముచేత యిది కూడదు' అని నిరూపించలేరు. ఈ మాటలకి నిదర్శనం చూడండి. తాపీ ధర్మారావుగారు 'ఆంధ్రులకొక విన్నపము' అను వ్యాసంలో..... 'కొందరు భాషాసంస్కరణ కుతూహలప్లవమానమానసులు లేచి, భాషా సంరక్షణమునకు గంకణంబుకట్టుకొని శ్రీహరీ! దాని రూపుమాపగా (?) గ్రామ్యంబునుందెచ్చిరి" అని వ్రాశారు. చూశారా వీరి భయం. గ్రామ్యమెందుకు చెడ్డది? అని శంక చేసుకొని కావున్లు వీరిట్లా వ్రాయించారు. చూడండి –

"గంజామువారి పొత్తంబుల కొండలనడుమను, విశాఖపురివారి కావ్యంబుల సంద్రంబునను, గోదావరి కృష్ణ జిల్లాలవారి గ్రంథంబుల నదుల లోను గలుపు నీ గ్రామ్యవూహయే మన నన్నయాదులకుం గలిగియుండిన నెంత సంతాపకరంబుగనుండును? వారి యర్థంబులెల్ల మన కనర్థకంబులు గాఁగ వారి భారతము, భారతమమయి యుండును గదా! వారి మనంబుల నిట్టిదురూహ వొడమనీయనందుకు దైవమున కంజలినిదె సేయుచున్నవాడ."

అని వ్రాశారు. ఈ వాక్యాల్లో "వారి యర్థంబులెల్ల మన కనర్థకంబులు గాఁగ" అనేది హేతువు.

(సశేషము)

(కృష్ణాపత్రిక
మార్చి 31, 1917)

ఏది సజీవరచన?

ఎప్పుడూ, రచన – అందులో ప్రశస్తరచన సోల్బణమయిన ప్రతిభా వికాసముగల సహృదయవర్గమే చేసేదిగా ఉంటుంది.

సామాన్య ప్రజావర్గమనే పాలలో కాకలు పొంగులు వచ్చివచ్చి పయి పయిని తేరుకొన్న స్నిగ్ధమధురమయిన మీగడ వంటిది సహృదయ రచయితృ వర్గము.

దానిలో, లోలో ఇంకా కాకలు పొంగులు చిటచిటలురేగి మెతకతనము తొలగి గమగమలాడుతూ నెమ్మదిగానెలకొనే నేతివలె వెలసేది ప్రశస్త రచన.

ఇరుగుపొరుగువారికి మంచిచేస్తూ సలహాలిస్తూ ఆనందపరుస్తూ కలసిమెలసి వర్తించే సజీవసత్పురుషునివంటిది సజీవప్రశస్తరచన.

ఆయా దేశకాలములకు ఆవశ్యకములయిన అర్థములను సమకూర్చిపెట్ట డానికిగా పుట్టి, తమపని తీరేదాకా వ్యాపకములయి, తర్వాత ఉత్తరోత్తర రచనలలో జీర్ణమైపోతూ ఉంటై కొన్ని సజీవరచనలు.

పైకి మంచిగా కనిపిస్తూ నిజంగా చెరుపుచేసే సజీవరచనలు కొన్ని ఉంటవి. వీటి గుణదోషపరిజ్ఞానం ప్రజావర్గపు ప్రజ్ఞావిలసితాన్ని అనుసరించి ఉంటుంది.

ధ్రువతారలవలె వెలుగుతూ ఎప్పుడూ సహృదయసంఘమునకు శిరోధార్యములుగా అస్తమించకుండా ఉంటవి కొన్ని శాశ్వతరచనలు.

మానవజీవితపరమార్థమును పరమావధిదాకా ముట్టిచూచినవారే అట్టి రచనలు చేయగలుగుతారు. క్రాంతదర్శులయి ఆ పరమార్థమును గుర్తించి శాశ్వతరచనలు చేసినవారు ఉపనిషద్ద్రష్టలు మొదలగువారు వ్రేళ్ళలెక్క మీదటే. ఇంతదాకా కడచిన కాలాన్నంతనూ గాలించిచూస్తే దొరకగల రనుకొంటాను. వ్యాసవాల్మీకికాళిదాసాదుల రచనలలో కూడా కొన్ని కొన్ని పట్టులే శాశ్వత రచనలనదగినవి. తక్కిన భాగాలు ఆయా కాలాలకు తగినవి. వారి ఆత్మోన్నతి హద్దులనంటునవి అంతే. నిజముగా శాశ్వతరచనలు గాంధీశకముననే

వెలయునని నా నమ్మకము. గాంధిశకమే మానవతలో అపరిచ్ఛిన్నమైన ఐక్యమును, అన్యూనాధికమయిన సామరస్యమును సరిగాగుర్తించి స్థాపింప బూనినది. ఇప్పటికే అందుకు తగ్గ దేశకాలపరిపాకము కలిగింది.

కూడుగుడ్డలు మొదలుగా పరమార్థము దాకా సర్వ ప్రజాభీప్సితములకు సాధనసమన్వయస్థానము గాంధిసారస్వతము. ఎవరో రచయితలు పది పుస్తకాలు చదివి భాషనేర్చి హాయిగా కూర్చుండి, ఇదిగో గ్రంథరచన చేస్తున్నాను. ఇది లోకాని కుపకరిస్తుంది అని సాగిస్తే సాగేదికాదు ఉత్తమరచన.

మానవవర్గం అన్నివిధాలాపెంపొంది అందులో ఉత్తమమానవత వెలసి, అది తనకూ లోకానికీ, సర్వోదయముకై తపించగా దాని గుండె వ్రీల్చుకొని వస్తుంది ఉత్తమరచన.

గాంధిమరణవార్త వినగానే, తన్నుతానే, ఎరగకుండా, సహృదయ రచయితృ లోకం నుండి ఒక్కసారే ఉవ్వెత్తుగా పరిస్ఫురించిన ప్రజ్ఞాప్రబోధములు ఇక మీద వెలయవలసిన ఉత్తమరచనల కాటపట్టులు.

గాంధిసూక్తములు వాని మూలాధారములు :

భవిష్యత్కాలంలో కావ్యవస్తువులు సత్యప్రేమాత్మకములుగానే ఉంటవను కొంటాను. రచనలలోనే యుగపరిణామం అంత పరిణామం జరుగనున్న దనుకొంటాను.

మనిషి మనిషినీ అడిగి తెలుసుకొంటే ప్రపంచమంతటా సహృదయ మానవతలో గాంధిమరణవార్త విన్నక్షణంలో ఏయే సంఘటనలు, సంభాషణలు జరిగినవో సరిగా సత్యముగా వ్రాస్తేనే అవి వెయ్యినవలల పెట్టు అవుతవి. లక్షభావకవిత్వాలందులో ఉంటవి.

సన్నిహితమైన సత్యపు సౌందర్యమును గుర్తించగలిగినకొద్దీ, రచయితలు దూరపు కల్పితపువస్తురచనలకు స్వస్తిచెపుతారు.

గాంధివారితో సహగమనం చేసిన ఆత్మధీరుల వీరగాథలు కావ్యవస్తువులు కాగలవు. దామను పితియనులకంటె మొన్నటి తూము నరసింహదాసు, నేటి గాంధి సహయాత్రికులు దివ్యసాహిత్యదీపకులు.

విద్వేషములు, మారణములు, చాణక్యతంత్రములు, జాతిమతదేశకృత విభేదములుపాటించి పొరపులుపుట్టించే రచనల కికనైనా స్వస్తిచెప్పడం మంచిది.

ఆత్మగుణములను భూతదయాక్షాంత్యనసూయాదులను పెంపొందించే రచనలే వెలయవలెను.

వస్తువు మంచిదే అయినా రచయిత మంచి భాషాది పరికరం కలవాడే అయినా వాని హృదయం పరమార్థాభిముఖంగా పర్వులువారేది కాకపోతే ఆ రచన చెడుతుంది. పరమార్థాభిముఖంగా పర్వులువారే హృదయం కలవానికి ఎటువంటి వస్తువైనాసరే మిలమిలలాడుతూ వస్తుభావప్రజ్వలనంవల్ల ప్రతిభాసిస్తుంది.

రచనకు నిజమైనసౌందర్యం పరమార్థపరాయణతవల్ల వస్తుంది. పాతిక ముప్పైయేండ్లనుండి మనతెలుగురచనలో కొత్తదనం వచ్చిందంటున్నారు. నిజమే. ఏదో వచ్చిందిగాని, అది ఏదో వచ్చిందన్నట్టే చాలా మట్టుక ఉన్నదనుకొంటాను. అందులో తెలుగుదనమూ పరమార్థపరాయణతా చాలా తక్కువ ఎందుచేతనంటే –

ఏ జాతిలోనయినా ప్రజలకు, వారి భావములకు, భాషకు సర్వతోముఖ మయిన స్వాతంత్ర్యం వస్తే, ఆ వచ్చిన తర్వాతనే ఆ జాతిలో తేరుకొనే సహృదయ వర్గము చేసే రచనవల్ల ఆ జాతి రచనావిశిష్టత ప్రవ్యక్తమవుతుంది. అట్టి శుభస్థితి తెలుగునాటి కింకా కలగలేదు. కూడుగుడ్డ లేక మలమలమాడుతూ ఉండే ప్రజలకుగాని, వారిలో నుండి తేరుకొనే రచయితృవర్గానికిగాని, పరమార్థ పరాయణత కుదురుపడడం కష్టసాధ్యం. తిష్టకుదిరితేగాని నిష్ఠ కుదరదు. కుదిరినా అది అల్లకల్లోలాన్నే ప్రదర్శిస్తుంది. భాషాప్రయోజనాలన్నీ చాలా మట్టుకు మనం తెలుగురచన వెలసినదాది నేటిదాకా పరభాషవల్లనే పడయడ మవుతున్నది.

ఏదో ఉన్నతసంఘంవారు, వారిపైయెత్తుభాషతో, ఇంతవరకు ఒక్క సాహిత్యప్రయోజనం మాత్రం కొంతకొంత సాధించడం జరుగుతోంది. ఈ ప్రౌఢసాహిత్యం ప్రజాసామాన్యాని కే మాత్రమూ పనికిరాదు.

పాతికముప్పైయేండ్లనుండి లఘుకథలు, లఘునాటకములు, వృత్తగంధి రచనలు, గేయరచనలు, తెలుగునాట మంచి మంచివి సాగుతున్నవి. వీనిలో

కొంత అపూర్వత, సౌలభ్యం ఉంటున్నదిగాని, ఇవి దేశములోని సంక్షోభములను నిరాశలను వెల్లడించడమే కాని మానవనౌకపరమార్థము గట్టు చేరగలందులకు అట్లే ఉపకరించేవిగాలేవు. వీటిలో కొన్ని విలాసినీ విలసితములతో కావ్యానికి లక్ష్యంగా కూడా ఉన్నవి.

ఇప్పుడు ప్రజావర్గమంతా అన్నవస్త్రదారిద్ర్యముతో, జ్ఞానదారిద్ర్యముతో తహతహలాడుతున్నది,

ముందు ఈ దారిద్ర్యబాధ తొలగవలెను. రచయితృవర్గమంతా ముందుగా ఈ క్షామనివారణమునకు సహాయపడే రచనలు సర్వతోముఖముగా సాగించవలసి ఉన్నది. అవి పద్యకవితారచనలుగావు. ప్రజలభాషలోనే ప్రపంచ విజ్ఞానమంతా దింపేవి కావలెను. అవి వచనరచనలే. వచనరచనలలోనే మోసగింపులేని సిద్ధమైన భావప్రసారం ఉంటుంది.

తెలుగుదనము నిండార్లుగా పొంగిపారే రచనావాహిని తెలుగునాట ఇక మీదనే వెలయవలసి ఉన్నది. రచనకు భావముతోపాటు భాష కూడా సమయోగ్యత గలది. అందుకై వడివడిగా భాషాసాధనసామగ్రి సంపాదనము జరగవలెను.

ఆంధ్రసాహిత్యసౌధమునకు పునాదులయిన నానుళ్ళు. పలుకుబళ్ళు, సామెతలు, జంటపలుకులు, లబ్జులు, పలుకుగుత్తులు, పనిపాటలవారి పరిశ్రమగీతాలు, బాలకుల ఆటపాటలు, స్త్రీలసౌభాగ్యగేయాలు, నోముల పాటలు, బిచ్చగాండ్రపాటలు, భక్తుల ప్రార్థనగీతాలు, వృద్ధులవేదాంత కీర్తనలు, చమత్కారకథలు, పొడుపుకథలు, ఊళ్ళకథలు, వాటి చరిత్రలు, ఊళ్ళలోని పూర్వపు పెద్దలకథలు, అక్కడి శిల్పములు, గ్రంథములు, జాతి పరిశ్రమలు, వాటి సంప్రదాయములు, బిరుదావళులు, ఆచార వ్యవహారములు, గుళ్ళు, వాటి చరిత్రలు, శాసనములు, వాటి చరిత్రలు, నదులు, కొండల, మనుష్యుల పేళ్ళు, వాటి పుట్టుపూర్వోత్తరాలు వగైరాలు దేశం నాలుగు చెఱగుల నుండి సేకరించడం జరగవలెను. అటువంటివాటిలో ఆయాజాతుల ప్రజల సహజాభిరుచులు, పలుకుతీరులు, కూర్పునేర్పులు, సారస్యవైరస్యములు, ఆశావాసనలు అన్నీ అద్దములో వలె అమాయికముగా ప్రతిఫలిస్తూ ఉంటాయి.

వీటి తీరుతీయముల ననుసరించి సాగించే వాఙ్మయనిర్మాణము నిర్వక్రమై జాతివార్తాచమత్కారవిలసితమై అతుకులబొంత కాకుండా జాతి శరీరమునకు అందచందముల నాపాదిస్తూ అత్తుకొని వెలయగల్గుతుంది.

అందుకై యూనివర్శిటీవారు, దొరతనమువారు, సాహిత్యపరిషత్తులవారు, మునిసిపాలిటీలవారు, అందరు ఏకమై దేశం నలుమూలలా గాలించి భాషాసాహిత్యపరికరముల సర్వేచేసి సేకరింపవలెను.

అక్కడక్కడ విద్యాశాలలోని తెలివిగలయుపాధ్యాయుల నిందుకై వినియోగింపవలెను. ప్రతిజిల్లాపాఠశాలలో వారిసేకరము గ్రుచ్చియెత్తి చేర్చే యేర్పాట్లు జరగవలెను. సేకరించే విధానము వారికి ముందు నేర్పేవారు తయారుకావలెను. కొందరు జిల్లాలు, తాలూకాలు టూరుచేసి ఆయా విధానములు బోధింపవలెను. ఆంధ్రప్రదేశమంతకూ వాటినన్నింటినీ చేర్చి తీర్చిదిద్ది ప్రకటించే సంస్థ గొప్పది వెలయవలెను. ఇదంతా ఆంధ్రరాష్ట్రం వేఱుపడడం ఆంధ్రదేశాన్ని ఆంధ్రులే పాలించడం జరిగేకాలం దగ్గరకు వచ్చినది గనుక సులువుగా ఇక నిర్వర్తింప వీలుపడుతుంది.

ఆంధ్రరాష్ట్రం వేరై, ఇళ్ళలో, స్కూళ్ళలో, రైళ్ళలో, ఆఫీసుల్లో, వర్కుషాపుల్లో, కోర్టులో, కౌన్సిళ్ళలో సర్వవ్యవహారమూ దేశభాషామూలంగా సాగిందంటే ఓహోహో మనం ఎన్నడూఎరగని రచనావైవిధ్యం మన భాషలో విజృంభిస్తుంది. అలాంటి విజృంభణ ఏర్పడ్డ తర్వాతనే వస్తుంది నిజమైన స్వాతంత్ర్యం.

సినిమా నేనింతదాక చూచి యెరుగను. అయినా దీని చెల్లుబడి ప్రజావర్గం మీద చాలా ఉన్నదని యెరుగుదును. ఇది మచ్చుచల్లి పామర ప్రజావర్గాన్ని ఎక్కడకో లాక్కువెడుతోంది. కాని సామాన్యంగా అది పామరుల, లఘుబుద్ధుల రంజనమునే పరమార్థముగా పెట్టుకొని సాగుతున్నదంటూన్నా రనేకులు. విజ్ఞానపరమార్థములు వీటివల్ల వెలయడంలేదంటున్నారు పరిణతబుద్ధులు కొందరు. ఏమో, ఈ సినిమాలలో వలపులకథల గగ్గోలు తగ్గితే బాగుండును. సినిమాల బ్రతుకంతా చక్కనిచుక్కల, వారి శృంగారగేయాలమీద ఆధారపడి ఉండడం కొంతైనా తొలగితే బాగుండును. పామరప్రజావర్గానికి పరమార్థాభిరుచి కొల్పేవిగా గాని, సినిమారచనలు, పామరుల ఆదరాభిరుచులకు లోబడి పోయేవిగా ఉండరాదు.

రేడియో ప్రపంచమానవత ఎంత దూరాన ఉన్నా, వారి భావములను దగ్గరకు చేరదీసి, మెరుగులు దేరుతూ ఉండే వారి మేల్మిరచనలను పరస్పర సమాకలనార్థ్వములను కావిస్తోంది. దీనివల్ల ప్రపంచం మొత్తాన సరసజీవ దివ్యరచనల వైభవం పరస్పర గుణసంగ్రహణోత్సాహంతో ప్రబలమై ప్రజ్వ రిల్లుతున్నది. యోగులు తపస్సుచేసి నిగూఢంగా సాధించే దూరశ్రవణ దూర దర్శనాది సిద్ధులను సర్వసామాన్యంగా లభ్యపరుస్తున్న ఈశ్వరశక్తి రేడియో. భవిష్యత్కాల సజీవరచనల కిది ప్రాకుడుగొమ్మ.

ఆంధ్రప్రదేశ్ మధ్యంలో రేడియో ప్రసారం సాగితే, అది తెలుగువారి సారస్వతవృద్ధికి చాలా తోడ్పడుతుంది. రేడియోసంగ్రహముగా సారస్వత సారోద్ధారమును ఎప్పటికప్పుడు ప్రదర్శిస్తూ ఉంటుంది. కనుక దానివల్ల సారస్వతవృద్ధి పరుగులు వారుతూ సాగుతుంది. మున్ముందు వెలిసే రచనల రూపురేఖలన్నీ ఇప్పుడే మనం తీర్చి చూపజాలము. దేశభాషామూలకపాలన జరగడం మన భాషాజీవితంలోఒక బ్రహ్మాండమంత శుభాభ్యుదయ పరిణామానికి కారణమవుతుంది.

(రేడియో గోష్ఠి మదరాసు
10-4-1948
ఆంధ్రభూమి 31-8-1980
మణిమంజరి, ఫిబ్రవరి 1982)

ఏనాదులు

ఏనాదులు చిన్ని చిన్ని గుడిసెలలో నివసింతురు. సామాన్యముగా నా గుడిసెలు రెండు మూడుగజముల మధ్య కొల్త గలవిగా నుండును. తెల్లవారు జాముననే వేటకుపోవుదురు. సాయంకాలము నాలుగైదుగంటలకు తిరిగి వత్తురు. వేటకు పోయినప్పుడు వాండ్ర గుడిసెలలో పదార్థములేమీ కనుపడవు. వట్టిముంతలు చేటలే. గుడిసెలలో జానెడులోతున మంచి యిసుకనుంచుదురు. మెత్తదనముకోసము చేర్చినట్టు కానవచ్చును. ఆ యిసుకనుతొలగించి చూడగా అడుగున నేలలోనికి పెద్దపెద్ద కుండలు పాతియుండును వాని మూతులపై కొయ్యచెక్కలుగాని సీనారేకులుగాని మూసి, మీద నిసుక కప్పుదురు. సామగ్రి, ఆ కుండలలోనుండును. చిరకాలాభ్యాస మే విద్యలోనైనను చురుకు గలిగించునుగదా! మోసగించుటలో, ఏనాదులకు చురుకు మెండు. కొందరు మాతోటలో నివసించుచుండిరి. గుడిసెలమీద సొరతీగలు మొదలయినవి ప్రాకించితిమి. తీగలెంతనేవళముగా పెరుగుచున్నను కాయలు కానరా వయ్యెను. కారణమేమగునాయని, గుడిసెలకున్న చిన్ని చిన్ని ద్వారముల గుండ లోనికి చూడగా లోపల పాలవెల్లికట్టినట్టు సొరకాయలు కానవచ్చినవి. పిందెలుపడగానే గుడిసెమీది తాటాకులకు కంతలుపొడిచిలోనికి దింపు చుండిరి.

వీండ్రు కూలినాలి చేసికొని జీవించుటకు సాధారణముగా నంగీకరిం పరు. వేటయే ప్రధానజీవిక. నక్కవేట నేర్చినగాని పెండ్లాడరాదు. పెండ్లికి ముందు పెండ్లికొడుకు వేటాడి నక్కనుదెచ్చి దానిమాంసముతో కులము పెద్దలకు విందు చేయవలెను. స్త్రీకి యుక్తవయసు వచ్చిన తరువాతగాని వివాహము జరుగదు. పెండ్లాడుటలో పిల్లదే స్వాతంత్ర్యముగాని తల్లిదండ్రుల యంగీకారముతో పనిలేదు. స్వయంవరమే. ఆలుమగండ్రు చెట్టపట్టుకొని మండలాకారముగా నృత్యముచేయుట పెండ్లికి ప్రధానతంతు. స్త్రీ యెన్ని వివాహములైన నాడవచ్చును. ఒక మగని విడిచి మరియొకని పెండ్లాడెనా నింద పురుషునికిగాని స్త్రీకిగాదు. ఆలిని తిన్నగా నడుపుకోలేక పోయినాడని కులమువాండ్రు గర్హింతురు. వ్యభిచారము మిక్కిలి నింద్యము. స్త్రీకంటెకూడ పురుషునికి మిక్కిలి నింద్యము. పురుషుడు తప్పుగా ప్రవర్తించినట్టు తెలిసెనా

స్త్రీ మిక్కిలి గోలచేసి వానిని విడనాడును. ఒక పెండ్లామున్నను మరొకతెను గూడ కట్టుకోవచ్చును. శవమును దహింతురు. కులమువాండ్రందరు త్రాగి సహభోజనముచేయుటే యౌర్ధ్వ దైహికకర్మము. గ్రామముల మూలమునకంటె అడవులమూలమున వీండ్ర కెక్కువ జీవనము జరుగును.

నేర్పుతో ద్రాచుబాములను పట్టి గరళముపిండుదురు. తేనెతుట్టెలను సులువుగా పట్టగలరు. పొడుగుపాటిగడకు చివర గుడ్డపీలికలుకట్టి నిప్పు ముట్టించి తేనెతుట్టె దగ్గరగా పట్టుదురు. ఆ సెగకు, ఆ పొగకు, తేనెటీగలు, ఉక్కిరిబిక్కిరి అయి చెల్లాచెదురుగా పారిపోవును. మరికొంతసేపటికి పొగ ఉన్నంతమేరకు ఈగ చేర రాదు. అప్పుడు తేనెతుట్టె పట్టుట సులభమగును.

ప్రొద్దున వేటకువెళ్ళి 9,10 గంటలయ్యేటప్పటికి చల్లని యాహారము భుజింతురు. అది యేదనగా ఆరబండిన రక్కెసపండ్లు నూగురాల్చి, 15,20 వరకు తిందురు. ఎండవేడిమిని రానియ్యదట! చల్లగా ఉండి ఓపిక నిచ్చునట. వడదెబ్బతినిన వాండ్ర కా యాహారమునే పెట్టుదురట. ప్రసవించిన నాటినుండి కూడ స్త్రీ పనిపాటులలో ప్రవర్తించును. పిల్లఒడిలో నుండును. ప్రసవించిననాడు బాలెంతరాలు కుంకుడివేళ్ళను నమలవలెను. అదియే వాండ్రకు ఔషధము. కారుచేదుగానుండు కుంకుడువేళ్ళను నమలగలుగుటకు వెఱ్ఱితీపిగానుండు గురివెందయాకునుగూడ తోడుచేయుదురు.

వేసవికాలమందు ఎలుకలవేట హెచ్చు. బహుచాతుర్యముతో ఎలుకలను పట్టుదురు. పొలములలో వాటి కన్నములను గుర్తించి తవ్వి కుంచెడు రెండు కుంచెములుగా ఆ కన్నములనుండి ధాన్యమును సంపాదింతురు. ఈతాకు చాపలల్లి యమ్ముదురు. నేలగుమ్ముడు, భూశర్కర, ఈశ్వరి మొదలయిన ఓషధులు కోరిన వారికి తవ్వితెచ్చి కొంచెపు విలువకే అమ్ముదురు. వసంత ఋతువులో తేనె, మైనము, తుమ్మబంక అమ్ముదురు. అద్దపు పెంకులువిరిచి తామే క్షౌరము చేసికొందురు. పురుషుడెంత పాటుపడునో స్త్రీకూడ నంతపాటు పడును. స్త్రీకి నాజూకు లేదు. కాబట్టి పురుషున కొదిగియుండదు. బ్రాహ్మణుల యిండ్లలో సంతర్పణలు జరిగితే, ఆ పుల్లెలలోని యెంగిళ్లు తిందురు. పారవేసిన కూరలు వగైరాలు గారెలవలెచేసి యెండించి దాచుకొని అప్పుడప్పుడు

ఉపయోగించుకొందురు. ధనము దాచుకొనుటవలన ప్రయోజనము వాండ్రెరుగరు. దాచుకోరు. త్రాగుడునకై వ్రయింతురు. నక్కలు దొరకనిచో నక్కలమ్మకు జాతర చేయుదురు. తప్పద్రాగి చిందులుద్రొక్కుటే జాతర. భాష సరిగా తెలుగు. తురకము కలియనే కలియదు. సంస్కృతమున్నూ చేరదు. ఎఱుకలవాండ్రకు వలె వీండ్రకు అరవపు సంబంధము అంతగాలేదు. ఉచ్చారణలో పదములు మిక్కిలి కుంచింపబడును. తత్త్వపరిశోధకులకు కొన్ని రహస్యములను దెలుపును.

(కృష్ణా పత్రిక
జనవరి 13, 1917)

పూర్వకాలపుపల్లెటూళ్లు

పూర్వకాలపు పల్లెటూళ్ళు పట్టణములకంటె సౌభాగ్యము సౌఖ్యముగలవై ఉండేవి. ఇప్పుడు పట్టణములలోనే గాని దొరకవనుకొనే సౌకర్యాలన్నీ ఆనాడు పల్లెటూళ్ళలోనే హెచ్చుగా దొరికేవి. విద్య, వైద్యము, వర్తకము మొదలయిన నాగరికలక్షణాలు నేడు పట్టణములలోనే కాని పల్లెటూళ్ళలో లభించవు. పూర్వము ఇవి అన్నివూళ్ళలోను అబ్బేవి. పట్టణాలకు ఇప్పుడున్నంత ప్రాముఖ్యం అప్పుడుండేదిగాదు. ఈ విషయమునకు కొంత వివరణము:

పూర్వకాలము పల్లెటూళ్ళలో, విద్యాప్రచారము చేయడముకు బ్రాహ్మలు, శత్రువులభయములేకుండా ఊరిని రక్షించడముకు క్షత్రియులు, వర్తక వ్యాపారములకు కోమట్లు, వ్యవసాయము చేయడముకు శూద్రులు, బంగారపు పని, (సొన్నారం) కొయ్యపని, (వడ్రంగం), ఇనుముపని, (కమ్మరం) కంచుపని, (కంచరం) రాతిపని, (కాసె) చేయడముకు పంచాణమువారు, మట్టి పాత్రములు చేయడముకు కుమ్మరివారు, వస్త్రములు నేయడముకు సాలెవారు, నూనెతీయడముకు తెలుకులవారు, చాపలుబుట్టలు అల్లడముకు మేదరవారు, బట్టలుతకడముకు చాకలివారు, క్షౌరముకు, మంగళవాద్యములకు మంగలివారు, చెప్పులు కుట్టడముకు గొడగరి (మాల) వారు, శ్మశానము చక్కబరచడముకు మాదిగవారు మొదలుగా అనేక వృత్తులు చేసేవారు అనేక జాతులవారు ప్రతిగ్రామంలోనూ ఉండేవారు. గ్రామమంటూ ఒకటి ఉంటే అందులో పై జాతులవారందరూ ఉండవలసినదే. ఊరిలో కాపురమున్న వారందరికీ ఈ అన్ని జాతులవారిలోనూ ఒకరితోఒకరికి అవసరం ఉండడంచేత వారు విరోధములు లేకుండా కలసిమెలసి ఏకీభావంతో ఉండేవారు. ఊరూరా దేవళములు ఉన్నవి గనక అక్కడి దేవరలకు నిత్యోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, వార్షికోత్సవాలు ఊరివారందరు మొత్తంమీద కలిసికట్టుగా చేయించేవారు. అవి అందరికీ అత్యానందంకలిగించేవి. కోవెలదగ్గర మంచినీటి చెరువు నిర్మలంగా సురక్షితంగా ఉండేది. ఆ చెరువునీళ్లు దేవుడి అభిషేకాల కుపయోగించేవారు గనక, అందులో ఏలాటి మలినము చేరనిచ్చేవారు గారు. దానివల్ల గ్రామానికి నిర్మలమైన మంచినీటి సౌకర్యం ఉండేది. బ్రాహ్మణులలో

వైదికులు వేదశాస్త్రాలు నేర్చుకుంటూ ఈశ్వరుణ్ణి గూర్చీ పరలోకసౌఖ్యమును గూర్చీ విచారణలు జరుపుతూ ఇతరులకు బోధిస్తూ, బ్రాహ్మణులకు బ్రాహ్మణేతరులకూ, పౌరోహిత్యములు జరుపుతూ ఉండేవారు. నియోగులు ఊరి అధికారములు చెలాయిస్తూ దేశభాషలోను, రాజభాషలోనూ పాండిత్యము సంపాదించి వీధిబళ్లుపెట్టి సామాన్యవిద్య అందరకూ నేర్పుతూ, కరణికములుచేస్తూ, ఊరిలోని తగవులు తీరుస్తూ రాజసంస్థానాలతో వ్యవహార ములు నడుపుతూ, వైభవముతో ఉండేవారు. బ్రాహ్మలలో, శైవులు, వైష్ణవులు, వైఖానసులు కొందరు దేవాలయములలో అర్చనాది కార్యములు జరుపుతూ, సమ్మానింపబడుతూ ఉండేవారు. సంగీతము, సాహిత్యము, వైద్యము, జ్యోతిషము, వేదాంతము, తర్కవ్యాకరణములు మొదలైన శాస్త్రాలు, కళలు బ్రాహ్మలు తరచుగా అభ్యసించి వాటిలో విద్వాంసులై ఇతరులకు నేర్పుతూ ఉండేవారు.

విద్యలు నేర్చుకొనే విద్యార్థులకు అన్నవస్త్రాదులు కష్టము లేకుండా దొరికేవి. విద్యార్థులందరూ బ్రహ్మచారులుగా ఉండడంచేత మాధుకరం ఎత్తి జీవనం చేసేవారు. కాబట్టి అనాయాసంగా ఒకరికి తొందరలేకుండా వేళకు విద్యార్థులు సుఖభోజనం చేయగలిగేవారు. గురువులకు వారు జీతాలివ్వడం ఉండేదిగాదు. గురువుకు సేవచెయ్యడమే జీతమివ్వడంగా ఉండేది. ఆ విధంగా విద్యనేర్పే గురువులను చదువుకునేశిష్యులను ఊరివారు పోషించేవారు.

దేవాలయాలలో కుంభహారతులు మొదలయిన శుభకార్యములు జరుపుతూ వేశ్యలు సంగీతాభినయవిద్యలలో చతురురాళ్లై మన్ననలందుతూ ఉండేవారు. ఊరిలో శుభకార్యములు జరిగేటప్పుడు వేశ్యలు నల్లపూసలు గుచ్చియివ్వడం మొదలయిన శుభప్రయోజనములకు అవసరమై ఉండేవారు.

ఊరిపొలములు పండేపంటలలో, వసూలుచేసే శిస్తులో పురోహితులకు, ఉపాధ్యాయులకు, కరణాలకు, దేవాలయాలకూ, అర్చకులకూ, పంచాణం వారికీ, చాకళ్ళకూ, మంగళ్ళకూ, కుమ్మరివారికీ, సాలెవారికి ఇంకా ఇతర వృత్తులవారికీ, సంవత్సర గ్రాసానికి చాలినజీతం ఇయ్యడం ఉండేది. దానితో వారు శాంతిగా, సౌఖ్యంగా జీవనాలు గడుపుకొనేవారు. మిగిలినసొమ్ము

దేశమేలే రాజుకు కప్పం కట్టేవారు. రాజు గ్రామాలయోగక్షేమాలు కరణాలు మొదలైనవారి ద్వారా చక్కగా విచారిస్తూ ఉండేవారు. దేశంలోని పాడిపంటలు దేశంలోనే ఖర్చయ్యేవి. అందరికీ తగినన్ని వృత్తులుండేవి. వ్యర్థంగా కాలక్షేపం చెయ్యడానికి వీలుండేదిగాదు. సోమరితనం ఉండేదిగాదు. అందరూ చక్కగా పనిపాట్లు జరుపుకొంటూ ఉండేవారు. కాబట్టి అందరూ ఆరోగ్యవంతులై ఉండేవారు. దూరదేశప్రయాణాలు సాధారణంగా ఉండేవిగావు. ఊళ్లు విడిచి లేచిపోవడం సాధారణంగా ఉండేదిగాదు. దేశవిధ్వంసం వచ్చి ఇతర రాజులు దేశం కొల్లగొట్టడం సంభవిస్తే అప్పుడప్పుడు కొన్ని ఊళ్ళు పాడుపడడం ఉండేదిగాని రాజవిప్లవం లేనప్పుడు ఊళ్లు సురక్షితంగా ఉండేవి.

ఊళ్లలో దుర్వ్యాపారాలు, దుస్తంత్రాలు, అప్పుడు హెచ్చుగా ఉండేవిగావు. ధర్మాధర్మముల విచారణ ఊరిలోనే జరిగేది గనుక దొంగసాక్ష్యాలు కల్పించి సత్యము అసత్యముగాను, అసత్యము సత్యముగాను మోసగించడానికి వీలుండేదిగాదు. విచారించే అధికారులు ఊరివారే అవడంచేత వాది ప్రతివాదుల యోగ్యతాయోగ్యతలు, స్వరూపస్వభావాలు వారికి బాగాతెలిసి ఉంటై గనక సాక్ష్యాల అవసరం అట్టె ఉండేదిగాదు. దొంగసాక్ష్యాలు సృష్టించ డానికి అధికారులను మోసగించడానికి శక్యమయ్యేదిగాదు. ఆయా దేశాల ప్రజలు ఆయా దేశాలలో పండే, తయారయ్యే వస్తువులతోనే ముఖ్యంగా జీవయాత్ర గడిపేవారు. దూరదేశాలనుండి వచ్చే వస్తువుల ఉపయోగం అసాధారణంగా ఉండేది. ముఖ్యంగా స్వదేశప్రజల అవసరాలకు సరిపోగా ఏవయినా పంటవస్తువులు, తయారయ్యే వస్తువులు, మిగిలితే ఇతరదేశాలకు వెళ్లేవి. ఇతరదేశాలని చెప్పడమేకాని అవి హిందూదేశాంతర్భాగములే అవడంచేత వాని క్రయవిక్రయాలవల్లవచ్చే మేళ్లు స్వదేశపు పల్లెటూళ్లకే చెందేవి. వానివల్లకూడా పల్లెటూళ్లు అభివృద్ధి పొందేవి, ఎట్లాగంటే: – తెలుగు దేశాన్నుండి కన్నడదేశానికి ధాన్యం ఎగుమతి కావలెనంటే ఆ ధాన్యమును రెండు దేశాల కాపులు బండ్లుకట్టి వాటిద్వారా చేర్చేవారు. బండ్లకూలి అంతా బాటగ్రామాలకే దక్కేది. అమ్మేవారూ కొనేవారూ హిందూదేశపువారే గనక ఎవరికి లాభము కల్గినా అది దేశంలోనే ఉండేది. పూర్వకాలం ఈ విధంగా

ఒకదేశాన్నుంచి యింకో దేశానికి సరకులు వగైరాలు సప్లై కావడానికి కొన్ని ముఖ్యమయిన బాటలుండేవి. అందులో ముఖ్యమైనది కాశీరామేశ్వరాల బాట. దానికి తెలుగుదేశంలో “దండుబాట” అని పేరు. ఆ బాటలో బాటసార్లకు సర్వసౌకర్యాలు ఉండేవి. అన్నసత్రాలుండేవి. మంచిబసలుండేవి, పశువులకు మనుష్యులకు కావలసిన సహాయములన్నీ, చక్కగా దొరకేటందుకు మంచి ఏర్పాట్లుండేవి. ఈ యేర్పాట్లకొఱకై అనేకులు దానధర్మాలు జరుపుతూ ఉండేవారు. ఆ ముఖ్యమార్గములు ఎప్పుడూ జనాకీర్ణములై నిత్యకళ్యాణముగా ఉండేవి. ఆ బాటలలో దుకాణములనేకములుండేవి. ఇతరదేశాల్నుండి వచ్చేవారు విక్రయించిపోయేటందుకు ఇతరులిక్కడి వస్తువులను కొనుకొని వెళ్లేటందుకు ఆ దుకాణాలు ఉపయోగపడేవి. ఇప్పుడు చెన్నపట్నం, కలకత్తా, బొంబై మొదలయిన మహాపట్టణాలకు వెళ్లితేనే కాని కొన్ని గొప్పవస్తువులు దొరకవు. ఆ నాళ్లలో ఆలాంటి వస్తువులన్నీ దండుబాట మొదలయిన రహదారి రోడ్లమీద దొరికేవి. కాశీనుంచి రామేశ్వరందాకా నడుమనడుమ అంచెలంచెలుగా ఆగుతూ వర్తకులు సరకులతో ప్రయాణాలుచేసేవారు గనక, ఆ బాటలు ‘తిరిగేపట్టణాలు’ గా ఉండేవి. ఇప్పుడు పట్టణాలలో లభించే ముచ్చటలు, అప్పుడు ఈ బాటలలో చుట్టుపట్టుల గ్రామాలవారికి చేరికనే లభించేవి.

గ్రామంమీద సర్వాధికారాలు ఊరి పెద్దలమీద ఉండేవి. గనుక ఊళ్లలో పెద్దపిన్న తారతమ్యాలు చక్కగా పాటింపబడుతూ ఉండేవి. గ్రుడ్డువచ్చి పిల్లను వెక్కిరించడము ఆనాడు ఉండేదిగాదు. ఊళ్లలోనివారు తమతమ కష్టసుఖము లకు తామే బాధ్యులమని గుర్తెరిగి అన్యులమీద ఆధారపడక జాగ్రత్తగా స్వసౌకర్యములు సంరక్షించుకొంటు ఉండేవారు. ఆయా జాతులవారు ఆయా జాతులవృత్తులను శ్రద్ధతో జరుపుకోకపోతే ఊళ్లోజీవనాధారం ఉండేది గాదు. కాబట్టి వృత్తులు సాంకర్యం లేకుండా చక్కగా సరిగా సాగుతూ ఉండేవి.

ఇంటింటా గోపూజ సాగుతూఉండేది, ఆవునేతితో దీపారాధనలు జరుగుతూ ఉండేవి. బాలకులు గుమ్మపాలుత్రాగి మిసిమిగలిగి కోడెదూడలు లాగు గంతులువేస్తూ ఉండేవారు. కమ్మనినెయ్యి పెరుగులతో దంపుడు బియ్యపు

అన్నము, జొన్నన్నము మొదలయినవి ఆయాదేశాలలో పండే ధాన్యాల అన్నముతిని అందరూ ఆరోగ్యభాగ్యము అనుభవిస్తూ ఉండేవారు. తలకుదాటిన ఆశలుండేవిగావు. వేలకొలదిపుటల చెత్తపుస్తకాలు చదవడ ముండేదిగాదు. లాంగ్‌సైటు షార్టుసైటు మొదలయిన కళ్లజబ్బులుండేవిగావు. నిమ్మకు నీరెత్తినట్టు నెమ్మదిగా గ్రామజీవనం సాగుతూ ఉండేది. ఇకనేడో!

(సంపాదకీయం
ఆనందవాహిని 1-3
మార్చి, 1930)

జానపదవాఙ్మయం

ఆంధ్రజాతి యాచార వ్యవహార ప్రవాహములో అంతర్లీనమయిపోయినవి ప్రాచీనకాలపు దేశిరచనా ప్రభేదములు. అవి కొన్ని యెంతగా అంతర్లీనమయి నవీ అంటే వాని అనుపానులు సరిగా ససిగా నేటివారు అనుమానించడానికైనా సాధ్యపడనంత వింతగా అంతర్లీనములయినవి. నేటికాలపు తెలుగుపాండితి వాటివాసననైనా యెఱుగనక్కరలేనంత యవనతితో ఉన్నది. చిత్రవిస్తర కవితావిశారదులుగా నేటి మన యెఱుక కందియున్న మన ప్రాచీనకవీశ్వరులు ఈ దేశిరచనాప్రభేదములను బాగా యెఱిగినవారై ఉండేవారనీ, రచించగల వారై కూడా ఉండేవారనీ చెప్పడాని కాధారాలున్నవి. నాచనసోమన వసంత విలాసమని గ్రంథము రచించినాడట. అది దొరకలేదుగాని దానిలోని దేశిరచన యొకటి లక్షణగ్రంథాలలో ఉదాహృతమై ఉన్నది.

వీణాగానము వెన్నెలతేటా,
రాణమీఱంగా రమణులపాటా
ప్రాణమైన పిన బ్రాహ్మణు వీటా
జాణలు మెత్తురు జాజఱ పాటా

ఇది విതాళచౌపద అని పేరుగల దేశిచ్ఛందోరచనాప్రభేదము. యక్షగానా లలో తప్ప దీనికి విస్తరకవితలో లక్ష్యములు దొరకవు. ఈ వితాళచౌపదలో పేర్కొనబడిన 'జాజఱపాట' యెట్టిదో నేడెవ్వరూ ఎఱుగరు. తాళ్ళపాక వారి తిరుపతి పాటలలో అది కానవస్తున్నది. ఈ జాజఱపాట దేశిరచనాప్రభేదమే.

దేశిరచనలు ఆచారవ్యవహారములలో అంతర్లీనమై ఉండడం కొంత వివరిస్తాను. 'వాఁడు నన్ను ఎగతాళి చేస్తున్నాడు' అన్న నానుడి ఆంధ్రదేశం అంతటా ఉన్నది. ఇందులోని ఎగతాళి పదం పుట్టుపూర్వోత్తరాలు ఎట్లాంటివో యెఱుగున్న వారెందఱో ఉండరు. ఎకతాళి అనేది ఒక దేశిరచనా ప్రభేదము. ఎకతాళి ఎగతాళి రూపభేదములే. సాతవాహనులనాటిదగు బృహద్దేశి, చాళుక్య సోమేశ్వరుని మానసోల్లాసము, చాళుక్య జగదేకమల్లుని సంగీతచూడామణి, కాకతీయులనాటి జాయసేనాపతి నృత్తరత్నావళి యీ యెకతాళిని పేర్కొన్నవి

'ఏకతాళాఖ్యతాళేన గేయాస్యా దేకతాళికా' అని సంగీతచూడామణి – యక్ష గానములలో కొన్నింట ఎకతాళి రచనలున్నవి.

వాడు చిందులు తొక్కుతున్నాడు.

ఆ వీధిలో వంకాయలు వాలలాడుతున్నవి ఇత్యాది వ్యవహారములలోని చిందులు, వాలలు, దేశిరచనా ప్రభేదములే. 'వేడుకతో చిందు పాడంగ నుబ్బి కోణంగి యాటల గునిసెడువారు' అని చిందుపాటను పాల్కురికి సోమనాథుడు పేర్కొన్నాడు. 'గీతార్థాభినయోపేతైర్ద్విపదై శ్చిందుసంజ్ఞికైః' అని చిందులు రెండేసి పదములు గలవిగా జాయసేనాపతి చెప్పినాడు. యక్షగానము లలో కొన్నింట చిందురచనలు కానవచ్చును. అవి ఆంధ్రదేశమునుండి అరవ దేశమునకుకూడా ఎగబ్రాకి అక్కడ లక్ష్యలక్షణ ప్రయోగప్రసిద్ధి పడసి యున్నవి. 'కావడి చిందు' 'నొండి – కుంబి – చిందు' ఇత్యాదులు అక్కడి ప్రభేదములు. 'వాడు తందనాలాడుతున్నాడు' అన్న వ్యవహారములోని తందనాలు తందానపదములన్నపేర ప్రసిద్ధిగాంచిన పదములే. వాటిలో తందానే అన్నది ఆ పదమునకు పల్లవిగా – అంటే ఊతపలుకుగా ఉంటుంది.

"ఇదేమిటో పెద్ద రగడగా నున్నదే" అన్న పలుకుబడిలోని రగడ గేయ రచనా ప్రభేదమే. రగడలు కొంత మార్పు పొందీ పొందకుండా కూడా తెలుగులో ఎన్నోరకాల గేయరచనలయినవి. ధవళాలు పాడుతున్నాడు అనే నానుడిలోని ధవళాలు వివాహాది శుభకార్యములలోను యక్షగానములలోను ప్రసిద్ధిగాంచియున్నవి. 'కథాసుషట్పయోజ్యా వివాహే ధవళస్తథా' అని చాళుక్య సోమేశ్వరుడు చెప్పినాడు.

నీకేవచ్చు సువాలయున్ ధవళ మింతీ – ఆల్లో నేరేళ్లు, గౌరీ కళ్యాణము ఇత్యాదిగా పాంచాలీపరిణయమునను ఆ లలనామణి కా గయ్యాళి యొకానొక్కవేళ నక్కరతో సువ్వాలలు సోబానలు ధవళాలున్ మొదలైన పాట లాదట నేర్పున్ – అని శుకసప్తతిలోనూ ధవళాలు పేర్కొనబడినవి. యక్షగాన ములలో ధవళములు అధికముగ కానవచ్చును. ఇంకా ఏలపాటలు అనేవి కూడా దేశిరచనాప్రభేదములే. చాళుక్య జగదేకమల్లుడు సంగీతచూడామణిలో కర్ణాటలాటగౌళాంధ్రద్రావిడభాషలలో ఏలలు కలవనీ అందులో ఆంధ్రుల ఏలలు మిక్కిలి మనోజ్ఞములని చెప్పియున్నాడు.

యక్షగానములలోను, సామాన్యజనవ్యవహారములలోను ఎన్నోరకాలైన ఏలలు సర్వాంధ్రదేశమునను వ్యాపించియున్నవి. సువాలలు (సువ్+ఏల) ఉయ్యాలలు (ఉఁ+ఏల), జోలలు (జో+ఏల), ఓలలు, కూడా అట్టివే. అల్లో నేరేళ్లు అనే పేరు గేయరచనలకు వింతతీరుగా వచ్చినది. అల్లోనేరేళ్ళల్లో వెలది రుక్మిణి సమర్త వేడుకలాయె అని ఉపక్రమముగల పాతకాలపుపాట ఫణితిని రచితములైన గేయములన్నిటికీ అల్లో నేరేళ్లు అన్న పేరైంది.

అల్లోనేరేళ్ళల్లో పాటలు వెన్నెలరాత్రులందు ఆరబైట కన్యకలు రెండు వహులుగా వేరుపడి ఆడుతూ పాడే పాటలు. ఇది మిక్కిలి ప్రాచీనమైనది. 'వెన్నెలదినముల నల్లో నేరేళ్లు గాక యావలగలవే' అని రామాయణ సుందర కాండములో గలదు. యక్షగానములలో గేయభాగములుగాను ఇంకా అనేక కథాప్రధానగేయములుగాను ఈ అల్లోనేరేళ్లున్నవి. వాడు కూనరాగాలు తీస్తున్నాడు – అన్న నానుడి సర్వాంధ్ర విదితము. ఈ కూనరాగాలు కూనలమ్మ పదాలు అనే వింత తీరు పదరచనలు. ఇంకా శోభనాలు, కొట్టాలపాటలు, గౌరీకళ్యాణములు, అర్థచంద్రికలు, జంపెలు, కురుచజంపెలు, త్రిభంగులు, మదిమరేకులు, విరాళిపదాలు, పాళిరేకులు, వెన్నెలపదాలు, తుమ్మెదపదాలు, చందమామపదాలు, చిలుకపదాలు, త్రిపదలు, షట్పదులు, సప్తపదులు మొదలైన పదాలెన్నో లక్ష్యలక్షణస్వరూపములతో వున్నవి.

మార్గశిరమాసము వస్తున్నది. ఆ నెలలో ఆంధ్రదేశమంతటా కన్యకలు గొబ్బిళ్లు అని పేడబొమ్మలుపెట్టి గొబ్బిపాటలుపాడే సంప్రదాయమున్నది. గొబ్బియలు గొబ్బిళ్ళు అన్న పదము గోపికలు అన్న పదమునుండి పుట్టినది. గొబ్బిళ్ళ యాట రాసక్రీడా నృత్యమే. గొబ్బిళ్ళపాటలు పెక్కుతీరులవి కలవు.

పై వాటిలో కొన్నింటిని మాదిరులు వినండి –

గొబ్బిపాట

కొలని దోపరికి గొబ్బిళ్లో యదు – కులస్వామికిని గొబ్బిళ్లో
కొండ గొడుగుగా గోవులఁగాచిన – కొండుక శిశువుకు గొబ్బిళ్లో
దుండగంపు దైత్యులకెల్లను తల – గుండు గండనికి గొబ్బిళ్లో...

ఉయ్యాలపాట

పల్లవి

అలరc జంచలమైన ఆత్మలం దుండని – యలవాటుసేసె నీ వుయ్యాలా
పలుమారు నిశ్వాస పవనమందుండని – భావంబు దెలిసె నీ వుయ్యాలా

చరణము

ఉదయాస్తశైలంబులొనరగంభములై – వుడుమండలము మోచె నుయ్యాలా
అదన నాకాశపద మడ్డదూలంబైన – అఖిలంబు నిండె నీ వుయ్యాలా
పదిలముగ వేదములు బంగారు చేరులై – పట్టవెరపై తోచె నుయ్యాలా
వదలకిటు ధర్మదేవత పీఠమై మిగుల – వర్ణింప నరుదాయె నుయ్యాలా

అల్లోనేరేళ్లు

అల్లోనేరేళ్లల్లో, వెలది రుక్మిణి సమర్త వేడూకలాయే, అనే మట్టుతో..
అల్లోనేరేళ్లల్లో, చెలువ కృష్ణుండనుచు చెప్పరే మీరూ – అల్లో–
అల్లోనేరేళ్లల్లో, కరివేల్పు మనదొరకు కలిగెనే నేడూ
అల్లోనేరేళ్లల్లో, సిరివరునివలె నితడు చెలగుచున్నాడూ
అల్లోనేరేళ్లల్లో, తరుణీ యశోదకూ తనయుడైనాడూ
అల్లోనేరేళ్లల్లో, గురికానివలె నితడు గునియుచున్నాడూ
అల్లోనేరేళ్లల్లో, మింటపూవులవాన మెలత కురిసేనే
అల్లోనేరేళ్లల్లో, వింటిరే భేరీలు వేడ్క మొరసేనే – అల్లో–

– కృష్ణవిలాస యక్షగానము.

వెన్నెల పదము

ఎన్నాడు వానికి నే లలన నైతినో, వెన్నెలారో! వాడు
నన్నెద దలచడు, నేనేమి చేతును, వెన్నెలారో!
చాలగా నమ్మి తా చక్కని చెలిమికి, వెన్నెలారో! నా
మేలును నింతైన మనసు నుంచడాయె వెన్నెలారో!
వలపు నిల్పరాదు వశముగాదు ఇంక వెన్నెలారో!

–తాళ్లపాకవారి పదాలు.

ధవళము

జయజయా జ్ఞానసంపన్నా
జయజయా నిన్నుబుధులెన్నా
జయము నీ పదములాగన్నా
జయమౌను ఒడయ నంబెన్నా

ఏల

నీవూ నేనూ గూడీ భావనా కొలదీ
కేవల బ్రహ్మాన గీలు గొల్పుదమూ – నీవు,
సారెసారెకు వారీ సరస సంగములా
తీరూగా జగముల ద్రిప్పుచుందామె
మానవీగణముల మమత నొందించీ
పూని భ్రాంతులలోన పొరల జేయుదమూ, నీవు

–జ్ఞాన కురవంజి.

సువాల

మారసంహరుండు తొల్లి దారువనములోన మునుల
చారుముఖులతో రమించు జారవిద్యలన్
తేటగనే నే సువాలపాటగా రచించువాడ
పాటలాగంధులెల్ల ప్రౌఢిcబాడcగా
హరుడు వొక్కనాడు తారకాచలంబునందు తనకు
నర్హమైన రత్నసింహాసనంబునా

–దారువన క్రీడనము.

తుమ్మెదపదము

ఆదినాథుcడ రావె తుమ్మెదా – అ
ల్లతడూ వూరికి పోయె తుమ్మెదా, నా
వద్ద నెవ్వరు లేరు తుమ్మెదా – వచ్చి
వాలలాడి పోవె తుమ్మెదా.

(రేడియో ప్రసంగము
15–11–41
ఆకాశవాణి, మద్రాసు)

ఆంధ్రదేశములోని జానపదగీతములు

(ప్రకటన)

ఎప్పుడో నేను ప్రాచీనగ్రంథాలకై దేశాటనంచేస్తూ ఉండేటప్పుడు లిపి రూపము పొందకుండా ప్రజలనాలుకలమీదనే ఉండే పాటలు, పదాలు, నానుళ్లు వగైరాలనుకూడా సేకరిస్తూ ఉండేవాణ్ణి. అందులో, పిల్లలపాటలు పదాలు వగైరాలను బాలభాష అనీ, స్త్రీలపాటలు పదాలు వగైరాలను స్త్రీ భాష అనీ, బిచ్చగాళ్లు మొదలయినవాళ్ల పాటలు పదాలను పామరభాష అనీ, ముసలివారిపాటలు పదాలు మొదలయిన వాటిని వృద్ధభాష అనీ విభాగా లేర్పఱుచుకొంటిని. ఇదివఱకు రేడియోప్రసంగాలలో, బాలకుల పాటలు పదాలు, పామరులపాటలు పదాలు కొన్ని వినిపించడం అయింది. ఈతూరి జానపదులే పాడే వీరకథాగేయము కాటమరాజుచరిత్రలోని పట్లు కొన్ని, స్త్రీలు పాడే శృంగారగేయాలు కొన్ని, వృద్ధులు పాడే వేదాంతగేయాలు కొన్ని వినిపించడం జరుగుతున్నది.

నెల్లూరి చోళ రాజులయిన నల్లసిద్ధిరాజుగారితో విరోధించి ఎఱగడ్డవారి గొల్లరాజులయిన కాటమరాజులవారు యుద్ధసన్నద్ధులుకాగా వారి రాయ బారిని ధిక్కరిస్తూ నల్లసిద్ధిరాజుగారి తరపువారుపలికే పలుకు లీ క్రింది పదంలోనివి.

– ఇక్కడినుండి హరి హరీ నారాయణాదినారాయణా నడక: –

ఎంతగాత్రంబైన యెద్దుల పౌజు తా
నేనుంగు గుంపుపై నెదిరింపఁ గలదె
చెప్పట్ట కత్తులు చెంపసిగలేకాని
చెనకి పోరాడ మీ చేత నేమౌను
ఎఱ్ఱమట్టి పొర్లాట యెఱుగుదురొ యేమొ
ఎఱ్ఱలు పొర్లవా యెఱ్ఱమట్టిలోను
సాము నేర్చినవారు జగడంబు చేస్తేను
ఇమ్మహీ ప్రజకెల్ల నెక్కడిది బ్రదుకు?
తల పొలములో బెదరి నిలబడ్డ గోవులను
కలవిలుచుకొన్నట్టు కాదు కయ్యంబు
అల కాపరిది నీవా పాలు నీళ్లనూ
కలపి త్రాగేతీరు కాదు కయ్యంబు
ముఱ్ఱుపాలును జున్ను ముద్దలును తెగమెసగి
గఱ్ఱున త్రేపినటు కాదు కయ్యంబు
చేసిన వెన్నను సెగపొంత గాచుకొని
కాసుల కమ్మట గాదు కయ్యంబు
గోవుల పాలెల్ల కుండలలో నింపి
కావళ్ల నమ్మినటుకాదు కయ్యంబు
పసులతో ప్రొద్దాక పైరు పట్టులనుండి
కసవు మేపినయట్లు కాదు కయ్యంబు
బాస పత్రాలిచ్చి పంటభూములనెల్ల
గాసిచేసినయట్లు కాదు కయ్యంబు
అడవుల కొండల నాలను మేపించి
కడచి యెగ్గొట్టుట కాదు కయ్యంబు
మనసున వారిధులు మఱి దాటగావచ్చు
కా నెదురపారేటి కాల్వ దాటఁగరాదు
మాటలే పోట్లైతె మత్తారులను జంప
నీటెకత్తులు మీకు నేల ధరియింప
పొదువు పొదువను మాట పోటులై పొడిచితే
కడనుండి చెయవచ్చు కయ్య మెంతైన
రచ్చలేటికి నీవు రాచ పోటోర్చితే
యిచ్చవచ్చిన ధనము నిచ్చేరు నీకు
పొర్లింపు మాటలను పొర్లబడి పొయ్యేవు
కుఱుచ బుద్ధులు నీకు గూడునే రాజ!

చుట్ట చుట్టుక బైట సుడిసియుండిన పాము
పుట్టచొచ్చేటపుడు పొడుగారవలదా?
దూరాన మీరెంత దురుసులాడినగాని
నేర్పుతో పలుకవలె నెల్లూరి నృపుతో!

*　　　*　　　*

ఇప్పుడు పాడబోయే వేదాంతగేయము అరవైచరణాలు గలది. ఆ అరవై చరణాలూ బైరాగులు తంబురా మీటుకుంటూ పాడుకొంటూ వీధిని పోతూ ఉంటే చుట్టు ప్రక్కల ప్రజలందరూ హాయిహాయిమంటూ ఆనందపారవశ్యంతో వెంటాడుతూ ఉంటారు. కొన్ని చరణాలు వినండి:

నాద బ్రహ్మానంద యోగీ, వీడు
వేదాంతసారము వినిచే బైరాగీ.... నాద బ్రహ్మానందయోగి॥

ఈ జన్మమిక దుర్లభమురా, ముక్తి
భాజనముగ దీని పనిగొనవలెరా
రాజసంబు దుఃఖదమురా, ఘన
రాజయోగమార్గమె సౌఖ్యదమురా........నాద॥

చిత్తశుద్ధి గల్గియుండు, భక్తి
జేరి సద్గురు నీవు సేవించుచుండూ
మత్తత్వము లేకయుండు, స
మస్తమింద్రజాలమంచూరకుండూ..... నాద॥

పెద్దల నిందింపవలదూ, ఒరులు
పీడించినా నీవు భీతిల్లవలదూ
కద్దని గర్వింపవలదూ, కంట
కంబైన ధర్మంబు గావించవలదూ....... నాద॥

వనితలేకున్న దుఃఖమురా, కాని
వనితగల్గెనేని వగవ దుఃఖమురా,
ధనముగల్గెనేని దాచ దుఃఖమురా....... నాద॥

వాచాజ్ఞాన మది వద్దు, బ్రహ్మ
వాదులతో కడు వాదింపవద్దూ
ఖేచరి ముద్రతో ఉండు, అల్ల
కేవలాత్ముగూడి క్రీడింపుచుండూ........... నాద॥

హాలాహలము నిండుకొన్నా, మిన్ను
కోలాహలంబుగా కూలిపైకొన్నా
కాలానలము చుట్టుకొన్నా, మది
జాలి బొంద డాత్మజ్ఞాని వో యన్నా!......... నాద॥

పచ్చి కుండవంటి మేను, ఇది
వచ్చుగాక ఆత్మ చావదెన్నడును
విచ్చి కుండ వ్రక్కలైనా, లోన
హెచ్చియున్న బయలు విచ్చి రెండౌనా........ నాద॥

పరమాత్మ జీవాత్మ యగునూ, మళ్ళీ
పరికింప జీవాత్మ పరమాత్మ యగునూ
పరమాత్మ జీవాత్మలకును, మాయ
పరగి భేదము సేయు వగదాయవలెనూ....... నాద॥

సర్వజ్ఞుడను యోగినంచు, తత్త్వ
సార మెఱుగలేక చాల నాదించూ
గర్వాంధు డెన్నంగ వినరా, మంచి
గంధము మోసిన గాడిద గదరా............. నాద॥

బ్రహ్మంగారితత్త్వాలనీ, వేదాంత తత్త్వాలనీ కొన్ని వింతగేయాలు బైరాగులు పాడుతూ ఉంటారు. రెండువందలేండ్లయి ఉంటుంది పోతులూరి వీరబ్రహ్మం గారని ఒక బైరాగి యిట్టి రచనలు చాలా చేసినాడు. ఈ పాటలలో ఇది ఆయన దౌనో కాదో గాని చమత్కారంగా ఉంటుంది వినండీ.

దీపాలు ధూపాలు దొడ్డుగా బోనాలు
రేపు మాపు వట్టి మాయలురా
చూపు మనసు వొక్క రూపైన తత్త్వము
ప్రాపు దాపు పరబ్రహ్మమురా! హరి!

ఏడుకాళ్ళ నడచు నెదటాయ కెప్పుడు
జాడేర్పడని దేమి జాలమురా
ఆడించు పాడించు అవుగాము లనిపించు
పాడు గుళ్ళలోని బ్రహ్మమురా! హరి!

మసకతిత్తివంటి మానవదేహము
కుసిగుంపులచేత కూలినదీ
మసకతిత్తిలోని మర్మము దెలిసితె
తసుకుగాదు పరతత్త్వమురా! హరి!

కాషాయవస్త్రాలు కట్టినంతలోనె
దోషాము లెక్కడ తొలగునురా
శేషగిరీశుని సేవచేసి సంసా
రౌషధమున సౌఖ్యమందుమురా! హరి!

గాలిలేని దీపకళిక చందంబున
చలగ నెమ్మది షణ్ముఖిని
లాలించి కూడేది రాజయోగికి స్త్రీల
జాల మేలర గోపాలకృష్ణ. హరి!

ఏల నీకు యీ విలాపం
బెఱుగవ? వాని ప్రతాపం
నెలతరో! ఇదియేటి మోహం, మరుడు
నీకే పన్నెనా యిట్టి వ్యూహం,
కలకంఠి యెపుడు నీ గేహం, శౌరి
కాచియుంటేనే నా స్నేహం
విడు సందేహం॥

వనితరో! ఇది మంచి యోగం, హరిని
వలపించ కాంభోజి రాగం
పనిబూచి పాడ నీ భోగం, విజయు
పాలించువాని సంయోగం
దొరకు వేగం॥

సర్వాంధ్రదేశవ్యాప్తిగన్నది, బహుప్రశస్తరచన గలది ఇప్పుడు పాడబోయే వేదాంతగేయము బ్రహ్మానందప్రదమైన యీ గేయాన్ని వినండీ.

అంతా చిన్మయ మఖండ మద్వయ
మానందం బ్రహ్మానందం
వింతగ ననుభవ మంతయు దెలిసి ని
రంతర మాత్మను చింతన సేయగ..... అంతా చిన్మయ॥

పెద్ద పాట యిది. అంతా వినిపించవద్దనుకొన్నాను. ఒక్క చరణం మాత్రం వినండి.

సత్తుచిత్తు, ఆనందంబైతా – సద్గురువై సర్వాత్మకమై
అత్యుత్తమమై తత్పదత్వంపద – అసిపద మావలతారకమై
నిత్యానంద నిరామయమై తా – నిర్వికల్పమై నిత్యంబై
అత్యున్నతమై అప్రమేయమై – అగణితగుణమై ఆద్యంబగునది
అంతా చిన్మయ మఖండ మద్వయ – మానందం బ్రహ్మానందం

(రేడియో ప్రసంగము
? జూన్, 1947
ఆకాశాణి, మద్రాసు)

ఆంధ్రదేశప్రజానపదగీతాలు

పల్లెటూళ్ళ ప్రజలపాటలు

పాటలుగాని, ఆటలుగాని, తొలుతొల్త పరితోష సందర్భములలో ప్రజలు పలుకులలో కులుకులలో పారవశ్యంతో బయల్పరచేవిగా ఉంటవి. అమాయకు లయిన పల్లెప్రజలు ఆనందహృదయములనే ఆటపట్టులనుండి ఊరించి జాల్వారించిన పాటలు, పదాలు తేటపలుకులతో తియతియ్యనై ఉంటవి.

పసితనము నాటినుండి ముసలితనము నాటిదాకా, పాకీవారి దగ్గరనుండి భాగ్యవంతులదాకా, బొమ్మలాటదగ్గర్నుంచి బ్రహ్మార్చనముదాకా, పల్లె ప్రజలీ పాటలు పదాలు పాడుకొంటూ ఆనందపరవశులవుతూ ఉంటారు.

రామన్న రాముడోయి రాంభజనా
రాము డొస్తున్నాడు రాంభజనా,

అంటూనూ,

రామ రామ రామ రామ రామ యేల పలుకవూ
పలుకమన్న పలుకవూ పంచదార చిలకవూ,

అంటూనూ,

దశరథుడనుపేర తుమ్మెదా ఒక్క
ధరణీశుడున్నాడు తుమ్మెదా – ఆ
ధరణీశ్వరునకు తుమ్మెదా – నలుగురు
తనయులున్నారు తుమ్మెదా
రామలక్ష్మణాలు తుమ్మెదా, భ
రత శత్రుఘ్నులు తుమ్మెదా!

అంటూనూ, రామాయణ కథనంతనూ పలుతీరుల పాటలుపదాలుగా పాడుకొంటూ పల్లెప్రజలు పరితోషపడుతూ ఉంటారు.

పాతికేళ్లనాటిమాట– విశాఖపట్నం జిల్లాలో గ్రంథార్జనకై నేను పర్యటిస్తూ ఒక పల్లెటూళ్లో ఉండగా అక్కడ కలరావ్యాధి చెలరేగి ఉన్నది – తగిన వైద్య సహాయం లేదు. అమాయకులు, ఆ వూరి ప్రజలు రాత్రులంతా రామభజన

చేస్తూ ఉండేవారు. వ్యాధి తొలగిపోయింది. రామభజనే వ్యాధిని తొలగించిందని వారు విశ్వసించి భజన మఠీ బలపఱచినారు. ఆనాళ్లలో వారితో వినోదిస్తూ విన్న పాటల మొదళ్లే ఇంచుకించుక ఇప్పుడు వినిపించినాను.

తేటగా తియ్యగా వున్న పిల్లలపాటలూ, బిచ్చగాళ్లపాటలూ, కొన్నీ, నీటుగానే నెఱనేర్పుతో ఉన్న ప్రౌఢరచనలు, అల్లో నేరేళ్లూ, ఏలలూ, తుమ్మెద పదాలూ, జాజఱపాటలు మొదలయినవి. ఛందో భేదములుగలవి కొన్ని వినిపిస్తున్నాను. కూనరాగంతో ఉపక్రమిస్తున్నాను.

కవితారసప్రజల్లు గంటలూ గలుగల్లు
కరణాలకే చెల్లు ఓ కూనలమ్మా!

కూనలమ్మ పదాలనీ కూనిరాగాలనీ, పేర్కొనబడేవి ఇట్టి రచనలు, పాత కాలపువి చాలాఉండేవి గాబోలు.

పిల్లల మెలిక పాట :–
ఎండలు కాసేదెందుకురా?
వానలు కురిసేటందుకురా
వానలు కురిసేదెందుకురా?
పంటలు పండేటందుకురా
పంటలు పండేదెందుకురా?
ప్రజలూ బ్రతికేటందుకురా
ప్రజలూ బ్రతికేదెందుకురా?
ప్రభువును గొలిచేటందుకురా
ప్రభువనగా వాడెవ్వడురా?
ప్రపంచమేలే దేవుడురా!

పసిపిల్లల యీ పాటలో ఎండలు కాయడంవల్ల వానలు కురవడం అనే క్రమంతో ప్రకృతి పద్ధతిని వివరించడం మొదలుగా ఈశ్వరాజ్ఞానువర్తనం దాకా, జ్ఞానబోధ ఉన్నది. ఈ పాటలో చరణాలు పూర్వచరణముల విషయము లతో గొలుసువారి ఉండడంచేత పిల్లలకు ధారణాశక్తిని, మెలకువను, రేకెత్తించ గలవు. అట్టిదే ఇంకొకటి.

కంచికి పోతావా కిష్టమ్మా – ఆ
కంచివార్తలేమి కిష్టమ్మా.....
కంచిలో ఉన్నది అవ్వ – ఆ
అవ్వ నాకు పెట్టు బువ్వా,
బువ్వ ఉన్నదిగాని కిష్టమ్మా, నీకు
కూర యెక్కడిదోయి కిష్టమ్మా?
దొడ్లోను ఉన్నది బీర – ఆ
బీర నాకు పెట్టు కూర
కూర ఉన్నది గాని కిష్టమ్మా – నీకు
పప్పు యెక్కడిదోయి కిష్టమ్మా?
పక్కయింటివారి అప్పు – ఆ
అప్పు నాకు పెట్టు పప్పు,
పప్పు ఉన్నదిగాని కిష్టమ్మా, నీకు
నెయ్యి యెక్కడిదోయి కిష్టమ్మా?
కోమటి అక్కప్ప చెయ్యి – ఆ
చెయ్యి నాకు పోయు నెయ్యి.
నెయ్యి ఉన్నదిగాని కిష్టమ్మా – నీకు
పెరుగు ఎక్కడిదోయి కిష్టమ్మా?
ఆ యింటి యీ యింటి యిరుగు, ఆ
యిరుగు నాకు పోయు పెరుగు,
బువ్వ తిందువుగాని కిష్టమ్మా – నీకు
ఆ వూళ్లో పనియేమి కిష్టమ్మా?
అక్కడ ఉన్నది అమ్మ, నేను
మొక్కివత్తును కామాక్షమ్మ –

బిచ్చపు పాట

హరి హరీ లక్ష్మణ స్వామీ – హరిహరీ
అన్యాయ మిటు చేస్తి వేమీ హరిహరీ
అడవిలో మృగము నేనైతే హరిహరీ

అడలకుందును గాని తండ్రీ హరిహరీ
ఆడజన్మము యెత్తినాను హరిహరీ
అడవిలోనెటు నిలువగలనూ, హరిహరీ
శ్రీరామునెడబాసి నేను హరిహరీ
జీవమెటు నిలుపుకోగలను హరిహరీ
ఏ పాప మెఱుగనో తండ్రీ హరిహరీ
ఎందు కిటు చేస్తివో తండ్రీ హరిహరీ
సీతాకూ రాసినా రాతా హరిహరీ
సీరామ యిది యెంతరోతా హరిహరీ
నిందు వేకటిదాని నేనూ హరిహరీ
ఎండమొగ మెన్నడెఱుగాను హరిహరీ
కొండలెట్లా తిరుగుతానూ హరిహరీ
కొండలకు పోయెనంటారు హరిహరీ
కొడుకులను గన్నదంటారు హరిహరీ
నిందపాలై పోయినాను హరిహరీ
నేనింక జీవించలేను హరిహరీ

ఈ విధంగా బిచ్చగాండ్రు ఉత్తరరామాయణకథ పాడుతూ ఉండగా వింటూ గుండె నీరయి కూర్చున్నాను.

మఱొక బిచ్చగాండ్రపాట

బిచ్చగాళ్ళామండి నారాయణా, కాసిని
బియ్యం పెట్టించండి నారాయణా;
పట్టెడన్నం లేదు నారాయణా,
కొంపగోడూ లేదు నారాయణా, చింపి
గుడ్డ లిప్పించండి నారాయణా
చలికి చస్తున్నాము నారాయణా,
ఆకలికి నొస్తున్నాము నారాయణా,
లేని వాళ్ళమండి నారాయణా, మాకు
లేదనబోకండి నారాయణా!

ఇంకోటి: –

బిచ్చమెత్తుకుంటూ ఒక సోదెకత్తెవచ్చి యింటివాకిట నిల్చున్న సువాసినిని అరజూచి యిట్లా పాడసాగింది...

శ్రీరామ రఘురామ సీతారాం – నిన్ను
పట్టింది ఒక్కా పాపిష్ఠి ముండే – శ్రీరామ॥
ఆ– పాపిష్ఠి ముండకు పరువే లేదమ్మా – శ్రీరామ
బిడ్డపుట్టకుండ అడ్డుపడుతోందే – శ్రీరామ
పెనిమిటికీ నీకు పీడకల్గిస్తోందే – శ్రీరామ
పన్నెండేళ్ళనుండి బాధపెడుతోందే – శ్రీరామ
అన్నద్వేషం నీకు అది కలిగిస్తోందే – శ్రీరామ.

ఇత్యాదిగా సరికొత్తగా ఆ సోదెకత్తె పాటకట్టి ఏదేదో పాడసాగింది... పాటలోని విషయానికికాదు గాని పాటకు నేను పరితోషపడ్డాను.

అల్లోనేరేళ్లు

నెయ్యము లల్లోనేరేళ్లో
ఒయ్యన నూరెడి ఉవ్విళ్లో॥
పలుచనిచెమటల బాహుమూలముల
చెలమలలోనా చెలువములే
తళతళమను ముత్యపు చెఱగుసురటి
దులిపేనీళ్ళ తుంపిళ్లో॥
తొటతొట కన్నుల దొరిగే నీళ్ళ
చిటిపొటి యలుకల చిరునగవే
వటఫలంపు టెఱవన్నెల మోవికి
గుటకలలోనా గుక్కిళ్లో॥
గరగరికలవెంకటపతి కౌఁగిటి
పరిమళములలో బచ్చనలే
మరునివింటి కమ్మని యంపవిరుల
గురితాకు లినుపగుగ్గిళ్లో!

అల్లోనేరేళ్లు అనే పదం వినండి.

వెలసేనే నందునికి విందు గోవిందు
అల్లోనేరేళ్ళల్లో
చెలువలూ కృష్ణుడని చెప్పరే మీరు
కటివేల్పు మనదొరకు కలిగెనే నేడు – అల్లోనేరేళ్ళల్లో
సిరివరునివలెనె తా చెలగుచున్నాడు – అల్లోనేరేళ్ళల్లో
తరుణియశోదకూ తనయుడైనాడు – అల్లోనేరేళ్ళల్లో

ఈ అల్లోనేరేళ్లు పదము పేరు.

అల్లోనేరేళ్ళల్లో
వెలదిరుక్మిణి సమర్తవేడుకలాయే

అనే ఉపక్రమముగల ప్రాతకాలపు పాటఫణితినిబట్టి పుట్టినట్టున్నది. తరువాత ఒక తుమ్మెదపదము వినండి.

తుమ్మెదపదము

వేడుకకాడవై విడివడి తిరిగేవు తుమ్మెదారో
చూడజూడగ తొంటిచూపు దప్పకువయ్య తుమ్మెదారో
తలపు తామరలోన తావైయుందువు నీవు తుమ్మెదారో
తలప నైతివి నీవె తావులీనెడు మమ్ము తుమ్మెదారో
పొలయు కమ్మనితావి పొందున తిరిగేవు తుమ్మెదారో
పొలసి నీ తిరిగేటి పొందు లెఱుంగుదుము తుమ్మెదారో
పచ్చని విలుకాని బంటవైతివిగద తుమ్మెదారో
మచ్చిక తలపులు మనలోనే సరిపోలు తుమ్మెదారో
అచ్చపు దీమస మందరి కెక్కడిదయ్య తుమ్మెదారో
చిచ్చు వెన్నెలవంటి చెలిమి సేయకుమయ్య తుమ్మెదారో
తిరువేంకటాద్రిపై తిరమై నిల్చినట్టి తుమ్మెదారో
పరమయోగుల పూలపరిమళములు గొన్న తుమ్మెదారో

కరుణించి మా మీద కలిగిన యీ ప్రేమ తుమ్మెదారో
ఇరవాయె నిటువలె నెలసి ఉండుగదవె తుమ్మెదారో..........

ఈ తుమ్మెదపదాలు, తాళ్ళపాకవారి శృంగారపదాలలోనివి – పలుకు బింకముగలవి.

తుమ్మెదపదము

తొల్లింటి వలెగావు తుమ్మెదా, ఇంక
ఒల్లవుగా మమ్ము ఓ తుమ్మెదా
తోరంపు ఝుంకృతుల తుమ్మెదా, తారి
దూరేవు గొందుల్లో ఓ తుమ్మెదా,
దూరిన నెఱుగవు తుమ్మెదా, మమ్ము
ఓరక జూడకు ఓ తుమ్మెదా

తొలిప్రాయపు మింగతుమ్మెదా, కడు
తొలిచేవు చేవలే తుమ్మెదా
తొలుకరి మెఱుగని తుమ్మెదా, ఇక
ఉలికేవు మముగని ఓ తుమ్మెదా

దొరవు వేంకటగిరి తుమ్మెదా, మా
తురుమేల చెనకేవు తుమ్మెదా
దొరకె నీ చనవులు తుమ్మెదా, దీని
నొరులెఱిగిరి గద ఓ తుమ్మెదా!

ఏలపదం

ఉపక్రమంలోనే ఏల ఉంటుంది కొన్నిటికి,

ఏల నీకు ఈ విలాపం, నీ
వెఱుగవా వాని ప్రతాపం.
నెలతరో ఇదియేటి మోహం, మరుడు
నీకేపన్నెనా యిట్టి వ్యూహం
కలకంఠి యెపుడు నీ గేహం, శౌరి

కాచియుంటేనేనా స్నేహం
విడు సందేహం.

తరుణిరో! వాని శృంగారం, ఎపుడూ
తలచేదేనా నీ వ్యాపారం,
పర్వేందుముఖిరో నీ వారం, విభుని
ప్రార్థించి కూల్చు మా భారం,
ఈ మాట మీరం

వనితరో! ఇది మంచియోగం, హరిని
వలపించ కాంభోజి రాగం
పనిబూని పాడనీభోగం, విజయు
పాలించువాని సంయోగం,
దొరకువేగం.

లాలిపాట

అప్పా రావోయీ ఒప్పులకుప్పా రావోయీ
తప్పాటడుగూ లిడుచూనూ మా యప్పా రావోయీ,

అంగీలోపాలా నీ బొజ్జా ఆకలిగొన్నదీ
బంగారూ నా తండ్రీ నీకూ పాలూ పోసేనూ

* * *

రంగూగా నేనెంతా పిలిచిన రాక జుణిగేపూ,
బుంగా పట్టుకొని పెద్దబూచీవచ్చేనూ,

* * *

పాలూ బువ్వాతిని తొట్టెలోపవ్వాళించీతే
లాలీపాటాలాతో నిన్ను జోలాపాడేనూ,

* * *

సరిపేఘాగద్దీనిండూ ముస్తాబూ చేసేనూ,
అరుదూగా నీ చదురులోకీ ఆడూకోబొమ్మీ!
ఉరువైనా నీ సొగసు చూచీ ఉప్పతించేరూ!

* * *

తిరుగబోకూ మీ స్వారీలో దృష్టి తాకేనీ

ఏనుగు లక్ష్మణకవి – పెద్దాపురపు రాజకుమారుని గూర్చి చెప్పిన లాలిపాట యిది.

గొబ్బిళ్లపాట

కొలనిదోపరికి గొబ్బిళ్లో యదు
కులస్వామికిని గొబ్బిళ్లో –
కొండగొడుగుగా గోవులగాచిన
కొండిక శిశువుకు గొబ్బిళ్లో–
దుండగంపు దైత్యులకెల్లను తల
గొండు గండనికి గొబ్బిళ్లో॥
పాపవిధుల శిశుపాలుని ద్రుంచిన
కోపగానికిని గొబ్బిళ్లో
ఏపునగంసుని నిడుమలబెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్లో
దండి వైరులను దరిమిన దనుజుల
గుండెదిగులునకు గొబ్బిళ్లో
వెండిపైడియగు వెంకటిగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్లో.......

గొబ్బిళ్లు, గొబ్బియళ్లు, అనేపాటలు “గోపికలు” అనే పదమును బట్టి వెలసినవి. మార్గశిరమాసంలో, ఆంధ్రద్రవిడదేశాలలో కన్యలు, ప్రాతఃకాలమున ఆడతూ వాకిళ్లలో పాడేపాటలే గొబ్బిళ్ల పాటలు, గొబ్బిపాటలు.

(రేడియో ప్రసంగము
26-6-1947
ఆకాశవాణి: మదరాసు)

ఏలపాటలు

తెలుగునుడికారపుసొంపు

ఏలపాటలంటే నానారసాలతో, నానారాగాలతో, నానాఫణితులతో పాడే చమత్కారపు పొడిపాటలన్నమాట. ప్రాచీనగ్రంథాలు పరిశోధిస్తే యీ విషయ మీలాగే తేలుతుంది. మరిన్నీ ఆరంభకాలంలో యేలలనే పేరితో పేర్కొనబడుతూ వచ్చిన చమత్కారపుపాటలే, తర్వాత జోలలనీ, సువ్వాలనీ, ఓలలనీ, ఇంకా యేయో అనీ విభాగములతో పేర్కొనబడుతూ వచ్చినవి. క్రీస్తుశకము నాల్గవశతాబ్దిలోని దనదగిన మతంగుని బృహద్దేశిలో ఆంధ్రద్రవిడకర్ణాటక భాషల ఏలలు పేర్కొనబడినవి. తర్వాతి సంగీతగ్రంథాలు, సంగీతచూడామణి, అభిలషితార్థచింతామణి, సంగీతరత్నాకరము, వగైరాలు కూడా ఏలల భేదములను విరివిగా పేర్కొన్నవి. సంగీతచూడామణిలో తెలుగువారి యేలలు చాలా మనోజ్ఞముగా వుండునని ప్రశంస ఉన్నది.

కర్ణాటలాటగౌడాంధ్రద్రావిడానాం స్వభాషయా
నానాధ్వని ప్రయోగాఢ్యా నానా రాగాంగ మిశ్రితా
ఆంధ్రనామ్నాభవే దేలా రసభావైర్విభూషితా
సరసా ప్రాస సంయుక్తా చిత్రధ్వని విమిశ్రితా

శాతవాహనులనాటి వాడైన మతంగుడు బృహద్దేశిలో యిట్లు చెప్పినాడు.

చత్వారోగీతయో యత్ర పాదేపాదే భవన్తిచ
గీత్వా తదీయపాదార్థ మనుప్రాసో విధీయతే
త్యాగసౌభాగ్యసౌందర్య శౌర్యధైర్యాదివర్ణనా
యస్యాం భవతి గీతజ్ఞా స్తా మేలాం సంప్రచక్షతే.
....
రమ్యగీతి గుణైర్యుక్తా ఛందో గుణసమన్వితా
అలంకార రసోపేతా కర్తవ్యైలా మనీషిభిః

అని యిత్యాదిగా యేలల్లో యెన్నో భేదములను పేర్కొని కర్ణాట, గౌడ, ద్రవిడదేశపు యేలల గుణదోషములను వర్ణించి తెలుగువారి యేలల నిట్లు ప్రశంసించినాడు.

ప్రాసై ర్మనోహరై ర్దివ్యైః ఆదిమధ్యాంత గోచరైః
ఏలా కర్ణాటికాప్రోక్తా లలితధ్వనిసంయుతా
సర్వత్ర ప్రాససహితా గమకైశ్చ వివర్జితా
నాదబిందురసోపేతా ఏలా సా గౌడదేశజా
కర్ణాటరాగ సంకీర్ణా మేలా మాంధ్రీం విదుర్బుధాః
భావాభినయతాళాఢ్యా విచిత్రధ్వనిరంజితా
ప్రాసహీనా రసస్థా చ ఏలా ద్రవిడదేశజా.

పై లక్షణాలనుబట్టి చూడగా యేలకు ఒక నియమితమైన ఫణితి లేదనీ అనేకరాగములతో, అనేకతాళములతో, అనేకఫణితులతో ఉంటవనీ తేలుతుంది ఊగునప్పటి యేల ఊయేలనీ, జోగునప్పటి యేల జోలనీ, యీ విధంగా నానా సందర్భములలో పాడే పాడిపాటలన్నీ ఏలల భేదములే అవుతవని తోస్తుంది. అనేక గ్రంథములలో యేల పాటల ప్రశంసలున్నవి.

పాలకురికి సోమనాథుని పండితారాధ్యచరిత్రలో

భరతోక్తి నేలలు పాడెడువారు
నరుదంద జిందుల కాడెడువారు
నాళతుల్ సేయుచు నలరెడువారు

అనీ, అందులోనే మరొకచోట

అరుదగు దాసయ్య నఱువత్తుమూఁబు
సరితంబులను శ్రీ బసవపురాణంబు
నేలలు వెట్టంగ నింపు సొంపారు
శైలిచేఁ గ్రాలుచుఁ జదివెడువారు.

అనీ, యేలలను గూర్చిన ప్రశంస ఉన్నది. రాధామాధవములో యేలలను గూర్చి యిట్లున్నది. విలాసవతినిగూర్చి వర్ణిస్తూ –

....
గాజులు చప్పుళ్లు ఘలఘల మనఁజేయుఁ
గొనగోళ్ల నందంద కురులు దిద్దు
నేలపాటల నల్ల నించుకించుక పాడుఁ
దగవుమాటల జాణతనములాడు

తే॥ సిగ్గుపడు దిట్టతనములచేగ చూపుఁ
బాయుఁ గడుడాయు మఱియును బహువిధములఁ
జేష్ఠలొనరించు నా యింతి సేవనడుమ
హాస్యరస మొక్కరూపమైనట్టి భంగి.

శుకసప్తతిలో –

సీ॥ వీథినేగెడు ప్రౌఢవిటుఁడు పాడెడు వింత
యేలపదాలట్టె యాలకించుఁ

అని ఉంది.

పద్యకావ్యములలోని యీ యుదాహరణములనుబట్టి చూడగా నీ యేలలు శృంగార, హాస్య, చమత్కారగర్భితములైన పదరచనలని తేలుతుంది. ఇందుకు తార్కాణంగా క్షేత్రయ్య తన శృంగారపదములో నిట్లు చెప్పినాడు. పల్లవి, ఒక చరణము పాడుతున్నాను.

తోడి – ఆది

ఎచ్చోట నున్నాడో చెలియ, న న్నేమనుచున్నాడో,
విచ్చలవిడిగా వెఱపింతైన లేక ముచ్చట
లాడుచు మా మువ్వగోపాలుడు... .... ఎ
చాలాను దూరుచు సాటిలే దనుచు
పాలుగారు చెక్కిలి బాగుగా జీరుచు
వాలాయముగాను వాతెఱ లానుచు
నేలపదమువాడు చెలమి సొక్కించుచు॥

ఇట్టిదే తెలుగు నాయకరాజులనాటి తెలుగుపదము మఱొకటి –విజయ రాఘవచంద్రికావిహారములోనిది.

పదం. సౌరాష్ట్ర – ఆటతాళం

కవులెంతురు చోళదేశము దివ్య – కావేరీ వారి ప్రకాశమూ
నవరత్నములున్న కోశమూ సుర – నాయక రాజ్యసంకాశము
చెరకు రాజసంపు పైరులు కాపు – సేమము గలిగినయూరులు
తిరముగా ప్రవహించునేరులు చోళ – దేశంబున వెయ్యారులు
ఆ రాజ్యరమకుమంజీరము ఆ – యమరావతి కన్ననారము

భూరమణీమణిహారము తంజ – పురము సంపదలకొటారము
నవరత్నంబులపేటలు దివ్య – నారికేళంబుల తోటలు
సవరణసేసినకోటలు వీట – సరసులు నూరారుకోటులు
వలరాయనిమీది యేలలు చాల – వర్ణింప నేర్చిన బాలలు
విలసిల్లు నాటకశాలలు అందు – వింతవింత కృష్ణలీలలు

పొడిపొడిగా విడివిడి భావములతో యీ యేలపాట ఎంత చమత్కారం కలదో వినండి.

పుట్టమీదా పాలపిట్టా – నా సామి
పట్టబోతే తేలుగుట్టా
పోరానిచోట్లకు పోతే – నా సామి
రారాని కష్టాలు రావా?

ఏనుగు లక్ష్మణకవి పెద్దాపురపు రాజకుమారుని మీద చెప్పిన పాట.

ప॥ అప్పా రావోయీ ఒప్పులకుప్పా రావోయి
తప్పటడుగు లిడుచూనూ మా తండ్రీ రావోయి

ఆ. అంగీలోపలా నీ బొజ్జ ఆకలిగొన్నాది
బంగారు నా తండ్రి నీకు పాలు పోసేను
రంగుగా నే నెంతపిలిచిన రాక గొణిగేవు
బుంగాపట్టుకొనె పెద్దబూచీ వచ్చేనూ॥
లాలపోసుకో బాబయ్య చాల ప్రొద్దాయె
తాలిమితో నీకూ వెనక దాదువుంచేనూ
పాలుబువ్వతిని తొట్టిలో పవ్వళించితే
లాలీపాటలాతో నిన్ను వోలాపాడేనూ॥
సరి పేషూగట్టి నిండూ ముస్తాబు చేసేను
అరుదుగా నీ చదురులోకీ ఆడుకో బొమ్మీ
ఉరువైన నీ సొగసు చూచి ఉప్పతించేరు
తిరుగబోకు మీ స్వారీలో దృష్టితాకీ నీ॥
అప్పా రావోయి ఒప్పుల కుప్పా రావోయి
తప్పటడుగు లిడుచునూ మా తండ్రి రావోయి.

రాటపుయేలలు

వడుకువడుకూ కదుర వడుకవే కదురా
ఏకుల్ల బుట్టంత యెల్లుండి సంత
ఏకేకు ఒక బార యెల్లుండి సంత
నా యేకులైపోయె నాకేమి చింత

ఈ యేలపాటలలో పామరజనులు పాడే యేలపాటలు వెకలిశృంగారముతో ఉంటవిగాని అందులోనూ మంచిపలుకుబడీ, పలుకు పొంకమూ, వ్యంగ్యార్థ చమత్కారమూ కలవి కొన్ని లేకపోలేదు. మచ్చుకు కొన్ని చరణములు మాత్రమే వినిపిస్తాను.

1

కొత్తకుండా నీరు తీపూ కోరినా మగవాడూ తీపు
వాడినా చెరు కెంత తీపబ్బీ
పెదమల్లి చెన్నా పదరా బందారు పోదామూ
సుక్కురారం ఒక్క పొద్దు మక్కునా
నా మీద ఉంటే
చక్కెరా పాలెక్కు వంపబ్బీ పెదమల్లి॥

2

తుమ్మెదలు చెలరేగి దూలాలు తొలిచితే
మొగరాలకేమైన మోస మొస్తుందా
చినదానా! నల్ల చినదానా!
ఓటికుండా నీరు ఊపెత్తి పారితే
సంద్రంపు నీళ్లతో సరితూగునా ఓసి చినదానా!
ఇసక బొమ్మను చేసి యీదిలో నిలబెడితె
బంగారు బొమ్మతో ప్రతివచ్చునా ఓసి చినదానా!
ఏటిమీద ఏరూ వచ్చె చిన్నవాడా – న
న్నేరు దాటించ వోయీ కుర్రవాడా!

3

కట్టెలు దేరా శివ్వ! నా కాలు నొస్తుం దవ్వ
గుడ్డలుతకరా శివ్వ! నా గుండెలదురుత్తె అవ్వ

నీళ్లు తేరా శివ్వ! నావొళ్లు వంగదో అవ్వ
వాకి లూడ్వరా శివ్వ! నాకాకలౌతోం దవ్వ
అన్నం తినరా శివ్వ! - నే
నందుకు సిద్ధం అవ్వ!

దేవుడయ్యా దేవుడూ, మాయదారీ దేవుడూ
ఊరెల్లా యిళ్లు చేశె, నోరెల్లా పళ్లు చేశె, దేవుడయ్యా దేవుడూ
మంచమెల్లా గళ్లు చేశె, కంచెల్లా ముళ్లు చేశె, దేవుడయ్యా॥
నల్లనీ మేకలపాలు తెల్లజేశె దేవుడూ
తెల్లనీ పాలల్లో నీళ్ళు తెల్లజేశె దేవుడూ.

ఇప్పుడు పాడిన పాటలన్నీ యేలపాట లనదగినవే. నానా రసములతో, నానా రాగములతో, నానా తాళములతో రచితములయిన నానా ఫణితుల యీ పాటలు చమత్కారార్థములతో పాడి పాడిగా పలుకుపొంకముతో ఒప్పారుతూ ఉన్నవి.

జావళీలు, సారంగపాణిపదాలు, కూనరాగాలు, లలాయపదాలు, దంపుడుపాటలు, ఇత్యాది విధముల వ్యాప్తములయియున్న పదరచనలన్నీ ప్రాచీనలక్షణములబట్టిచూస్తే, యేలపాటలే. వీటి నన్నింటినీ ఉద్ధరించి ప్రకటింపవలెను.

(రేడియో ప్రసంగము
11-6-1944
ఆకాశవాణి: మద్రాసు
ఆంధ్రపత్రిక : 11-6-1944)

మధురకవితలు

ఎన్నాళ్లదాఁక పాటలు, పదాలు మొదలైన మధురకవితలయెడ రసజ్ఞ లోకమాదరము చూపదో అన్నాళ్లదాక నాంధ్రకవితయం దాంధ్రతావాసన గుబాళింప నేరదు. నవకము, చవి చక్కన గలిగి తియ్యతియ్యనై యాంధ్రలోకము నాలుకమీద నాట్యమాడుచున్న మధురకవితల నెన్నింటినో చవిచూచి సంతోషించి చాలఁగా సంపాదించితిని. వానివాని రచనావిశేషములను, జమత్కారములను వివరించుచూ నొక్కపుస్తకమును వెల్లడింపదలచియు, నింకను విశేషసామగ్రీ సంపాదన వాంఛచేతను ప్రస్తుతపు ముద్రణాద్యసౌకర్య క్లేశముచేతను గొన్నింటిని పత్రికలో వెల్లడించుచున్నాడను. క్రొత్తక్రొత్త రచనలను సేకరించి భాషాభిమానులు నాయుద్యమునకుఁ దోడ్పడుదురుగాక!

తుమ్మెదపదాలు, కోయిలపదాలు, చందమామపదాలు, బహుభిన్నగతులతో నున్నవి. భక్తి, శృంగార, వైరాగ్య కథావర్ణనాద్యంశములం దీపదములు రచింపఁబడినవి. ఈ సంక్రాంతి పండుగలందు మాలలు మాదిఁగలు తుమ్మెద, కోయిల, పదములను దఱచు పాడుచుందురు. రసికు లీ నాళ్లలో నా పదములను జక్కగా సమకూర్తురుగాక. గొంతెమ్మపదాలని వానినివాడుదురు. భారతకథాంశములందు వర్ణితములు. కుంతీదేవి జన్మవృత్తాంతములు వింతగా నందు వినబడును. ఆమె యా జాతుల కారాధ్యదేవత. భక్తిశృంగారములందలి తుమ్మెద పదములను రెండు చదువుదు.

తుమ్మెదపదాలు

శ్రీకంఠుడను పువ్వు తుమ్మెదా! మూడు,
లోకము లాయెను తుమ్మెదా!
సాకారమైయుండు తుమ్మెదా! పర
మైకాంతమున జూడు తుమ్మెదా!
శివశివ యనమేలు తుమ్మెదా! శివ
యంటేను విన మేలు తుమ్మెదా

శివుని భక్తులాకు తుమ్మెదా! శివ
శరణన్న మేలే వో తుమ్మెదా! 1

ముట్టీముట్టని పువ్వు తుమ్మెదా! అది
ముట్టింది జగమెల్ల తుమ్మెదా!
ముట్టి గూడవే వో తుమ్మెదా అది
ముట్టి పాయలేవె తుమ్మెదా!
శివశివ యనమేలు.......... 2

యవ్వన మందవె తుమ్మెదా! చాల
పువ్వులవాసన తుమ్మెదా
కొవ్వి నీవెఱుగవె తుమ్మెదా! నిను
నెవ్వి నేరమూలె తుమ్మెదా!
శివశివ................ 3

ఆఱుతేకులపువ్వు తుమ్మెదా! అది
మీఱిన వాసనె తుమ్మెదా
వేఱుసేయక నీవు తుమ్మెదా! శివు
జేరి భజించవె తుమ్మెదా!
శివశివ................ 4

ఈడపింగళలు తుమ్మెదా! సుషుమ్న
నాడిమధ్యమున తుమ్మెదా
మేలి మెఱిగి నీవు తుమ్మెదా శివ
కేళి జరించవె తుమ్మెదా
శివశివ.............. 5

ఏడుగురు రాజులు తుమ్మెదా! నీకు
ఈడుజోడుబంట్లు తుమ్మెదా
చూడుపాడు జంపె తుమ్మెదా! భక్తి
రూఢి కెక్కు మట్టె తుమ్మెదా
శివశివ............. 6

ఆస పాపజాతి తుమ్మెదా! పట్టి
ఆస గోసివేసి తుమ్మెదా!
మోసపోకు మంటి తుమ్మెదా! భక్తి
వాసికెక్క మంటి తుమ్మెదా!
శివశివ.................. 7

అష్టదళముమీఁద తుమ్మెదా! నీవు
అంటి చరించవె తుమ్మెదా
కష్టము లెఱుగవె తుమ్మెదా! నీవు
స్రష్టవైయుందువె తుమ్మెదా
శివశివ.................... 8

తొమ్మిదివాకిళ్ల తుమ్మెదా! నీవు
నమ్మి చరించవె తుమ్మెదా!
మమ్మూలకోనల తుమ్మెదా! నీవు
నెమ్మది నుండవె తుమ్మెదా!
శివశివ.................... 9

పదిపదిహేనింటను తుమ్మెదా! వుండే
పదకొండో తావున తుమ్మెదా
మెదలక నిల్చిన తుమ్మెదా! నిన్ను
కదలించగలరటె తుమ్మెదా
శివశివ................ 10

ఆన తోటపువ్వు తుమ్మెదా! నీ
వానక మానవె తుమ్మెదా,
వానిచే జిక్కిన తుమ్మెదా! తోట
వానిచేఁ బడుదువె తుమ్మెదా
శివశివ................. 11

నింగినేలయును తుమ్మెదా! నాడు
గంగగౌరులని తుమ్మెదా,
పొంగుచు నొకబోద తుమ్మెదా! వేయు
భంగుల నటియించు తుమ్మెదా
శివశివ...................... 12

వేయురేకులపూవు తుమ్మెదా! అది
వెదకి కానలేవె తుమ్మెదా
సద్గురు నడుగవె తుమ్మెదా! పూవు
సద్యచూపు నీకు తుమ్మెదా
శివశివ.................. 13

గురునకు హరునకు తుమ్మెదా! అం
తరువూలేదటే! తుమ్మెదా
గురుపాదపద్మములు తుమ్మెదా! నిన్ను
దరిసించు మంటినె తుమ్మెదా
శివశివ.......................... 14

2

ఆదినాథుడ రావె తుమ్మెదా, అ
ల్లతడు ఊరికిపోయె తుమ్మెదా! నా,
వద్ద నెవరు లేరు తుమ్మెదా, వచ్చి
వాలలాడిపోవె తుమ్మెదా 1

చెట్టుకేసి పాయె తుమ్మెదా,
కావి లెవ్వరు లేరు తుమ్మెదా!
రాశికిందవున్న తుమ్మెదా, నీ
నెత్తిబర్వుదింపె తుమ్మెదా 2

బాసలిచ్చినారు తుమ్మెదా! నీకు
బలిపీట గొట్టాను తుమ్మెదా!
రావె సుందరగిరి తుమ్మెదా! గుట్టు
రట్టు చేయవద్దు తుమ్మెదా
ఆదినాథుఁడ రావె తుమ్మెదా! 3

ఈ పదమునకు వింతయగు కథాసందర్భముగలదు. బలాత్కరించి యొకతె కొక్కనిఁ బెండ్లిచేసిరి. ఆ యువిదకు వలచినవాడు వేఱొకఁడు. పెండ్లాడిన మగని ఱోసి, వెడలగొట్టి, తోటలో దాగియున్న తన యాదినాథుని భావగర్భముగాఁ దుమ్మెద పేరఁ బిలుచుచున్నది.

(కృష్ణాపత్రిక
జనవరి 13, 1917)

మధురగీతములు

వడ్లదంపు, ఊడుపు, అలుకు, ముగ్గు మొదలగు గృహకృత్యములు చేసికొనుచుండు నప్పుడును, బిడ్డలనోదార్చి నిద్రపుచ్చునప్పుడును, స్త్రీలు కొన్ని పదములను పాడుచుందురు. ఈ సంప్రదాయ మిప్పుడు, నవనాగరకత పొర్లిపోవుచున్న యిండ్లలో కానరాకపోవచ్చునుగాని, తక్కిన యెల్లయెడలను, విశేషముగా పల్లెటూళ్ళలోను, నిండియున్నది. ఈతడవ, అట్టి పదములు కొన్ని వెల్లడించుచున్నాను. ఇందు యతిప్రాసములబంధము శిథిలము కాలేదు. భాష, వ్యాకరణజ్ఞుల క్రక్కసమున కెంత పాత్రముగానున్నను, శ్రుతి సుభగతను నించుచుండు యతిప్రాససంబంధము స్వాభావికముగను, నప్రయత్న కల్పితముగను, మధురకవితలయందు పొసఁగియే యుండును. అది కవితకు సహజాలంకారము. పామరుని నోటినుండికూడ భావామృతము పొర్లి పదబద్ధమై వచ్చునప్పుడు, వ్యాకరణము తప్పినను, ఛందస్సు తప్పదు. ఒక్క తార్కాణము :– నరసారావుపేట దగ్గఱ, పశువులను గాచుచున్న యొక కాఁపుఁగుఱ్ఱడుఁ దారిని గుఱ్ఱమెక్కి పోవుచున్న "అరండల్" (జిల్లా కలెక్టరు) దొరగారిని చూచి పదము కట్టి పాడసాఁగెనట! వినుఁడు : – " అరండలే దొర, రైలు బండే మర! –" దొరగారికిఁ దెలుఁగు తెలియును. ఆనందపరవ శుఁడై యాఁగి, విని, యెనిమిదణా లాపిల్లవానికిచ్చి మఱి వెడలెనట!

పదము పల్కెడు గమనిక తెలియకపోవునని, దీర్ఘములు, ఒత్తులు, నేను తీసివేయక విన్నది విన్నట్లే వ్రాసితిని. ఈ పదములు ఒక నాడొక్కరిచే రచింపఁబడినవి కావు. అప్పటికప్పుడు, ఆయా స్త్రీలు గృహకృత్యములు నిర్వర్తించు కొనువేళ, తొల్లింటి కొన్ని పదములు పాడుచుండు సందర్భమున, స్వాభావిక ముగా మనఃపరిశ్రమము లేకుండ కుటుంబవిషయములు, వరుసవావులు మొదలగు, తమతమ పరిచితప్రసక్తులందు వినోదమురేఁగి, వేడుకగా వెల్వరించినవి కాని, కావలెనని కూరుచుండి కలము కాగితము కైకొని, కష్టపడి కల్పించినవి కావు. వీనిలో భాషాప్రౌఢి కన్పడకపోవచ్చును. భావ పౌష్కల్యము కూడ లేకుండవచ్చును. ఏ తద్విధమగు రచనాసర్వస్వమును జక్కఁగా సమకూర్చుకొని రసార్ద్రదృష్టితోఁ బరికింపఁ గల్గితిమేని, వింత విరత కవిభావములు ఆంధ్రతాముద్రతో బయల్పడకపోవు. ఈ రచనలలోఁ

గొన్నింటఁ బుష్కలమగు భావము కలదు. వ్యంగ్యము కలదు. అలంకారము కలదు. ఈ చెప్పినది ప్రస్తుత పదములను గూర్చియే కాదు. సర్వవిధములుగా మధురకవితలఁ గూర్చియును. ఇట్టి కవితలను, లాక్షణికులు మధురకవిత లనిరి. ఆ విషయము వేఱొకవేళ ముచ్చటించెదను.

ఈ ప్రచురించిన పదములకు ప్రక్రమభంగి లేదు. కొన్నిచోట్ల నొకటి రెండు మూడుపదములకు అర్థసంబంధము గలదు. కొన్నింటికి లేదు. "వడ్లు దంచంగానె" మొదలగు కొన్ని పదములు వడ్లదంపుడువేళ పాడునవి. "కుడు ములపిండనీ గ్రుద్దుకోకండి, యిరుగుపొరుగుల్లార యిది ముగ్గుపిండి" మొదలగునవి ముగ్గువేయునప్పుడు పాడునవి. హాయీవోయి మొదలగునవి జోలపాటలు. ఇట్లు వానివాని సందర్భములను గుర్తించుకొనవలెను. ఈ జాతిపదములు వందలు వేలుగా నున్నవి. ఊరికొక్కతీరున వెలసినవి. ఇందు కొన్ని హాస్యకథలతో కల్పితములు. వీని నన్నింటిని స్త్రీలయొద్దనుండి గ్రహింప వలెను. అది దుష్కరము. యత్నించి భాషాభిమానులు సమకూర్తురుగాక. ఇది వడ్లనూర్పిడి కాలము. ఊడ్పుపాటలు, కోతపాటలు, నూర్పిడిపాటలు, వేఱువేఱుగా నుండును. గుడివాడసీమను భాషాభిరుచిగల కమ్మసంసారులు పెక్కురున్నారు. వారు యత్నించి ఆ పాటలను సేకరించి ప్రచురించుచుందురు గాక యని హెచ్చరించుచున్నాను. బందరుకాల్వమీదను, ఏలూరుకాల్వ మీదను, పడవలు లాగువాండ్రు వింత వింత "పడవపాటలు" పాడుదురు. కూడినంత వఱకు వానిని సేకరించుట యత్యావశ్యకము. కొన్ని రసవంతములయిన పదములు. "కోలుకోలో కోలుకోలో నా సామి కొమ్మలిద్దరు తోడిజోడూ"– ఇత్యాది పదము బహురుచ్యము. రెండు చరణములు వినుఁడు:– "నల్ల నల్లని దాని మగడే, నా సామి, వల్లివల్లక తిరుగువాడే, నల్లరేవడ దున్న లేదా, నా సామి, తెల్లజొన్నలు పండలేదా."

గొడ్లకాపువాండ్రు, చేలకాపరులు, సాలీలు, దొమ్మరులు, కుమ్మరులు మొదలగువాండ్రు పాడుపాటలు అనేకముగా నున్నవి. సేకరింపవలయును. ఇంకను ఊరిదేవళ్ళ జాతరలు జరుగునప్పుడు పంబవాండ్రు, బవనీండ్రు, ఏకవీరాదేవి, మరిడిమహాలక్ష్మి, మొదలగు క్షుద్రదేవతల జన్మాది వృత్తాంత ములు పాడుచుందురు. శ్రీనాథకవిసార్వభౌము డీ సందర్భమును మిక్కిలి

వర్ణించినాడు. జాతరలలో నా పదములను ప్రతిపల్లెటూరి సంసారులును గొల్వుతీర్చి కూర్చుండి వినుచుందురు. అవి సేకరింపవలసియున్నవి.

వడ్లదంచంగానె వచ్చె చుట్టమ్ము
పొమ్మన్న పోడాయె వరికూటివాపి,
వరికూటివాపికీ వంకాయవండి
వంకాయ నేతిందు వార్ని పొమ్మందు –
అందలము కోరింది కుందనపుకుచ్చు
అతిభోగికోరాడు అత్తవారిల్లు
పలకీకోరింది పచ్చన్ని కుచ్చు
పరదేసి కోరాడు పంచటరుగుల్లు –
అటుగుల్లుకొట్టాము పుటిగపోశాము
అమ్మ నీ తమ్ములకు ఆరాటమెత్త –
పండగొచ్చిం దంటె తిండికి ప్రేమ
అల్లు డొచ్చాడంటె అత్తకూ ప్రేమ –
వియ్యాలవారింట విందు భోంచేసి
చెంబెత్తి చెయిగడుగ శక్తిలేదమ్మ –
ఊరిముందరచేను వేయబోకన్న
ఊళ్లోను వియ్యమ్ము చేయబోకన్న
ఊరిముందరచేను కాకుల్లపాలు
ఊళ్లోను వియ్యమ్ము కయ్యాలపాలు–
అండలేనీ వూర వుండదోషమ్ము
ఆశమాలినవారి నడుగ దోషమ్ము
వాడన్ని పూవుల్లు వాసనలుగలవా
ఓ తాత యీ మనుము వద్దయ్యానాకు –
వెంకటప్పడికొండ వెలశుండవలెను
ఎప్పటికి పుట్టిల్లు కలిగుండవలెను.
పుట్టింటి దీర్ఘాయు కావల్లెనన్ని
ఆదినారాయుడికి అర్ఘ్యమ్ము లిస్తు –
ఆడవారీ నేల కన్నావు తల్లి

అడవుల్లపాలేం చేశావు తండ్రి
ఆడదీపుట్టింది అబల పుట్టింది–
దణ్ణాల కోకలకు దైత పుట్టింది –
మొగవాడు పుట్టాడు మొగ్గపుట్టాడు
ధనము పెట్టెలకెల్ల దాతకలిగాడు
కొడుకు పుట్టాడంటె కొండ లెక్కుదురు
కోడలొచ్చిం దంటె రచ్చ లెక్కుదురు
ఆకలీవలె మంట లోకానలేదు
తల్లివలె బంధువులు ధరణిలో లేరు
ఏవూరుచూచినా మా వూరుగాదు
ఏ వార్నిచూచినా మా వాళ్లుగారు
ఏమిరా నాయన్న ననుజూడరావు
నినుజూడవస్తేను నీకేమి తెస్తు
గంపల్ల చక్కిలాలు దుంపకురివేరు
మూటల్ల అరిశలు మొగ్గల్ల రవిక,
ఎక్కేది అందలము ఏలేది భూమి
ఎడలేదు చెల్లెలా నిను చూడరాను
సవతివచ్చిందంటె సంతోషపడితి
నా సవతి గాదమ్మ నాగుల్లచవతి
ఆడబిడ్డ పేర్పెట్టి యేమన్ని పిలుతు
అమ్మక్క బొమ్మక్క రావె తిమ్మక్క
ఇదియేమి వింతమ్మ యీ వూరిలోను
అత్తపోయి కోడలికి యెత్తె చేతుల్లు
నీ కడుపు చల్లన్న నీ కొడుకు బ్రతుక
నీవుపోయి స్వర్గాన యేకుల్లు వడక
తోడికోడలు పెద్ద తులిశమ్మ పెద్ద
అందరికి తాపెద్ద అలివేలుమంగ
ఉత్తముడి పేరేమి వూరిపేరేమి
సత్యపురుషులగన్న సాధ్వి పేరేమి

ఉత్తముడు దశరథుఁడు ఊరు అయోధ్య
సత్యపురుషులగన్న సాధ్వి కౌసల్య
బాపనారక్కలకు ఏమేమి సొమ్ము
అడుగడుగు స్నానాలు తడిబట్ట సొమ్ము
కోమటారక్కలకు ఏమేమి సొమ్ము
వడ్లగింజా సొమ్ము వళ్ళంత దుమ్ము
చక్కిలాలాబుట్ట చంక బెట్టుకుని
సభలోను మా బావ సంగీతపరుడు
బావగారు మీరు ప్రతిభగలవారు
నిండిన సభలోను పిండిబొక్కేరు
వదినగారు మీరు వాసిగలవారు
వండబోయినచోట కుండ నాకేరు
కుడుముల్ల పిండనీ గుద్దుకోకండి
యిరుగుపొరుగుల్లార యిది ముగ్గుపిండి
రాగుల్లు నల్లన్న పిండితెల్లన్న
అంబల్లి పుల్లన్న కడుపు చల్లన్న
ఒంటికణతనొప్పి వొరుగాలితీపు
పంటిపోటూవద్దు పగవానికైన,
ఓ చేడెకూ తగిలె మోచేతిదెబ్బ
అత్తింటి సౌఖ్యమని వొత్తి చెప్పింది.

జోలలు

హాయీ వోయీ ఆపదలు గాయి
చిన్నవాళ్ళను గాయి శ్రీవెంకటప్ప
శ్రీరామ జయరామ శృంగారరామ
చారువిక్రమరామ చంద్రరఘురామ
హాయమ్మ వోయమ్మ అక్కచెల్లెళ్లు
తొల్లొక్క జన్మాన తోడికోడళ్లు
చిట్టిముత్యం పుట్టె సీతకడుపున్న
స్వాతివానలు - కురిసె సంద్రమ్ములోన

మంచిముత్యం పుట్టె మగువ కడుపున్న
మల్లెవానలు కురిసె మా వాడలోను
ముంగిట్లొ అమ్మాయి ఆడంగ జూచి
ముంతమామిడిపండనీ మూగె చిలకల్లు
పందిట్లొ అమ్మాయి పాకంగ జూచి
పనసపండూ అనీ వ్రాలె హంసల్లు
చిన్న నా అమ్మాయి ఆడుకోబోతె
ఎవ్వారు గట్టిరే కాళ్లగజ్జల్లు
కలవారిపట్టనీ గారాబమన్ని
ముద్దుకు గట్టారు మేనమామల్లు
పట్టుచీరలుగట్టి పప్పూ లొడిగట్టి
పాడిరా అమ్మాయి పాట జూతాము
అంచుచీరాగట్టి అటుగు లొడిగట్టి
పాడిరా అమ్మాయి ఆట జూతాము
చిన్న నా అమ్మాయి చీర కేడ్చింది
నెయ్యవోయి సాలీడ నేత్రానపట్టు
మురుస్తు సాలీడు మూణ్ణెల్లు నేసు
అరుస్తు చాకలీ ఆర్నెల్లు ఉతుకు
వేడుకతొ అమ్మాయి వెయ్యేళ్లు కట్టు
చిన్న నా అమ్మాయి సిరిముఖము జూచి
సిగ్గుపడి చంద్రుడు పొడవజాలాడు
ఏడవకు ఏడవకు వెఱ్ఱి అమ్మాయి
ఏడిస్తె నీ కళ్ళ నీలాలుగారు
నీలాలు గారితే నే జూడలేను
పాలైన గారవే బంగారు కళ్ళ
రావె రావే పిట్ట రత్నాలపిట్ట
కోల దేవే పిట్ట కుర్రాణ్ణి గొట్ట.

(కృష్ణా పత్రిక
మార్చి 10, 1917)

మధురరచనలు

స్త్రీలు పాడుచుండెడు కొన్నిపాటలు, రసవత్తర కథాసంవిధానములతో నున్నవి. ఆంధ్రభాషావిద్వాంసులు పెక్కురు వీనిని వాఙ్మయాంగముగాఁ దలఁప కున్నారు. పరిహాసపాత్రముగా భావించుచున్నారు. లంకాయాగము, కుచ్చెలకథ, లంకాసారథి, కుసలాయకము, గంగావివాహము, సీత ఆనవాలు, సీతసురటి, రామపట్టాభిషేకము, ధర్మరాజుజూదము, గోవిందనామాలు, పాముపాట, లక్ష్మణస్వామిమూర్ఛ, లక్ష్మణస్వామినవ్వు, గుహభరతుల అగ్ని ప్రవేశము, ఊర్మిళనిద్ర, నారాయణశతకము, కపోతవాక్యము, కామమ్మకథ, గాంధారికథ, రుక్మిణీసీమంతము, సీతవేవిళ్లు, సీతసమర్త, శ్రీకృష్ణునిచల్దులు, చిలుకరాయబారము, పండుపాట, వేదాంతకుచ్చెలకథ, చెంచీతకథ, బాలనాగమ్మకథ, బొబ్బిలికథ, కౌసల్యవేవిళ్లు, మార్కండేయులపుట్టుక, సీతగడియ, సీతఅలుక, గుమ్మడేడే పాట, మేలుకొలుపులు, జోలలు, సువ్వాలలు, ధవళాలు, అర్ధచంద్రికలు, కందార్థాలు, శోభనములు, హారతులు, బువ్వములు మొదలగునవి సహస్రముగా నున్నవి. ఇందలి పదప్రయోగములు కొన్ని నిఘంటువులందు జేరవలసినవి. (గ్రామ్యములని పండితులు తెగడరా నివి!) శబ్దరత్నాకరాది నిఘంటువులందలి సందేహములనుగూడఁ తీర్చునవిగా నున్నవి. "చేపట్టు" అను పదమునకు శబ్దరత్నాకరమున "స్థానము" అని అర్థమున్నది. అన్నము వడ్డించుటకు ముందు విస్తరి వేయుచోట చేతితో చేయు స్థలశుద్ధికి 'చేపట్టు' అనిపేరు. ఇది బువ్వము బంతిపాటవలన తెలిసికొంటిని. ప్రాతకాలపుపాటలు, ప్రాచీనగ్రంథములట్లు పరిశీలింప దగినవి.

శబ్దరత్నాకరకారులగు బహుజనపల్లి సీతారామాచార్యులుగారు తమ నిఘంటువున క్షేత్రయపదములనుండి కొన్ని శబ్దములను గైకొన్నారు. ఇప్పుడు కొందఱు విద్వాంసులు క్షేత్రయపదములు మొదలగువానియందలి భాష గ్రామ్యమనియు గర్హ్యమనియు దెగడుచున్నారు. వాని స్వారస్యమును దలప బోవరు. కీర్తిశేషులగు పనప్పాకము అనంతాచార్యులవారు మున్నొకతూరి యీ విషయమున నొక వృత్తాంతము చెప్పిరి. వారియింటి కొకతూరి సీతారామా చార్యులుగారు వచ్చియుండగా, పండితవర్యులొకరు, క్షేత్రయపదములను మీ నిఘంటువునఁ బ్రమాణముగాఁ జేర్చితి రేమని యాక్షేపించిరట! కొన్ని

ప్రబంధములకంటె కూడ నా పదము లెక్కువ ప్రమాణముగా జూతుననియు, క్షేత్రయ కవీశ్వరుడుకాక తత్కృతులు ప్రమాణార్హము కానిచో నిక ప్రబంధకవు లుగా దలపబడు వారెందరో కవులు గాదగరనియును నుడివిరట! క్షేత్రయ పదములు మొదలగువానినుండి యెంతో శబ్దజాలము, ఇంకను కైకొనవలసి యున్నదనియు నా శక్తికొలది పాటుపడితి ననియు తెల్పిరట! శబ్దప్రయోగాది విషయముననే కాక మీద పేర్కొన్న గీతములు కొన్ని చక్కని రసస్ఫూర్తియు గలిగియున్నవి. అధికారి తారతమ్యమునుబట్టి యాయా గీతముల రచనము భేదించియున్నది. ఈ విషయము కొంచెము విస్తరింపవలసియున్నది. కొందరు విద్వాంసులు, వాడుకభాషను గ్రంథములు రచించినను, మీద పేర్కొన్న గ్రంథ ములను వాఙ్మయమున జేర్చి యట్టి రచనములకు విద్వదాదరము చేకూర్చి మిక్కిలి వెలయింపసాగినను, నన్నయతిక్కనాదుల ప్రౌఢగ్రంథములకుఁ బ్రచారము చెడుననియు దన్మూలమున మన భారతభాగవతాది పురాణపవిత్ర కథలకే వ్యాప్తిచెడి మతభ్రంశ మేర్పడుననియు పరితపించుచున్నారు. ఇది మిక్కిలి విరుద్ధవాదము. వ్యాసవాల్మీకాదులయు, నన్నయతిక్కనాదులయు గ్రంథముల మూలమున భారతరామాయణాదుల నెఱిగిన వారు వేయింటికి పదుగురుందురేమో! తక్కిన జనులందఱును తోలుబొమ్మలాటలు యక్షగాన ములు, పాటలు మొదలగు వాని మూలముననే యా కథాంశముల నెఱుగ గలుగుచున్నారు. కావున వీని యుద్ధారముగూడ నత్యావశ్యకమే. పామరజనుడు ఎంత తేటగా వ్రాసినను వచనగ్రంథమునుగూడ అవగాహనము చేసికొన జాలడు. ఒక్క వాక్యము అవగాహనము చేసికొని గ్రుక్కత్రిప్పుకొను నంతలో మీదిమీది వాక్యములు నడుచుచుండును. అతిపామరున కిట్టి వచన గ్రంథములుగూడ నుపయోగపడవు. వాండ్రకు కామమ్మకథ, సీతవనవాసము, బొబ్బిలికథ మొదలగు గేయరచనలవంటివి మిక్కిలి సులువుగా హృద్యముగా మనస్సున కెక్కును! కామమ్మకథ మొదలగువానియందు వాక్యము, నాల్గు మూడు త్రుంపులుచేసి ఉగ్గుపాలు కుడిపినట్టు కొంచెముకొంచెముగా బుద్ధికెక్కు నట్లు కూర్పబడును. సీతావనవాసమున నాల్గు బంతులు వినుడు.

హరిహరీ! లక్ష్మణస్వామీ॥ హరిహరీ.
నడవలేనో కన్నతండ్రీ! – హరి
చూడ చుట్టము లేదు రామా! – హరి.
మ్రొక్కదైవము లేదు రామా! – హరి.

అక్కటా! యెంత నిబ్బరము – హరి.
అడవుల్లపాలు చేసితివా – హరి.
కానికార్యము చేసితేను – హరి.
ఖండించి శిక్షించరాదా – హరి.
తెలియకుండా అడవులందు – హరి.
దిగవిడచి రమ్మనడమేనా – హరి.
త్రోవ కనలేనయ్య తండ్రీ – హరి.
కన్నీరు దొంతరులు కాల్వలై పారంగ
కటకటా! లక్ష్మణస్వామీ! – హరి.
కన్ను కనపడదయ్య తండ్రీ! – హరి.
భయపడకు భయపడకు తల్లీ! – హరి.
ప్రారబ్ధకర్మ మోయమ్మా – హరి.
తల్లివ్రాసినవ్రాలు అయితే – హరి.
తప్పింపగావచ్చుగానీ – హరి.
బ్రహ్మవ్రాసినవ్రాలు తల్లీ – హరి!

పై సందర్భమునే యేకధారగా వచనమునఁ జెప్పినప్పుడు తెలిసికొనలేని జనులుందురుకాని యీ విధమున చిన్ని చిన్ని తునుకలుగా విషయమును త్రుంచి గేయముగా జెప్పినప్పుడు ఆబాలగోపాలమును సుఖతరముగా తెలిసికొనగల్గుదురు. సార్వజనీనముగా విద్యాజ్ఞానము ప్రబలవలయునని కోరుచున్న ఈ కాలమున నిట్టిరచనములకు సముద్ధారముకలిగినగాని ప్రయత్నము ఫలవంతము కానేరదు.

మీఁద బేర్కొన్న గేయరచనములుగాక, వచనరూపమునఁగూడ నెన్నో రచనలు వెలసియున్నవి. కథలు మొదలగునవి. అందును కొన్ని వ్రతకథలు సర్వాంధ్రదేశమందును, ముద్రణలేఖనాది సాహాయ్య నిరపేక్షముగానే వేద బుక్కులవలె స్త్రీలకు కంఠపాఠముగా నెలకొనియున్నవి. ముందటి వారమున నొక కథ ప్రచురించెదను.

(కృష్ణాపత్రిక
ఏప్రెలు 21, 1917)

మధురకవితలు

మధురకవితలనుపేర నేను వ్యాసములు వ్రాయుటను గొంద ఱాక్షేపించు చున్నారట! ఈ పేరు నేను క్రొత్తగా పెట్టినదికాదు.

"మధురకవిత్వమన్నది, నాటకాలంకారములు, కళికోత్కళికలు, విభక్త్యధిదేవతోదాహరణములు, సప్తతాళనటనలు, నట్లట్లు, గీతప్రబంధములు, చతుర్భద్రికాష్టభద్రికలు, బిరుదావళి, నామావళి, భోగావళి, రంగఘోష, జయఘోష, త్యాగఘోష, చతురుత్తరసంఘటనలు, యక్షగానంబున వెలయు పదంబులు, దరువులు, లీలలు, ధవళంబులు, మంగళహారతులు, శోభనములు, ఉయ్యాలలు, జోలలు, జక్కులరేకుపదంబులు, చందమామసుద్దులు"
– లక్షణదీపిక.

చతుర్విధకవిత్వములలో మధురకవిత రెండవది. ఇట్టి కవితకూడఁ జెప్పనేర్చినవాఁడే చతుర్విధ కవితావిశారదుఁడు.

ఆంధ్రకవులలో నౌచిత్యమును సర్వవిధములఁ బరిపుష్టపఱిచి ప్రబంధములను సంతరించిన సుకవి పింగళి సూరనార్యుని కళాపూర్ణోదయమునుండి యొక గ్రంథభాగము నుదాహరించి యదేసందర్భమున నొక "మధురకవిత" ను గూడ జతగూర్చెదను. స్వారస్యము నాస్వాదింపుఁడు.

కళాపూర్ణోదయమున సవతులకొట్లాట!

క॥ త్రుళ్ళఁగనేటికి నిలునిలు
మిల్లలికినఁ బందువగునె యింతటిలోనే
వల్లభునకుఁ గడునిచ్చిన
యిల్లాలవె యేను లాతినే పోఁద్రోలన్.

క॥ మగఁడా పట్టెంబునఁ దలఁ
దెగఁగొట్టినఁ గొట్టుఁగాక తెకతేరన నీ
కెగవిడచి పోయెదనె ప్రా
వగ నా కాణాచియైన వలపులపంటన్.

క॥ ఈ రీతిని మద్వల్లభుఁ
గోరిక మెడఁ గౌఁగలించుకొని నీవుండన్

సైరించుట కొఱగాదిది
రారమ్మిఁక నోర్వఁజుమ్ము రావే యనుచున్.

కII వెడదెరువు లిచటఁ జెల్లవు
పుడిమ నహహ దొంగలానఁ బొడిచినఁ గోకల్
విడతురె? గడింతునే యె
క్కడి గతిమాలిన పిశాచికవొ నీ మాటల్.

మానినిII
అంత మదింపకువే యని పల్కిన నంత మదింపకువే యనుచున్
గంతు లడంచెద లెమ్మనిపల్కిన గంతు లడంచెద లెమ్మనుచున్
రంతుల నేమిఫలంబని పల్కిన రంతుల నేమిఫలం బనుచున్
బంతము చూడఁగదే యని పల్కినఁ బంతము చూడఁగదే యనుచున్.

సీII ఒట్టుచుమీ యన్న నొట్టుచుమీ యంచు
నేమేమి యనిన నేమేమి యనుచు
కానీగదే యన్నఁ గానీగదే యంచు
నీ కేల యనిన నీ కేల యనుచు
ఓసి పోవే యన్న నోసి పోవే యంచు
నౌనంటి ననిన నౌనంటి ననుచు
మఱవకు మిదియన్న మఱవకు మిదియంచు
నీ వెంత యనిన నీ వెంతయనుచు

గీII నొకతె మగనికి నాశించు టొప్ప దనిన
నొకతె మగనికి నాశించు టొప్ప దనుచు
బట్టియాడె నా రంభతోఁ బ్రథమరంభ
ప్రియుఁడు నిలుమన్న నిలువక పెద్దరొదగ.

నరుకూరిపారిజాతమున.

అక్క! నాపాటూ నీవూ యెంచేపాటీదానవా? పో పోగదే బుద్ధినేరవూ। ఓసి! బుద్ధీమాలినదాన! పురుషునీ విడిచి నే పొమ్మనగానే పోతానటే। అక్క, పొమ్మన్న పోకుంటే దిమ్మారీవై యిట్లు దొమ్మిజగడాలకు రాబోకే। ఓసి! చేతూలు

పొడుగాని మూతూలు పొడిచేవు ఛీ తాళు పైబడరాకువే। అక్కరాకుండ యేమమ్మ.... .... ఓసి హత్తూఇ యున్నట్టీ వుత్తాము దెచ్చిట్లూ యెత్తూలు జెప్పా నీవెవతెవే। ముందుగ నా పతినిపొం దెడబాపీ నీవెందుకే రాకుండఁ జేయుట। గద్దియపై నిన్న పొద్దుపోయి వానీయొద్ద గూర్చుండ నీ వెవతెవే। వాని సుద్దూలదేలించ నీవెవతెవే। వానీ ముద్దూబెట్టుకో నీవెవతెవే। వాని బుద్ధూలూ చెరచ నీవెవతెవే.

....

చక్కానీసామీ నన్నెక్కువగాజూచి మ్రొక్కితే నీ కేమక్కరే। పంచనీమమూలు కంచిలో విడిచితి వెంచనేటికె నీ గుణములూ। అక్క! యెంచబోతె మంచమెల్ల కంతలు తలవంచుకోవె సిగ్గుబాటులూ। ఏమే నీవాడేటిమాటలూ, అదేమే యాడక వెట్టిదాననా। ఓసి! వదరాక బుద్ధీబల్కవే, నీవలె బుద్ధిలేక పోలేదుగా। ఎంచక మాటలాడేవేమే, నిన్నుంచైనా నేర్చుకోవద్దటే। ఓసి! యేనూగతో పంతమేలనే, నీ వేనుగైతే నంకుశాననే। ఓసి! కుసుమాలు గోధుమ లౌనటే, ఓ కొమ్మా! నీవంతకు యెక్కువా। నీకు జగడమంటే యెంత సంబ్రమే, నా సవతివీవు నంగనాచివే। ఎంతకాపురాల గుత్తవే, అయితే యింతి నీవలె వుండ వద్దటే। దొడ్డకలదానివలె నట్టెపొంగకే, నీ యందలమూ బట్టుకవచ్చినావటే। నీ నొసట మాత్రము పొద్దుబొడిచెనా। ఇంత కావారా మటె సత్యభామినీ। ఇంత గయ్యాళితనమటె రుక్మిణీ, ఓసి! కూతలేల తాళుకోగదే। ఓసి! కూసేది కోకిలగాదటే, నా, చెలువూనిగూడ నీవెవతెవే। వాని, తల, చ నీవెక్కాడీ సవతీవె...... అక్కారో పతిరాడూ పోగదే, నీ, వనగానే పతి రాకపోయెనా.... .... అయితే, నేమాయె తా రాడు పోగదే.

నీవే బ్రతుకవే, ఎంతవోరుపే, అంతపాటటే, ఔను పోవమ్మా, ఎంతదుడి యువే, నీవుసుద్దమా, దొడ్డ అదరకే, చీచీ వదరకే, ఇంతపొంగటే, నీవు నంగవా,......... అంతపడకువే, పడితె యెత్తేనే, నాతో యెగతాళా, దిగువ పుస్తెమ్మా ఓసి బెడగాయా, ఉండే వసిగొయ్యా.

(కృష్ణాపత్రిక
జూన్16, 1917)

ఆంధ్రులు - సంగీతము

"ఆంధ్రదేశము – సంగీతము" అను శీర్షికతో బ్రహ్మశ్రీ హరినాగభూషణముగారును, దానిపై నాక్షేపములుగా మరికొందఱును వ్రాసిన వ్యాసములు జదివితిని. నాగభూషణముగారును సంగీతమున కాంధ్రదేశమే పేరెత్తినదని సిద్ధాంతపరుపఁ జూచువారయినను దత్సాధకములయిన విషయములను బెక్కింటిని దెలుపజాలరయిరి. వారి నాక్షేపించువారును నసందర్భముల వ్రాసిరి. బ్రహ్మశ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు ఆంధ్రపత్రిక యుగాది సంచికలో "ఉపవేదములు" అను పేర వ్రాసినవ్యాసమును, భారతిలో నేను "కృష్ణరాయల విద్యాగోష్ఠులు" అను పేర వ్రాసినవ్యాసమును, నాగభూషణముగారి వాదమున కెక్కువయుపకారకములు. కానివానిని వారుచూచి యుండరు. చూచినచో వానిలోని విషయముల గ్రహించియుందురు. పూర్వకాలమున దక్షిణాపథమందాంధ్రులే సంగీతవిద్యలో పేరెన్నిక గనిరనుటకు జ్ఞాపకములైన విషయములను గొన్నింటిని నాగభూషణముగారు పేర్కొనని వాని నిక్కడ చూపుచున్నాఁడను. కాకతీయసామ్రాజ్యమున వీరభల్లట దేశికాదులు సంగీత గ్రంథకారులయి యుండిరి. కృష్ణాతీరమున దీవిసీమలో వసించినవాఁడు జాయసేనాపతి (కాకతీయ గణపతిదేవుని నాఁడు) నృత్తరత్నావళియని తౌర్యత్రిక విషయకమయిన గ్రంథమును రచించినాఁడు. ఆతఁడు తన కాలమునఁ దెలుఁగు దేశమునఁగల నృత్తగీతసంప్రదాయముల వివరించినాఁడు.

కొండవీడు రాజధానిగా మధ్యాంధ్రదేశమేలినవాఁడు పెదకోమటి వేమారెడ్డి 'సంగీత చింతామణి' యని గొప్ప సంగీతగ్రంథమును రచియించినాఁడు. ఆ కాలముననే వెలుగోటి సింగభూపాలుఁడు సంగీతరత్నాకరమునకు వ్యాఖ్య రచియించెను.

దక్షిణాపథమునకెల్ల నేకచ్ఛత్రాధిపత్యము వహించిన శ్రీకృష్ణరాయలవారి యాస్థానమునను, అంతఃపురమునను సంగీతసారథిపత్యమును సంగీత విద్యాచార్యత్వమును వహించినవా రాంధ్రులు. ఈ విషయమునుగూర్చి "శ్రీకృష్ణదేవరాయల విద్యాగోష్ఠులు" అను పేర భారతిలో నేనొకవ్యాసము వ్రాసితిని. బండారు లక్ష్మీనారాయణుఁ డనునాతఁడు సంగీతసూర్యోదయమని యొక్క గ్రంథము రచియించెను. అతఁడు కృష్ణదేవరాయలచే ముత్తెపు సరుల జల్లులుగల పల్లకీ, ఏనుఁగు, మలహరివాద్యము మొదలగు బహుమానములు

బిరుదులు పొందినవాఁడు. కృష్ణరాయల యంతఃపురమున నాతఁడే సంగీత విద్యాచార్యుఁడు. ఆతనిఁగూర్చి విశేషము లెఱుఁగుటకు భారతిలోని వ్యాసము చూడదగును. ఈ కాలముననే తిరుపతిలో తాళ్లపాకవారు సుప్రఖ్యాత సంగీత విద్వాంసులుగానుండిరి. అందు తాళ్లపాక యన్నమాచార్యునికి సంకీర్తనా చార్యుఁడని బిరుదుపేరు. అతనికి "భవదీయ సంకీర్తనంబు లాలించిన కర్ణంబుల నితర సంక్తీరనంబులాలింప" నని శ్రీనివాసమూర్తి ప్రతిజ్ఞ గావించెనట! తాళ్లపాక తిరువేంగళనాథుఁడు. "సంకీర్తనంబులఁబాడిన శ్రీనివాసమూర్తి యాడఁదొడఁగెడివాఁడట! తాళ్లపాకవారురచించిన గేయము లసంఖ్యాకములుగా నున్నవి. అవి తిరుపతిదేవస్థానమున రాగిరేకులపై వ్రాయఁబడి భద్రపఱుపఁబడి యున్నవి. కొలదిదినములలో నవి ప్రకటితముగాఁగలవు.

"కర్ణాటకసామ్రాజ్యము భ్రష్టమైన పిదప రానురాను ఆంధ్రదేశమున విద్యాప్రోత్సాహకులగు రాజులు సన్నగిల్లుటయు, మహారాష్ట్రవంశీకులు తంజావూరునందు రాజ్యము స్థాపించి సంగీతము మున్నగు విద్యల పోషించి సుప్రసిద్ధివడయుటయు సంభవించెను. ఆ కారణంబున ఆంధ్రదేశములోఁ గల గాయకవరేణ్యులు దక్షిణదేశంబున విరాజిల్లు క్షేత్రంబులకు యాత్రార్థులయి యేఁగియు, దిగ్విజయయాత్రకై పోయియు కుక్షింభరత్వముకొఱకు యానముసల్పియు శ్రీతంజావూరు సంస్థానాధిపతులచే నాదరింపఁబడి ద్రవిడదేశంబుననివాసంబు గల్పించుకొన్నటుల పొడకట్టుచున్నది." అని నాగభూషణముగారు వ్రాసిరి. ఈ వ్రాఁత నాకు మిక్కిలి దుఃఖము గల్గించినది. శ్రీకృష్ణదేవరాయల యవసానకాలముననుండి ద్రవిడదేశమనఁబడు చోళ పాండ్య దేశములే కాక మళయాళ సింహళాది దేశములనుగూడ నాక్రమించుకొని యఖండవైభవముతో నద్వితీయవైదుష్యముతో నిత్యకళ్యాణముగా రాజ్యమేలి సర్వవిద్యలకు నాఁడు కలిగిన యభ్యుచ్ఛ్రయము నభూతో నభవిష్యతి యని యేనాఁడును దలపోయుచుండవలయునట్లు పేర్వెలసిన మన యాంధ్రనాయకరాజుల విషయమును నాగభూషణముగారు స్మరింప నెఱుఁగరయిరి. తంజావూరి యాంధ్రనాయకరాజులు పుణ్యశ్లోకులు. "తంజావూరి యాంధ్రరాజులచరిత్ర" యను గ్రంథమున నేను వారి కీర్తిని పూర్తిగా నారాధించితిని. దానినుండి సంగీతప్రసక్తమగుదాని నించుక యిక్కడ గ్రహించుచున్నాఁడను. తంజావూరిసత్రము, తంజావూరిపాట అను నానుడులకు జనన కారణమగు మహారాజు తంజావూరి రఘునాథనాయకుఁడు మన యాంధ్రుఁడు.

ఆయన "శత సహస్రాధిక సకుటుంబవిప్రసతతాన్నదానదీక్షాధురంధరుఁడు". ఆయన తాతయగు చెవ్వప్పనాయకుని కాలమున తంజావూరురాజ్యమాంధ్రుల వశమయినది. చోళరాజ్యమునకుఁ తంజావూరిని రాజధానిగాఁ దొల్తఁగల్పించిన వారు మన తెల్గునాయకరాజులే. తంజావూరునగరమును బెంపొందించి కోట కొత్తడములు, అగడ్తలు, రాచనగరులు, సంగీతశాలలు మొదలగునవి యక్కడ కల్పించినవారు తెల్గునాయకరాజులగు చెవ్వప్పనాయకుడు, అచ్యుతప్పనాయకుడు, రఘునాథనాయకుఁడుననువారే. వారక్కడ రాజ్యము నెలకొల్పుకొనునప్పుడు రాజమంత్రులను బురోహితులను విద్వాంసులను కవులను, గాయకులను వేశ్యలను, చిత్రలేఖకులను, వారు వీరననేల సర్వరాజ్యాంగములను నాంధ్రదేశమున నుండియే తోడ్కొని పోయిరి. నేఁడు వేలకొలఁదిగా దక్షిణమున నెలకొనియున్న యాంధ్రులెల్ల నానాఁడు మన నాయకరాజులచేఁ గొంపోఁ బడినవారి వంశములవారే. ఆంధ్రులానాఁడు ద్రవిడదేశమునకు వియ్యాల వారుగా వెడలిరిగాని, భిక్షాటకులుగాఁబోలేదు. ఆనాఁడు తెలుగుకవులు, తెలుగుఁనాయకులు తంజావూరి మన తెలుగురాజ్యమున వేలకొలఁ దిగానుండిరి. ఇక్కడ నిప్పుడు సంగీతవిషయమే ప్రసక్తముగాన దానినే పేర్కొనుచున్నాఁడను. రఘునాథనాయకుడు సంగీతవిద్యలో నఖండ పాండిత్యముగలవాఁడు. 'సంగీతసుధ' యని యాతఁడొక గొప్ప సంగీతశాస్త్ర గ్రంథమును రచియించెను. ఆయనకు మంత్రియు గురువునగు గోవింద దీక్షితులవారు దానికి పీఠికను రచియించిరి. రఘునాథరాయలు జయంతసేనాది రాగములను, రామానందాది తాళములను గ్రొత్తగాఁ గనిపెట్టెనట. తనపేర నొక వీణను గూడఁగల్పించెనట. గోవిందదీక్షితులవారికి యజ్ఞనారాయణదీక్షితులని, వేంకటేశ్వరదీక్షితులని యిద్దఱు కుమాళ్లు. వీరిర్వురును సర్వక్రతువులను జేసినవారు. యజ్ఞనారాయణదీక్షితులు రఘునాథరాయలచరిత్రమునే సాహిత్యరత్నాకర మనుపేర గొప్ప కావ్యముగా రచియించెను. తర్కవ్యాకరణ పూర్వోత్తర మీమాంసాది శాస్త్రముల నాతఁడు నేర్చెను. కావ్యాలంకారనాటకాదిసాహిత్యము నాతఁడు మన తెలుఁగు రాజగు రఘునాథరాయలయొద్దనే నేర్చుకొన్నాఁడు. అట్లు నేర్చుకొని గురుఁడగు రఘునాథరాయలకు గురుదక్షిణఁ దానీయవలసినవాఁడైయుండఁగా రఘునాథరాయఁడే తన కాతడు ధరించు కర్ణాభరణమును, పదకమును,

పాదాంగదమును, కంకణమును బహుమతిగానొసఁగెనని సాహిత్యరత్నాకరమందు యజ్ఞనారాయణదీక్షితుఁడు చెప్పుకొన్నాఁడు.

"పాతంజలం భాట్టమతం చ తర్క
మద్వైత రాద్ధాంత మవైమి కింతైః
ప్రబంధ సందర్భరైః కవిత్వ
విద్యా మిదానీం విశదీకరోమి.

కావ్యాలంకృతి నాటకాది కలనా పాండిత్య మత్యద్భుతం
సర్వజ్ఞో రఘునాథభూశతమఖో యస్యోపదిశ్య స్వయమ్
ఆదాతుం గురుదక్షిణా మభిమతా మర్థ్వోవ్య హోదత్తవాన్
స్వం కర్ణాభరణం నిజం చ పదకం పాదాంగదం కంకణమ్."

ఈ యజ్ఞనారాయణదీక్షితులవారి తమ్ముఁడగు వేంకటేశ్వరదీక్షితుఁడే చతుర్దండిప్రకాశిక యను సంగీతగ్రంథమును రచియించినవాఁడు. వేంకటముఖి యని యీతనికే నామాంతరము. నాగభూషణముగా "రీతడు ద్రావిడి" యని వ్రాసిరి. అది సరిగాదు. ఈతఁడు ద్రావిడుఁడు గాఁడు. కర్ణాటకుఁడు. విద్యా నగరముననుండి తంజావూరికి నేలఁబోయిన చెవ్వప్ప నాయకుఁడు గోవింద దీక్షితులవారి తండ్రినో వారినో తోడఁ గొంపోయెను. గోవిందదీక్షితులవారి వంశమువారు నేఁడును దక్షిణదేశమునఁ గలరు. వారు కర్ణాటకులు. వీరు గోవిందదీక్షితులను, వేంకటేశ్వరదీక్షితులను తమ వంశమువారినిగాఁ జెప్పుకొ నుచున్నారు. వేంకటముఖి చతుర్దండిప్రకాశికను రఘునాథనాయకుని యాజ్ఞ చొప్పున రచించినట్టు చెప్పుకొన్నాడు. ఆతఁడు తన గ్రంథమందు పేర్కొన్న సంగీతవిద్వాంసులెల్లరు నాంధ్రులే. ఆయన గానసంప్రదాయ మాంధ్రులదే గాని ద్రావిడులది కాదు.

"తథైవ రఘునాథేంద్ర వీణాయామపిదుర్ఘట
....
అహ మేవ శ్రుతేర్వేదీ త్యాహ గోపాలనాయకః
తాన స్మరమాచార్య తానపార్య సముద్ధృతాన్"

ఇత్యాది విధముల నాతఁడు రఘునాథరాయాదులను బ్రస్తుతించినాడు. ఆతని గద్య మిట్లున్నది:

"ఇతి శ్రీమదద్వైత విద్యాచార్య సాగ్నిచిత్సర్వతోముఖాతిరాత్ర సాగ్నిచిత్యాప్త వాజపేయయాజి గోవిందదీక్షిత నాగమాంబికావరద్వితీయనందనస్య సాగ్నిచిత్య సర్వక్రతుయాజి యజ్ఞనారాయణ దీక్షితావ్యవహితానుజన్య అచ్యుత విజయ రాఘవభూపాల ప్రేరితస్య వేంకటేశ్వర దీక్షితస్య కృతౌ చతుర్దండి ప్రకాశికాయామ్."

నాగభూషణముగారు మఱికొందరు, తలఁచుచున్నవిధము సరికా దనియు, నీతఁడు ద్రావిడుఁడు గాఁడనియు నెల్లరు నెఱుఁగుదురు గాక! ఆంధ్రులవలెనే కర్ణాటకులు గూడ సంగీతవిద్యను సంరక్షించిరి. విద్యారణ్యుల వారు సంగీతశాస్త్రమున గొప్ప గ్రంథమును రచియించిరట. రఘునాథరాయ లా గ్రంథమును ప్రశంసించెను.

రఘునాథరాయలసభలో సంగీతవిద్వాంసు లాంధ్రు లింక ననేకులుండిరి. వారి విషయము నా తంజావూరి యాంధ్రరాజులచరిత్రలో చూడదగును. రఘునాథరాయల కుమారుడు విజయరాఘవనాయకుఁడు. ఈతఁడును తండ్రిని బోలినవాఁడు. మహారసికుఁడు, మహామహుఁడు. ఎనుఁబదియేం డ్లతఁడు జీవించెను. ఈతని యాస్థానమునఁ గూడ గాయకులనేకులుండిరి. ఈ ప్రభుని యనంతరమే అనగా క్రీ.శ. 1680లో తంజావూరి రాజ్యము మహారాష్ట్రుల వశమయినది. ఆనాఁ డాంధ్రనాయకరాజ్యము మహారాష్ట్రుల పాలగుటకుఁ గారణమయిన రాయసం వెంకన్నపంతులుగారి ప్రయోజకత్వము వర్ణింప రానిది. అదియెల్ల నా "తంజావూరి యాంధ్రరాజులచరిత్ర" చదివిన వారికి విశదమే. మహారాష్ట్రరాజులు తమ పూర్వులగు నాంధ్రరాజులు పెంపొందించిన సంగీతసాహిత్యవిద్యలను సముచితరీతిని సంరక్షించిరి. మహారాష్ట్రరాజుల కాలమునఁ బేరెన్నికగన్న యాంధ్రనాయకు లెల్లరును నాంధ్రనాయకరాజుల కాలము నక్కడ కరిగినవారి పరంపరలలోనివారే. కాని యాంధ్రదేశము గొడ్డుపోవుటచే భిక్షాటనాదులకు వెళ్లినవారు గారు.

తంజావూరి తెలుగు నాయకరాజుల నాళ్లలో రచితములయిన తెలుఁగు గేయములు వందలకొలదిఁగా నేఁటికిని తంజావూరి పుస్తకశాలలో తెఱచి చూచువారు లేక పురుగులపాలగుచున్నవి. ప్రాచీనచరిత్ర పరిజ్ఞానము గలవారు దాక్షిణాత్యులనేకు లిప్పుడుకూడ తమ దేశమునకు సంగీతభిక్షపెట్టిన వారాంధ్రనాయకరాజులేయని సబహుమానముగా సంస్మరించుచున్నారు.

స్వరమేలకలానిధిని రచియించిన రామయమంత్రి గుంటూరుమండల మందలి వినుకొండలో నుండినవాఁడు.

గోవిందమంత్రి తెలుఁగునఁబద్యకావ్యముగా 'రాగతాళచింతామణి' యను గొప్పగ్రంథమును రచియించెను. అది యింతవఱకును ముద్రితమే కాలేదు.

సంగీతవిద్యాభిమానులగు నాంధ్రులెవ్వరయినను ఆంధ్రులే రచియించి నవి, యింతవఱ కముద్రితములయినవి యగు నీ క్రింది గ్రంథములను బ్రకటింపఁ బ్రయత్నింతురుగాక!

1. 'సంగీతచింతామణి కొండవీటిరాజు కోమటి వేమారెడ్డి రచించినది. తిరువనంతపురము రాజకీయ పుస్తకశాలలో నున్నది.
2. "సంగీతసుధ" రఘునాథరాయలు రచించినది. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తకశాలలోనున్నది. బ్ర॥ మానవల్లి రామకృష్ణ కవిగారి దగ్గఱఁ గూడనున్నది.
3. 'రాగతాళచింతామణి' తెనుఁగు పద్యకావ్యము గోవిందమంత్రిది. చెన్నపురి పుస్తకశాలలో నున్నది.
4. 'సంగీతసూర్యోదయము' శ్రీకృష్ణదేవరాయలవారి యాస్థానమున గల సంగీత విద్వాంసుఁడు బండారు లక్ష్మీనారాయణుఁడు రచించినది. గొప్ప గ్రంథము.

ఇంకను కొన్ని గ్రంథములు గలవు. వానిని గూర్చి యింకొకతూరి వ్రాయుదును.

(వ్యాసము ఆంధ్రపత్రిక : తేది?)

చాటువులు

చిత్రకవితారచనలు

ద్రవిడాంధ్రములలో కలగలపుభాషలపద్యాలు బహుకాలమునుండి ఉన్నవి. కలగలుపుభాషకే మణిప్రవాళభాష అని పేరు. పాల్కురికి సోమనాథుడు వృషాధిపశతకములో మణిప్రవాళభాషాపద్యములు రచించినాడు. ద్రవిడసంస్కృతముల కలగలపు చాటుపద్యమొకటి,

మణల్ భ్యోవాంగలాం తైలం
కల్లుభ్యోవాంగలాం త్వచమ్,
పులిభ్యోవాంగలాం క్షీరం
త్వత్తః కించిన్న వాంగలామ్.

యాచకుడొకడు లుబ్ధుడయిన ధనికునిగూర్చి చెప్పిన పద్యమిది.

ద్రావిడాంధ్రభాషలలో చమత్కృతికై యిట్టి రచనలు వెలసినవి. కాని మళయాళభాషలో కవితారచనలెల్లను మణిప్రవాళభాషాత్మకములే. మాదిరి కొకటి.

ఆకృతి కండా లతిరంభేయం
ఆరావలివళ్దన్ అధరం పేయం,
ఆకృతిమద్యుతి రనవద్యేయం
అదుత్తి చెన్నిని అనుపశ్యేయమ్.

– నలచరిత్ర కథాకళి.

చాటుపద్యమణిమంజరిలో నింతకుముందు చేరనివి కొన్ని గలపుభాష పద్యాలు

భోజనం ఈగ సంకీర్ణం
దోమ సంకీర్ణ మందిరమ్
శయనం నల్లి సంకీర్ణం
దేహి మే కుంటికూనమా!

పాండవగీతలలోని యీ క్రింది శ్లోకము మీది శ్లోకమున తల్లక్రిందులయినది.

భోజనం మిత్రసంకీర్ణం
బంధుసంకీర్ణ మందిరమ్
శయనం సుతసంకీర్ణం
దేహిమే మధుసూదన!

మఱియొకటి!

పత్న్యా సుప్తే చెనకి పలికెన్
నన్ను సా రంతుకామా
నిద్రా కింతే, అది విని ఒసీ
కాసి బాలే త్వ మంటిన్
భీతాభీతా కమలరుచినా
పాణినా నోరు మూసెన్
మందం మందం మధురవచనా
చాలు చాల్నిత్యవోచత్.

ఈ వరుస మరికొన్ని శృంగారపద్యాలు వెకలి రచనవి కలవు.

భాషాద్వయాభాస శ్లోకము:-

అంబలి ద్వేషిణం వందే
చింతకాయ కృతాదరమ్,
కూరగాయ కృతత్రాసం
పాలనేతి ప్రియంగవామ్

భాషాద్వయ పునరుక్తాభాస శ్లోకము.

భాండే జలంవా తక్రంవా
నీరోమోరో వదాంగనే

(నిర్+రోమ+ఊరు; బహువ్రీహి సంబుద్ధి.)

మార్గ మాలోక్య గంతవ్యం
ముల్లుస్స్యాత్ తత్ర కంటకః.
(ముదం లునాతి)

ఈ క్రింది పద్యము వర్తమానుడు కశ్చన రచించినది.

వడపై, నావడపై, పకోడిపయి, హ
ల్వాతుంటిపై, బూంది యోం
పొడిపై, నుప్పిడిపై, రవిడ్డిలిపయిం
బోండాపయిన్ సేవియా
సుడిపైఁ బాఱు భవత్కృపారసము ని
చ్చోఁగొంత రానిమ్ము నే
నుడుకుం గాఫిని, మ్రొక్కు! గ్రుక్కఁగొనవే
యో కుంభదంభోదరా!

పై పద్య మీ క్రిందపద్యమునకుఁ దల్లక్రిందుల రచన.

అరయన్ శంతనుపుత్రుపై విదురుపైన క్రూరుపైఁ గుబ్జపై
నరుపై ద్రౌపదిపై కుచేలునిపయిన్ నందవ్రజశ్రేణిపై
పరగం గల్గు భవత్కృపారసము నాపైఁ గొంత రానిమ్ము నీ
చరణాబ్జంబులు నమ్మినాను జగదీశా! కృష్ణ! భక్తప్రియా!

ద్రాభ భాష

ఆంధ్రద్రవిడకర్ణాటక భాషలలో "ద్రాభ భాష" యన్న వ్యవహార మున్నది. పాల్కురికి సోమనాథుఁడు" ద్రాభ, ఛందో విరుద్ధం, బాది యగుని లాభప్రలాపోక్తి లాఘవంబనక – అని దీనిని పండితారాధ్యచరిత్రలో పేర్కొన్నాడు. – కర్ణాటాంధ్రకవులు మఱికొందఱు కూడ నీ ద్రాభభాషను గర్హించిరి. "ద్రాబ" యనియు గొందఱు కవులు దీనిని బేర్కొనిరి,– ద్రాభభాష యెట్టిదో యీ క్రింది సీసమాలిక తెలుపుచున్నది.

సీ॥ బావగా రీ సారె పనసవల్లించిండ
తాత యీ జంర్ఘాలు తాలిచిండ

మామ యీ శ్లోకంబ మఱవక రాశిండ
గోవిందునికి నంగి కూరిశిండ
పెండ్లి సాగిన దింట పెత్తనా న్కొచ్చిండ
మా ప్రాతకించాలు మాఱిచిండ
శోపస్కరాలెల్ల రేవు తెప్పించిండ
మా వద్ద హరువైన మానిసిండ
కమ్మలు కడియాలు సొమ్ము శేయించిండ
బేరమాడఁగ నాకు నేరుపుండ
ఒమ్మెచ్చు పైఁడిగా నొఱసి తూపించిండ
అక్షతల్ గంధంబు లమరిచిండ
అప్పన్న యాయాకు దొప్పగా మడిశిండ
కూసుండి యీ బట్ట కూరిశిండ
పెద్దత్త యీ సంట పెసలు గాలించిండ
వణ్ణంబు మెత్తగా వారిశిండ
పులగూర వండిండ బూరెల నెంచిండ
ఆ చిన్నవానికి నప్పచిండ
నడిపత్త సెగదాఁకి బడలిక పడుసుంది.
రూపత్త పప్పులు రుబ్బుసుంది
నిలువుడీ మనవాడు నీళ్లులు దెస్సాడు
క్రాఁగులో వేన్నీళ్ళు కాపుసాడు
ఈశ్వరభట్లు దానింటికి బోసాడు
భానుభ ట్లింటికిఁ బారుసాడు

గీ॥ అనుచు మురుముళ్ల పల్ల్యగ్రహారమునను
శోభనము సేయుచుందురు ద్రాభభాష
యెట్లు నిర్మించె నా తలకొట్లమారి
బ్రహ్మ యిటువంటి పరిపాటి బ్రాహ్మణులకు

(ఆంధ్రపత్రిక,
జూలై 15, 1942
మణిమంజరి: ఫిబ్రవరి, 1984)

బ్రహ్మశ్రీ
నడిమింటి మంగళేశ్వరశాస్త్రులు

విశాఖపట్టణంజిల్లా పార్వతీపురము తాలూకాలోని నాగూరను నగ్రహార మున మీఁదఁ బేర్కొన్న నడిమింటి మంగళేశ్వరశాస్త్రులను నుద్దండవిద్వాంసుడు జన్మించెను. ఇప్పటికి నెనుబదియేండ్ల క్రిందటివఱకు నీతఁడు జీవించి యుండెను. విశాఖపట్టణ మండలమందేగాక సర్వాంధ్రదేశమందును నీ పండిత ప్రకాండుని పేరు ప్రఖ్యాతమయినది. వ్యాకరణశాస్త్రమం దీయన మహాపండి తుడు. తెనాలి రామలింగని విధమువాఁడు. సుకవి. సంస్కృత భాషాపరిచయము గోరు బాలురకయి సమాసకుసుమావళి యనుపేర నీయన రచించిన లఘు గ్రంథము మనదేశమున బహువ్యాప్తికలది. సంస్కృత భాషాభ్యాసము సేయు ప్రతివిద్యార్థియు నా గ్రంథప్రతిని జదువుచున్నాఁడు.

1. బొబ్బిలి సంస్థానమునకు వీరి యగ్రహారము చేరువనున్నది. ఆ కారణమున బొబ్బిలి ప్రభువులతో నీయనకు దఱచుగా సమాగమము కల్గు చుండెడిది. నక్క యెడమవైపునుండి కుడివైపునకుఁ బోయిన మంచిదా? కుడివైపు నుండి యెడమవైపునకుఁబోయిన మంచిదా? యని యెకనాఁడు బొబ్బిలిరాజు గారు విద్వద్గోష్ఠిలో మంగళేశ్వరశాస్త్రులుగారి నడిగిరి. శాస్త్రులుగా రిట్లు బదులు చెప్పిరి! అది కఱవలేదుగదా! కఱవకుండ నెటుపోయినను మంచిదే.

2. బొబ్బిలిరాజుగారు మీకు ఊరు+ ఇచ్చెదమనుచున్నారని తదాస్థానో ద్యోగియగు తన మిత్రుఁడొకఁడు చెప్పఁగా దాని తత్త్వమెఱిఁగిన యీయన యిట్లు బదులుచెప్పెను. “మీ రాజుగా రెప్పుడూ ఊరిస్తూనే వుంటారులెండి”..

3. బొబ్బిలిరాజుగారు సీతారామపురమను పేరుగల తమ సంస్థాన గ్రామమున వేంచేసియున్న గోపాలస్వామియే యజమానుడుగా నొకప్పుడు యజ్ఞము చేయించినారట. ఆ యజ్ఞమునకు విచ్చేయను మన మంగళేశ్వర శాస్త్రులుగారికిని ఆహ్వానపత్రిక వచ్చెను. దాని కీయన యిట్లు బదులు వ్రాసి పుచ్చెను ‘ప్రభూ! శ్రీవేణుగోపాలస్వామివారు స్వయముగా జేయుచున్న యజ్ఞమును దర్శింప నేను దప్పక రావలసినవాఁడనే కాని నాకిక్కడ నొక్కచిక్కు

తటస్థించినది. మా గ్రామమున రేగాలమ్మయని గ్రామదేవత కలదు. ఆమెను మాయూరనే నెలకొనియున్న పోతురాజును దేవరకిచ్చి పెద్దలు పెండ్లిచేసినారు. రేగాలమ్మ యెన్నాళ్ళకును సమర్తాడదయ్యెను. పోతురాజు బ్రహ్మచర్యమున నిల్వఁజాలక తనకిట్టి యసందర్భవివాహమేల చేయవలెనని మా గ్రామమువారి మీఁద మహాగ్రహావిష్టుఁడై యున్నాడు. మేమందఱము పోతురాజుగారివలన భీతిగొనియున్నాము. మా యదృష్టవశమున నీ నాటికి రేగాలమ్మ పెద్దమనుష్యు రాలయినది. మీరు శ్రీ వేణుగోపాలస్వామివారి యజ్ఞమునకుఁబెట్టించిన సుముహూర్తము చాల దొడ్డదగుటచే మేము నదే సుముహూర్తమున సౌభాగ్యవతియగు రేగాలమ్మకు గర్భాదానమంగళము జరిపింప నిదివఱకే నిర్ణయించి పోతురాజుగారి నాశ్వాసపఱచి ప్రయత్నములు జరుపుచున్నాము. గ్రామమునఁ బెద్దవాఁడనగుటచే నేనా శుభకార్యమునకుండి తీఱవలయును. అప్పుడుండకున్నను, సుముహూర్తముమార్చినను బోతురాజుగారికి మహాగ్రహము వచ్చును. ఈ కారణమున శ్రీస్వామివారి యజ్ఞమునకు రాజాలనందుకు నన్ను క్షమింపవేఁడెదను’.

4. బొబ్బిలి సంస్థాన గ్రామవ్యాస్తవ్యులగు నొకరియింటఁ గొంతసొమ్ము దొంగలు దోచుకొనిపోయిరట. దానిని విచారింప రాజుగారి కాయింటి యతడు విన్నవించుకొనెను. కన్నము త్రవ్వక చేసి దొంగతికము విచారింప సాధ్యము కానిదనియు నట్టి దొంగతికములను గూర్చి యింకమీద దమకు విన్నపము లంపుకొనరాదనియు ద్రోసిపుచ్చి యట్లే దండూరా వేయించిరట. దానిమీఁద నీ కవి చెప్పిన శ్లోకము:

శ్లో॥ చోరస్సద్మోర్ధ్వభేదాదర రవిఘటనా త్త్రప్షఘాణాప్రఖానా,
దేదూకచ్ఛేదనాద్వావిశతి యదిగృహంతత్రనో నోవిచారః,
కింత్వస్మాకంసురంగాకలనయితి పురే ఘోషయామాస యస్మా
త్తస్మాదేతత్పురంగాధిప ఇతి బిరుదం ప్రోచురేతత్పురస్థాః.

5. తురుష్కులనుగూర్చి యీయన యీ క్రింది శ్లోకమును జెప్పెనట!

శ్లో॥ తురకః కరకశ్చైవ ద్వావేతౌ మలమోచకౌ,
తురకోదర్శనాదేవ కరకస్తునిషేవణాత్.

6. ఈయనకు రుక్మేశ్వరశాస్త్రులను అన్నగారు గొప్ప విద్వాంసుడుండెను. వీరిరువురును రాజకార్యవశమున నొకప్పుడు విశాఖపట్టణమువచ్చి యక్కడ శిష్యులతో స్వయంపాకము చేసికొనుచుండిరి. ఒకనాఁడు రుక్మేశ్వరశాస్త్రులు తమ్మునితో నిట్లనియె. "అబ్బీ, కూరగాయలకై బాజారులకు వెళ్లుచున్నాను. నే నేకూర తెచ్చినను యేదో యాక్షేపముచేయుచుందువు. నీకు సరిపడు పదార్థములు నాకు తెలియకున్నవి; నేదేమి తెమ్మందువో చెప్పుము" అనెను. మంగళేశ్వరశాస్త్రులు కోపముతో నే తెమ్మన్నది తెచ్చెదరేని మాణిక్యము తెండు, అనెను. రుక్మేశ్వరశాస్త్రులు చెప్పిన శ్లోకము:–

శ్లో॥ మాణిక్యక్రయణంలోకే మంగళాయభవేత్కిల,
మంగళేసహజే ఽ స్మాకం మాణిక్యాత్కిం ప్రయోజనమ్.

7. మంగళేశ్వరశాస్త్రిగారికి గోపాలశాస్త్రియను కుమారుడు ప్రయోజకుడు విద్వాంసుడుండెను. తండ్రి జీవించియుండగానే యాతడు చనిపోయెను. ఎప్పుడును ఎల్లరను వెక్కిరించు స్వభావమే కలవాడగుటచేత గ్రామస్థులందరు నీయనను లోలోన ద్వేషించుచుండిరి. ఈయనను సాధింప వారికెన్నడును తఱిదొరకకుండెను. ఇప్పుడురా సమయమనుకొని వారెవ్వరును శవమును మోయరారైరి. అట్టి దుఃఖసమయమందు కూడ యీతనిచాతుర్యము కుంఠితము కాలేదు. ఇట్లనెనట: – కొడుకు గోపాలశాస్త్రి బ్రతికీ నిర్వాహకుడే. చచ్చీ నిర్వాహకుడేయైనాడే:– ఈ కథను విశ్వగుణాదర్శాది గ్రంథకర్త శ్లేషయమక చక్రవర్తి ఆర్యాణిపాలెం వేంకటాచార్యులపేరఁ గొందరు చెప్పుచున్నారు.

8. విజయనగరప్రభువైన నారాయణగజపతిసన్నిధానమునకు సమ్మానము వడయుటకై యొకప్పుడొక మాధ్వపండితుఁడు వచ్చెనట. రాజుగా రాయనవైదుష్యోన్మేషమును బరీక్షింపను బండితసభ కూర్పించిరి. ఎందరో పండితులందు వచ్చియుండిరి. మంగళేశ్వరశాస్త్రులును బ్రచ్ఛన్నముగా నచ్చటికి వచ్చియుండెను. మాధ్వపండితుఁడు మతవిషయోపన్యాసముచేయ ననుజ్ఞగొని యద్వైతవిశిష్టాద్వైత్వములను ఖండింప నారంభించెను. అద్వైతము శాబ్దప్రమాణ బాధితమని చెప్పుచు "భిదాసత్యం భిదాసత్యం భిదాసత్యమ్" అని శ్రుతి వాక్యమున్నట్లు వైదిక స్వరముతోఁ బల్కెనట. తోడనే మంగళేశ్వర శాస్త్రులు

"భిదాసత్యమితి యోవదతి స చండాలోభవతి స చండాలోభవతి స చండాలోభవతి" యని యంతకంటె రంజకముగా నుచ్చస్వరముతో శ్రుతిరీతిని బఠించెనట! అందఱు నబ్రపడి యీయనకేసి చూసిరి. రాజుగా రభిముఖులైరి. ఎక్కడిదీ శ్రుతివాక్యమని యడిగిరి. మంగళేశ్వరశాస్త్రులిట్లు పలికెను: 'ప్రభూ! మన మాధ్వాచార్యులుగారు సెలవిచ్చిన శ్రుతివాక్యము పూర్వపక్షవాక్యము. ఇది సిద్ధాంత వాక్యము. రెండును ఒక యనువాకమందలివే. తొమ్మిదవ యట్టముననున్నవి. వారు పూర్వపక్ష గ్రంథమువఱకే చదువుకొన్నారు కాఁబోలును! కనుక నీ గ్రంథము వారుదహరింపఁజాలకపోయినారు. నేను తొమ్మిదవ యట్టమును బూర్ణముగా నేకరువుపెట్టగల్గుదును, అనెను. మాధ్వాచార్యులుగారి ముఖము మకమక లాడెను. అంతకుముందు ప్రఖ్యాతిని బట్టి వినుకలిమాత్రమే కలిగియున్న మంగళేశ్వరశాస్త్రుల నప్పుడు కనుకలి కలిగినందులకు సంతోషించి నారాయణగజపతి చేరికయొసఁగి గౌరవించెను. అప్పుడు మంగళేశ్వరశాస్త్రు లీ శ్లోకముతో రాజు నాశీర్వదించెను.

శ్లో॥ పూషవాడాన్వయాబ్ధీందో। స్వస్తి నారాయణ ప్రభో!
నేత్రే గాత్రే తదా శ్రోత్రే। వక్త్రే పుష్పేషు శోభతే.

9. ఈ శ్లోకమందలి గుట్టును చక్కని సంస్కృతసాహిత్యముగలవారు గుర్తింపఁగల్గుదురు. శ్లోకచాతుర్యమునకు మెచ్చి రాజీయనను మిక్కిలి సమ్మానించెను. ఆ సందర్భమందే "శాస్త్రులుగారూ మీ పాండిత్యమునకునుఁ జాతుర్యమునకును దగినట్టుగా లేదండీ ఇంటిపేరు, నడిమింటివారు, మొదటింటి వారుగాక నడిమింటివారయితిరి" అనెనట. రాజుకు ఈయన పల్కిన బదులు: "ప్రభూ! ఏ యిల్లయినను బూసపాటి చేయదా?"

10. మంగళేశ్వరశాస్త్రులొకప్పుడు తమ యూర నౌకరియింట వివాహ ముహూర్తము జరుగుచుండఁగాఁ దాంబూలమునకు వెళ్ళెను. మంగళసూత్ర ధారణ సమయమునఁ బురోహితుఁడు వరునిచే "మాంగల్యతంతునా నేన మమజీవన హేతునా! కంఠే బధ్నామి సుభగే త్వం జీవ శరదాంశతమ్" అన్న శ్లోకమును బఠింపించుచుండెను. మంగళేశ్వరశాస్త్రులు పెడదిరిగి యక్కడ నున్నవారితో మీ కీ శ్లోకమున కర్థము తెలసినదా యనెను. ఏదో కొంటెతన ముందుననుకొని వారు తెలియలేదు సెలవిండని కోరిరి. శాస్త్రులుగారు చేసిన

యనర్థమిది – మాంగల్య తంతు – న ఇది మాంగల్యతంతువుకాదు, నేను ముసలి ముండకొడుకను. ఇట్టి నాకింక నెక్కడిమాంగల్య మనిభావము. అనేన మమ– జీవనహేతు న (నా?, దీనిచే నా బ్రతకుఁదెరువును జెడినది. రెండెకరాలో మూఁడెకరాలో ఉన్నయాస్తి కాస్త తెగనమ్ముకొన్నాను. జీవనోపాధి పోయినదని భావము. కంఠే – బధ్నామి, నీ కుత్తికకు త్రాడుకట్టుచున్నాను. నా వల్ల నీకు సౌఖ్యములేదు సరికదా ఇదొక నిర్బంధముకూడ నీకు కల్గినది అని భావము. సుభగే– సుభగురాలా! (పరికరాలంకారము) త్వం–నీవు సుభగురాలవు గనుక, శరదాంశతమ్= నూఱేండ్లపాటు, జీవ= జీవించుము.

11. విజయనగరసంస్థానమున ననంతరావను దుబాసియుండెను. ఏదో పనియుండి మంగళేశ్వరశాస్త్రు లాయనదగ్గఱ కేఁగెను. కుమారసంభవము చదువుచున్న శిష్యుఁడు వెంటనుండెను. అనంతరావుగారు పండితులచేఁ బొగడించుకొనఁ గోరికకలవాఁడని యీయన యెఱిగెను. ప్రాచీనశ్లోకములకు సందర్భానుసారముగా నానార్థములను జెప్పుచాతుర్యము మంగళేశ్వరశాస్త్రులు గారికిఁగలదని విని యనంతరావుగారును గోరిరి. ఏదేని శ్లోకమునకు వింతయర్థమును సెలవిండని:– మంగళేశ్వరశాస్త్రులును వెంటనున్న శిష్యుడు చదువుచున్న కుమారసంభవశ్లోకము నెత్తుకొని యర్థముచెప్పెను.

శ్లో॥ అనంతరత్న ప్రభవస్యయస్య ।
హిమన్న సౌభాగ్యవిలోపిజాతమ్ ।
ఏకోహిదోషో గుణసన్నిపాతే
నిమజ్జతీందోః కిరణేష్వివాంకః

అర్థమిది: హే అనంతరత్న = రత్నమువంటి ఓ యనంతరాయా! హి= ఎందువలన, జాతమ్= (నీ యొక్క) పుట్టుక, మన్న సౌభాగ్య విలోపి= నా (మంగళేశ్వరశాస్త్రుల) యిబ్బందిని తీర్చునది (నఞర్థక న శబ్దముతోసుప్సుపా, అన్న విధినే సమానము) యైనదో, అందువలన, అయస్య= శుభకర్మమునకు, ప్రభవసి = తగుచున్నావు(కాని) ఏకః = ఒక్కటి, అహిదోషః = సర్పదోషము, (కలదు) అనఁగా సర్పమునకు రెండునాల్కలుండును. అట్లే, నీవు రెండుభాషలాడుదువు. (దుబాసి, ద్విభాషి), ఇది, గుణసన్నిపాతే= గుణసమూహమున, నిమజ్జతి = మునుగుచున్నది. ఇందోఃకిరణేషు = చంద్రకిరణములందు, అంక ఇవ, కళంకమువలె:–

12. మంగళేశ్వరశాస్త్రులుగారు జగనాథస్వామిని సేవింపఁగోరి యొకతూరి పూరి (జగన్నాథక్షేత్రము) కరిగిరట! పాండిత్య ప్రఖ్యాతిని విని యక్కడి యోఢ్రవిద్వాంసులు వీరిని దర్శింప నరుగుదెంచిరి. అప్పు డీయన మంచి నిడువును వెడలుపునుగల మఱ్ఱియాకులను గోసికొనివచ్చి విస్తళ్లు కుట్టుచుండెను. జగన్నాథక్షేత్రమున కరిగినవా రెవరును మఱ్ఱియాకువిస్తరిలో భుజింపరు. అక్కడికి వెళ్లి వచ్చిన తర్వాతఁగూడ భుజింపరనఁగా నక్కడనున్నప్పుడది యత్యంతము నిషిద్ధమే యగునుగదా! ఈ కారణముచే నా క్షేత్రమున మఱ్ఱిచెట్లు చక్కఁగాఁ బెరిఁగి మంచియాకులతో నుండును. విలక్షణప్రతిభగలవాఁడగుటచే నీయన యా యాకులను కోసికొనివచ్చి విస్తళ్లు కుట్టనారంభించెను. ఆ యోఢ్రపండితులది చూచి శాస్త్రులుగారి నాక్షేపించిరి. అయ్యా! మఱ్ఱియాకులో భుజించుట నిషిద్ధము. అందును జగన్నాథ క్షేత్రమున భుజించుట యత్యంత నిషిద్ధము. అనుకరణీయమగు వర్తనముతో నుండవలసిన మీ రిట్లుచేయుట పాడికాదు – అని. శాస్త్రులుగారు మఱ్ఱియాకులో భుజించుట యేలనిషిద్ధమయ్యెనని వారి నడిగిరి. శ్రీ నారాయణమూర్తి వటపత్రశాయి. స్వామివారికి శయ్యగా నగుటచే నత్యంత పూజ్యమయిన వటపత్రమున భుజించుట నిషిద్ధమగును. ఈ క్షేత్రము స్వామివారి యవతార క్షేత్రము. ఇక్కడ భుజించుట యత్యంత నిషిద్ధము– అని వారు బదులుచెప్పిరి. శాస్త్రులుగారు వెడనవ్వునవ్వి యిట్లనిరి. “ఇట్టి యవతార క్షేత్రమున శ్రీ స్వామివారి యవతారమూర్తులనే మడమడాయించి యాహారించుచున్న మీకాయన శయ్యయైన వటపత్రమున భోజనము నిషిద్ధమాయెనా! సెబాసు!– “ఓఢ్రులు మత్స్యభుక్కులు. శ్రీనారాయణమూర్తి మత్స్యావతారము నెత్తెను. కావున మీరు శ్రీనారాయణుని యవతారమూర్తులనే యారగించువారగుదురు? శ్రీశాస్త్రులుగారి బెట్టిదపు సమాధానమునకు వారు నిట్టూర్పు పుచ్చి యూరకుండిరి.

13. అప్పుడు మంగళేశ్వరశాస్త్రులుగారు శ్రీ జగన్నాథస్వామివారి ప్రసాదమును స్వీకరింపలేదట! అక్కడి ప్రసాదము మంగళ్ల యెంగిళ్లతోఁ గలయుచుండునని గర్హించిరట! ఆ కారణమున వారి కప్పుడంధత్వము వచ్చినదట!” జగన్నాథస్వామీ నయనపథగామీ భవతు మే” అను మకుటముగల ప్రఖ్యాతమయిన జగన్నాథాష్టక మప్పుడు మంగళేశ్వరశాస్త్రులుగారు రచించి స్వామిని ప్రార్థింపఁగా మరల కన్నులు వచ్చెనట! ఇట్టి ప్రతీతి

విశాఖపట్టణ మండలమందున్నది. ఈ యష్టకము శ్రీ జగద్గురు శంకరాచార్య రచితముగా నితరదేశములందుఁ బ్రఖ్యాతి కలదు.

14. మంగళేశ్వరశాస్త్రులుగారి నొకప్పు డధికారగర్వితుఁడగు నొక యభ్యున్నతుఁడు చేయెత్తక "నమస్కారమండీ' యనెనట. శాస్త్రులుగారు "దీర్ఘ మయురస్తు" అని యాశీర్వదించిరి. దీర్ఘమ్- ఆయుః-అస్తు. అనియు, దీర్ఘ మాయుః- అస్తు అనియు నిక్కడ రెండుదెఱఁగుల ఛేదముకల్గును. మొదటి విధమునకు దీర్ఘాయుష్మంతుడవగుమని యర్థము. రెండవవిధమునకు నీకు గొప్ప పైత్యము కల్గుఁగాక యనియర్థము. శాస్త్రులుగారి శబ్దోచ్చారణము ద్వితీయార్థ స్ఫోరకముగానే యుండెను.

15. అట్లే మఱొకప్పు డొకయుద్యోగి యీయన గుమ్మముదాఁటి లోనికిఁ బోవుచుండఁగాఁ బరిహాసపూర్వకముగా 'దండాలండీ' అనెనట! మాటాడక శాస్త్రులుగారు లోనికరిగి కొంతసేపటికిఁదిరిగివచ్చిరి. ఆ యుద్యోగి యడిగెను. "శాస్త్రులుగారూ! మీరు విశేషజ్ఞులు. నమస్కరించినప్పుడు ప్రత్యభివాదము చేయవలదా."యని. కోపముచిప్పిలఁగాఁనీతఁడిట్లు బదులుచెప్పెను. అయ్యా! మీరు గుమ్మమున కావలనొకకాలు, ఈవలనొకకాలు నుండఁగా నడుమ నమస్కరించితిరి. దానికి నేనేమి ప్రత్యభివాదముచేయుదును! ఇందు జుగుప్సితమగు నర్థమున్నది. ఇట్టిదే యింకొకటి.

16. మంగళేశ్వర శాస్త్రులుగారు కుమార్తె నత్తవారింటికిఁ బంపవలసి యుండెను. ఈ సందర్భము విని బొబ్బిలిరాజుగారు వారిని సత్కరింపవలసి నదిగా రాజపురుషుని కాజ్ఞాపించిరి. రాజాజ్ఞానుసార మాతఁడేదో యీయ వలసినది యిచ్చి పంపక వీరిని వికటముగాఁ బ్రశ్నించెను. అయ్యా! మీరు కుమార్తె నత్తవారింటికిఁ బంపునప్పు డేమి పెట్టి పంపెదరండీ? అని. ఈయన బదులు, 'చిత్తము! మేము బీదబ్రాహ్మణులము! ఏమున్నది! ఇంత పసుపు కుంకుమ చీర రవిక యిచ్చి పంపెదము. తమవలె మేమేమి రాజాశ్రయ సంపన్నులమా? వేలుపెట్టి పంపుటకు!'

17. నరసరాజును నాతనిమీదఁ జెప్పిన శ్లోకము : - శ్లో. యాగక్రియార్థం ఖలు వృక్షరాజో వర్ణక్రియార్థంఖలుభృంగరాజః. తులా క్రియార్థంఖలు విట్టరాజో నకించిదర్థం భువినర్సరాజః.

18. దక్షిణామూర్తి విగ్రహమును స్వర్ణకారుఁడు హరింపఁగాఁ జెప్పినది :-

శ్లో. 'భూత్వా పౌల్కసకాత్ ప్రపద్య రజకా నాభాష్యపౌరాణికాన్'
గాన స్థానముపేత్య చాశుకరణానాలింగ్య నత్వా కవీన్
'వేశ్యాసద్మని సంప్రవిశ్యచగతా వైద్యస్య పాణిగ్రహం'
భూయోహంత సువర్ణ కారసదనే సానంద మాస్తేమృషా.

19. "తక్రం శక్రస్యదుర్లభమ్" సమస్యాపూర్తి "ఆక్రత్యంగం యతస్తక్రం శక్రేణ నహుతంపురా, నాదత్తమితి వాక్యార్థాత్తక్రంశక్రస్యదుర్లభమ్."

20. ఈయనకు వైష్ణవులన్నను దురుష్కులన్నను బహువిద్వేషము. ఈ యిరుదెగలవారిని బరిహసించుచు 'సన్నతీసున్నతీయ' మని పండ్రెండువేల సంఖ్యగల గ్రంథము నీయన రచియించెనట! అందు మూఁడువేలు శ్లోకములట! మూఁడువేలు వేదవాక్యములట! మూడువేలు ఖొరానువాక్యములట, వైష్ణవ తురుష్కనిందాపరముగాఁ బయివాని కర్థము కూర్చుటకయి మూడువేలు వ్యాకరణవాక్యములట! పాపము! ప్రతిభ నెంతపనికిమాలిన పనికై వినియోగించి పాడుచేసికొనియెనో వినుఁడు! ఇందొక్క యక్షరమేని లోకమున కక్కరకు వచ్చునా? పరిహాసార్థ మిందలి శ్లోకములను గొందఱు చదువుచుందురు. ఉదాహరింపరాని శ్లోకములు:- ఒక్కటి మాత్రము వ్రాయుచున్నాను. వైకుంఠై కాదశినాఁడు విష్ణ్వాలయములందు దోసెలు పంచిపెట్టుదురు. ఆ దోసెల పంపకమునకు వైష్ణవస్వాములు వింతగాఁ దగవులాడుకొనుటను జూచి జెప్పిన శ్లోకము.

శ్లో. దోశలేశాశయా కేచి త్త్రీకశవత్త్రైశవాజనాః,
కేశవస్య సమీపేతు కేశాకేశివితన్వతే.

చమత్కారముగలవయినను నిందా కలుషితములగుటచే మఱి కొన్ని శ్లోకములనుదాహరింపజాలకున్నాడను.

21. బూతు సామెతలను దృష్టాంతముగా బెట్టి యీతడు "లౌకిక దృష్టాంత మంజరి" యని యొక గ్రంథము రచించెను. కొన్ని శ్లోకములు సేకరించితిని. ఉదాహరింపరానివి.

(వ్యాసము రెండు భాగములుగా ., త్రిలిఙ్గ : నవంబరు, 25;
డిసెంబరు 23-1922)

జయంతి కామేశముపంతులుగారు

పుణ్యశ్లోకులయిన కామేశముపంతులుగారి చరిత్రమును శ్రీ శివల సుబ్బారావుపంతులుగారు సారస్వతానుబంధములో ప్రకటించిరి. అది నాకు మిక్కిలి ఆనందము కూర్చినది. విశాఖపట్టణము జిల్లాలో కామేశము పంతులుగారి కీర్తిని పలువురు కీర్తించుచుండగా వింటిని. ప్రకటింపవలసిన దనుకొంటిని. ఇప్పుడు సారస్వతానుబంధముతో శ్రీ సుబ్బారావుపంతులుగారు ప్రకటించిన విషయములు గాక, నేను విన్న కథలను కొన్ని వ్రాయుచున్నాను.

పంతులుగారు నిత్యాన్నదానవ్రతులుగదా! బొబ్బట్లతో జరిగిన యొకనాటి సంతర్పణమున, వంటవాడు సాయంకాల మింటికి పోవుచు పెద్ద పళ్లెరము నిండుగా బొబ్బట్లను పెట్టుకొనిపోయినాడట! కామేశముపంతులుగారి తల్లి దానిని చూచెను. రాత్రి కుమారుని దగ్గరకు వచ్చి "నాయనా! నీ యన్న ప్రదానములకు సంతర్పణములకు సంతోషమేకాని దొంగతనముల క్రిందకూడ సొమ్ము నాశనమగుట చూడలేకున్నాను. నీవేమి విచారించవుగదా!" అనెను. కుమారు "డేమిటి అది" అని అడిగెను.

నేడు వంటవాడు కొన్నివందల బొబ్బట్లు పళ్లెమునిండుగా పెట్టుకొని ఎత్తుకొనిపోయినాడు. సంతర్పణలో పదిమంది భోజనము చేసిన తృప్తిగాని యిటువంటిదికూడ జరుగుచున్నచో నిబ్బరించుట కష్టముగాదా" అనెను. అది విని పంతులుగారు "సరే, అమ్మా! ప్రొద్దునరానీ వానిని చీవాట్లు పెట్టుదును. నీవు విచారపడకు" మన్నారు.

ఉదయము వీధిఅరుగుమీద పంతులుగారు పలుదోముకొనుచు వంటవాని రాకచూచి తల్లిని పిలిచి తల్లియెదుట వానిని విచారించిరి. "ఏమిరా! నిన్న సాయంకాలము బొబ్బట్ల పళ్ళెము పట్టుకొనిపోయినావట నిజమేనా?" అని. అతడు యింట్లో పిల్లలకని తీసుకొనివెళ్ళినాననెను. "పనికిమాలినవాడా! నీకేమి బుద్ధి లేదా? పొడిబొబ్బట్లు తింటే కడుపునొప్పి వస్తుందని యెరగవా, శీఘ్రముగా లోపలికిపోయి జారీచెంబునిండా నెయ్యి తీసికొనిపో, వెంటనే తీసుకుపో. వెంటనే పో. ఈలోగా పసిపిల్లలు ఇంటిదగ్గర తింటారేమో!

ఆపైన బాధపడతారు." అని చీవాట్లుపెట్టి నేతిజారీ యిచ్చి వెంటనే యింటికి పంపిరి! "అమ్మా! సంతర్పణలు చేయుట సంతోషమేనంటివిగదా! ఇదేమను కొన్నావు? పెంటమీద పారవేయడ మనుకొన్నావా? మఱియెప్పుడు నిట్టివానిని గూర్చి నీవు విచారము పెట్టుకొనకు, నీ చేతనైతే నీవుకూడ ఎవరికైన నింత పెట్టుచుండుము. గృహనిర్వాహ భారము నా మీదనున్నది. నీకెందుకులే ఈ చింత" అని మందలించిరట.

కామేశం పంతులుగారు మంచి భోజనపుష్టి కలవారు. గుమాస్తాచేత చదివించుటేకాని రికార్డు సాధారణముగా స్వయముగా వారు చూచుట ఉండేది కాదట. పెద్దచావడిలో రికార్డు వింటూ ఈ మూలనుండి ఆ మూలకు పచార్లు చేస్తూ దండెములకు రెండు చక్రకేళీ యరటిపండ్లగెలలు వ్రేలుచుండ నిటువచ్చి నప్పు డీ గెలలోని దొకపండు అటుపోయినప్పు డాగెలలోని దొకపండు ఆరగించుచు రెండు గెలలను కడతేర్చుట నొకనాడొక పెద్దమనుష్యుడు చూచి యచ్చెరువు చెందినాడట!

కామేశము పంతులుగా రొకనాఁడు భక్ష్యభోజ్యములతో విందారగించి, బరంపురంనుండి శ్రీకాకుళమునకుఁగాబోలును మేనా సవారీమీద ప్రయాణమై వచ్చుచుండిరట. త్రోవలో ఎండలో వారికి హెచ్చుగా దప్పిపుట్టెను. అది యడవిపట్టుగా నుండెను. మంచినీరు కానరాలేదు. సంకటపడుచున్నారు. త్రోవలో నెదురుగా నొక బ్రాహ్మణుడు కానవచ్చెను. ఆయనను పిల్చి "ఎవ్వరవు ఎక్కడికి వెళ్ళుచున్నా"వని పంతులుగారడిగిరి. "అయ్యా! మాది ఫలాని గ్రామము నా కుమారునికి ఉపనయనము జరుగవలసియున్నది. నేను బీదవాడను. కామేశంపంతులుగారను మహాధర్మాత్ములు బరంపురములోనున్నారని విన్నాను. వారేమయిన సహాయము చేయుదురేమో దానితో ఉపనయనము జరుపుకొందు మని యాచింప బోవుచున్నాను." అనెను. "వెళ్ళుదువుగాని నేను మిక్కిలి దప్పిగొనియున్నాను ఈ చెంబునిండ మంచితీర్థము తెచ్చిపెట్టగలవా? పుణ్యము కల్గును." అని పంతులుగారనిరట. ఆ బ్రాహ్మణు డాసవారీబోయీలను, బిళ్ళబంట్రోతులను వారి ప్రాభవమునుచూచి ఎవరో గొప్పయుద్యోగి యనుకొని వారి దగ్గరనున్న పెద్దచెంబును తీసికొనిపోయి, ఆ చుట్టుపట్టుల నెక్కడనో

ఉన్న బావినుండి చెంబునిండుగా తియ్యని చల్లని మంచినీరు కొనివచ్చి యిచ్చెనట. పంతులుగారా చెంబుడు నీరుత్రాగి తృప్తిచెంది "బ్రాహ్మణుడా! బ్రతికించితివయ్యా! కాని పాపము నీవు వెళ్లి లాభములేదు కామేశంపంతు లాగ్రామమున నిప్పుడు లేదు. మరల నింకొకతూరిపోయి చూతువుగాని, యీ సారికి దీనిని తీసికొని పొమ్మని చెప్పి సవారిలో తలగడ క్రింద రాశిగాఁ బోసియున్న రూపాయల నా పెద్దచెంబు నిండ నింపి చేతికిచ్చి "నీ విచ్చిన మంచినీటి విలువ దీనికంటె హెచ్చుసుమా! కొనిపొమ్ము" అనిరట. బ్రాహ్మణుడు ఆశ్చర్యము పొందెను. ఆ చెంబులోని రూపాయలు అయిదాఱువందలకు తక్కువ యుండవట. పరమానందభరితుడై బ్రాహ్మణుడు "వెదకబోయిన తీగ కాలదగిలెను. మీరేనా? కామేశంపంతులుగారు! మహానుభావా! మహాదాతవయ్యా! దొడ్డ ప్రభువువయ్యా" అని కైవారము చేయుచు మళ్లీ తన గ్రామమునకు వెళ్ళెను.

భాష్యమయ్యంగా రొక పక్షమందయినచో రెండవపక్షమందనంతాచార్యులు గారుండవలసినదే అని హైకోర్టువకీళ్ళలో నఖండయశమును గాంచినవారు, ఆంధ్రభాషాభిమానులు నగు పనప్పాకము అనంతాచార్యులుగారును, జయంతి కామేశము పంతులుగారును మదరాసులో సహపాఠులుగా నుండిరట. అనంతా చార్యులుగారినే కొందఱానందాచార్యులుగారని పేర్కొందురు. అనంతాచార్యులు గారయిదాఱు మాసములకు వైకుంఠవాసులగుదురనగా నేను మదరాసుకు వచ్చి వారి వాత్సల్యమునకు బాత్రమైతిని. కామేశముపంతులుగారి మహనీయ తను వారు పలుమారులు ప్రశంసించుచుండెడివారు. ఇప్పుడు సంస్మరింపఁ గల్గిన దిది యొక్కటి.

ఒక వ్యాజ్యము తరపున అనంతాచార్యులుగారు విశాఖపట్టణమో బరంపురమో వెళ్ళిరట. అదే తొలితూరి వారాదేశమున కరగుట. బాలసఖుడగు కామేశంపంతులుగారింటనే వారుండిరి. దాక్షిణాత్యులు బహిర్దేశమునకు వెళ్ళునప్పుడు చెంబువెంటగొనిపోవు నలవాటు లేదు. కావున అనంతాచార్యులు గారానాడు సాయంకాలము ఊరి వెలుపలి కరిగి, అక్కడ నొక ముసలియాడుది కానరాగా, "ఇక్కడ నెక్కడైన నొక గుంటను చూపుతావా? పోవలెను." అని

అడిగిరట. ఆ ముసలిది నీ జిమ్మడ! నీ కేమి పోగాలము వచ్చినదో నన్ను గుంటను చూపుమంటావా" అని తిట్టుచు మొగాన మొటికెలు విరుచుచు తొలగిపోయెనట. అవమానము చెంది యనంతాచార్యులుగారింటికి వచ్చిరి. కాని కామేశముగారితో దీనిని జెప్పలేదు. వ్యవహారము ముగిసిన తరువాత ప్రయాణమునాడు కామేశముపంతులుగారి తండ్రిగారు అనంతాచార్యులుగారిని సంభావించుటలో నిట్లనిరట "అయ్యా! మా గుంటడు మీ సహవాసముచేత నీ మాత్రము వ్యాప్తిలోనికి రాగల్గినాడు." అనంతాచార్యులుగారి మనసు అన్యత్ర ఉన్నట్లు కన్పట్టెను. బదులు సరిగా చెప్పలేదు. "ఏమో యోచించుచుంటి రేమి?" అని వారనిరి తనకు జరిగిన పరాభవము చెప్పిరట. అందరు నవ్విరి.

అపర గౌతములని ప్రసిద్ధిగాంచిన శ్రీపాద రామశాస్త్రులవారు వీరి సహాయముచే బొబ్బిలియందు వేదాంతశాస్త్రాభ్యాసము నొనరించిరట.

(వ్యాసము
ఆంధ్రపత్రిక- సారస్వతానుబంధము 30, 1924
రక్తాక్షి, చైత్ర బ॥ 30, శనివారం)

ఆనందగజపతి బాల్యంలో

మహామహోపాధ్యాయులు, శాస్త్రరత్నాకరులు శ్రీ తాతా సుబ్బరాయశాస్త్రి గారు శిథిలమయిన యన్నమయకోశమును వీడనాడినను విజ్ఞానమయకోశమున దివ్యానుభూతితో వెలయుచున్నారన్న తనివి నాకుఁగలదు. ఇహమున ఆంధ్ర దేశమునకు వారి వియోగమువలని కొఱఁత గొప్పది. వారి ప్రతిభాధార సునిశిత! ఎంత లోఁతయిన, చిక్కయిన శాస్త్రవిషయముననను, శాస్త్రవిషయముననే కాదు వ్యవహారవిషయమే యయినను, విషయసాకల్యము నొక్కతూరి యామూలాగ్ర ముగా నాకలనమునకుఁ దెచ్చుకొని యల్లంతలో నిశ్చలమయిన సిద్ధాంతమును నిర్ణయించి తెలుఁపగలనేర్పు వారికుండెడిది! అంతటినేర్పు నే నితరపండితులకడఁ జూచి యెఱుఁగను. వారితోడి యిష్టాగోష్ఠులలో నేను విన్న వేడుకవిషయమిది.

ఆనందగజపతి

ఆనందగజపతిరాజునకు లింగం లక్ష్మాజీరావుపంతులుగారను మహాప్రతిభా శాలి విద్యాగురువట! ఆయనకుఁ గొన్నివందల రూప్యముల వేతనమేర్పరచి యానందగజపతికిఁజదువు చెప్పించుచుండిరి. ఆనందగజపతి పసిబాలుఁడు. ఆటలమరగి చదువు నుజ్జగించుచుండెను. కొన్ని నెల లాయానందుని వేడుక నీ యుపాధ్యాయుడు సాగనిచ్చెను. క్రమముగాఁ జదువు చెప్ప సాగించెను. శిష్యుఁడు చదువు లక్ష్యము చేయఁడయ్యెను. గురువు నయమునఁ గొంత జతనము సల్పెను, ఫలింపలేదు. భయమున జెప్పసాధ్యముగాదు. ఏమితోఁచనివాఁడువోలె నొకనాఁడా బాలశిష్యుని బుజ్జగించుచు దగ్గఱనుంచుకొని లక్ష్మాజీరావు పంతులు జొటజొటఁ గన్నుల నీరు కార్పసాగెనట! ఆనందగజపతి దుఃఖాక్రాంతుడై 'యేల యిట్లు దుఃఖించెదరు? మీ యింట నేమి యిబ్బంది కలిగినది? మీ కేమేని కొఱఁత వాటిల్లినదా? దుఃఖించెదరేల? మీ యిక్కట్టు నా చేతనగునేని తొలఁగింపఁజూచెదను. సెలవిండు' అని వేఁడెనట! లక్ష్మాజీరావు పంతులుగారు 'భవిష్యన్మహారాజా! మీ తండ్రిగారి దయవలన నా కిప్పటికేమియు కొఱఁతలేదు. మీకు చదువు చెప్పుచుంటినని నాకు మీ తండ్రిగారు చాలినంత వేతన మిచ్చుచున్నారు. కాన వస్తువాహనాదుల కిప్పటి కే కొఱతయును లేదు. ఇంట నందఱును సుఖులే! ఒక్కటే గొప్పచిక్కు' అనిరట!

శిష్యుఁడు 'ఆ చిక్కేదో నేను దీర్చఁగల్గుదునేని తీర్చెదను. సెలవిండు' అనెనట! లక్ష్మాజీరావు పంతులుగారిట్లనిరి. 'రాచగున్నా! మీకు చాల సామర్థ్యముతో నేను చదువు చెప్పుచుంటినని మహారాజులుగారు, మీ తండ్రిగారు సంతోషించు చున్నారు. నాకు వలసిన వస్తువాహనాదుల ననుగ్రహించుచున్నారు. మీ రేమీ చదువుకొనకుంటిరి. ఎన్నాళ్ళిట్లు సాగును? కొన్నాళ్ళ తర్వాతయినను మీకు చదువు సరిగా సాగకుండుట మహారాజులుంగారు గుర్తింపఁగల్గుదురు. మీరు చదివినను జదువకున్నను నేఁడు మీరు కుమార మహారాజులుంగారగుట, మహారాజులుంగారి యనంతరము మహారాజులుంగారే యగుట యనివార్యము. మీరట్లు పెట్టిపుట్టితిరి! కాన మీకే కొఱఁతయు నుండదు, గాని నాకు మాత్రమే బ్రతుకుతెరువు తొలఁగును. అందుకని దుఃఖించుచున్నా' ననెనట! అది విని యానందగజపతి 'నేను కారణముగా మీకు కొఱఁతకలుగుటా! ఇఁక నా తీరు తిలకింతురుగాక!' యని యా క్షణమాదిగా నెడతెగక విద్య నభ్యసింప సాగెనట! లక్ష్మాజీరావు పంతులుగా రానందగజపతిని దనకుఁదగిన శిష్యునిగా దిద్దుకొనిరి. లక్ష్మాజీరావుపంతులుగారు సంస్కృతమునందుఁగూడ మహావిద్వాం సులు. ఆయన కథ మరొకప్పుడు–

(వ్యాసము
ఆంధ్రపత్రిక
29-10-1944)

క్షేత్రయ అక్షరాక్షరమును పరమప్రమాణమే

1907 సంవత్సరమున మదరాసులో నేను శ్రీ పనప్పాకం అనంతాచార్యులు గారి వాత్సల్యమునకు పాల్పడినాను. పండిత గోపాలాచార్లుగారు నన్ను వారి కెఱుకపరిచినారు. వారికి శ్రీనివాసాచార్యులుగారని బి.ఎ.బి.ఎల్. కుమారుడు. ఆయన తెల్గుకవిత నేర్చినవాఁడు. తండ్రి అనంతాచార్యులుగారు, విద్యావినోద, విశారద బిరుదాంకితుఁడు. అంతకు పూర్వము ఒకప్రక్క భాష్యమయంగారుంటే ఇంకో ప్రక్క వీరు అనంతప్రఖ్యాతి గలవారు అనంతాచార్యులుగారు. వక్కీలు వృత్తిలో ఆయన ఒకతూరి కాంగ్రెసు ప్రసిడెంటు, తన పేరు 'అనంతాచార్లు' అని దస్కతు చేసేవారు. ఎందుకంటే అది తెలుగుపలుకుబడి గుర్తు అని ఆయన అనగా నేను విన్నాను. ఆయన బడి చొప్పుననే గోపాలాచార్యులుగారు కూడా 'చార్లు' అని దస్కతు చేసేవారు. అనంతాచార్లుగారికి గోపాలాచార్లుగారి మీద చాలప్రీతి. అనంతాచార్లుగారికి తెలుగువారంటేనే చాలప్రీతి. విద్వాన్ అభినవపండితరాయ బిరుదాంకితులగు మాడభూషి వేంకటాచార్యులుగారికీ – అనంతాచార్యులుగారికీ చాలమైత్రి. వేంకటాచార్యులుగారు అనంతా చార్యులుగారి ప్రేరణమున భరతాభ్యుదయము, హంససందేశము, పుష్పబాణ విలాసము మొదలయిన గ్రంథములు రచించినారు. అనంతాచార్యులు గారెప్పుడూ ఆంధ్రపండితగోష్ఠిలో ఉండేవారు. నేను మద్రాసు వెళ్లిన తర్వాత వారు వైకుంఠవాసులయ్యేంతవరకూ వారానికి నాలుగైదు రోజులయినా నేను వారియింటికి వెళ్ళేవాఁడను. భారతమంటే వారికి పరమప్రీతి. భారతమును గూర్చి వా రింగ్లీషులో ఒక పుస్తకమును రచించినారు. నన్ను దగ్గఱ పెట్టుకొని తిక్కనభారతము పద్యములనుగూర్చి చిన్ననాటినుండీ పండితగోష్ఠిలో వారు విన్న విశేషములు మొదలయినవి నాతో చెప్పుతూ, నాచే ఆయా పట్టుల కర్థము చెప్పిస్తూ నేను చెప్పినవానిలో గుణవంతములుగా తోచిన వాటికి మెచ్చుకుంటూ వాటిని కుమారునికీ, గోపాలాచార్లుగారికీ, అప్పుడప్పుడు చెప్పుతూ నాకు చాలా ప్రోత్సాహము గొల్పుతూ ఉండేవారు. ఇంగ్లీషు నాకు నేర్పగోరి కొన్ని పుస్తకములు కొనియిచ్చినారు. నన్ను తమయింటి నుండి తిరువల్లిక్కేణి బీచిదాకా కోచిలో తోడ్కొనివస్తూ ఇంగ్లీషు నేర్పుతూ ఉండేవారు. షేక్స్పియరు 'ఒథెల్లో' వారు తెనిగించిరి. అప్పుడు అందులో మంచిపట్టులు

కొన్ని నాచే పద్యరూపముగా మార్పించిరి. కాని దాని ముద్రణము జరగక ముందే వారు గతించిరి. అది యేమయ్యెనో! వారి కుమారుడు శ్రీనివాసా చార్యులుగారు పుట్టిననాఁడు వారియింట మాడభూషి వేంకటాచార్యులు గారుండిరట! తదాది ఆ కుమారుని పుట్టినదినపు బండుగునాడు ఏటేటా ఒక్కొక తెలుగుపండితుని భోజనమునకు బిలిచి సత్కరించుట యలవాటట! నేను మద్రాసు వెళ్ళిన యా వత్సరమున నన్ను భోజనమునకు రమ్మనిరి. అప్పటికి నేను వైష్ణవులయింట భుజించి యెఱుగను. దాక్షిణాత్యులభోజనపద్ధతి యసలే యెఱుగను. వెఱచితిని. ఆయనయు వారి ధర్మపత్నియు నన్ను బుజ్జగించి, తప్పక రాగోరిరి. నాకప్పటికి పందొమ్మిదేండ్ల వయసు. మర్నాడు తెల్లవారగానే బండిపంపి నన్ను రప్పించు కొనిరి. అభ్యంగస్నానము చేయించి క్రొత్తవస్త్రములిచ్చి తాల్పించిరి. మడికట్టు కొనవలెనని తంటాలుపడితిని కాని క్రొత్తవస్త్రములు మడియే., దాక్షిణాత్య పద్ధతిని వేఠే మడిబట్ట అక్కర లేదనిరి. చీకాకుపడితిని. పట్టుబట్ట కట్టుకొందు నంటిని. సాగలేదు. భోజనమున కుపక్రమించితిమి. అన్నము చాల కొంచెముగా, ఇతరపదార్థము లేవేవో విస్తరి నిండుగా నుండెను. వారు తమ భోజన ప్రక్రియ ననుసరింపు మనిరి. ఘృతప్లుతి, తెలుగువారికి నేయెక్కువ కావలెనని, ఎట్లో అధికభోజనశ్రమమునకు పాల్పడితిని. రెండుగంటలవేళ మరల నేదో లఘ్వాహారము. ఆనాడే 'నేంద్రము' అని పేరుగల మలయాళపు టనటిపంటిని నే నెఱిగినది. కోచిమీద నింటికి పంపిరి. మర్నాడు నేను వారింటికి వెళ్ళలేదు. అనారోగ్యము కలిగెనేమో అలవాటులేని భోజనపుతీరు వలననని దంపతులు నన్ను మూడవనాటి ప్రొద్దుట చూడవచ్చిరి. నేను కంగారుపడితిని. తదాది వారితోను, వారి పుత్రులతోను వారి కుటుంబములోనివాడనుగానే వర్తిల్లెడివాడను. అనంతాచార్యులుగారు శ్రీచిన్నయసూరిగారి నెఱుగుదురు. గాజుల లక్ష్మీనరసుసెట్టిగారు ప్రాపున చిన్నయసూరిగారు గొప్ప గౌరవము గలిగి యుండెడివారనియు, ఆ గుల్బము తెల్లనియంగరకా తాల్చి, వినిర్మలాకృతితో తేజస్వంతులై చిన్నయసూరిగారు లక్ష్మీనరసుసెట్టిగారి యింట నొకగదిలో నెల్లప్పుడును ప్రాచీనతాళపత్రగ్రంథ పరిశీలన జరుపుచుండు వారనియు, ప్రతిదినము కొన్ని యపూర్వాంశములను భాషావిషయమున గుర్తించినగానీ

వారు భోజనమునకు లేచెడివారు కారట యనియు, తెల్గుననే కాక సంస్కృతమునను వారు గొప్ప పండితులని యానాటి ప్రౌఢవిద్వాంసు లందరు వారినెంతో గౌరవించెడివారనియు, తెలుగుభాషలో, ఆ కాలమున దక్షిణదేశమున, సాత్తనివైష్ణవులే మహావిద్వాంసులుగా నుండెడివారనియు, చిన్నయసూరిగారివంటి విద్వాంసు లింక నెందఱో సాత్తని వైష్ణవులానాడు వర్తిల్లి రనియు ననంతాచార్యులుగారనెడివారు. చిన్నయసూరిగారి మేనల్లుడు కాబోలును మనవాళయ్యగారు అనంతాచార్యులుగారికి మిత్రులు. అనంతాచార్యులుగారి 'మంజువాణీవిజయము'ను మనవాళయ్యగారు సంస్కరించిరట. అనంతాచార్యులుగారు మదరాసులో నుండునపుడు (వారు వైస్రాయి కౌన్సిలు మెంబరుగా కలకత్తాలో కొన్నాళ్లుండిరి) ప్రతి యాదివారము మదరాసులోని యాంధ్రపండితులు వారి యింటికి వచ్చి విద్యాగోష్ఠి నెఱపెడివారట. ఒకనాడు శబ్దరత్నాకరకారులను కొక్కొండ వెంకటరత్నముపంతులు గారాక్షేపించిరట. "మీ నిఘంటువున క్షేత్రయపదములనుగూడ ప్రమాణముగా గ్రహించిరి. 'రాతాయ' (అయె అనుటకు) పోయ (పోయెన్ అనుటకు) అని యాతని పదములలో ప్రయోగములుకూడ మీకు పరిగ్రాహ్యములయినపుడు మీ నిఘంటువునకు ప్రామాణ్యము సిద్ధింపదు" అని. సీతారామాచార్యులుగారు వేశ్యాభినయాద్యభిరుచి హెచ్చుగా గలవారట! క్షేత్రయపదములను వేశ్య లభినయించుట వారభినందించుట, పరిపాటి యట! "క్షేత్రయ ప్రామాణికు డయిన సత్కవి కాకపోతే, ఆంధ్రమున నిక సత్కవి యుండడు. క్షేత్రయరచనము అక్షరాక్షరమును పరమప్రమాణమే. పోయ, ఆయ, ఇత్యాదులు పంచతంత్ర కారుదును ప్రయోగించినాడు. మీకు క్షేత్రయరచనము గ్రాహ్యము కాకపో వచ్చును. లోకమున సహృదయత యంతరించిపోదు. నా నిఘంటువు నాదరించువా రుండకపోరు." అనిరట! అనంతాచార్యులుగారును వేశ్యాభినయ రసికులు. వారెందఱనో వేశ్యలను క్షేత్రయపదముల నభినయించువారినిగా జేసిరట! పండిత గోపాలచార్యులుగారి మేడమీద నా యేడు నవరాత్రములలో గానసభలు జరిగినవి. ఆ సభలకు అనంతాచార్యులుగారు ప్రసిడెంటు– తొమ్మిదినాళ్లును స్త్రీలే గాయనులు – పురుషులపాటలందు లేవు. ఆ కచ్చేరీలకు పొన్నూరినుండి ఆంధ్రగాయకరత్నము రామసుబ్బయ్యగారును వచ్చి యుండిరి.

కాని వారి పాటకచ్చేరీ లేదు. అనంతాచార్యులుగారు నన్ను, రామసుబ్బయ్య గారిని, తమ కుమారుని ఆ కచ్చేరీలకు తోడ్కొనిపోయెడివారు. మాకు టిక్కెట్టులేదు. తొమ్మిదిరోజుల పాటకచ్చేరీలలోనూ క్షేత్రయపదములను గొందఱు వేశ్యలచేఁ బాడించిరి. ఒక వేశ్య క్షేత్రయపదమును సాభినయముగా పాడెను. నాకు క్షేత్రయపదముల గానాభినయఘనత నాటికి నేటికికూడ నపరిచితమే. కాని కొన్ని నెలలక్రింద, శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు, సీతారామాచార్యులుగారు ప్రస్తుతించినట్టుగానే, క్షేత్రయను ప్రస్తుతించిరి! సీతారామాచార్యులుగారన్న విషయమును శర్మగా రెఱిగియుండరనుకొంటాను. క్షేత్రయ ఘనతను తార్కాణించుటకై యిది పేర్కొన్నాను.

అనంతాచార్యులుగారికి జయంతి కామేశముగారని – గంజాము, విశాఖ పట్టణము జిల్లాలకు అద్వితీయుడయిన వక్కీలు– సహాధ్యాయి. ఆయన మద్రాసులో చదువుకొనేటప్పుడు అనంతాచార్యులుగారి యింట నుండెడివారట! ఇద్దరును ప్రాణమిత్రులు. కామేశముగారును కవిత నేర్చినవారు. వారి శతకము లను అనంతాచార్యులుగా రచ్చువేయించిరి. అనంతాచార్యులుగారు చెప్పినవి కొన్ని, నేను గంజాము విశాఖపట్టణము జిల్లాలలో గ్రామవృద్ధులవల్ల విన్నవి కొన్ని జయంతి కామేశముపంతులుగారి కథలు:–

ఒక వ్యాజ్యముతరపున అనంతాచార్యులుగారు వకీలుగా విశాఖ పట్టణమో, బరంపురమో వెళ్ళిరట! అదే తొలితూరి వా రాదేశమున కరుగుట! బాలసఖుఁడగు కామేశము పంతులుగారింటనే వారుండిరి. దాక్షిణాత్యులు బహిర్దేశమునకు వెళ్లినపుడు చెంబు వెంటఁగొనిపోవునలవాటుండదు. కావున అనంతాచార్యులుగా రానాడు సాయంకాల మూరివెలుపలి కరిగి, అక్కడ నొక ముసలియాడుది కానరాగా "ఇక్కడ నెక్కడైనా ఒకగుంటను చూపుతావా, పోవలెను" అని అడిగిరట! ఆ ముసలిది ' నీ జిమ్మడ! నీకేమి పోగాలము వచ్చినదో, నన్ను గుంటను చూపుమంటావా' అని తిట్టుచు మొగాన మెటికలు విరుచుచు తొలగిపోయెనట! అవమానముఁజెంది అనంతాచార్యులుగారింటికి వచ్చిరి. కాని కామేశముగారితో దీనిని జెప్పలేదు. వ్యవహారము ముగిసిన తర్వాత ప్రయాణమునాఁడు కామేశముపంతులుగారి తండ్రిగారు అనంతా

చార్యులుగారిని సంభావించుటలో నిట్లనిరట. "అయ్యా! మా గుంటఁడు మీ సహవాసముచేత నీమాత్రము వ్యాప్తిలోనికి రాఁగలిగినాఁడు". అనంతాచార్యులు గారి మనసు అన్యత్ర ఉన్నట్లు కన్పట్టెను. బదులు సరిగా చెప్పలేదు. 'ఏమో యోచించుచుంటి రేమి' అని వారనిరి. తనకు జరిగిన పరాభవము చెప్పిరట! అందఱు నవ్విరి.

అపరగౌతములని ప్రసిద్ధిచెందిన శ్రీపాదరామశాస్త్రులవారు వీరి సహాయముచే బొబ్బిలియందు వేదాంతశాస్త్రాభ్యాసము నొనరించిరట!

శ్రీకామేశం పంతులుగారు నిత్యాన్నదానవ్రతులు! బొబ్బట్లతో జరిగిన యొకనాటి సంతర్పణమున, వంటవాడు సాయంకాల మింటికిఁబోవుచు పెద్ద పళ్లెరమునిండుగా బొబ్బట్లను పెట్టుకొనిపోయినాడట! కామేశముపంతులుగారి తల్లి దానిని చూచెను. రాత్రి కుమారుని దగ్గరకు వచ్చి "నాయనా! నీ యన్న ప్రదానములకు, సంతర్పణలకు సంతోషమేకాని దొంగతనముల క్రిందకూడ సొమ్ము నాశనమగుట నే చూడలేకున్నాను. నీవేమి విచారించవుగదా!" అనెను. కుమారు "డేమిటి అది?" అని అడిగెను. "నేడు వంటవాడు కొన్నివందల బొబ్బట్లు పళ్లెరము నిండుగా పెట్టుకొనిపోయినాడు. సంతర్పణలో పదిమంది భోజనము చేసిన తృప్తిగాని యిటువంటిదికూడ జరుగుచున్నచో నిబ్బరించుట కష్టముగాదా!" అనెను. అది విని పంతులుగారు "సరే, అమ్మా! పొద్దునరానీ వానిని చీవాట్లు పెట్టుదును. నీవు విచారపడకు" మన్నాఁడు. ఉదయము వీధియరుగుమీద పంతులుగారు పలుదోముకొనుచు వంటవాని రాకచూచి తల్లిని పిలిచి తల్లియెదుట వానిని విచారించిరి. "ఏమిరా! నిన్న సాయంకాలము బొబ్బట్ల పళ్ళెము పట్టుకొనిపోయినావట! నిజమేనా"? అని. అతఁడు ఇంట్లో పిల్లలకని తీసుకొనివెళ్ళినాననెను. "పనికిమాలినవాడా! నీకేమి బుద్ధిలేదా! పొడిబొబ్బట్లు తింటే కడుపునొప్పి వస్తుందని యెరగవా, శీఘ్రముగా లోపలికి పోయి జారీచెంబునిండా నెయ్యి తీసుకుపో, వెంటనే పో. ఈలోగా పసిపిల్లలు ఇంటిదగ్గర తింటారేమో! ఆపైన బాధపడతారు." అని చీవాట్లుపెట్టి నేతిజారీ యిచ్చి వెంటనే యింటికిఁబంపిరి! "అమ్మా! సంతర్పణలు చేయుట సంతోషమే నంటివిగదా! ఇదేమను కొన్నావు? పెంటమీద పారవేయడ మనుకొన్నావా?

మఱియెప్పుడు నిట్టివానిని గూర్చి నీవు విచారము పెట్టుకొనకు. నీ చేతనైతే నీవుకూడ ఎవరికైన నింత పెట్టుచుండుము. గృహనిర్వాహభారము నా మీదనున్నది. నీకెందుకులే యీ చింత" అని మందలించిరట!

కామేశము పంతులుగారు మంచి భోజనపుష్టి కలవారు. గుమాస్తాచేత చదివించుటేకాని రికార్డు సాధారణముగా స్వయముగా వారు చూచుట ఉండేది కాదట! పెద్దచావడిలో రికార్డు వింటూ ఈ మూలనుండి ఆ మూలకు పచార్లు చేస్తూ దండెములకు రెండు చక్రకేళీ యరటిపండ్లగెలలు వ్రేలుచుండ నిటువచ్చి నప్పు డీ గెలలోని దొకపండు, అటుపోయినప్పు డా గెలలోని దొకపండు ఆరగించుచు రెండు గెలలను కడతేర్చుట నొకనాఁడొక పెద్దమనుష్యుడు చూచి యచ్చెరువు చెందినాఁడట!

శ్రీకామేశము పంతులుగా రొకనాఁడు భక్ష్యభోజ్యములతో విందారగించి, బరంపురమునుండి శ్రీకాకుళమునకుఁగాబోలును మేనాసవారీమీద ప్రయాణమై వచ్చుచుండిరట. త్రోవలో, ఎండలో వారికి హెచ్చుగా దప్పిపుట్టెను. అది యడవిపట్టుగా నుండెను. మంచినీరు కానరాలేదు. సంకటపడుచున్నారు. త్రోవలో నెదురుగా నొక బ్రాహ్మణుఁడు కానవచ్చెను. ఆయనను పిల్చి "ఎవ్వరవు? ఎక్కడికి వెళ్ళుచున్నా"వని పంతులుగా రడిగిరి. "అయ్యా! మాది ఫలాని గ్రామము. నా కుమారునికి ఉపనయనము జరుగవలసియున్నది. నేను బీదవాఁడను. కామేశం పంతులుగారను మహాధర్మాత్ములు బరంపురములో నున్నారని విన్నాను. వారేమైన సహాయము చేయుదురేమో! దానితో నుపనయనము జరుపుకొందుమని యాచింపబోవుచున్నాను." అనెను. "వెళ్ళుదువుగాని నేను మిక్కిలి దప్పిగొని యున్నాను ఈ చెంబునిండ మంచితీర్థము తెచ్చిపెట్టగలవా? పుణ్యము కల్గును." అని పంతులుగారనిరట. ఆ బ్రాహ్మణు డాసవారీ బోయలను, బంట్రౌతులను, వారి ప్రాభవమును చూచి ఎవరో గొప్ప యుద్యోగి యనుకొని వారి దగ్గఱనున్న పెద్దచెంబును తీసికొనిపోయి ఆ చుట్టుపట్టుల నెక్కడనో ఉన్న బావినుండి చెంబునిండుగా తియ్యని చల్లని మంచినీరు కొనివచ్చి యిచ్చెనట! పంతులుగారా చెంబెడు నీరుత్రాగి తృప్తిచెంది "బ్రాహ్మణుడా! బ్రతికించితివయ్యా! కాని పాపము

నీవు వెళ్లి లాభములేదు. కామేశంపంతులు గ్రామమున నిప్పుడు లేడు. మరల నింకొకతూరిపోయి చూతువుగాని, యీ సారికి దీనిని తీసికొని పొమ్మని చెప్పి సవారిలో తలగడ క్రింద రాశిగాఁ బోసియున్న రూపాయల నా పెద్దచెంబు నిండ నింపి చేతికిచ్చి "నీ విచ్చిన మంచినీటి విలువ దీనికంటె హెచ్చుసుమా! కొనిపొమ్ము" అనిరట! బ్రాహ్మణుడు ఆశ్చర్యము పొందెను. ఆ చెంబులోని రూపాయలు అయిదాఱు వందలకు తక్కువ యుండవట! పరమానందభరితుడై బ్రాహ్మణుడు "వెదకబోయినతీగ కాలఁదగిలెను. మీరేనా? కామేశం పంతులుగారు! మహాదాతవయ్యా! దొడ్డ ప్రభువవయ్యా" అని కైవారము చేయుచు మళ్లీ తన గ్రామమునకు వెళ్ళెను.

అనంతాచార్యులుగారు చెప్పగా విన్న యీ క్రింది వృత్తాంతమును మాడభూషి వెంకటాచార్యులుగారికి సంబంధించిన దానిని చాటుపద్యమణి మంజరిలో ప్రకటించినాను.

'అనంతాచార్యులుగారి దగ్గఱ కొకప్పు డవలిప్తుఁడగు నొక యరవదేశపు విద్వాంసుఁడు వచ్చి స్వరచితములయిన శ్లోకములను జదువుచు, వివరించుచుఁ బ్రశంసించుకొనుచునుండగా వేంకటాచార్యులుగారు వినుచుండిరి. పదిశ్లోకములయినవి. ఆత్మోత్కృష్ట ప్రశంసాపరాయణుఁడుగానున్న యా పండితునితో 'నయ్యా'! యీ శ్లోకములు పిన్ననాఁడు మా నాయనగారు నాకు జెప్పిరి. ప్రాచీనకృతములయిన యీ శ్లోకముల ననంతాచార్యులుగా రెరుగరు గదా యని యాత్మీయములుగాఁ జదువనారంభించితిరా?' యని యడ్డుపలికి రట. కుపితుఁడై వెడనవ్వునవ్వి యా యరవదేశపుఁబండితుఁడు వేంకటాచార్యులుగారి నెఱుగక యేదీనీకు వచ్చునేని చదువుము. రచించిన వాడను నేనే యిక్కడ నుండగా నాతోనే యిట్లు బలికెద వేమయ్యా? ఎవ్వర వీవు?' అని తుటారించెనట. ఇదిగో చదువుచున్నానని వేంకటా చార్యులుగా రన్నింటిని నేకసంధాగ్రహణముననప్పగించెను. వెల్లఁబోయి యా పండితుడు వేడుకొనె నట. 'మీ మాహాత్మ్యము నెఱుగనైతిని మన్నింపుడు' దని—

(వ్యాసము ఆంధ్రపత్రిక: మార్చి 5, 1944
మణిమంజరి; ఆగస్టు, 1981)

వాఙ్మయపరిణామము

శా॥ భాషాదేవత సుస్వరూపమది విస్పష్టంబుగాఁ గానరా;
దీషద్జ్ఞానము యెల్లవారికిని; మా కీనాఁడు బహ్వర్థముల్
భాషింపన్ వలసెన్; నిబంధముల నిర్బంధం బసంబద్ధమన్
ఘోషం బేర్పడె; మార్పుతప్పు;దిట లగ్గుంగూర్పు మో యీశ్వరా!

పండితులదగ్గఱనుండి పామరులదాఁకఁ బుట్టిననాఁటినుండి గిట్టిన నాఁటిదాఁక నెల్లరకును నెల్లపుడును లోక ప్రవృత్తికి భాష పరమోపకారకము; అత్యావశక్యకము. కాని చిత్తసంస్కారములలో నావశ్యకతలలో రుచులలో నర్హతలలో భిన్నలక్షణములుండుటనుబట్టి వారివారి భాషలుకూడ భిన్న లక్షణములతోనే యుండును. పండితులభాష వేఱు; పామరులభాష వేఱు! ప్రౌఢులభాష వేఱు. వారువారు వారివారి భాషలతోఁ దమతమ యవసరము లను దీర్చుకొనుచుందురు. పండితునకు రామకథ భవభూత్యాది ప్రౌఢకవి నాటకములచే దర్శనీయముకాఁగాఁ బామరునకుఁ దోలుబొమ్మలాటచే దర్శనీయమయ్యెను. పండితుఁడు తిక్కనభారతము చదివి భారతకథ తెలిసికోఁగాఁ బామరుఁడు "హరిహరీ నారాయణాదినారాయణా" మట్టుపదములు మొదలైనవి చదివి దానిని దెలిసికొనును. పండితుఁడు "వచ్చుచున్నా" నని "వస్తున్నా" నని యనఁగాఁ బామరుఁడు "వస్తుండాను" "వత్తుండాను" యని యనును. వారి రుచులు వేఱు; వీరు రుచులు వేఱు గదా! ఇట్లు భేదపరమావధు లను జూపఁబూనినచో నొక్కొక్కని కొక్కొక్కతీరుభాష యున్నదన్నంత వఱకుఁ జూపవచ్చును. ఇందులో నెవ్వరుగాని సంఘమునుండి యెట్లు తొలఁగింప రానివారుగా నుందురో యట్లేవారి భాషయు నపరిహార్యమేయగును. కాని యింతవఱకుఁ గడచి చన్న కాలమందట్లు జరుగలేదు. ఉన్నత సంఘములవారి యుత్కృష్టభాషయుఁ దత్ప్రయోజనములును, గొంతకొంత పరిరక్షింపఁబడినవి గాని యధమసంఘములవారి యవనతభాషయు వారి భాషాప్రయోజనము లును బరిరక్షింపఁబడలేదు. అందఱకు సమానమయిన యర్హత సమ్మానము ప్రాచీనకాలమునందెట్లేర్పడలేదో యట్లే వారివారి భాషలకును భాషాప్రయోజన ములకును సమానమయిన సమ్మానము, అర్హత కలుగదయ్యెను. ఇది సర్వలోక సర్వభాషాసామాన్యమయిన విషయమే.

ప్రస్తుతమగుటచే నిట మన తెనుఁగునాటిమాట తీసికొనుచున్నాను. ఇతరులచేఁ బ్రాజ్ఞులని సత్కరింపఁబడినవారు, ఇతరులను దమ నిర్ణయము చొప్పున వినిపింపఁగల్గినవారు ఎవరో కొంద ఱాయాకాలములయం దేవో కొన్ని ఛందోవ్యాకరణాది విధుల నేర్పఱచి యా విధుల చొప్పున గ్రంథరచనాదికము జరుగవలెనని నిబంధములు గల్పించుచువచ్చిరి. అధమగతి నున్న తక్కినలోకము వారినిర్ణయములను గొన్ని ప్రయోజనములందుఁ గొంతకొంత పాటించుచు వారిని వెంటాడుచు వచ్చిరి. దేశకాలపాత్రములను బట్టి యా నిర్ణయములును మాఱుచు వచ్చినవి. మఱియు నిట్లింతకాలము వఱకు నా భాషాలక్షణనియామకులు తమకుఁబరిచితమయిన జనసంఘమును బ్రయోజనములను మాత్రమే లక్ష్యముగాఁ జూచుకొని నిబంధములఁ జేయుచు వచ్చిరి. కాని యా భాష ప్రచారముగాంచిన సర్వమానవసంఘమును గూర్చియు భాషవలన వారివారికిఁగలుగవలసిన సర్వప్రయోజనములను గూర్చియుఁ, జర్చించి సర్వార్థసాధకమగునట్లు నిబంధముల నేర్పఱిచినవారు కారు. కావ్యాలంకారచూడామణికారుని నుండి బాలవ్యాకరణకారునిదాఁకఁ గల పండితులుచేసిన నిబంధము లాంధ్రదేశమందలి పరిమితమానవసంఘమునకుఁ బరిమితభాషాప్రయోజనమైన కావ్యానందమునకు మాత్రమే కొంత చాలియున్నవి. ఇంతదాఁకఁ గడచిన కాలముతీరు వేఱు. నేఁటి కాలము తీరు వేఱు. పూర్వమువారు తలఁచియైన నెఱుఁగని యావశ్యకత లెన్నో యీనాఁటివారికిఁగల్గుచున్నవి. పూర్వమువారు మానవులుగాఁ గూడ గణింపని వారెందఱో యిప్పుడు మహనీయులగుచున్నారు.

ఇట్టి స్థితిలోఁ బ్రాచీనుల నిబంధము లీ కాలమునఁ బనికిఁజాలనివి, పనికిమాలినవి యగుచున్నవి. భాషావిషయముననే కాక సర్వవిషయములందు నిట్టి సంఘర్షమే సంఘటిల్లినది. నేఁడొక యద్భుతశక్తి యఖిలప్రపంచము నావహించినది. భారతదేశము నది బలముగా నలముకొన్నది. ప్రతిమానవునకు "నేను బరతంత్రుఁడనుగా నుండరాదు. స్వతంత్రుఁడను గావలెను" అను నాత్మాభిమానము పొడముచున్నది. ఒకని నిబంధమున కింకొకఁడు లోపడకున్నాఁడు. బ్రాహ్మణుని యాధిక్యమును బ్రతిఘటించుటకు మాలవాఁడును, మహారాజు ప్రాభవమును బ్రతిఘటించుటకు దరిద్రుఁడును బ్రయత్నించుచున్నారు. ఈ సంఘర్షమనివార్యముగా నున్నది. నివారించుట కూడఁ గూడని

పనిగాఁదలఁపఁబడుచున్నది. దీర్ఘదర్శులు కొందఱు పెద్దలిందుకై చండాలాదుల యస్పృశ్యతాదులను దొలఁగింపవలె ననియు, దరిద్రులు సంపన్నులగుటకు వలయు సాధనముల సమకూర్పవలెననియు సంస్కారములు సేయ సమకట్టుచున్నారు. భాషావిషయమునఁ గూడ నట్టిదే జరుగుచున్నది. కొందఱు పండితులు, కొన్ని భాషా ప్రయోజనములనే యుద్దేశించి చేసిన నిబంధములు నిలువరింపరానివనియు, భాషవలన నంతకంటె హెచ్చుప్రయోజనములిప్పుడు పడయవలసిన యావశ్యకత యేర్పడుచున్నదనియు, సర్వమానవసంఘమును భాషాప్రయోజనసర్వస్వమును సమమముగాఁబడయవలసియున్నదనియు, నందులకై వాడుకభాషను గ్రంథరచనము జరుగవలెననియు వాదించుచున్నారు. అట్లు గ్రంథరచనములు చేయుచున్నారు. నేనును నట్టి సంస్కారము నభిమానించినవారిలో నొక్కఁడను. కాని దానిఁగూర్చి యిటీవల నా యభిప్రాయము మఱింత విపులముగా విరిసి దిక్కు దోఁచనిదిగా నున్నది.

ఇదివఱకు మేము కొందఱము సంకల్పించిన సంస్కారములు సంకుచితభావములుగలవిగా నే నిప్పుడు తలఁచుచున్నానను. ఏలనఁగా: "వచ్చుచున్నాను" అను శబ్దరూపమువలెనే "వస్తున్నాను" అను రూపము కూడఁ బ్రాజ్ఞవ్యవహారమందుఁ గలదు గనుక ప్రయోగార్హమని యంగీకరింపఁదగునంటిమి. కాని ప్రస్తుత కాలపరిణామమునఁ జూడఁగాఁ బ్రాజ్ఞ సంఘమిది యని వేఱుపఱుచుట కిఁక వీలు కలుగనట్టున్నది. సర్వమానవసంఘమందును విద్యావిజ్ఞానములు విపులముగా వెలయుచున్నవి. అహమిక నిండారుచున్నది. బ్రాహ్మణాదుల వ్యవహారమందుఁగల 'వస్తున్నాడు' ప్రయోగార్హ మయినప్పుడు చండాలాదుల 'వస్తుండాడు' మొదలగురూపములు ప్రయోగార్హము లేలకావు? బ్రాహ్మణులయాధిక్యమును జండాలురు వెన్నాడకున్నప్పుడు వారి భాషా ప్రయోగరీతిని మాత్రమేల వెంటాడుదురు? 'మా సంఘవ్యవహారమున నున్న రూపమునే మేము మా గ్రంథములం దుపయోగించుకొందు' మందు రేని "వస్తున్నారు" మాత్రమే ప్రయోగార్హమని తలఁచువా రేమి బదులు చెప్పఁగల్గుదురు? ఇట్టి రూపములే ప్రయోగార్హములని విధించుటకు వీరి కేమి యధికారమున్నది? నాకు నే నయి యింతవఱకుమాత్రమే సంస్కారమంగీకరింపఁదగునని నిబంధింపఁబూనితినేని యా నిబంధమునకు లోఁగువా రెవ్వరు? ఇట్టి చిక్కు భాషా విషయములందుఁగొన్ని సంస్కారములు

మహాత్ములకుఁ గూడఁగొఱుకఁబడనివిగా నున్నవి. ఈ చిక్కుయొక్క పరమావధి యేమనఁగా:- ఒక్కొక్క మనుష్యుఁడును 'నా భాషను నేను వ్రాయుదును. ఇంకొకరి నిబంధము నాకు విధాయకముగాదు' అన్నంతవఱకుఁ బోవచ్చును. కాని యట్టి సంఘర్షమునఁ జిదికిపోయెడి చింతనములేవో బ్రదుకఁగల్గెడి భావములేవో వీని పరిణామమెట్టిదగునో నా యల్పబుద్ధికి గోచరము గాకున్నది. నేఁడు భాషాసంస్కారము నపేక్షించి చర్చించువారిలోఁగూడ నైకకంఠ్యము లేదు. "చూచినాడు, చూచాడు, చూసినాడు, చూశినాడు, చూశాడు, చూసేడు" అని యిన్ని రూపములును వ్రాయువారున్నారు. ఇందుఁ గొన్నియే పరిగ్రాహ్యములని వ్యవస్థాపించి యాఁచి పట్టుట కధికారులులేరు. సంస్కారమే పనికిరాదని యడ్డుపెట్టుట కంతకంటె నధికారులు లేరు. ఆ సంస్కారమనివార్యముగా జరుగుచునే యున్నది. అయ్యో! ఎంత భయంకరమైన చిక్కు? ఇట్టి చిక్కొక్క భాషావిషయమందే కాక సర్వవిషయములందు సంప్రాప్తమయి నదిగదా! మానవమాత్రుఁడు ప్రాభవముచేఁగాని ప్రజ్ఞచేఁ గాని యిఁకమీఁదికాలమున లోకమున నే విషయముగాని యనుశాసింపఁ జాలఁడేమో యని నా సంశయము. భగవంతుఁడొకఁ డుండెనేని లోకమును బరమానందోద్దేశము నకుఁ జేర్చుటే తదుద్దేశమేని, యాయన కల్యాణమార్గ మేదో లోకమునకుఁ గల్పింపఁగలఁడు. అదియేదో యందువఱకును మన ప్రయత్నములు గ్రుడ్డియెద్దువేనఁబడినలాగున సాగుచుండవలసినవే కాఁబోలును! అట్టి శుభసమయము లోకమునకు లభించుటెప్పుడో!

(వ్యాసము
భారతి: మే, 1924
మీగడ తఱకలు: 1951)

నేటితెలుగు - నోటితెలుగు

వెలయగలదు, నేడు కాకపోతే రేపు - వేరుగా ఆంధ్రరాష్ట్రం తప్పక వెలయగలదు.

అప్పటినుండీ ఆంధ్రరాష్ట్ర పరిపాలనా తంత్రమంతా, భాషాప్రయోజనము లన్నీ ఆంధ్రభాషామూలకములుగానే సాగగలవు. లేఖనమూలముననేకాక వాఙ్మూలముసకూడా తెలుగురచన చాలా పెంపొందగలదు.

పరిపాలనా తంత్రమునకు ముఖ్యమైన కౌన్సిళ్లు, డిస్ట్రిక్టు బోర్డులు, మునిసి పాలిటీలు, కలెక్టరు మొదలగువారి ఆఫీసులు, కోర్టులు, విద్యాశాలలు, అక్కడి పాఠప్రవచనములు అన్నీ తెలుగుతో సాగితే, ఆయాచోట్ల ఉద్యోగులు, సదస్యులు తెలుగుతోనే చర్చలు సాగిస్తే, ఆంధ్రదేశము నలుమూలలవారు, నానాజాతుల వారు సమానస్వాతంత్ర్యముతో వాగ్వ్యవహారములు ఆయాచోట్ల సాగిస్తే, వాటిని షార్టుహాండు రిపోర్టర్లు అట్లట్లే పత్రికలకుపంపితే, వారి భాషితములు మార్చ వీలులేదు గనుక వాటిని అట్లట్లే పత్రికలవారు ప్రకటిస్తే చాలామట్టుకు నేటిది కాకపోయినా రేపటిదయినా తెలుగుభాష 'నోటితెలుగు కాకతప్పదు'.

మాట్లాడేభాషకూ, వ్రాసేభాషకూ ఐక్యమో, కాకపోతే సాన్నిధ్యమో అని వార్యం అవుతుంది. ఈ మార్పు రాకతప్పదు.

తెలుగు పుట్టిననాటినుండి నేటిదాకా తెలుగువారు భాషాప్రయోజనాలను పెక్కింటిని పరభాషలద్వారానే పడయడం సంభవిస్తూ వచ్చింది.

ఆదికాలంలో సంస్కృత ప్రాకృతములు, తర్వాత తురక, ఇంగ్లీషు భాషలు తెలుగు ప్రజలమీద వెల్లివిరిసి తెలుగుకు రూపేర్పటిచి పెంపొందించి భాషా ప్రయోజనములను పెక్కింటిని తమ మూలాన తెలుగు ప్రజలకు ప్రసాదిస్తూ వచ్చినవి.

ఆయా కాలములలో భాషాప్రయోజనాలలో ఒక్కటయిన సాహిత్య ప్రయోజనానికి మాత్రమే తెలుగు కొంత ఉపయోగపడుతూ వచ్చింది. కాన అందులోకూడా ఆయా కాలాలలో సంస్కృతప్రాకృతములయు, తురుష్కాంగ్లము లయు తాకిడి తెలుగురచనలకు తగులుతూనే వచ్చినది. సర్వస్వతంత్రత తెలుగుకు పూర్వం కలుగనే లేదు.

అయిపోయిందేదో అయిపోయింది. ఇప్పుడు దేశకాలముల తీరులు మాఱినవి. ఎప్పుడూ చవిచూచి యెఱుగని మార్పులు సమకూరినవి.

భారతదేశానికంతా ఏకమొత్తాన రాజ్యాంగభాషగా, నవ్యనాగరకభాషగా నూరేండ్లపాటు తెగ వెలిగి వెలిగి అనేకాపూర్వ ప్రయోజనములను సాధించి పెట్టిన ఆంగ్లభాష ఇక క్రమక్రమంగా తెరమరుగు కావలసిన స్థితికి వచ్చినది. దాని స్థానమును కొంతవరకైనా హిందీ ఆక్రమించుకొనబోతున్నది.

అయినా అది సర్వభారతదేశ సామాన్యవ్యవహారమునకే పనిగొంటుంది. కాన నేటిదాకా ఇంగ్లీషు పట్టినట్టు దేశభాషావ్యవహారాలపై కుత్తికపట్టు పట్టదట!

రాష్ట్రపాలనవ్యవహారాలన్నీ దేశభాషలలోనే జరుగును గనుక దేశభాషల కిక కుత్తికకోతలు కలుగవు.

కౌన్సిళ్ళలో, స్కూళ్ళలో, ఇళ్ళలో, వాకిళ్ళలో, రోడ్లలో, రికార్డులలో, కోర్టులలో, ఉపన్యాసాలలో, రాజ్యశాసనాలలో, గ్రంథపఠనరచనలలో తెలుగు దేశంవారు సర్వే సర్వత్రా తెలుగువాడుకనే సాగించగలిగినారంటే – అహోహో! తెలుగుకు పలుకుబడీ, చెల్లుబడీ యెంతో సర్వోదయంగా సాగుతుందన్నమాట!

తెలుగువెలుగు లెంతో దేదీప్యమానంగా వెలయగలవన్నమాట!

ఇది సర్వోదయమే! సంతోషకరమే కాని – తీవ్రయోచనగొల్పుతూ కొన్ని చిక్కులు దీనినుండీ యెగరేగుతున్నవి.

గ్రాంథికభాషనూ, ఇంకా ఇటీవల ప్రబలిన వ్యావహారికభాషనూ కూడా ఇప్పటిదాకా ఏవో హద్దు పద్దులలో కొంతవరకైనా ఆచిపట్టుకుంటూ వస్తున్నారు – యూనివర్శిటీలవారు. గ్రంథరచయితలు, పత్రికారచయితలు, మఱీ పండితులూను.

ఇక దేశం నాలుగంచుల వారిదాకా సర్వతోముఖమయిన స్వాతంత్ర్యం చెలరేగిందంటే హరిజనుల దగ్గఱనుండి భూసురులదాకా సర్వప్రజలూ సర్వదేశ వ్యవహారములలో సమానస్వతంత్రులూ, సమానభాగస్వాములూనయి బుజాలు కలుపుకొని వర్తిల్లనూ వర్ధిల్లనూ సాగించినారంటే, వారి వారి భాషలు మాత్రం కలగాపులగములు కాకుండా దూర దూరములుగానే ఉండిపోగలవా! ‘ మీ

జాతి తక్కువది, మా జాతి యెక్కువది’ అనరానట్టే, ‘మీ పలుకుబడి తక్కువది, మా పలుకుబడి యెక్కువది’ అని యిక అన వీలుండదు.

కుల్లూకభట్టీయాన్ని బట్టి వర్ణాశ్రమధర్మాలనూ, నన్నయభట్టీయాన్ని బట్టి ఆంధ్రభాషావ్యవహారాలను, ఆచిపట్టవలె ననేవారు నాలుకను కఱచుకో వలసిన స్థితి వస్తుంది, తప్పదు.

ఇది పెద్ద యుగపరిణామం వంటిది.

భాషా విషయంలోనే అయెను– ఈ మహత్తర పరిణామంతో రేపు ఇటువంటి పరిస్థితి యేర్పడుతుందని నిస్సంశయంగా నిరూపించడం ఎవరి తరమూకాదు. అసలు ఆంధ్రభాషావృక్షం ఎన్ని చిలవలు పలవలువేస్తూ పెరుగుతూ వచ్చిందో, యే కొంతయినా దాని విజృంభణ పూర్వం యెట్లా వుండేదో, ఇప్పుడెంత వుందో పరిశీలించి గుర్తించి చూచిన వారెవ్వరున్నారు?

పైపై జాతులవారి తేరుకొన్న భాషలమెరుగులే ఇంతదాక సారస్వత రచనలలో సాగుతున్నవి గాని దేశం నాలుగంచులా తిరిగి భాషను సర్వేచేసి దాని సర్వాంగసౌందర్యమును గుర్తించిన వారెవ్వరున్నారు?

జరిగితే ఇక మీదనే ఆ పని జరుగవలెను – ఆంధ్రులే ఆంధ్రదేశాన్ని పాలిస్తారు గనుక!

నాళ్లు, ఊళ్లు, గుళ్లు, కొండలు, నదులు, చెరువులు మొదలగువాని పేర్లు, వాని పుట్టుపూర్వోత్తరాలు, తచ్చరిత్రలు, జాతులు– తచ్చరిత్రలు, ఆయా నాళ్ళలో ఊళ్ళలో ప్రఖ్యాతులైన వారి చరిత్రలు, గ్రంథాలు – శాసనాలు, విగ్రహాలు వాటి కథలు, నోటిపాటలు, పద్యాలు, నానుళ్లు, పలుకుబళ్లు, అపూర్వ పదాలు, వాక్యవిన్యాసాలు వగైరాలు, బహుజాతుల వారి, బహుదేశ భాగములవారి భాషాభేదములు, ఆచారవ్యవహారములు– అన్నీ సమాకలనం చేసి సముద్ధరిస్తూ వాటిలోని గుణగణాలను గుర్తించి నిరూపిస్తూ ఉంటే సర్వ ప్రజలనుండీ, వారి భాషలనుండీ, సారాంశములనదగినట్లు, ప్రజలూ, వారి భాషలూ మెఱుగులు దేరితేరి బహుముఖముల బహువిధముల భాషా రచన స్వాతంత్ర్యంతో కొనసాగి కొంతకాలంగడిస్తే ఆ బహుత్వంలో నుండి సారభూత మైన యేకత్వము నెలకొనగలుగుతుందేమో! ముందు ముందు కాని, అట్టిస్థితి

యేర్పడక పూర్వం, అంటే యిప్పుడే, ఇటువంటి భాషనే 'ఈ విధంగానే వాడవలసింది' అని శాసించడం కూడా ఎవరికీ తరము గాదు.

పుట్టెకో బుద్ధి, నోటికో మాట! మాటాడే భాషకు విలువ యేర్పడ్డపుడు మనిషి మనిషికీ భాషాభేదాలు మఱీ యేర్పడగలవు.

ఒక్కడే కూడా విషయభేదాలనుబట్టీ, సమయసందర్భాలనుబట్టీ, గ్రాంథిక వ్యావహారిక రూపద్వయంలో కూడా అనేకాంతరాంతర భేదములను వాడుక చేస్తూ ఉంటాడు.

నా మట్టుకు నేను యెఱిగియెఱిగి అనేక సందర్భాలలో అనేకవిధ భాషలను వాడే స్థితిలో ఉంటాను.

వీటి పరిణామాలన్నీ శుభపర్యవసాయులు కాగలవనే ఆశిస్తున్నాను గాని, కొన్ని సందర్భములలో దిగ్భ్రమకూడా చెందుతూ ఉంటాను.

ఇప్పటికే సంస్కృతసమాసాడంబరంబుల డంబులతో పరమచ్ఛాందస ముగా వచన రచన చేసేవారు కొందఱు–

ముద్దులుగొలిపే పలుకులతో ఇది గ్రాంథికమని కాని, వ్యావహారికమని కాని నిరూపించ వీలులేనంత సున్నితముగా, సులభముగా వచనరచన చేసేవారు కొందఱు–

ఒడుపులు, ఒయ్యారములు గల వాడుకభాషలో బొంగరమును త్రిప్పి నట్లు పొంకముగా వచనరచన చేసేవారు కొందఱు–

మాటాడేటప్పటికంటే కూడా పలుకులను అరగరాచి గాలికి తూలిపోయే టంత తేలికగా వచనరచన చేసేవారు కొందఱూ ఉన్నారు.

కాని వ్యావహారికరచన పెంపొందసాగిన కొద్దీ నుడికారములు, నానుళ్లు, పలుకుపొంకములు, కాకువులు, తెలుగురచనలో వెల్లివిరయ సాగినవి.

హృదయములకు హత్తుకోజాలనివి, వ్యవహారానుసరణము లేనివి, సంస్కృత పదాడంబర రచనలు సన్నగిల్లి పోజొచ్చినవి.

పుట్టుకతోనే సంగీతవాసనతో కొందఱు పొలుపొందుతూ ఉండేటట్టు

సరసాంద్రరచనా స్వభావంతోనే జన్మించి చదువుసందె లంతగా లేకపోయినా అతిమనోజ్ఞరచనలు సాగిస్తున్న వారనేకులున్నారు. తెలుగు తియ్యదన మట్టిది!

కష్టపడి గట్టిగా విద్యాభ్యాసాధికము కావించికూడా, పద్యరచన లేవో పరగిస్తూ కూడా విద్వాంసులే కొందఱు అందమయిన వచనరచనల నలవరచు కోజాలకపోతున్నారు.

'పత్రికావిలేఖరుల', 'ప్రాముఖ్యతను', 'విభాగితభారతదేశమును', హిందూమహ్మదీయ 'సఖ్యతను' – ఇక కాదన వీలులేదు కాబోలును.

ఇట్టి పదాలను పత్రికలే కొంతవఱకు పుట్టించి పోషిస్తున్నవి. 'లోక వాడుక'లో నుండి వచ్చినవికావు పయి పలుకులు.

శయ్యలో వైవిధ్యముండుగాక! గ్రాంథికమున గాని, వ్యావహారికమున గాని పదముల నుపయోగించుటలో భాషాలోకజ్ఞుల ననువర్తించు టావశ్యకము గాదా! ఆచిపట్టువా రెవ్వరు?

వివిధత యింత వింతగా విజృంభిస్తున్నా, కొన్నాళ్ళకు దీనిలోనుండి యింకా నిద్దమయిన రచనపు సరకు నెగడగలదు.

వైవిధ్యమే మెరుగులు దేరితేరి తనలోనుండి హార్దమహితమయిన యైక విధ్యము నవతరింప జేయగలదు.

(ఆంధ్రపత్రిక ఉగాది సంచిక
సర్వధారి – 1948
మణిమంజరి : ఫిబ్రవరి, 1982)

మధురకవితలు-3

ప్రాచీనాంధ్రలక్షణకర్తలు తెలుఁగుగవిత్వమును 'ఆశు, మధుర, చిత్ర, విస్తరము' లను పేళ్లఁ జతుర్విధముల విభజించిరి. యక్షగానాదు లందులో మధురకవిత్వమునఁ జేరును.

"మధురకవిత్వం బన్నది, నాటకాలంకారంబులు, కళికోత్కళికలు, విభక్త్యధిదేవతోదాహరణములు, సప్తతాళనటనలు, నట్టొట్లు, గీతప్రబంధములు, చతుర్భద్రికాష్టభద్రికలు, బిరుదావళి, నామావళి, భోగావళి, రంగఘోష, జయఘోష, త్యాగఘోష, చతురుత్తర సంఘటనలు, యక్షగానంబున వెలయు పదంబులు, దరువులు, లీలలు, ధవళంబులు, మంగళహారతులు, శోభనంబులు, నుయ్యాలజోలలు, జక్కులరేకుపదంబులు, చందమామసుద్దులు, అష్టకంబులు, ఏకపద ద్విపద త్రిపద చతుష్పదాష్టపదులు నివి యాదిగాఁ గల్గునన్నియు."

– లక్షణదీపిక.

మధురకవితలు ప్రాయికముగా భాష, భావము, ఛందము దేసిగా నుండుటచే సంగీతసంస్కారము గలిగిన సామాన్యజనుల నాలుకమీఁద నాట్యమాడునవిగా నుండును, గాన తొలుత నవి యంతగా లిపి కెక్కకపోయెను. సంస్కృతప్రాయరచనలు గల చిత్రవిస్తరకవితల ప్రాబల్యమునఁగూడ వానికి సత్కవితలతోఁబరిగణనమంతగా లేకపోయెను. ఇటీవల కవులుగాఁ బురాణప్రబంధ రచయితలే పరిగణింపఁబడుచుండిరి గాని మధురకవితా రచయితలు లెక్కకెక్కకున్నారు. ఆంధ్రవాఙ్మయవృక్షమున ముఖ్యమయిన మధురకవితాశాఖ యిందాఁక సుపరిశీలనము లేకయే యున్నది. ఇక్కడ నాకిప్పుడు దేసి నాటకములనఁదగిన యక్షగానరచనముల ప్రశంసయే ప్రసక్తమగుటచే వాని పుట్టుపూర్వోత్తరములఁగూర్చి మాత్రమే నాకు గోచరించిన విషయములఁ గొన్నింటి వివరింతును.

దేశిదృశ్యరచనలు

యక్షగానములన్నపేరుగల దృశ్యరచనములు నన్నయాదుల కాలమున నున్నవనుటకుఁ బ్రబలాధారములు గానరావు. కాని యానాఁడేవో కొన్ని

దేశి దృశ్యరచనములున్నవని మాత్రము గుర్తింపనగును. నన్నయ కిన్నూ ఱేండ్లకుఁ దర్వాత నున్న పాల్కురికి సోమనాథుఁడిట్లు చెప్పినాఁడు.

"భ్రమరులు జాళెముల్ బయకముల్ మెఱసి
రమణఁ బంచాంగపేరణి యాడువారు
ప్రమథపురాతన పటుచరిత్రములు
క్రమమొంద బహునాటకము లాడువారు
లలితాంగ రసకళాలంకారరేఖ
లలవడ బహురూప మాడెడువారు
* * *
అమరాంగనలు దివి నాడెడుమాడ్కి
నమరంగ గడలపై నాడెడువారు
ఆ వియద్గతి యక్షు లాడెడునట్టి
భావన మ్రోకులపై నాడువారు
భారతాదికథలు చీరమఱుఁగుల
నారంగ బొమ్మల నాడించువారు
కడునద్భుతంబుగఁ గంభసూత్రంబు
లడరంగ బొమ్మల నాడించువారు
నాదట గంధర్వయక్షవిద్యాధ
రాదులై పాత్రల నాడించు

– పండితారాధ్య చరిత్రము– పండితప్రకరణము

పై ద్విపదలందు, నేఁటి వీథినాటకములు, దొమ్మరాటలు, తోలుబొమ్మలాటలు మొదలగునవి పేర్కొనఁబడినవి. ఇట్టి సంప్రదాయములు వీనిఁ బేర్కొన్న సోమనాథుని కిన్నూఱేండ్ల పూర్వకాలమునఁగూడ నుండుట సంభావ్యమే. తెలుఁగునకు సాటిభాషలగు ద్రవిడకర్ణాటభాషల పద్ధతులను బట్టియుఁ దెలుఁగులో నిప్పుడుపలభ్యమానములగుచున్న కొన్ని ప్రాచీనదృశ్య రచనములతీరులను బట్టియు, ద్రావిడభాషాసామాన్యముగాఁ దొలుత వెలసిన నాటకరచనల స్వరూపము కొంత గుర్తింపవచ్చును.

కురవంజి[1]

తొలుత ద్రావిడభాషలలో వెలసిన దృశ్యరచనములు కురవంజు లనఁబడినవి. ఆంధ్రకర్ణాటద్రవిడదేశముల యరణ్యములలో వసించునాటవికులు, చెంచులు, కురవలు, (క్రోవ, కోయ) అనువారు. అందుఁగురవజాతివారి యంజె= అడుగు (నృత్యవిశేషము) కురవంజే యనఁబడెను. చిందు, గంతు, గొండ్లి, అంజె, అంగ– ఇత్యాదులు నృత్యవిశేషములు. ఆంధ్రదేశమున బహుకాలమునుండి శివక్షేత్రములగు శ్రీశైలము ఇంద్రకీలనగము (బెజవాడ కొండ) మొదలగు పర్వతములమీఁదను, నృసింహక్షేత్రములగు వేదాద్రులు (పెక్కులున్నవి. మంగళాద్రి, సింహాద్రి, గరుడాద్రి, మాల్యాద్రి, వేంకటాద్రి) మొదలగు పర్వతములమీఁదను వర్షోత్సవములు (యాత్రలు, జాత్రలు, జాతరలు) జరుగునప్పు డక్కడికి నాగరకప్రజలు చేరుచుండువారు. వారి వినోదమునకై యక్కడి యాటవికులు రాత్రులందు నృత్యవిశేషములు నెఱపి ధనార్జనము చేయుచుండువారు. అక్కడక్కడి కొరవజాతులవారు చేయు నృత్యములు కొరవంజు లనఁబడెను. కొరవంజె యన్న పేరు తొలుత వారి నృత్యమునకును, బిదప నృత్యవిశిష్టమయిన చిన్నిచిన్నిగేయరచనలకును, నాపై కురవజాతివారికిని గూడఁ బేరైనది. కురవజాతివారు తొలుత చేయు నృత్యవిశేషము కాలక్రమమున నాయా పర్వతప్రదేశముల స్థలమాహాత్మ్యకథలతోను, శివవిష్ణులీలాకథలతోను మిళితములయి గేయవిశిష్టనాట్యరూపములను బడసెను. అపుడు మాయాకిరాతవేషులగు పార్వతీశివులకథలతో నున్న కిరాతార్జునీయము, నృసింహస్వామి చెంచీతను బెండ్లాడు స్థలమాహాత్మ్యకథలు (చెంచీతకథ కురువంజులుగా వెలసెను. ఇట్లు వెలసిన యాదృశ్యరచనములు

---

1. వాల్విచి గుజ్జరి విల్వేడు(?) దండలాస్యము కందుకక్రీడ యల్లికయును కొరవంజి(జె) శుభలీల గుజరాతి దేసి చౌపదము జక్కిణి దురుపదము మదనపదదౌత్యమును జోగిపదచాళి శారదాసామ్రాజ్యమును జిందు సవతిమచ్చరంబులు నాట్యకదంబంబు మొదలైన నాట్యముల్ హావణించు నవరసజ్ఞు (విజయరాఘవనృపాలుని ప్రహ్లాద చరిత్ర – యక్షగానము) ఇందు 'కొరవంజి' నృత్యవిశేషముగానే పేర్కొనబడినది.

2. కురవంజి, కురవ + అంజె (అంజ, అంజె, అంజియ రూపాంతరములు) కురవంజియ కురవంజెలనుండి కురవంజి అను రూపమేర్పడి యుండవచ్చును.

తొలుత నత్యల్పముగా గేయభాగములును విశేషముగా నృత్యమును గలవై యుండెను. అవి సింగి, సింగఁడు – అని యిద్దఱు పాత్రములు గలవై సంస్కృతవీథీనాటకములఁబోలియున్నవి. సింగి, సింగఁడు సంస్కృత నాటకములలోని నటీనటులవలె నాలుమగంద్రు. వీరిద్దఱే కథాపాత్రము లగుచుందురు. కొన్నింట గథాసంధాయకుఁడు– సంధివచనములఁ జెప్పువాఁడు – విదూషకుఁడనఁదగినవాఁడు– మూఁడవపాత్రము – కోణంగి యనువాఁడు – (పిదప చోడిగాఁడు) కాననగును. కోణంగి సంస్కృతనాటకములలోని విదూషకస్థానీయుఁడగుట స్పష్టముగాఁ గానవచ్చును. సంస్కృతనాటకములలోని ధ్రువగానమే కురవంజులలో దరువనఁబడెను. దేశిరచనలలో నుండి సింగి, సింగఁడు, కోణంగి, దరువు అనునవి నటీనటులుగను, విదూషకుఁడుగను, ధ్రువగను సంస్కృత నాటకములఁ జేరెనేమో యని కూడ యోచింపఁదగినట్టున్నది. ఎంతోకాల మిట్లు కొండపట్టులందు సాఁగుచుఁ బెంపొందిన గేయనృత్యసందర్భములు నగరములకుఁ గూడఁ గ్రమముగా వ్యాపించినవి. చెంచులు, కురవలు నడవులనుండి పులిగోళ్లు, అడవిపంది కోఱలు, అడవి పండ్లు, వెదురుబియ్యం, వెదురుబెత్తములు, పిల్లనగ్రోవులు, సూదంటురాళ్లు, ఓషధులు, తేనె మొదలగు నాటవికవస్తువులను నగరములకుఁ గొనివచ్చి యమ్ముచు నప్పుడప్పుడు తమ గేయనృత్యవిశేషములను నగరములందును, బల్లెలందును బ్రయోగించుటచే నవి నాగరకదేశములందును వ్యాపించెను.

యక్షగానములు

ఇట్లు నగరములందు నభిరుచి గొల్పిన యా గేయవిశిష్ఠనృత్యదృశ్యములు, జక్కులవారు (యక్షులు, కళావంతులు) తర్వాత నగరములందును బ్రయోగింపఁజొచ్చిరి. వీరి ప్రయోగములందు దృశ్యమయిన నృత్యాభినయములతోపాటుగా నధికముగా గేయవచనరూపమైన శ్రవ్యరచనము గూడఁ జేరెను. కురవంజులకంటె యక్షగానములు పర్యాప్తముగా శ్రవ్యములగు కవిరచనములు గలవి. వీరి రచనములలో బహువిధములగు పురాణకథ లెల్లఁ జేరినవి. కురవంజులలోని సింగి, సింగఁడుపాత్రలు మాఱి రామ నల, హరిశ్చంద్ర, సీతా, దమయంతీ, చంద్రమత్యాదిపాత్రలు వచ్చినవి. కాని వీనిలో నాటవికరచనాసంస్కారసూచకముగా, 'ఎఱుకతసాని' పాత్రము

వెలసినది. కురవంజులలోని దేసిరచనల కంటె నత్యధికముగా వీనిలో దేసిచ్ఛందోబద్ధములగు గేయరచనలు ప్రబలినవి. రాజసభలలో, దేవోత్సవములలో, ఊరిజాత్రలలో యక్షగంధర్వాదివేషముల ధరించీవేశ్యలు ప్రదర్శించునవి గావునను, నృత్యధర్మములకంటె గేయధర్మములధికముగాఁగలవి కావునను నివి యక్షగానము లనఁబడెను. కళావంతులలో నొక తెగకు నేఁడు జక్కులవారనుపేరు గలదు. యక్షాదివేషముల ధరించి నృత్యగాన ప్రదర్శనములను గావించుటచేతనే వారి కాపేరు వచ్చియుండవచ్చును. శ్రీనాథుఁడు క్రీడాభిరామమున జక్కుల వారిని గూర్చి కొంతప్రశంస నెఱిపినాఁడు.

---

1. శ్రీనాథుఁడు భీమఖండమున ద్రాక్షారామభీమేశ్వర మహోత్సవ సమయములందు సానులు (వేశ్యలు) వేషములు వేసికొని నాటకములాడుట నిట్లు వర్ణించెను.

సీ॥ విరులదండలతోడివేణికాభారంబు
 పొంకంబు పిఱుఁదులఁ బొరలియాడ
మణితులాకోటికోమలఝణత్కారంబు
 రవలి మట్టెల మ్రోఁత యవఘళింపఁ
గుదురునిండిన చిన్నగుబ్బచన్నులమీఁద
 ముత్యాలత్రిసరంబు మురువుఁజూప
వలమానతాటంక వజ్రాంకురచ్ఛాయ
 లేఁతవెన్నెలఁ బుక్కిలించియుమియ

గీ॥ సాని యీశానియై మహోత్సవమునందుఁ
గేల వనచంద్రకాంతపుగిన్నె పూని
వీథి భిక్షాటన మొనర్చువేళఁ జేయు
మరులు నృత్యంబు జగముల మరులుకొలుపు (ఆ.1.105)

వ॥ మహోత్సవ మండపమునందుఁ బేరోలగం బుండి, కుండలీదండలాసకప్రేరణీ ప్రేంకణసింధుకందక ధమాళి చేల మత్తల్లీహల్లీసకాది నృత్యంబు లవలోకించును. (ఆ. 1. 118)

శ్రీనాథుని కాలమునకే దేవోత్సవాదులయందు వేశ్యలు వేషములుకట్టి నాటకములఁబ్రదర్శించు సంప్రదాయము ప్రబలినది.

"కీర్తింతు రెవ్వానికీర్తి గంధర్వులు - గాంధర్వమున యక్షగానసరణి" భీమ 3-ఆశ్వా. శ్రీనాథుని కాలమున యక్షగానములు ప్రబలియుండుట దీనిచేఁ దెలియనగును.

సీ॥ కోణాగ్ర సంఘర్ష ఘుమఘుమధ్వని తార
 కంఠస్వరంబుతో గారవింప
మసిబొగ్గు బోనాన వసలుకొల్పినకన్ను
 కొడుపుచేఁ దాటించు నెడపదడప
శ్రుతికి నుత్కర్షంబుఁ జూపంగ వలయుచోఁ
 జెవిత్రాడు బిగియించు జీవగఱ్ఱ
గిల్కుగిల్కున మ్రోయుకింకిణీగుచ్ఛంబు
 తాళమానంబుతో మేళవింప

గీ॥ రాగముననుండి లంఘించు రాగమునకు
నురుమ యూరుద్వయంబుపై నొత్తిగిల్ల
కామవల్లీ మహాలక్ష్మి కైటభారి
వలపు వాడుచు వచ్చె జక్కులపురంధ్రి.

అప్పకవి యక్షగానలక్షణము నిట్లు చెప్పినాఁడు

సీ॥ తుద నేడులఘువులు తొలఁగించి చదివినఁ
 ద్రిపుటకు వృషభగతిపదయుగము
లలిఁగడపల నొక్కలఘువు మానిన జంపె
 మను ద్విరదగతిసమపదయుగము
గురు తగురచ్చెరకుఁ దురగవల్గనా
 హ్వయ మేకతాళి యామధురగతికి(?)
నంఘ్రి కిర్వదినాలు గటతాళమున మాత్ర
 లోలి విశ్రాంతి పద్నాలుగింటఁ

గీ॥ దెలియ నర్థంబు నర్ధచంద్రికలు వీన
యక్షగానప్రబంధంబు లతుకవచ్చు
రగడభేదంబు లివి యంద్రు రసఁగవీంద్రు
లవితనిజసేవకస్తోమ! యబ్ధిరామ!

పై పద్యమునుబట్టి చూడఁగా యక్షగానములందలి ప్రధాన గేయ రచనములు దేశిరచనలగు రగడలలోఁ గొంతమార్పుజరిపి - త్రిపుట, జంపె,

ఏక, ఆట, అను తాళముల కనుగుణముగాఁగల్పింపఁబడినవిగాఁ గాన వచ్చును. అప్పకవి రగడవికారరచనములను తాళములపేరనే పేర్కొనెను గాని వానికిఁ బేరులు వేఱె తెలుపలేదు. అప్పకవి పేర్కొన్న యీ రచనములే కాక యక్షగానములలో నింకను ననేకవిధములయిన దేశిరచనములు చేరినవి. ఏలలు, జోలలు, సువ్వాలలు, ఆరతులు, ధవళములు, చందమామసుద్దులు, వెన్నెలపదములు, విరాళిపదములు, తుమ్మెదపదములు, గొబ్బిపదములు, కోవెలపదములు, చిలుకపదములు, అల్లొనేరేళ్ళు, సీస- కందార్థములు, త్రిభంగులు, ద్విపదలు, త్రిపదలు, చౌపదలు, షట్పదులు, మంజరులు, జక్కుల రేకులు మొదలగునవి.

యక్షగానము లిట్లు వెలసినను ప్రాచీనములయిన కురవంజి రచనములును యక్షగానరచనావిధానసంకలితములై ఈ కాలమునఁ గూడఁ గొన్ని సాఁగుచునే వచ్చినవి. దేవోత్సవరాజాస్థానాదులం దిట్లు వేశ్యలచేఁ బ్రదర్శింపఁ బడుచున్న యక్షగానములు పెంపొందుచుండు నీ కాలమున, దక్షిణదేశమున విజయనగరరాజ్యమున కుపశాఖలుగా తంజావూరు మధురరాజ్యము లాంధ్రనాయకరాజుల పరిపాలనమున వెలసినవి. ఆంధ్రదేశమునందును, దక్షిణదేశమునందును నీ కాలమున యక్షగానరచనము మిక్కిలి ప్రబలఁ జొచ్చెను. ఇవి యిట్లు కలావతులచేతఁ బ్రదర్శింపఁబడుచున్నవౌట గౌఱఁ తగాఁగనిపట్టియో యేమో కాని, కృష్ణాతీరమునందలి కూచిపూడిగ్రామమమున సిద్ధేంద్రుఁడనుయోగి యొకఁడు భాగవతకథలను పారిజాతముగొల్లకలాపము మొదలగుపేళ్ళతో యక్షగానములుగా రచియించి శాస్త్రీయమయిన భరతనాట్య సంప్రదాయములకు రక్షగా, స్త్రీనిస్సహాయముగా, నా యూరి బ్రాహ్మణులచేతనే ప్రదర్శనము చేయింపనేర్పాటు చేసెను. ఆ యూర జన్మించిన బ్రాహ్మణుఁ డెవ్వఁడుగాని, ఒక్కతూరియైనను, యక్షగానప్రదర్శనమున స్త్రీవేషమును ధరించి తీరవలెననియు, నది వారి కులాభ్యుదయహేతువనియుఁగూడ శాసించెనఁట. నేఁడుకూడ కూచిపూడిబ్రాహ్మణులు శాస్త్రీయమయిన భరత నాట్యముతో భాగవతకథలను బ్రదర్శించువారుగానున్నారు. ఈ సంప్రదాయము వెలసిన పిదపనే తత్ ప్రదర్శకులకు భాగవతులనియు, తద్రచనములకు 'ఆటభాగవతము' లనియుఁ బేరయ్యెను.

ఆటభాగవతములు

ఈ భాగవతకథలలో పారిజాతాపహరణకథ హృద్యతరమగుటచే దానికిఁబ్రచార మెక్కువయ్యెను. అది హృద్యతరమగుట కందలి సవతుల కయ్యపుఁబట్టు ప్రధానకారణము. దీనినిఁబట్టి యక్షగానసామాన్యమునకుఁ బారిజాతములనియుఁ బేరయ్యెను. ఏ యక్షగానముఁ బ్రదర్శించినను నందు సవతుల కయ్యపుఁబట్టునకుఁబ్రసక్తి గల్పించుటయో లేక పారిజాతము నందలి తత్కథాఖండమునే స్వతంత్రముగాఁబ్రదర్శించుటయో పిదప నేర్పడెను. ఈ సవతులకయ్యపుఁ గథపట్టు హృద్యతరమగుటచేఁ బ్రబంధకవులనుగూడ నిది వలపించెను. కళాపూర్ణోదయమున పింగళి సూరన్న పారిజాతకథలోని సవతుల కయ్యపుఁబట్టునిట్లనుకరించెను.

"అంత మదింపకువే యని పల్కిన నంత మదింపకువే యనుచున్
గంతు లడంచెద లెమ్మని పల్కిన గంతు లడంచెద లెమ్మనుచున్
రంతుల నేమి ఫలంబని పల్కిన రంతులనేమి ఫలంబనుచున్
బంతము చూడఁగదే యని పల్కినఁ బంతము చూడఁగదే యనుచున్.

సీ॥ ఒట్టు సుమీ యన్న నొట్టుసుమీ యంచు
నేమేమి యనిన నేమేమి యనుచుఁ
గానీగదే యన్నఁ గానీగదే యంచు
నింకేల యనిన నింకేల యనుచు
నోసిపోవే యన్న నోసి పోవే యంచు
నౌనంటి ననిన నౌనంటి ననుచు
మఱవకు మిది యన్న మఱవకు మిది యంచు
నీ వెంత యనిన నీ వెంత యనుచు

గీ॥ నొకతె మగనికి నాసించు టొప్ప దనిన
నొకతెమగనికి నాసించు టొప్ప దనుచుఁ
బట్టియాడె నారంభతోఁ బ్రథమరంభ
ప్రియుఁడు నిలుమన్న నిలువక పెద్దరొదగ."

కళా. ఆ. 3-195, 196.

ఆంధ్రదేశమున వెలసిన యీ కూచిపూఁడి భాగవతముల ప్రయోగ

వైశారద్యము దక్షిణదేశమునకుగూడ వ్యాపించినది. ఆనాఁడు కూచిపూడి భాగవతుల యాటభాగవతసంప్రదాయము నేఁటికిని దక్షిణదేశమునఁ గలదు. దక్షిణదేశమున బ్రాహ్మణులు పురుషులే నేఁడును భాగవతయక్షగానములను దెనుఁగువానినే ప్రదర్శింతురు. ఆంధ్రదేశమున వెలసిన యక్షగానము లిన్నూటికిఁబైచిలుకు పరిగణింపఁబడినవి. వీని ననుసరించి వెలసిన దక్షిణ దేశపుయక్షగానములు మున్నూటికిఁ బైచిలుకు గలవు. భక్తాగ్రేసరుఁడనఁ బడిన శివనారాయణతీర్థులవారు (కృష్ణలీలాతరంగిణి కర్త), త్యాగరాజస్వామి వారు పారిజాతాపహరణమని, నౌకాచరితమని భక్తిరసభరితములయిన యక్షగానములను రచించిరి. భగవత్కథలతోఁ బురాణకథలతోఁ బెంపు వెలసిన యీ భాగవతయక్షగానములు తత్ ప్రదర్శనములు నాయకరాజుల కాలము నను, మహారాష్ట్రరాజుల కాలమునను మితిమీఱి యాయా రాజుల శృంగార జీవిత వర్ణనాత్మకములుగాఁగూడ రచితములై ప్రదర్శితములగుచు వచ్చినవి. దిక్ ప్రదర్శనలుగా కొన్ని కురవంజులను, యక్షగానములను, భాగవతములను బేర్కొనుచున్నాను.

"కిరాతార్జునీయము, శ్రీగిరికురవంజి, గంగాగౌరీవిలాసము, అలమేలు మంగావిలాసము, ఎఱుకలవేషకథ, కపోతవాక్యము, గరుడాచలము, త్రిపుర సంహారము, దారువనక్రీడ, నలచరిత్ర, నిజలింగచిక్కయ్యకథ, కన్యకాచరిత్ర, పారిజాతాపహరణము, పార్వతీపరిణయము, మృత్యుంజయవిలాసము, శివపారిజాతము, సముద్రమథనము, విజయరాఘవచంద్రికావిహారము, రఘునాథనాయకాభ్యుదయము."–

భిన్న వేషధారణము లేక సింగి, సింగఁడు (కొన్నింటఁ గోణంగికూడ) పాత్రలతో వెలసిన వీథినాటకములనఁబడు కురవంజులు యక్షగానరూప మునఁ బెంపొందినపుడు వేషభేదముగల పాత్రభేదములను బెంపొందెను. ఇట్లు పాత్రబాహుళ్యము కూడఁ గలవైన యక్షగానములందు సంధివచనములఁ జెప్పు కోణంగి లేక సూత్రధారుఁడు 'వచ్చెనమ్మా సత్యభామ–' ఇత్యాది విధము లను, 'అంతట హనుమంతుఁడేమనుచున్నాఁడు' ఇత్యాది విధములను బాత్రములఁబేర్కొనగాఁ దద్వేషధారులువచ్చి తమయాటపాటలు నెఱపుదురు. ఇట్లింకను బెంపొందిన యక్షగానములు తెరలు, రంగభేదములు కలవయి కొంత సంస్కృతనాటకచ్ఛాయయుఁ జొప్పడగా నాటకములను పేరను గూడఁ బదునెనిమిదవ శతాబ్దినాటికిఁ బేర్వెలసినవి.

ఇంచుమించుగాఁ దెలుగున నేనూఱింటిదాఁక లెక్కింప దగియున్న యక్షగానములలో సుగ్రీవవిజయమొక ప్రశస్తకృతి.

దానికర్త కందుకూరి రుద్రకవి

ఈతఁడు విశ్వబ్రాహ్మణవంశ్యుడు. కందుకూరికిఁ జేరువనే పాలేటి యొద్దునఁగల చింతలపాలెమను గ్రామ మీతని యూరు. ఆ యూరనే తద్వంశ్యు లిప్పటికిని గలరు. రద్రకవిమూలమున నా వంశమువారికి 'కవివారు' అని యుపనామ మేర్పడినది. ఆ వంశమున రుద్రకవికిఁదర్వాతఁబలువురు రుద్రకవి నామకులుండిరి. తొలుతటి రుద్రకవి కృష్ణదేవరాయల యాస్థానమున నష్టదిగ్గజములనఁబడు కవులెనమండుగురిలో నొక్కఁడుగా నుండెనట.[1] మల్కిబ్రహీంకాలమునఁగూడ నొక రుద్రకవి యుండెను. ఇబ్రహీం కాలమునఁ గల రుద్రకవియే కృష్ణరాయల కాలమున బాలుఁడుగా నుండఁబోలును. చింతలపాలెమను గ్రామము మల్కిబ్రహీం ప్రభువే రుద్రకవి కొసఁగెను.

"అద్యాశీతి చతుశ్శతాధిక సహస్రంవై శకాబ్దా గతాః
అస్మిన్ శ్రీజయవత్సరే జయతిథౌ మాసే చ మాఘే తథా
పంచమ్యాం ద్వయతింత్రిణీ జనపదం రుద్రస్య విద్వత్కవేః
ప్రీత్యా శ్రీయిభరామ భూపతి రదాత్ క్షోణీధరాఖండలః॥"

ఇబ్రహీం ప్రభువిచ్చిన యగ్రహారమును నిన్న మొన్నఁటి దాఁక దద్వంశులే యనుభవించుచుండిరి.

సుగ్రీవవిజయము రచించిన రుద్రకవియే నిరంకుశోపాఖ్యానమని గ్రంథాంతరము రచియించెను. రెండుగ్రంథములందును గర్తకు కందుకూరు జనార్దనభక్తత్వము, పెదలింగనార్యపుత్త్రత్వము గలదు గావున రెండు గ్రంథములు నొక్కనివే యగుట స్పష్టము. నిరంకుశోపాఖ్యానమున.

"చేరి కన్నడభూమి చెఱపట్టు పాశ్చాత్య
నృపతికైనను గొంతకృప దలిర్చు"

అని సీసచరణమున్నది. అది విద్యానగరమును దురుష్కులు కొల్లఁగొట్టిన దుస్సందర్భమున దెలుపుచున్నది. విద్యానగర వినాశనము క్రీ.శ. 1568

1. రుద్రకవి విషయమును చాటుపద్యమణిమంజరి ద్వితీయ భాగమునఁ జూచునది.

నాఁడు జరిగినది. కావున నిరంకుశోపాఖ్యాన రచన మటు తరువాత జరిగిన దగును. అప్పకవీయమున వినుకొండలో గుంటుపల్లి భాస్కరయగారి సముఖమునఁ గందుకూరి రుద్రకవి కవితాచర్చ జరిపినట్లు కలదు. మన రుద్రకవి యాతఁడగునేమో! నిరంకుశోపాఖ్యాన సుగ్రీవ విజయకర్త క్రీ.శ. 1568 ప్రాంతములవాఁడేని, కొంత తర్వాతివాఁడేని కాఁగలడు. దక్షిణదేశమం దల్పముగా నాంధ్రదేశమందధికముగా యక్షగానముల రచనములు, ప్రయోగములు సాగుచుండిన కాలమది.

సుగ్రీవ విజయము

శ్రీమద్రామాయణమునఁగల కథాఖండములలో సుగ్రీవవిజయకథ యొక కండపట్టు. అత్యల్పకాలమున వడివడిగా గంటలలో నడచిన యీ కథపట్టు రామలక్ష్మణులు, హనుమంతుడు, సుగ్రీవుడు, వాలి, అంగదుఁడు, తార అను కథాపాత్రముల శీలపుమేలిమి నొఱసి మెఱుఁగుతఱుఁగులు చూపిన యొఱగల్లనఁదగినది.

తెలుఁగున గుత్తెనదీవిరామాయణాదులగు రామాయణ గేయ కృతులలో నీ సుగ్రీవవిజయపుఁగథ పట్టు చాల హృద్యరచనములతో నున్నది.

"ఎంత పని చేసితివి రామా; నిన్ను
నేమనందును సార్వభౌమా!
చెంత కిటు రాలేక చెట్లలో దాగుండి
వింతమృగమును గొట్టువిధ మాయెనా బ్రదుకు!"

ఇత్యాది గేయములను బలువురు పాడుచుందురు.

ఈ రుద్రకవి సుగ్రీవవిజయమును గూడ స్త్రీ, వృద్ధ, పామరాదులు పలువురు పాడుచుందురఁట! ఆయా పాత్రముల పాటలు తత్తద్వేషధారులు వచ్చి పాడునట్లును దక్కిన సంధివచనాదులు ఒక్కరిద్దఱు సూత్రధారప్రాయులు పఠించునట్లును నీ సుగ్రీవవిజయము వీథియాటగా నాడబడుచుండెడిది. ప్రాచీనసంస్కృతనాటకరచయితలు భాసభవభూత్యాదు లీ సుగ్రీవవిజ యౌచిత్యమును దమ నాటకములలో విమర్శించిరి. శ్రీరాముని శీలమును

శ్రీవాల్మీకిరామాయణ పద్ధతిని సమర్థించిరి.

భవభూతి "యద్వా కౌశల మింద్రసూనుదమనే తత్రాప్యభిజ్ఞోజనః" యని దీని యౌచిత్యము నించుక చెనకెను. మన రుద్రకవి సంస్కృతాంధ్ర రామాయణకవులు త్రొక్కిన త్రోవనే త్రొక్కెను గాన యపూర్వ కల్పనాంశము నే మాత్రము నిందుఁ జేర్పలేదు.

ఆయా పాత్రములు ప్రసిద్ధ రామాయణములలో నెట్టి యుక్తి ప్రత్యుక్తులు గలవిగాఁ జిత్రితములయ్యెనో యిందు నదే తీరు గలదు. కాని యిది దేశిరచనముతో గేయరూపమున నుండుట విశేషము. ఇం దీ క్రింది గేయరచనలు ప్రశస్తములయినవి!

"హా! సతీమణి! ధర్మచారిణి! హా! గుణోన్నత జనకసుత! ననుఁ
బాసిపోయితి వింతలోనే పద్మనయన!
లేటిమాయలు మదిని దెలియఁగ లేక పాపపు రక్కసునిచే
బోటి! నిను గోల్పోతి నిక నా కేటి బ్రదుకు!"

* * *

లలన! నినుఁగలనైన బాయఁగఁగలన నీవిట లేకయుండినఁ
జలనమొందెను నాదు హృదయము జలజనయన!

* * *

తరణికులమునఁ బుట్టి శరచాపములఁబట్టి
తరుణిఁ గోల్పడుకంటె మరణమే మేలు
నను శౌర్యవంతుఁడని తన పుత్రి నిడినట్టి
జనకవిభుఁ డీ వార్త విని వగవకున్నె?

* * *

నాయ మెఱుగక చంపితివి నరనాథ! పాపము గట్టికొంటివి
బోయ వింతియె కాక నీవొక భూమిపతివా!

* * *

శ్రీరామ! నీ రామఁ జెఱగొన్న రావణుని
వారిధుల ముంచితిని వాలమునఁ జుట్టి

ఒకమాట నాకుఁజెప్పక పోయితివి గాక
సకలదైత్యుల దున్మి జానకిని దేనె?
*　　　*　　　*
ఆలిఁ జెఱగొని పోయినట్టిదశాస్యుఁ డుండఁగ నిర్నిమిత్తము
వాలి నేటికిఁ జంపితివి రఘువంశతిలకా!
ఇట్టి సాహసకర్మ మెచటికి నేఁగె భరతుఁడు సీమవెడలఁగఁ
గొట్టి రాజ్యముపుచ్చుకొన్నెడఁ గువలయేశా!
నాయ మేటికిఁ దప్పితివి రఘునాథ! జానకితోడనే చెఱఁ
బోయెనే నీ రాజనీతియు భూరిమతియున్”
*　　　*　　　*

శ్రీరామచంద్రమూర్తి చెట్టుచాటుననుండి వాలిమేనఁగాడనేసిన వాఁడి ములుకులకంటె నిక్కడ తార ప్రత్యక్షమై నిలుచుండి శ్రీరాముని యంతరంగము నుచ్చిపోవునట్టు ప్రయోగించిన పలుకు ములుకులు క్రొవ్వాఁడి గలవి.

సుగ్రీవవిజయము వీరకరుణరసభరితము. స్త్రీ బాలపామరాదులు గూడఁబఠింపఁదగినది.

ఆ యక్షగానమున నీ క్రింది దేశిరచన లున్నవి. త్రిపుట, జంపె, కురుచజంపె, అర్ధచంద్రికలు, ఆటతాళము, ఏకతాళము, ద్విపదలు, ధవళ ములు, ఏలలు, అర్ధచంద్రికలు, త్రిపుటాదిరచనల ఖండరచనలు గాఁబోలును. ఇందలి యర్ధచంద్రికలెల్ల నొక్కతెఱఁగు నడకగలవి గాక భిన్నగతులతో నున్నవి. సంగీతతాళలక్షణము లెఱిఁగినవారు వాని ప్రభేదములు గుర్తింప వలెను.

కురవంజులు, యక్షగానములు నింకను మంచి రచనములు గలవి కొన్ని యున్నవి. అవి యేవేని సుగ్రీవవిజయమువలె సుముద్రితములైనచో నాంధ్రమధురకవితావిశేషములను సహృదయు లింక నధికముగా నాస్వాదింపఁ గల్గుదురు.

(సుగ్రీవవిజయము – పీఠిక 1939, మీగడతఱకలు : 1951)

ముగ్ధమధురవాఙ్మయము

భాష యడవివంటిది. కవిత యుద్యానవనము వంటిది. అడవినుండి శోధించి యందు సుందరమైన చివురుగుత్తులతోనున్న తరులతా గుల్మాదులను గొనివచ్చి చక్కఁబఱిచి యుద్యానవములందు నాఁటుకొనుచుందుము. బహుప్రయోజనమయిన యడవినుండి పరిమితప్రయోజనమయిన యుద్యానము పెంపొందుచున్నది. ఉద్యానహృద్యత కూడ నడవియం దెడనెడఁ బొడకట్టఁగలదు గాని యరణ్య ప్రయోజనములెల్ల నుద్యానమునం దొదవఁ జాలవు. అడవి విచ్చలవిడిగాఁ బెరుగునది. ఉద్యానము పెంపుసొంపులకు అరణ్యపరిశోధన మత్యావశ్యకము. అట్లే సుకవిత పెంపుసొంపులకు భాషా పరిశోధన మత్యావశ్యకమవును. ఇంతవఱకాంధ్రకవితోద్యాన పాలకులు తమ కవితోద్యానమందు నాఁటిన వచోవల్లరులు కొన్ని దెఱఁగులవే యున్నవి. ఇప్పుడు వింతవింత వన్నెచిన్నె యుద్యానములు వెలయుచున్నవి. పరికల్పకు లును బలుదెఱఁగులవారు వెలయుచున్నారు. వారువారు వారివారి హృద్యతల కనుగుణముగా భిన్నభిన్న రీతుల పలుకు పువుగుత్తులను, వాని కూర్పుతీర్పులను జూచుకొనుచున్నారు. ఇది చక్కగా సాగుటకుఁ గవితోద్యానములు వెల్లివిరియు టకు, వార్వారు భాషారణ్యమునఁబరిశ్రమించి, పరిశోధనము నెఱపి యపూర్వముల నరయచుండు టావశ్యకము కాదా?

విచ్చలవిడిగా జీబుకొని వెలయుచున్న యాంధ్రభాషారణ్యమునుండి కవితోద్యానమునకుఁ గొనితేవలసిన హృద్యవచోవల్లరు లింకనెన్నో యున్నవి. చవులొలుకునవి, పలుకుబళ్లు, పాటలు, పదాలు, కథలు, గాథలు, సామెతలు ఇత్యాదులు పెక్కులు అపరిశోధితములై యముద్రితములై లోకము వాకులందే పుట్టుచు గిట్టుచున్నవి. అట్టివానిని బరిశోధించుటలోను, సేకరించుటలోను నాకుఁ గోర్కె కొండంత.

పామరులనుండి పండితులదాఁక, వారిలోఁగూడ బాల్యమునుండి వార్ధకము దాఁక నంతరము లనేకములున్నవి. ఎన్ని యంతరములున్నవో యన్ని భాషారీతులున్నవి. వ్యవహారార్థమైన భాషారీతులేకాక రంజనార్థమయిన

కవితారీతులు నంతరములఁబట్టిగూడ యనేక భేదములుగలవిగా నున్నవి. అవియెల్లఁబరిశోధితములై యాదృతములుగావలెను. పలువురు దీనికై యత్నించుట బాగు. భూములకువలె భాషకును సర్వే జరుగవలెను.

నేనట్లు సేకరించినదానిలో బాలుర ముగ్ధమధురవాఙ్మయము నిప్పుడు వేఱుపఱచి, 'బాలభాష' యనుపేర గ్రంథముగా వెల్లడించుచున్నాఁడను. దాని నుద్దేశించియే నాకుఁదోచినవి నాలుగు ముక్కలిక్కడ వ్రాయుచున్నాఁడను.

ఉన్నతకవితావాహినికి బాలవాఙ్మయ మూటపట్టని చెప్పవచ్చును. బాలభాషలో సహజముగా నంకురప్రాయములుగాఁ గన్పట్టు కవితాగుణములే ప్రౌఢభాషలో సంస్కృతములై బలుపొందుచున్నవి. సరళాక్షరసౌష్ఠవము, సంగీతచ్ఛాయ, యతిప్రాససంగతి, యాంధ్రకవిత కవతారమునాడే యలవడిన వన్న విషయము నీ బాలవాఙ్మయము ప్రవ్యక్తపఱుచుచున్నది. పసిపిల్లల కర్థానుస్యూతములుగా శబ్దములను సంధించి వాక్యములను వ్యాహరించుట కింక నలవాటు కాకముందే యతిప్రాసల పొందిక యలవడుట కానవచ్చును.

రుంగు రుంగు బిళ్ళా,
రూపాయదండా,
దండాగాదు తామరమొగ్గ,
మొగ్గాగాదు మోదుగుమాడ. – ఇత్యాది.

బండో యమ్మబండి,
బండికి కుచ్చులు తెండి;
సుబ్బారాయడి పెండ్లి,
చూచి వత్తాం రండి.
అమ్మనాకు బువ్వ,
అరచేతిలో గవ్వ,
చేయబోకు తప్పు,
చేస్తే కాలి చెప్పు. – ఇత్యాది.

వీనిలో వాక్యార్థసంగతి యంతగా లేకున్నను యతిప్రాససంగతి యనుగతమై కానవచ్చుచున్నది.

పంతులు పంతులు
పావుసేరు మెంతులు,
కూర్లోకి చాలవు
గుప్పెడు మెంతులు.
పంచా యెక్కం పంచా,
పంతుల్నేసి దంచా;
రోట్లో వేసి రుబ్బా,
రొట్టె గాల్చుకు దొబ్బా!!

బడిబాలురే యీ దుడుకుఁ గవిత్వమునకుఁ గర్తలు; యతిప్రాసముల మెలపేకదా పయిరచనలకుఁ జెప్పఁదగిన యర్థము.

తెలియవలసిన విషయమెంతయుఁ దేలికైన భాషలో, అందును వచనములో నున్నను గూడ, నది వాక్యముపై వాక్యముగా నెడతెగకుండఁ దీగసాగుచున్నపుడు బాలురు, పామరులు వెంటాడుచు దాని యర్థము నందుకొనఁ జాలకుందురు. ద్రవరూపమున నున్నను ఉగ్గుఁబాలను ధారగాఁ బోయుచున్నచో బాలురు త్రాగఁజాలరు. గ్రుక్కెడు గ్రుక్కెడు చొప్పున నాచియాచి పోసినచోఁద్రాగఁగల్గుదురు. అట్లయిన నా త్రాగినదియుఁ జక్కఁగా నిముడును. అట్లే తెలియవలసిన విషయముగూడఁ ద్రుంచి త్రుంచి యించు కించుకగాఁ జేసి, నడుమనడుమ, విశ్రాంతికై యెత్తుపలుకును గూడఁజేర్చి చెప్పినచో బాలురు తేలికగాఁ దెలిసికొనఁగల్గుదురు. అప్పుడు దాని యర్థమును తలలో వాంద్రకుఁ జక్కఁగా నెలకొనును. అంతేకాక యది యించుక తాళలయానుగుణముగా గణబద్ధమై యుండుటచేఁ జిత్తరంజకమై మరవరానిదై కూడ నుండును. హెచ్చుగా బాలురయు, పామరులయు వాఙ్మయ మీ విధముగాఁగానవచ్చుచున్నది.

రామన్న రాముడోయి రామభజనా,
రాముడొస్తున్నాడు రామభజనా,
పూలారథము నెక్కి రామభజనా,
వూరేగుతున్నాడు రామభజనా. –ఇత్యాది.

శ్రీరామలక్ష్మణులు గోవిందా రామ,
చెలులతో గూడుకొని గోవిందా.
పన్నెండువర్షములు గోవిందా రామ,
ప్రమదముతో ఉండిరీ గోవిందా,
దశరథుఁడంతటను గోవిందా రామ,
తగ వసిష్ఠునిజూచి గోవిందా. – ఇత్యాది.

తుమ్మెదపదాలు, కోవెలపదాలు, చందమామపదాలు, బాలనాగమ్మ కథ మొదలయినవి యిట్టివే.

దశరథుడను పేర తుమ్మెదా
ఒక్క
ధరణీశుడున్నాడు తుమ్మెదా.
ఆ
ధరణీశునకు తుమ్మెదా
నలుగురు
తనయూలున్నారు తుమ్మెదా! – ఇత్యాది.

వీనిలో ఎత్తు పలుకులు విడిచితిమేని మిగిలినది సరిగా సాధారణముగాఁ జదువఁదగిన వచనముగా నుండును. యతిప్రాసముల సంగతికై రవంత రచనా ప్రయత్నము కావలెనుగాని యిట్టి రచనలలోని కే వచనముగాని సులువుగా వివిుగఁదీయవచ్చును. యతిప్రాసములు, తాళలయాన్వితమగు గణబంధము పొసఁగుటచే నివి చదువునప్పుడెంతో హృదయంగమములుగా నుండును. ఆంధ్రభాషకు సహజాలంకారములయిన యతిప్రాసములు, సంగీతచ్ఛాయ, బాలరచనములందు గానవచ్చుచున్నవి. అట్టి రచనములను బాలకులు పాలమీఁగడ చవితో జఁదువఁగలరు. ఈ యింపు నెఱుఁగకపోవుటచే నిప్పటి బాలపాఠగ్రంథరచయితలు "ఇదిగో ఆవు. దీనికి నాలుగుకాళ్లు గలవు". ఇత్యాది విధములఁబొల్లుమాటలతోనే పాఠములల్లి బాలకుల విసిగించుచున్నారు. బాల్యమందిట్టి సముచిత సంస్కారముఁబడయక పోవుటచే నిప్పటిబాలురు మంచిమంచి తెలుఁగుపలుకుబళ్ళను, వాని సంగీత చ్ఛాయలను' పాటలను, బదములను, బద్యములను జక్కఁగా జదువనేర కున్నారు.

కంచికిపోతావా కృష్ణమ్మా!
ఆ – కంచి వార్తలేమి కృష్ణమ్మా?
కంచిలో ఉన్నది అవ్వ;
ఆ – అవ్వ నాకుపెట్టు బువ్వ.
బువ్వ ఉన్నదిగాని కృష్ణమ్మా,
నీకు – పప్పు ఎక్కడిదోయి కృష్ణమ్మా?
కోమటి యింటిది అప్పు;
ఆ– అప్పునాకు పెట్టు పప్పు.
పప్పు ఉన్నదిగాని కృష్ణమ్మా,
నీకు – కూరయెక్కడిదోయి కృష్ణమ్మా?
దొడ్లోను ఉన్నది బీర;
ఆ – బీర నాకు పెట్టు కూర.
కూర ఉన్నది కాని కృష్ణమ్మా,
నీకు – నెయ్యి యెక్కడిదోయి కృష్ణమ్మా?
కోమటి అక్కెమ్మ చెయ్యి;
ఆ – చెయ్యి నాకుపోయు నెయ్యి.
నెయ్యి ఉన్నదిగాని కృష్ణమ్మా;
నీకు – పెరుగు ఎక్కడిదోయి కృష్ణమ్మా?
ఉన్నయింటి యిరుగుపొరుగు,
ఆ –పొరుగు నాకుపోయు పెరుగు,
బువ్వ తిందువుగాని కృష్ణమ్మా,
నీకు – ఆ వూళ్ళోపనియేమి కృష్ణమ్మా?
అక్కడ ఉన్నది అమ్మ,
నేను – మొక్కి వత్తును కామాక్షమ్మ.

ఈ పదము 'కృష్ణమ్మ' అని ఎత్తు పలుకు గలిగి బువ్వ, పప్పు, కూర, నెయ్యి, పెరుగు అను భోజనపదార్థముల వరుసతోను, వరుసగా అవ్వబువ్వ, అప్పుపప్పు, బీరకూర, నెయ్యిచెయ్యి, పొరుగుపెరుగు అను అనుప్రాసపదముల సంగతితోను, ముక్తవిషయగ్రస్తముగాఁ బప్పు మొదలగు వాని పునరుచ్చారముతోను గలదు గనుక, బాలుడు, ఎక్కాలు వానివలె బండవల్లెవేయ నక్కఱలేకుండ నించుకంత ధారణను అవధానమును జూపుచు,

అప్పటికప్పుడు పయిపయి పలుకు నందుకొనఁగలిగి సులువుగాఁ గడముట్ట నప్పగింపఁ గలుగును. దీనిచే బాలునిబుద్ధికి వయోనుగుణముగా సుకుమార మయిన పరిశ్రమము, యోజన కలుగును. ఈ పదము ముగింపు జీవిత పరమార్థముగా భావికాలమునఁ జూచుకొనవలసిన యీశ్వరచింతనము నాటు నదిగా నున్నది. ఇట్టిదే యింకొక్కటి.

ఎండలు కాసే దెందుకురా?
వానలు కురిసే టందుకురా.
వానలు కురిసే దెందుకురా?
చెరువులు నిండే టందుకురా.
చెరువులు నిండే దెందుకురా;?
పంటలు పండే టందుకురా.
పంటలు పండే దెందుకురా?
ప్రజలు బ్రతికే టందుకురా.
ప్రజలు బ్రతికే దెందుకురా?
స్వామిని గొలిచే టందుకురా.

ఇందు భౌతికస్వభావము వరుస చొప్పునఁ జెప్పఁబడుటచే బాలుఁడా వరుస నంటుకొని, యొకటి రెండుమారులు వినినంతనే తప్పకుండఁబదము నప్పగింపఁగలడు.

సనసన్నగాఁ బ్రతిభ నుద్దీప్తపఱచి యవధానమును, ధారణను బెంపొందించి, చిత్తవృత్తి నిటునటు దొలఁగనీక బాలునికిఁ జురుకుఁదనము నేర్పఁగలకథలు, పలుకుబళ్లు పెక్కులున్నవి. “చిలుకలు కొట్టిన పలుకు లేమి చేశావోయి? పిండిగొట్టానోయి. పిండేమి చేశావోయి? రొట్టెగాల్చానోయి”– ఇత్యాదులు కొన్ని చేపకథ, గుఱ్ఱముకథ మొదలయినవి కథలు కొన్ని.

మఱియు బాలుర విద్యాభివృద్ధి యాటపాటల చాటున దెలియకుండా వెలయునదిగా నుండుట మేలు. ప్రాంతకాలమున నది యట్టిదిగానుండెను.

పసితనముననే బాలురకు రామకథ మొదలగు పుణ్యకథలను, నీతివార్తలును నుయ్యాలలో నూచుచు జోలలుగా బాడుచు తల్లులు నేర్పెడివారు. ఇప్పటికిని బల్లెటూళ్ళలో ప్రాంతకాలపు తల్లు లిట్లు జోలలుపాడుట గానవచ్చును; గాని పట్టణములందుఁ జప్పఁగా జట్టువాఱుచున్నది. నేఁటి నాగరపు స్కూళ్ళలోఁ జదువుకొను బాలిక లిట్టివాని నెఱుఁగరు గదా! వీరు తల్లులైనపుడు తనయుల కిక నెట్లు తెలియును!

ఉత్తముని పేరేమి? ఊరు పేరేమి?
సత్యపురుషులఁగన్న సాధ్వి పేరేమి?
ఉత్తముడు దశరథుడు, ఊరు అయోధ్య,
సత్యపురుషులఁగన్న సాధ్వి కౌసల్య.
ఇల్లాళ్లు ముగ్గురే యీ దశరథునకు,
పిల్లాళ్లు నలుగురే పేరు గలవారు.
అయ్యోధ్యలో వారు అందరున్నారు,
నయ్యోధ్యలో వారు సరిలేని వారు.
జగతిపై రామయ్య జన్మించినాడు,
సత్యమ్ము లోకాన స్థాపించినాడు,
తల్లిదండ్రులమాట చెల్లించినాడు.
ఇల్లాలితోపాటు హింసపడ్డాడు.
సీతామహాదేవి సృష్టిలోపలను
మాతల్లి వెలసింది మహనీయురాలు.
శ్రీరామ జయరామ సీతాభిరామ
కారుణ్యగుణధామ! కల్యాణనామ!
కృష్ణమ్మ వంటివాడు కొడుకొకడు పుడితె,
కష్టాలు కడతేరు కన్న తల్లులకు.
మారుతల్లీచేత మాటపన్నుచు
సారంగధరు డమ్మచావు కొప్పాడు.

పాటలతోను, పదములతోను గూడిన పసిపిల్లల యాటలనేకము లున్నవి. వానిలో వింతవింత విషయము లనేకములున్నవి. గణనీయమైన కవిత యున్నది. భాషలో నాకు శక్యమయినంత వాని సమకూర్చినాఁడను.

నన్నయాది కవీశ్వరులు తమ దేశకాలములను దెలుపుకొనుటచే వారి గ్రంథముల ప్రాచీనత యెట్టిదో మనమెఱుఁగ గల్గుచున్నాము! కాని యీ పాటలు ఈ కాలమున వెలసినవని, వీరు రచించిరని చెప్పుట కెట్లు సాధ్యమగును? నన్నయాదుల కింకను బ్రాచీన కాలమునాఁటివిగూడఁ గొన్ని యిందుండవచ్చును. నిన్న నేఁటివిగూడ నుండవచ్చును. నన్నయాదుల రచన ములకింక నెంతో పూర్వమే యిట్టి రచనలు పుట్టియుండక తీఱదు. నన్నిచోడాదు లిట్టివానిఁ బేర్కొన్నారు. పాల్కురికి సోమనాథు డిట్లనుచున్నాడు.

పొందంగ "రాగుంజ పోగుంజ లాట"
కుందెన "గుడి గుడి గుంచంబు లాట"
"అప్పల విందుల యాట" పల్మాఱు
చప్పుట్లు వెట్టెడు "సరిగుంజ లాట"
"చేర బొంతలయాట" "చిట్లపొట్లాట"
"గోరెంతలాట" "దాఁగుడుమూతలాట."

వీనిలో "గుడిగుంచ" మాట, "చిట్లపొట్లాట" ఇప్పటికిని ఇదే యుప క్రమముగల పదములతో బాలకులాడుచున్నారు. చూచితిరా! ఆ పదము లెంత ప్రాఁతకాలమునాఁటివో!

(కళ - 1923 (?)
భారతి ప్రమోదూత
ఫాల్గుణ చైత్రములు - 1930
బాలభాష - 1953)

శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయపీఠం ద్వారా ప్రచురింపబడిన గ్రంథములు

1.	తెలుగుమెఱుగులు	2008
2.	కావ్యమంజరి	2008
3.	అన్నమాచార్యచరిత్రపీఠిక	2008
4.	సింహావలోకనము	2009
5.	పూలవిందు	2010
6.	ప్రజ్ఞాప్రభాకరము–గురుపూజ	2011
7.	వేటూరిప్రభాకరశాస్త్రి వాఙ్మయసూచిక	2012
8.	కేయూరబాహుచరిత్ర	2012
9.	శ్రీ వేంకటేశ్వర స్తుతిరత్నమాల	2012
10.	వేటూరివారి పీఠికలు (మొదటిభాగం)	2012
11.	వేటూరివారి పీఠికలు (రెండవభాగం)	2012
12.	చాటుపద్యమణిమంజరి (1వ భాగము)	2013
13.	చాటుపద్యమణిమంజరి (2వ భాగము)	2013
14.	సుభద్రాకల్యాణము	2013
15.	సుగ్రీవవిజయము.	2013
16.	బసవపురాణము (బసవోదాహరణము అనుబంధంగా)	2013
17.	శ్రీ వేంకటేశ్వరలఘుకృతులు.	2013
18.	శ్రీ వేంకటేశ్వరవచనములు.	2013
19.	ఆంధ్రకామందకము	2013
20.	శృంగారామరుకావ్యము	2013
21.	ప్రబంధరత్నావళి	2014
22.	ఉద్భటారాధ్యచరిత్ర	2014
23.	రంగనాథరామాయణము	2014